ప్రజా మణిపూస

సకల జన వికాస మాస పత్రిక

మార్చి - 2022 | సంపుటి : 3 సంచిక : 2 | రూ. 50/-

2nd Anniversary

అంతర్జాతీయ మహిళాదినోత్సవ

శుభాకాంక్షలు

ప్రజా

RNI No.APTEL/2021/81099

మణిపూస
తెలుగు
మాసపత్రిక

సంపుటి - 3 సంచిక - 2 మార్చి, 2022 పేజీలు : 80 వెల : 50/-

విషయ సూచిక

సమానత్వ సాధన దిశగా ఆధునిక భారతీయ మహిళ	06
బ్రాహ్మణవాదం పై తిరుగుబాటు చేసిన సావిత్రిబాయి పూలే	09
బోయి భీమన్న జీవితం, సాహిత్యం : జాతీయ సమైక్యతా స్ఫూర్తి	11
అవని నీడ ఆమే..	16
మహిళల సాధికారత ఎక్కడ?	20
తెలుగు కవిత్వంలో స్త్రీవాద సాహిత్యం చర్చించిన అంశాలు	22
గుమ్మడికాయల దొంగంటే..!	26
బుల్డోజర్ల తిరుగుబాటు...	27
వేటూరి వైభవం..	29
సావిత్రిబాయి పూలే ఆకాశంలో వెలుగుతున్న నీలి నక్షత్రం	30
విజ్ఞాన వటవృక్షం వేటూరి	31
అంతర్జాతీయ మహిళా దినోత్సవ థీమ్స్ చిగురించని జీవితాలు	36
మైండ్ సెట్... తెల్లవారింది..	39
హిజాబ్.. శాంతిభద్రతల సమస్యా?	42
యూపీలో మండల్ శక్తుల తిరుగుబాటు	44
మహిళా తరం మారుతోంది....	46
మహిళల వివాహ పెంపుతో సమానత్వం సాధ్యమా?	47
కోపం కాదు..,కడుపులో దుఃఖం....	49
ఉక్రెయిన్ ఉదంతం ప్రపంచానికో గుణపాఠం	50
పూరీ ఆలయ భండారం... నిజం పెరుమాళ్ళకే ఎరుక...	52
నేల విడిచి సాము	54
కరెంట్ అఫైర్స్	56

ప్రధాన సంపాదకులు & పబ్లిషర్
కనపర్తి రాజారావు

మేనేజింగ్ ఎడిటర్
డా॥ గుమ్మడి పెంచలయ్య

కొడుకుల శ్రీనివాస్, యాక్టివ్ జర్నలిస్ట్

అసోసియేట్ ఎడిటర్
శ్రీ కె.వెంకట అప్పారావు (Ph.D)

సీనియర్ సబ్ ఎడిటర్ & టెక్నికల్ అడ్వయిజర్
డా॥ ఎం.జయకుమార్,MBA.,Ph.D,.

సంపాదకులు : **శ్రీ బి.రాజేష్,** B.Sc,.

సంపాదకులు : **సత్యాల వెంకటేష్,** MA.,(M.Phil)

ఫొటోగ్రాఫర్ : **బి.వీరయ్య**

డిజైన్ & డి.టి.పి
ఆర్.తేజేష్, Cell : 9866789072

Edited, Printed, Published and Owned by **KANAPARTHI RAJA RAO,** Plot No.302, Sai Towers I, Rednam Gardens, Visakhapatnam - 530 002, A.P. On behalf of **KANAPARTHI RAJA RAO** Printed at **AMMA OFFSET PRINTERS,** D.No.30-8-35, Dabagardens, Visakhapatnam - 530 020, A.P. Published by Plot No.302, Sai Towers I, Rednam Gardens, Visakhapatnam - 530 002, A.P. Editor : **KANAPARTHI RAJA RAO,** Cell : 9492423833, e-mail : kanaparthirajaro@gmail.com.

ఈ పత్రికలో ప్రచురించిన వివిధ వ్యాసాలు, రచనల్లోని అభిప్రాయాలు ఆ యా రచయిత / రచయిత్రుల అభిప్రాయాలు మాత్రమే. వాటితో సంపాదకులు / పత్రికా యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదని విజ్ఞప్తి.

గౌరవ సలహా మండలి

ఆచార్య శ్రీ కె.యస్.చలం
యు.పి.ఎస్.సి.,పూర్వ సభ్యులు, న్యూఢిల్లీ,
మాజీ వి.సి. ద్రావిడ యూనివర్శిటీ,

ఆచార్య బాబివర్ధన్
(విశ్రాంత ఆచార్యులు) జర్నలిజం శాఖ అధిపతి,
డీన్, మీడియా రిలేషన్స్, ఆంధ్రాయూనివర్శిటీ, వాల్తేరు

ఆచార్య ఎన్.ఎ.డి.పాల్
యూజీసీ, హెచ్ఆర్‌డీసీ డైరెక్టర్, ఆంధ్రాయూనివర్శిటీ, వాల్తేరు

ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి
వైస్ ఛాన్సలర్, దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయం, గుంటూరు

వీరవనేని వెంకట పూర్ణచంద్రరావు, తెలంగాణ
బి.టెక్ (ఎన్ఐటి, వరంగల్), ఎం.టెక్ (ఐఐటి, రూర్కీ, యూ.పి)

నల్లపు సుధా రామకృష్ణ
విజ్ఞాన్ ఫౌండేషన్, ఖమ్మం, తెలంగాణ

సంపాదక మండలి

ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు
తెలుగు శాఖాధిపతి, యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్, హైదరాబాద్

ఆచార్య జర్రా అప్పారావు
తెలుగు శాఖాధిపతి, ఆంధ్రాయూనివర్శిటీ, వాల్తేరు

ఆచార్య విస్తాలి శంకరరావు
తెలుగు శాఖాధిపతి, యూనివర్శిటీ ఆఫ్ మద్రాస్, చెన్నై

డా॥ జి.వి.రత్నాకర్
మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్శిటీ హైదరాబాద్, హైదరాబాద్

డా॥ ఎస్.సంజయ్ కుమార్
అసిస్టెంట్ ప్రొఫెసర్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్
గురు గోబింద్ సింగ్ ఇంద్రప్రస్థ యూనివర్శిటీ, న్యూ ఢిల్లీ.

డా॥ డి.జ్యోతిర్మయి
అసోసియేట్ ప్రొఫెసర్ ఇన్ ఇంగ్లీష్,
హెడ్ ఆఫ్ ది డిపార్టమెంట్ ఆఫ్ ఇంగ్లీష్ &
డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్, ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ, రాజమండ్రి

సురేష్ నక్కా B.Tech, MBA., (Ph.D)

శ్రీలతరమేశ్ గోస్కుల, M.A., B.Ed,
హుజురాబాద్, తెలంగాణ

Registration No.1140/2019

ఇ. జయకర్ డానియల్
Chief Executive Officer (CEO)

ప్రజా మీడియా నెట్‌వర్క్
PRAJA MEDIA NETWORK

మీ యొక్క రచనలు, సలహాలు, సూచనలు పంపవలసిన చిరునామా :
Praja Manipoosa, Sai Towers I, Plot No.302, House No.10-12-6/44,
Rednam Gardens, Visakhapatnam - 530002.
Email : prajamanipoosa2020@gmail.com, prajamedia2020@gmail.com
www.prajamanipoosa.com

ఆంధ్రప్రదేశ్ : సాయి టవర్స్- 1, ఫ్లాట్ నెం.302, రెడ్నం గార్డెన్స్, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్. ఫోన్ : 94924 23833.
తెలంగాణ : హెచ్.నెం. 9-1-38, వైఎంసిఎ కాంప్లెక్స్, సర్దార్‌పటేల్ రోడ్డు, సికింద్రాబాద్, తెలంగాణ,
ఫోన్ : 9885715927, 9912202720

ఎడిటోరియల్

ఎల్ఐసిని ప్రైవేట్‌పరం దేశభక్తా..? ..

ఎల్ఐసిని తెగనమ్మడానికి మోడీ ప్రభుత్వం బరితెగిస్తున్న తీరు అత్యంత దుర్మార్గం. దేశ వ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నప్పటికీ తాను పట్టిన కుందేలుకు మూడే కాళ్లు అన్న ధోరణిలో ప్రభుత్వం వ్యవహరిస్తోంది. వాటాల విక్రయానికి సంబంధించిన ముసాయిదా ప్రతి (డిఆర్‌హెచ్‌పి)ని సెబికి సమర్పించడంతో ఈ ధోరణి మరింతగా స్పష్టమైంది. ఈ పబ్లిక్ ఇష్యూ ద్వారా ఎంత వాటా అమ్ముతారు? ఎన్ని వేల కోట్ల రూపాయలు సమకూర్చుకుంటారన్న విషయాలు పక్కన పెడితే అసలు ఎల్ఐసిని అమ్మే హక్కు ప్రభుత్వానికి ఎక్కడుందన్నది కీలక ప్రశ్న! 1956లో జీవిత బీమా సంస్థను ఏర్పాటు చేసినప్పుడు ప్రభుత్వం పెట్టిన పెట్టుబడి కేవలం 5కోట్ల రూపాయలు. ఈ పెట్టుబడి మీద ఇప్పటివరకు ప్రభుత్వానికి వచ్చిన డివిడెండ్ 31,616 కోట్ల రూపాయలు. దేశ వ్యాప్తంగా ఆ సంస్థకు ఉన్న ఆస్తుల విలువే సుమారు రూ. 38 లక్షల కోట్లు ఉంటుందని అంచనా! ఇంతింతై.. వటుడింతై... అన్నట్టుగా సాగుతున్న ఈ అసాధారణ ప్రస్థానానికి కారణం కేవలం ఐదు కోట్ల రూపాయలు కాదు! అంతకుమించి దేశ వ్యాప్తంగా సాధారణ ప్రజానీకం పెట్టుకున్న నమ్మకం! ప్రపంచంలోనే మరే బీమా సంస్థ కలలో కూడా ఊహించలేని విధంగా 40కోట్ల మంది ప్రజానీకం ఎల్ఐసికి పాలసీదారులుగా మారారు. వారి జీవితాశలు, ఆశయాలు, ఆకాంక్షలు ఎల్ఐసి పాలసీల రూపంలో ప్రతిఫలించాయి. వారి కష్టార్జితమే ఎల్ఐసిని ముందుకు నడిపిస్తోంది. ఒక్క మాటలో చెప్పాలంటే ఎల్ఐసికి వారే నిజమైన యజమానులు. వారి ప్రమేయం, సమ్మతి లేకుండా ఎవరైనా సరే ఎలా అమ్మగలరు? కానీ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ దుశ్చర్యకు తెగబడింది. 1956లో ప్రత్యేక చట్టంతో ఎల్ఐసిని ఏర్పాటు చేశారు. ఇప్పుడు వాటాలు అమ్మడానికి మరో చట్టాన్ని పార్లమెంటులో పెట్టే ధైర్యం, నిజాయితీ మోడీ ప్రభుత్వానికి లేదు. అందుకే, పాలసీదారులతో ఒక్క మాట చెప్పకుండా, వారి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా, పార్లమెంట్‌లో నామమాత్రపు చర్చ కూడా జరపకుండా దొడ్డిదారిన బడ్జెట్ ప్రతిపాదనల్లో చేర్చి ఈ అక్రమానికి పాల్పడింది.

ఎల్ఐసి ప్రతి ఏటా 4లక్షల కోట్ల రూపాయల నికర మిగులును ఆర్జిస్తోంది. దీంతో పాటు ప్రతి సంవత్సరం 14శాతం చొప్పున వ్యాపారాన్ని పెంచుకుంటోంది. ఈ ట్రాక్ రికార్డును పరిశీలిస్తే రానున్న సంవత్సరాల్లో కూడా వ్యాపారం మరింత పెరుగుతుందన్న అంచనాలు ఉన్నాయి. దీనికి 38లక్షల కోట్ల రూపాయల స్థిరాస్తులు అదనం! ఇది కాక... ఎల్ఐసి పట్ల ప్రజానీకంలో అపరిమితమైన గుడ్‌విల్ ఉన్నది. దీనిని ఎలా లెక్క కట్టాలి? అందుకే ఎల్ఐసి ఎంబెడెడ్ విలువను లెక్క కట్టడం అసాధ్యమని, ఆర్థికరంగ నిపుణులు చెబుతున్నారు. కానీ, ఎల్ఐసి డెవిడెంట్ విలువను కేవలం 5లక్షల కోట్ల రూపాయలుగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రాతిపదిక ఏమిటో చెప్పకుండా ఇంత తక్కువగా విలువను నిర్ధారించడం వెనుక కార్పొరేట్ కుతంత్రం లేదంటే నమ్మగలమా? ప్రజల సొత్తును అడ్డగోలుగా దోచిపెట్టడమని కాక దీనిని మరేమి అనగలం?

మన దేశం 2008 ఆర్థిక సంక్షోభపు తాకిడిని తట్టుకుని నిలవగలిగిందంటే, ప్రభుత్వ రంగ ఆర్థిక సంస్థలు వెన్నుదన్నుగా నిలవడమే కారణం. మళ్లీ ఇప్పుడు మరో సంక్షోభంలోకి కూరుకుపోతున్న సమయంలో ఎల్ఐసి వాటాలను తెగనమ్మడం దేశ ప్రయోజనాలకు చేటు. అందుకే, ఎల్ఐసిని కాపాడుకోవడమంటే కేవలం ఒక ప్రభుత్వ రంగ సంస్థను పరిరక్షించుకోవడం మాత్రమే కాదు. దేశ స్వాతంత్ర్యాన్ని, స్వావలంబనను కాపాడుకోవడం. సామాన్య ప్రజల ప్రయోజనాలను, వారి ఆత్మగౌరవాన్ని పరిరక్షించుకోవడం. ఎల్ఐసి ఆవిర్భావ మూలాలు దేశ స్వాతంత్ర్య పోరాటం నుండి వచ్చాయి. దాని పరిరక్షణ కోసం జరిగే పోరాటమంటే దేశ స్వావలంబన కోసం జరిపే పోరాటమే! దీనిలో భాగస్వాములు కావడం నిజమైన దేశభక్తులందరి బాధ్యత!

ప్రధాన సంపాదకులు

అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా

సమానత్వ సాధన దిశగా ఆధునిక భారతీయ మహిళ

స్వాతంత్ర్యానంతరం భారత ప్రభుత్వం వివిధ ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాల ద్వారా స్త్రీలకు పురుషులతో సమాన హోదా కల్పించాలని ప్రణాళికలు రూపొందించింది. కానీ, అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ, భారతీయ మహిళలు ఇప్పటికీ బలహీనంగానే ఉన్నారు. పురుషులతో పోల్చినప్పుడు అన్ని రంగాల్లోనూ వెనకబడివున్నారు. ఈ వ్యాసం ఆధునిక భారతదేశంలో మారుతున్న మహిళల స్థితిగతుల్ని విశ్లేషింస్తోంది. దీనిలో వివిధ అధ్యయనాల్ని పరిశీలించడం జరిగింది. ఆధునిక భారతదేశంలో మహిళలు అన్ని రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించినప్పటికీ, సమాజంలోని లోతైన పాతుకుపోయిన పితృస్వామ్య మనస్తత్వానికి వ్యతిరేకంగా పోరాడవలసి వస్తోంది. భారత రాజ్యాంగం పురుషులతో సమానంగా మహిళలకు సమాన హక్కులను కల్పించి. కొన్ని ప్రత్యేక చట్టాలు మరింత బలాన్ని చేకూర్చాయి. అయితే ఆధునిక మహిళల స్థితిలో చెప్పుకోదగ్గ మార్పును తీసుకురావడానికి పురుషులు ముక్తకంఠంతో పోరాడింది లేదు. భిన్నాభిప్రాయాలతో ఉన్నారు. పురుషులతో సమానత్వం అనేది ఇప్పటికీ ఆడవారికి భ్రమగానే మిగిలింది. నేటికీ సమాజంలో పురుషాధిక్యత కొనసాగుతుండటమే ఇందుకు బలమైన ఉదాహరణగా చెపవ్వచ్చు.

ప్రొఫెసర్ పీటా బాబీవర్థన్
విశ్రాంతాచార్యులు,
జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ శాఖ
ఆంధ్రవిశ్వవిద్యాలయం,
విశాఖపట్నం, 9393100566

స్త్రీలు లేకుండా పురుషులు వేగవంతంగా ముందుకు పయనించడం సాధ్యం కాదు. స్త్రీ సామాజిక కొలమానానికి ప్రాథమిక ప్రమాణం. ఆమె కుటుంబ నిర్మాణంలో ప్రధాన భాగం. కుటుంబాన్ని ఇల్లుగా మారుస్తుంది. ఇంటిని ఒక సమాజంగా తయారు చేస్తుంది. చివరికి సమాజాన్ని ఒక దేశంగా నిలుపుతుంది. మహిళలు అభివృద్ధి పనులకు చొరవ చూపేంత వరకు దేశం పురోగమించదు. అందుకే స్వామి వివేకానంద .. "స్త్రీల పరిస్థితి మెరుగుపడకపోతే లోక క్షేమం గురించి ఆలోచించడం అసాధ్యం." అన్నారు. భారతదేశంలోని మహిళల స్థితి గత కొన్నేళ్ళుగా చాలా మార్పులకు లోనైంది. భారతదేశంలో నేటి స్త్రీల స్థితి– సామాజిక, ఆర్థిక, రాజకీయంగా మార్పు చెందింది. ప్రాచీన, మధ్యయుగాల కంటే చాలా ఎక్కువగా స్త్రీ అభివృద్ధి పథంలో నిలిచింది. ఐనప్పటికీ చట్ట పరంగా మహిళల స్థితిగతులను పెంచారు. ఇప్పటికీ పురుషులతో సమానత్వానికి చాలా దూరంగా ఉన్నారు. సైద్ధాంతికంగా ఆధునిక స్త్రీల పరిస్థితి చాలా మెరుగ్గా కనిపిస్తుంది. ఐనప్పటికీ ఆచరణాత్మకంగా అది తక్కువగా ఉంది. ఆధునిక భారతీయ సమాజంలో స్త్రీలు ఇప్పటికీ దోపిడీకి, అవమానాలకు గురవుతున్నారు. దీనికి సంబంధించిన ఘటనలు రోజూ తారసపడుతున్నాయి.

చారిత్రాత్మకంగా, క్రీ.శ 1750 తర్వాత కాలం ఆధునిక కాలంగా పిలువబడుతుంది. ఈ కాలంలో స్త్రీల స్థితి సమూలంగా మారుతుంది. భారతదేశంలో బ్రిటిష్ పాలనలో మహిళల స్థితి కంటే స్వతంత్రం తర్వాత భారతదేశంలో మహిళల స్థితి కొంత మెరుగ్గా కనిపిస్తోంది. మొగల్ సామ్రాజ్యం పతనం తరువాత బ్రిటిష్ పాలకులు భారతీయ ప్రజలపై తమ ఆధిపత్యాన్ని చలాయించారు. బ్రిటీష్ పాలనలో, మన సమాజంలోని ఆర్థిక, సామాజిక నిర్మాణాలలో చాలా మార్పులు వచ్చాయి. ఈ కాలంలో స్త్రీల జీవన నాణ్యత పెరిగింది. స్త్రీ పురుషుల మధ్య అసమానతలను తొలగించడంలో కొంత గణనీయమైన పురోగతి చెందింది. బాల్యవివాహాలు, సతీసహగమనం, దేవదాసి వ్యవస్థల నిషేధం, పరదా పాత్ర, వితంతు పునర్వివాహాలు మొదలైనవన్నీ స్త్రీలను ప్రగతిపథంలో నిలిపాయి. రాజారామ్ మోహన్ రాయ్, విద్యా సాగర్ వంటి సంస్కర్తల కృషి ఫలించింది. పండిత రమా బాయి వంటి అనేక మంది మహిళా సంస్కర్తలు కూడా మహిళల వైకల్యాల కోసం పోరాడారు. భికాజీ కామా, డాక్టర్ అన్నీ బిసెంట్, విజయలక్ష్మి పండిట్, అరుణా అసఫ్ అలీ, సుచేతా కృపాలనీ మొదలైన మహిళలు భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో ముఖ్యపాత్ర పోషించారు. కవయిత్రి, స్వాతంత్ర్య సమరయోధురాలు సరోజినీ నాయుడు భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా నిలిచారు. రాష్ట్ర గవర్నర్ గా చేసిన మొదటి మహిళ కూడా ఆమే.

స్వాతంత్ర్యానంతరం మహిళల స్థితిగతులు

స్వాతంత్ర్యానంతరం భారతీయ స్త్రీల స్థితిగతుల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. సాంస్కృతికంగా, నిర్మాణాత్మక మార్పులు చోటుచేసుకున్నాయి. మహిళలపై జరుగుతున్న దోపిడీని చాలా వరకు తగ్గింది. వివిధ రంగాలలో మహిళలకు సమాన అవకాశాలు దక్కాయి. మహిళలు తమ ప్రతిభతో పూర్తిగా పకడ్బందీగా జీవిత రణరంగంలో సురక్షితంగా ఉన్నారు. నేడు భారతీయ స్త్రీలు జయించని రంగమేదీ లేదు. మహిళా శిశుహత్య, లింగ వివక్ష, మహిళల ఆరోగ్యం, మహిళల భద్రత, మహిళల అక్షరాస్యత వంటి సమస్యలపై మహిళా కార్యకర్తలు కూడా ఏకమయ్యారు. 1966లో ఇందిరా గాంధీ భారతదేశపు మొదటి మహిళా ప్రధానమంత్రి అయ్యారు. ఆమె మొత్తం పదిహేనేళ్ల పాటు ఆ పదవిలో పనిచేశారు. ప్రపంచంలోనే అత్యధిక కాలం పనిచేసిన మహిళా ప్రధానిగా నిలిచారు. రాజకీయ రంగంలో ఇందిరాగాంధీ, జయలలిత, మాయావతి, వసుంధర రాజే, ఉమాభారతి, షీలా దీక్షిత్, మమతా బెనర్జీ మొదలైన మహిళలు తమను తాము నిరూపించుకుని భారతీయ మహిళలు గర్వపడేలా నిలిచారు. భారతదేశంలో మహిళా రచయిత్రి లేని కాలం నుండి, నేడు అరుంధతీ రాయ్, అనితా దేశాయ్, కిరణ్ దేశాయ్, ఝంపా లాహిరి మొదలైన పేర్లు మరే ఇతర రచయిత్రినైనా సిగ్గుపడేలా చేస్తాయి. కిరణ్ బేడీ, మదర్ థెరిసా,

బచేంద్రిపాల్, కిరణ్ మజుందార్, కల్పనా చావాలా, మీరా కుమార్, ప్రతిభా పాటిల్ మొదలైన వారు వివిధ రంగాలకు చెందిన పేర్లు ఇతరులకు ఉదాహరణగా నిలిచారు. సాధకులుగా ఉండటంతో పాటు, ఆధునిక భారతదేశంలోని మహిళలు భార్యలుగా, తల్లులుగా తమ పాత్రలను నిర్వర్తిస్తున్నారు. సాంప్రదాయకంగా మగవారికి కేటాయించిన విధులను ఇప్పుడు మహిళలు సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. ఖరీదైన సంస్కృతిలో జీవిస్తున్నారు. అందుకు ఒక పురుషుని ఆదాయం సరిపోవడం లేదు. కాబట్టి ఆర్థికవ్యవస్థలో హెచ్చుతగ్గులు కుటుంబాన్ని పోషించడానికి, నిర్వహించడానికి అవసరమైన నిధులను అందించడానికి, ఒక మహిళ వృత్తిని పొందడం తప్పనిసరి అయింది.


కల్పనా చావాలా


అరుణా అసఫ్ అలీ

1990వ దశకంలో, విదేశీ దాత ఏజెన్సీల నుండి వచ్చిన గ్రాంట్లు కొత్త మహిళా ఆధారిత స్వచంధ సేవాసంస్థల ఏర్పాటును ప్రారంభించాయి. స్వయం సహాయక బృందాలు మరియు స్వయం ఉపాధి పొందిన మహిళా సంఘాలు, ఎస్ఇడబ్ల్యుఎ వంటి సంస్థలు భారతదేశంలో మహిళల స్థితిని పెంపొందించడంలో ప్రధాన పాత్ర పోషించాయి. ఈ క్రమంలో నర్మదా బచవ్ ఆందోళనకు చెందిన మేధాపాట్కర్ వంటి మహిళలు స్థానిక ఉద్యమాలకు నాయకులుగా ఎదిగారు. భారత ప్రభుత్వం 2001ని మహిళా సాధికారత సంవత్సరంగా ప్రకటించింది. మహిళల సాధికారత కోసం జాతీయ విధానం కూడా 2001లో ఆమోదించబడింది. మహిళలు ప్రజాస్వామ్య ప్రక్రియ మరియు ఎన్నికలలో చురుకుగా పాల్గొంటున్నారు. ఇది వారి స్థితిని మెరుగుపరుచుకోవడంలో బాగా ఆకట్టుకుంటుంది. నేడు భారతదేశంలోని ఆధునిక మహిళలు ఇంజనీరింగ్, మెడిసిన్, రాజకీయాలు, అధ్యాపకులు వంటి అన్ని రకాల వృత్తులల్లోకి ఘనసీయంగా చేరారు. పెద్ద సంఖ్యలో కళాశాలలు, విశ్వవిద్యాలయాలు చేరుతున్నారు. నిజానికి, భారతదేశం ప్రపంచంలో అత్యధిక శ్రామిక మహిళా జనాభాను కలిగివుంది. యునైటెడ్ స్టేట్స్ కంటే ఎక్కువ సంఖ్యలో వైద్యులు, సర్జన్లు, ప్రొఫెసర్లు ఉన్నారు.

అరుంధతీ రాయ్

బృందా కారత్

భికాజీ కామా

మహిళల కోసం ప్రభుత్వ కార్యక్రమాలు

భారతదేశంలో మహిళల స్థాయిని పెంచడానికి ప్రభుత్వం అనేక శాసనపరమైన చర్యలు చేపట్టింది. 1948లో ఉద్యోగుల రాష్ట్ర బీమా చట్టం రూపొందించింది. 1951లో ప్లాంటేషన్ లేబర్ చట్టాన్ని తీసుకొచ్చింది. 1954లో కుటుంబ న్యాయస్థానాల చట్టం ఇదే ఏడాది ప్రత్యేక వివాహ చట్టం, 1955లో హిందూ వివాహ చట్టం, 1956 హిందూ వారసత్వ చట్టం, 2005లో సవరణతో 1956 అనైతిక రవాణా (నివారణ) చట్టాన్ని తీసుకొచ్చారు. దీనికి 2005లో సవరణలు తీసుకొచ్చారు. 1961లో ప్రసూతి ప్రయోజన చట్టం చేశారు. దీనికి 1995లో సవరణ చేబట్టారు. 1961 వరకట్న నిషేధ చట్టం, 1971లో ది మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ యాక్ట్, 1976లో కాంట్రాక్ట్ లేబర్ (నియంత్రణ మరియు రద్దు) చట్టం, 1976 సమాన వేతన చట్టం, 2006లో బాల్య వివాహాల నిషేధ చట్టం, 1983లో క్రిమినల్ లా (సవరణ) చట్టం, 1986లో కర్మాగారాల (సవరణ) చట్టం, 1986లో మహిళల అసభ్య ప్రాతినిధ్యం (నిషేధం) చట్టం, 1987లో కమీషన్ ఆఫ్ సతి (నివారణ) చట్టం, 2005లో గృహ హింస నుండి మహిళల రక్షణ చట్టం మొదలయినవి వచ్చాయి. శాసన నిబంధనలతో పాటు, కేంద్ర, రాష్ట్ర స్థాయిలో అనేక సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు, వివిధ మంత్రిత్వ శాఖలచే అమలు జరుగుతున్నాయి. 1993 నుంచి మహిళా సమృద్ధి యోజన, ఇందిరా మహిళా యోగా, 1995 స్వధార్, 2003 మహిళలకు శిక్షణ మరియు ఉపాధి కార్యక్రమానికి మద్దతు, 2007 ఉజ్వల, 2008 ధనలక్ష్మి, 2010 సబ్లా పథకం, 2010 నేషనల్ మిషన్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్. ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్, మహిళా అభివృద్ధి కార్పొరేషన్ పథకాలు, ఇందిరా ప్రియదర్శిని యోజన, స్త్రీ శక్తి పథకాలు మొదలయినవి కొనసాగుతున్నాయి. ఈ విధంగా, మహిళల సామాజిక, ఆర్థిక మరియు రాజకీయ ప్రయోజనాల కోసం అనేక ప్రయత్నాలు జరిగాయి, అయినప్పటికీ పరిస్థితిలో చెప్పుకోదగిన మార్పులు

చోటుచేసుకోడం లేదు. మునుపటి కాలం కంటే మెరుగుపడిన పరిస్థితిని ఎవరూ కాదనలేరు. గతంతో పోలిస్తే, ఆధునిక కాలంలో మహిళలు వివిధ రంగాల్లో శక్తిమంతులుగా మారారు. ఇంకా మారాల్సిన అవసరం ఉంది.

సరోజినీ నాయుడు

సాహిత్యరంగంలో సముచిత స్థానం ఆక్రమించిన మహిళలు :

ఉద్యోగ రంగంలో స్త్రీల సంఖ్య పెరుగుతూ వచ్చింది. ఉద్యోగ బాధ్యతలు నిర్వహించే ప్రదేశాల్లో వారు వివిధ రకాలుగా హింసకు గురవుతున్నారు. అనేక అనుభవాలను చవి చూడాల్సి వస్తుంది. ఇటువంటి పరిస్థితుల్ని నలిగిపోయే స్త్రీల స్వభావాన్ని చిత్రించిన ఘనతను మాలతీచందూర్, వాసిరెడ్డి సీతాదేవి, అరవింద ఆనందారామం మొదలయిన రచయిత్రులకు దక్కుతుంది. మహిళల అంతరంగాన్ని సునిశితంగా ఆవిష్కరించిన ప్రతిభ వీరి సొంతమని చెప్పవచ్చు. "తెలుగు సాహితీ క్షేత్రంలో సార్వకాలికమయిన సమ్మోహనశక్తితో నిలబడగలిగిన అక్షరాలు రెండే రెండు అవి 'అమ్మ'. నిత్య నైమిత్తకాలాల్లో మానవుడు అమ్మను ఎన్ని రూపాల్లో తలచుకుంటాడో, స్తుతిస్తాడో చెప్పలేం. 'మాతృదేవో భవ'తో ప్రారంభమయ్యే బాలకాండ మనిషి బావిజీవితాన్ని తీర్చిదిద్దే పెదబాలశిక్ష!. శిశువుకు పాలివ్వడంతోనే తన కర్తవ్యం పూర్తయిందని తల్లి అనుకోదు. అనుభవాల ఆస్తులు పంచుతుంది. అనురాగాలను వారసత్వంగా అందేజేస్తుంది. అందుకే పోతనామాత్యుడు 'అమ్మలగన్న యమ్మ ముగు రమ్మల మూలపుటమ్మ' అమ్మలో కవులు దేవిని చూశారు. శారదాదేవిని చూశారు. భారత మాతను దర్శించారు, తెలుగుతల్లిని ఆవాహన చేశారని ప్రముఖ సంపాదకులు ఎబికె ప్రసాద్ ఒక సమీక్షలో పేర్కొన్నారు.

సుధా మూర్తి

విజయలక్ష్మి పండిట్

స్త్రీ వాద దృక్పథం అనగా స్త్రీల జీవితాల్లోని సాంఘిక, ఆర్థిక, రాజకీయ అంశాలని పురోగామి దిశగా మలుపు తిప్పగల దృక్పథం అని అర్థం. ఈ దృక్పథం కలిగిన సాహిత్య ప్రక్రియ ఏదైనా, స్త్రీవాద సాహిత్యం అవుతుంది. స్త్రీల సాహిత్యంలో వారి జీవితాల్లోని సంక్లిష్టతా, వైరుధ్యాలు వ్యక్తమవుతాయి. బలమయిన కవితా ధోరణితో శక్తివంతమయిన శైలిలో ప్రపంచంలోనే తెలుగు సాహిత్యానికి ఒక ప్రత్యేకతనీ, విశిష్టతనీ కవయిత్రులు తీసుకొచ్చారు. దీనిని తెలుగు సాహిత్య విమర్శ గుర్తించి గౌరవించింది. స్త్రీవాద సాహిత్యం 90వ దశకం నుంచి మొదలయింది. స్త్రీ విముక్తికి సోషలిజమే మార్గమని నమ్మినా, స్త్రీ సమస్యలపై వామపక్ష ఉద్యమాలకు సరైన అవగాహన లేదంటూ, ఒకవేళ ఉన్నా ఆచరణలో విఫలమవుతున్నారంటూ వచ్చిన ఆరోపణల నుంచి స్త్రీవాద సాహిత్యం మొదలయింది. పెట్టుబడిదారీ విధానం గల పాశ్చాత్య దేశాల్లో అవసరం మేరకు స్త్రీలను ఉత్పత్తి రంగంలోకి తీసుకురావడం వల్ల మహిళల్లో కొంత వికాసం జరిగింది. మన దేశం విషయానికొస్తే 70 శాతం మంది చదువుకోనివారు, 80 శాతం గ్రామాల్లో నివసిస్తున్నవారు కావడం వల్ల మహిళ చైతన్యం నామమాత్రంగానే ఉంది. స్త్రీల పరిస్థితులను, సమస్యలను వివరించడానికి, చర్చించడానికి ఫెమినిస్టులు ఇంగ్లీషు, హిందీలో 'మానుషి', సంఘర్ష్ పత్రికలను, బెంగాలీ భాషలో 'సచేల' మరాఠీలో 'మిలాన్ సర్వాజని' తెలుగులో స్త్రీ స్వేచ్ఛ', 'భూమిక' పత్రికలను ప్రచురిస్తున్నారు. స్త్రీ ఉద్యమాన్ని, స్త్రీ వాద సాహిత్యాన్ని భారతీయ పత్రికలు, మీడియా మంచి ప్రచారాన్ని ఇస్తున్నాయి. స్త్రీ ఉద్యమాల ప్రభావం వల్లనో, ప్రచార సాధనాల ప్రభావం వల్లనో ఇటీవల ఆడపిల్లల తల్లిదండ్రుల మనస్తత్వాల్లో కొంతమార్పు కనిపిస్తుంది.

షీలా దీక్షిత్

గాంధీజీ స్త్రీ పరిస్థితుల గురించి మాట్లాడారు. "దేవుని సృష్టిలో స్త్రీలు అత్యంత శ్రేష్ఠమైనవారు, వారు తమదైన కార్యా చరణలో అత్యున్నతమైనవారు" ఈ మాటలకు చాలావరకు సార్థకత లభించింది. పెరిగిన అవగాహన, విద్య మహిళలను ఇంటి గోడల నుండి బయటకు రావడానికి ప్రేరేపించాయి. ఆధునిక మహిళ తన సామాజిక, భావోద్వేగ, సాంస్కృతిక, మత పరమైన మరియు ఆర్థిక అవసరాలను సమకూర్చుకోవడంలో పరుగులు తీస్తుంది. ఆమె ఇప్పుడు భారతదేశంలో సామాజిక మార్పుకు సాధనంగా మారింది. మహిళలకు మునుపటి కంటే ఎక్కువ స్వేచ్ఛ లభించింది. అయితే చాలా విషయాల్లో ఈ పరిస్థితికి కనిపించడం లేదు. ఎందుకంటే సమాజంలో ఇప్పటికీ వివక్ష ఉంది. భారతదేశంలో నేటి ఆధునిక మహిళల స్థితి మెరుగ్గా ఉన్నప్పటికీ, అన్ని రంగాల్లో సంతృప్తికరంగా లేదు. ఒక దేశపు తల్లులు, భార్యలు, సోదరి, సోదరీమణుల, కుమార్తెలు చురుకైన భాగస్వామ్యంతో ప్రపంచ పురోగతి సాధిస్తోందని మరచిపోకూడదు. కాబట్టి ప్రతి పురుషుడు స్త్రీల పట్ల తన దృక్పథంలో విప్లవాత్మకమైన మార్పు తీసుకురావాలని, దేశ ప్రగతిలో స్త్రీలను సమాన భాగస్వాములుగా అంగీకరించాలని ఆలోచనాత్మకంగా నిర్ణయించుకోవాలి. అప్పుడే భారతీయ మహిళ త్వరితగతిన సమానస్థితిలో నిలుస్తుంది.

అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా

బ్రాహ్మణవాదం పై తిరుగుబాటు చేసిన సావిత్రిబాయి పూలే

సావిత్రిబాయ్ పూలే భారతదేశంలో ప్రత్యామ్నాయ జీవన వ్యవస్థలు వెలిగించిన ఒక మహోజ్వల కాంతి దీపం. భారతదేశ చరిత్రను మలుపుతిప్పిన స్త్రీమూర్తి. ఎవరైతే చరిత్రను మలుపుతిప్పుతారో వారికే యుగ కర్తృత్వం ఉంటుంది.. చరిత్రతో నడిచే వాళ్ళు మరణించిన తర్వాత తిరిగి లేవరు. చరిత్రను మార్చాలి అంటే త్యాగాలు కావాలి. త్యాగం అనేది ఒక ఆరిపోని దీపం. ఈ రోజుకి సావిత్రిబాయ్ పూలే భారతదేశంలో వెలుగొందుతుంది అంటే, త్యాగం, కృషి, పట్టుదల, నిజాయితీ. నీతి, విజ్ఞానం, విలువలు సావిత్రిబాయ్ పూలేకే సొంతం.

భారతదేశంలో స్త్రీలు అణచివేతకు గురై విద్యాగంధం లేక బ్రాహ్మణాధిపత్య భావజాలంలో మగ్గిపోతున్నప్పుడు స్త్రీ వ్యక్తిత్వాన్ని ధ్వంసం చేసి ఆమెను వ్యభిచారిగా చిత్రించి, ఆమె మనసు తోడేలు మనసు అని వ్యాఖ్యానించి, ఆమెకు స్వేచ్ఛ ఇస్తే పురుష సంపర్కానికి తెగబడిందని ప్రకటనలు చేసి, స్త్రీని వంటింటి కుందేలుగా మార్చిన సందర్భంలో సావిత్రిబాయ్ పూలే సూర్య ప్రభాసమమైవ స్త్రీ విముక్తి ఉద్యమానికి సావిత్రిబాయ్ పూలే ఉద్యమానికి నడుం కట్టింది.

డా॥ కత్తి పద్మారావు
మహాకవి

ముఖ్యంగా మనుస్మృతి స్త్రీకి ఇనుప సంకెళ్లు బిగించింది. ఇనుప కచ్చడాలు ఆమె వేరే వారితో సంభోదించకుండా మర్మాంగాలకు కట్టి బంధించింది. నిజానికి స్త్రీ లేకపోతే ప్రపంచమే లేదు. ఏ స్త్రీకైతే పుట్టాడో, ఆ పురుషుడే స్త్రీని ద్వేషించాడు. ఆమెను అవమానించాడు, అనుమానించాడు, శాసించాడు. ముఖ్యంగా బ్రాహ్మణులు స్త్రీ శృంగార శక్తికి భయపడ్డారు. ఇతర వర్ణాల వారితో, కులాల వారితో కలుస్తుందేమోనని విపరీతమైన ఆంక్షలు విధించారు. మనుస్మతి నిండా ఇతర కులాల వారిని ఇతర వర్ణాల వారిని, ముఖ్యంగా అస్పృశ్యులను త్రైవర్ణాల పురుషులను కలవకుండా ఇలా విధించారు.

“సంతానం కలగాలంటే ఒక స్త్రీ, ఒక పురుషుడు కలిస్తే చాలా? లేక ఒక వర్ణంలో ఉండే స్త్రీ పురుషులే కలవాలా? ఒకే వర్ణంలో ఉన్న స్త్రీ పురుషులే పెండ్లికి అర్హులైతే – రెండు వర్ణాలు సంకరమైనప్పుడు పిల్లలెలా కలిగారు?పుట్టిన పిల్లవాణ్ణి గుణకర్మల్ని బట్టి నాలుగు వర్ణాల్లో దేనిలోనో ఒక దానిలో చేర్చాలి గాని, వీడికి ప్రత్యేక వర్ణం ఎక్కడిది? అంటే జన్మని బట్టి వర్ణమా? గుణాన్ని బట్టా?

అయితే “ఆర్యా స్త్రైవర్ణికా:” అని గౌతమ ధర్మ సూత్రం “చాతుర్వర్ణం మయా సృష్టం గుణకర్మ విభాగశ:” అని వ్యాసుడు (కృష్ణుని ముఖమున) నాస్తితు పంచమ : అని మనువు చెప్పినవి కాక – ఇవాళ 4000 కులాలు ఎట్టా ఏర్పడినవి?

భారతదేశంలో ఒక దానిలోనే ఈ విభాగామా

ప్రపంచ దేశాలన్నింటిలోనా?

మరి ఏ దేశంలో కృష్ణుడు, మనువు ఈ వర్ణ విభాగం చేసినట్లు కనిపించదే?

వీరందరిలో చండాలుడు ఒక్కడే స్పర్శకనర్హుడా?

“ఏకాంతరే త్వానులో మాద్యం బష్ఠాగ్రా యథౌస్మృతౌ.

క్షత్తృ వైదేహకౌ తద్వత్ ప్రాతిలోయ్యే పి జన్మని” (అ–8 శ్లోకం – 13)

ఒకటి విడిచిన వర్ణమున అనగా అనులోమమున బ్రాహ్మణునకు వైశ్య స్త్రీ యందు పుట్టిన అంబష్ఠుడు, క్షత్రియునకు శూద్ర స్త్రీ యందు పుట్టిన ఉగ్రుడును ఎట్లు తాకదగిన వారలో, అట్లే ఒకటి విడిచిన వర్ణమందు ప్రతి లోమమునను శూద్రునకు క్షత్రియ స్త్రీ యందు పుట్టినే క్షత్ర వైశ్యునకు బ్రహ్మణి యందు పుట్టిన వైదేహుండును, స్పర్శాదులకు అర్హులే అగుదురు. ఒకటి కంటే వెంబడి జాతియందు పుట్టివారెట్లు స్పర్శాదులో అట్లు రెండు విడిచిన జాతులందు పుట్టిన సూతమాగధ, అమోగవులును స్పర్శార్హులగుదురు. కనుక ప్రతిలోమ జాతులలో చండాలుడొక్కడే స్పర్శాదుల కర్హుడు కాడు అని మనువు నిర్ణయించాడు”. సావిత్రిబాయ్ పూలే మనుస్మృతి విధించిన సంకెళ్ళన్నింటిని ధ్వంసం చేసింది. స్త్రీ, పురుషుల సంబంధాలు సహజమైనవి, ప్రాకృతకమైనవి అని నిరూపించింది.

ప్రపంచవ్యాప్తంగా తాత్వికులకు, ఉద్యమకారులకు పోరాటవీరులకు బాసటగా నిలచిన స్త్రీలలో సావిత్రిబాయి పూలేది అద్వితీయ చరిత్ర. ఒక మార్క్సుకు జన్నీ ఎంతో సహకారాన్ని అందించింది. అయితే అది తాత్విక రంగంలోనే ఎక్కువగా జరిగింది. కానీ సావిత్రిబాయి పూలే మొత్తం పోరాటంలోనే భర్తకి అండగా నిలచింది. తన వ్యక్తిత్వాన్ని చాటి అనేకమైన అంశాల్ని చరిత్రను ముందు తీసుకొచ్చింది. భారతదేవ చరిత్రలో దళితులకు పాఠశాల పెట్టిన ఘనత సావిత్రిబాయిపూలే, మహాత్మా పూలేలదే. అట్టడుగు వర్గాలకు విద్య చెప్పడమనే ఒక పోరాటాన్ని వాళ్ళు అప్పుడే స్వీకరించారు. స్త్రీ బానిసగా చూసే ఈ సమాజంలో తన భార్యను విద్యావంతురాలిని చేయడమే గాక ఆమెలో పోరాట స్ఫూర్తిని తీసుకు రావడంలో మహాత్మాపూలే కూడా ఒక చారిత్రాత్మకమైన బాధ్యతని నిర్వహించారు. అయితే సావిత్రిబాయి పూలే లోనే ఒక అచంచలమైన దీక్ష ఉంది. సావిత్రిబాయి పూలే జీవితాలు భార్య భర్తలకు కూడా

ఆదర్శనీయమైనవి. ఒక ఉద్యమానికి ఒకరు స్ఫూర్తిదాతలు. భార్య భర్త లిద్దరిలో అనునయం, ఆత్మీయత, సిద్ధాంతబలం సమ్మిళితంగా ఉన్నాయి. సావిత్రిబాయి పూలే మంచి సహచరిణి. కమ్యూనిస్టులు ఎక్కువగా మార్క్సును ఆయన భార్య జన్మను పొగుడుతారు కానీ వారికి ధీటైనవారే. ఎందుకంటే మార్క్స్ జన్నీలో మార్క్స్‌కు జన్నీ సహకారమే ఉంది కానీ జన్మ స్వతంత్ర ఉద్యమం లేదు. ఇక్కడ సావిత్రిబాయి పూలే ఒక్క స్త్రీగా బ్రాహ్మణ వాదంపై తిరుగుబాటు చేసింది. అది అసమానమైన సాహసం. బ్రాహ్మణవాదులు పెనుకుట్రదారులు వారు ప్రతీ ఉద్యమాన్ని విధ్వంసం చేస్తారు. అయితే ఆమెకు అండగా నిలబడిన పూలే చాలా గొప్పవాడు.

విద్యా చైతన్య దీప్తి : జ్యోతిరావు పూలే నవయుగ వైతాళికుడు. ఆయన ముఖ్యంగా శూద్ర, అతిశూద్రులకు విద్యను నిరాకరించిన ఆంశాల మీద పోరాడి వీరిలో విద్యా చైతన్యాన్ని కల్పించాడు.

పూలే ఉద్యమం లేకుంటే ఈనాడు కొందరి చేతుల్లోనే విద్యా సంస్కృతి, చరిత్ర, ప్రబోధం మిగిలిపోయి ఉండేవి. కానీ విద్యను అందరికీ సార్వత్రికం చేయటానికి ఆయన చేసిన పోరాటంలో కులవాదం లేదు. ఆనాడు బ్రాహ్మణ వాదాన్ని ఎదిరించే క్రమంలో బ్రాహ్మణులను కూడా ఎదిరించాల్సి వచ్చింది. బ్రాహ్మణుల్లో ఆనాడు పూలేను ఎంతో మంది సమర్థించారు. ఆయన పోరాటంలో సాహుమహారాజ్ సమర్థించారు. ఆ పోరాటాన్ని మనం అవగాహన చేసుకోగలిగితేనే ఏ ఆధిపత్య వర్గాలు కొన్నివేల సంవత్సరాలు విద్యను స్వాయత్తం చేసుకుని ఈనాటి నిరక్షరాస్యతకు, పేదరికానికి కారణమవుతున్నాయో తెలుసుకోగలుగుతాం.

జ్యోతిరావు పూలే చిన్నతనం నుంచి బ్రాహ్మణవాదాన్ని బలంగా ఎదుర్కొన్నాడు. ఆయన మార్గంలోనే సావిత్రిబాయి పూలే అచంచలమైన కృషి చేసింది. ఎందుకంటే బ్రాహ్మణవాదులు స్త్రీకి బిగించిన సంకెళ్లు సామాన్యమైనవి కావు. అవి యుగాలుగా బిగించబడి ఉన్నాయి. వాటిని ఛేధించాలంటే ముందు బ్రాహ్మణవాదం అంటే ఏమిటో తెలుసుకోవాలి. ఆ కృషిని సావిత్రిబాయి పూలే చేశారు. సావిత్రిబాయి పూలే జీవన ఘర్షణ నుండి పైకి వచ్చిన శూద్ర స్త్రీ, ఆ రోజుల్లో బ్రాహ్మణ స్త్రీని కూడా శూద్రస్త్రీలతో పాటు చదువుకోకుండా చేశారు. వారి యజ్ఞాలన్నింటిలో బ్రాహ్మణ స్త్రీకి వ్యభిచారిగా తేల్చారు.

"కౌసల్య । సుమిత్ర । కైకేయిలను ఋష్యశృంగ గుడాదిగా గల వారితో చేసిన యజ్ఞం పేరుతో పుట్టిన శ్రీరామాదుల ఎలా యాగాల కర్మలయ్యారు? కలుస్తుంటారనే సత్యం తెలియని మనువు పెట్టిన ఇట్టి నిబంధనలను చూసే వేమన.

"ఆలిరంకు తెలుపు అఖిల యజ్ఞమ్ములు
తల్లిరంకు తెలుప తద్దినాలు" అన్నాడు.

శ్లో॥ "న కశ్చిద్యోషిత శ్శక్తహ: ప్రసహ్య పరిరక్షితుం
ఏతై రూపాయ యోగైస్తు శక్యాస్తా: పరిరక్షితుమ్॥
(మను-9-10)

స్త్రీలను బలవంతముగా కాపాడ నెవ్వరికిని తరముగాదు. కావున వారిని క్రింది ఉపాయములచే సంరక్షింప వలయును.

శ్లో॥ అర్థస్య సంగ్రమే చైనాం వ్యయే చైవ నియోజవేత్
శౌచే ధర్మేన్న ఏకాంచ్య పరిణాహ్యస్య చేక్షణే" (మను-9-11)

స్త్రీ విముక్తి పోరాట నేపథ్యం :

స్త్రీని ధనమును కాపాడుట, వ్యయ పరచుటల యందు ద్రవ్యములు శరీరమును పరిశుద్ధ పరచుట యందు, భర్త శుశ్రూష మొదలగు కార్యములందును, వంటవార్పులయందును, గృహోపకరణముల రక్షణమునందును, నియమింపవలయును.

నిత్యము శుద్ధి కార్యముల్లో, సేవా కార్యక్రమాల్లో తలమునకలుగా స్త్రీని నియుక్తం చేస్తే కాని ఆమె తప్పు చేయకుండా ఉండదు అనే దుష్ట నీతిని మనువు ప్రవచిస్తున్నాడు. ఇట్టి దురాభిప్రాయం ఎందరి మెదళ్ళలోనే గూడు కట్టుకొని స్త్రీల యెడ పాశవికంగా ప్రవర్తించే దోరణిని అలవర్చింది. ఈ పరిధులు దాటి ఎందరో స్త్రీలు ఉన్నత పరిధుల్లో పయనిస్తున్నప్పటికి మగవాళ్ళ మనసులు మాత్రం ఇట్టి సంకుచిత దృష్టి నుండి విశాలం కాలేకపోవడానికి కారణం ఈ భావాల పట్టు ఇంకా సంస్కృతి నుండి విముక్తం కాకపోవడమే, భార్యలను మీరెంత కాపాడుకున్నా, రక్షించుకున్నా వారి మనసులు పరపురుషాభియుక్తాలు, కాబట్టి వారు పాడవుతూనే ఉంటారని ఈ ధర్మకర్త పురుష పుంగవులకు అనుమానాన్ని తరతరాలుగా నూరిపోస్తున్నాడు.

శ్లో॥ "ఏవం స్వభావం జ్ఞాత్వానాం ప్రజాపతి నిసర్గజం
పరమం యత్న మాతిష్టేత్ పురుషో రక్షణం ప్రతి"
(మను - 9-16)

ఇట్లు బ్రహ్మ సృష్టించిన కాలము నుండియే వీరి స్వభావ మెట్టిదయ్యెనట. ఎరిగి పురుషుడు నెంతయును అపుదలతో నుంచకదుంగదు యత్నించవలయును" (2) భారతీయ సంస్కృతిలో స్త్రీ.

స్త్రీని అనుమనించడం అనే విద్య ఒక్కటే హిందూమతం పురుషులకు నేర్పింది. ఆధునిక హిందువులు కూడా అదే భావనలో ఉన్నారు. ఆధునిక కంచి కామకోటి పీఠాదిపతి శ్రీ చంద్రశేఖర సరస్వతి రజస్వల అయిన బాలికను పాఠశాలను పంపిచంకూడదని అంటున్నారు. ఇవి హిందూమత బ్రామ్మణవాద భావజాలం. ఈ బ్రాహ్మణవాద భావజాలాన్ని సావిత్రిబాయి పూలే ఎదురించి నిలబడింది. సావిత్రిబయి పూలే స్వతంత్రమైన ఉద్యమకారురాలు. మహాత్మా పూలే సహకారం తీసుకున్నప్పటికీ కూడా ఆమెదే స్వతంత్రమైన భావన. ఆమెలో సిద్ధాంతబలం నిక్కచ్చిగా ఉంది. బ్రాహ్మణ వాదాన్ని ఎదిరించటం అంటే అదీ సామాన్యమైన భావన కాదు. ఆదీ మొత్తం వ్యవస్థను వ్యతిరేకించడమే. అప్పటికి ఉన్న వ్యవస్థే బ్రాహ్మణ వ్యవస్థ.

బోయి భీమన్న జీవితం, సాహిత్యం : జాతీయ సమైక్యతా స్ఫూర్తి

బోయి భీమన్న సాహిత్యం- సమాలోచన పేరుతో రెండు రోజుల పాటు (21,22 ఫిబ్రవరి 2022) అంతర్జాల అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తూ, ప్రారంభోత్సవ సమావేశానికి అధ్యక్షత కూడా వహిస్తున్న మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య విస్తాలి శంకర రావు గారికి, ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రత్యేక సంచికను ఆవిష్కరించబోతున్న భీమన్న సాహితీ నిధి అధ్యక్షులు శ్రీమతి హైమవతి భీమన్న గారికి, వారి కుటుంబ సభ్యులకు నా నమస్కారాలు తెలియజేస్తున్నాను.

ఈ ప్రారంభ సమావేశంలో అతిథులుగా పాల్గొంటున్న జర్మనీ లోని హైడెల్ బర్గ్ విశ్వ విద్యాలయానికి చెందిన డా.టి శ్రీ గణేష్‌గార్కి, అమెరికా నుండి పాల్గొంటున్న శ్రీ సీతారామ్ లంకా గార్కి, మదురై కామరాజ్ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షులు ఆచార్య వెంకటరమణ గార్కి, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్ తెలుగుశాఖ ఆచార్యులు ఏటూరి జ్యోతి గార్కి, ఆంధ్ర విశ్వకళాపరిషత్ తెలుగు ఆచార్యులు భావవీణ మాసపత్రిక యుజిసి కేర్ జర్నల్ సంపాదకులు ఆచార్య బూసి వెంకటస్వామి గార్కి, మద్రాసు క్రైస్తవ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య శ్రీపురం యజ్ఞశేఖర్ గార్కి, సభకు అతిథులను ఆత్మీయంగా ఆహ్వానించిన తెలుగుశాఖ మద్రాసు విశ్వవిద్యాలయం అధ్యాపకులు డా.పాండురంగం కాళియప్ప గార్కి, ఈ సమావేశానికి వందన సమర్పణ చేయబోతున్న డా.మాదాశంకరబాబు గార్కి, సాంకేతిక సహకారాన్ని అందిస్తున్న పులి జ్యోతి గారికి, మద్రాసు విశ్వవిద్యాలయంలో ఆచార్య శంకరరావు గారితో ఎంతో ఆత్మీయంగా ఉండే, ఆయన్ని చూస్తుండగానే బాబాయ్ అనిపించేటంతటి ఆత్మీయులు గుడిమెట్ల చెన్నయ్యగార్కి నా నమస్కారాలు. సభలో విశ్వర్షి వాసిలి వసంతకుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.జరుపుల రమేష్, పోస్ట్ డాక్టోరల్ రీసర్చ్ స్కాలర్స్ డా.ఎన్.రాంబాబు, డా.గౌరీశ్వరరావు.. ఇలా ఎంతో మంది ఉన్నారు. వారందరికీ నమస్కారాలు.

ఆచార్య **దార్ల వెంకటేశ్వరరావు,**
తెలుగు శాఖాధిపతి,
సెంట్రల్ యూనివర్సిటీ,
హైదరాబాద్,
ఫోను: 9182685231

ఈ రెండు రోజుల సదస్సులో పాల్గొంటున్న అనేకమంది సాహితీవేత్తలకు పత్ర సమర్పకులకు, విద్యార్థినీ విద్యార్థులకు, పరిశోధకులకు నా నమస్కారాలు తెలియజేస్తున్నాను. బోయి భీమన్న గారు ప్రసిద్ధ కవి.బోయి భీమన్న గారు బాధ్యతాయుతమైన నాటక కర్త. బోయి భీమన్న గారు సామాజిక పరివర్తనను ఆశించిన దార్శనికుడు. బోయి భీమన్న గారు గొప్ప రసవాది, ప్రేమ పిపాసి. బోయి భీమన్న గారు భారత జాతీయ సమైక్యతాస్ఫూర్తి.అందుకే ఆయన కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని పొందారు. అందుకే అయిన భారత ప్రభుత్వ అత్యున్నత పురస్కారమైన పద్మ విభూషణ్ పొందారు. అన్నింటికంటే మించి భారతదేశంలోను, ముఖ్యంగా తెలుగు వాళ్ళ గుండెల్లో పదిలంగా నిలిచిపోయారు. అటువంటి మహానుభావుడు గురించి ఈరోజు మనం ఎందుకు మాట్లాడుకోవాలి?

ఎందుకంటే నేడు ...?

మతం పేరుతో, భాష పేరుతో, ప్రాంతాల పేరుతో, కులాల పేరుతో రకరకాలైన ఏర్పాటు ధోరణులు కనిపిస్తున్నాయి. మనదేశంలో ఈ సమస్యలు నిత్యం కనిపిస్తున్నా, ఈ మధ్య కాలంలో మరింత ఎక్కువయ్యాయి.ఈ పరిస్థితుల్లో భారతదేశ జాతీయ సమైక్యత గురించి మాట్లాడుకోవాలి. జాతీయ సమగ్రత గురించి మాట్లాడిన వారి గురించి మనం మాట్లాడుకోవాలి. మరలా మన జాతి విచ్ఛిన్నం కాకుండా భారతీయులంతా ఒక్కటేనని ధ్వనింప చేయగలిగిన రచనలు చేసిన వారిని గురించి మాట్లాడుకోవాలి. అటువంటి జాతీయతా స్ఫూర్తిని రగిలించిన మూర్తి, స్ఫూర్తి. బోయి భీమన్న తేజో దీప్తి. అందుకనే సరైన సమయంలో మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ వారు ఆయన గురించి అంతర్జాలంలో ద్వారా అంతర్జాతీయ స్ఫూర్తితో ఒక సదస్సుని నిర్వహిస్తున్నారు. అందుకు ముందుగా మద్రాసు విశ్వవిద్యాలయం వారిని మనం అభినందించాలి.

బోయి భీమన్న గారి జీవితం వడ్డించి విస్తరి కాదు. ఒక సాధారణ దళితుని జీవితం ఎలా ఉంటుందో అలాగే భీమన్నగారి జీవితం కూడా ప్రారంభమైంది.ఈయన జీవితం గురించి సమగ్రమైన రచన శ్రీమతి హైమవతీ భీమన్నగారు రాసిన 'పాలేరు నుండి పద్మశ్రీ వరకూ" చదవాలి. అది భీమన్నగార్ని, ఆయన భావజాలాన్ని తెలుసుకోవడానికి కీ పాయింట్స్ ఎన్నో ఈ గ్రంథంలో ఉన్నాయి. భీమన్నగారు 1911 సెప్టెంబరు 19 వ తేదీన ఒకప్పటి తూర్పు గోదావరి జిల్లా (ప్రస్తుతం కోనసీమ జిల్లా) మామిడికుదురు గ్రామంలో ఒక దళిత కుటుంబంలో పుట్టారు.ఈయన తల్లి పేరు నాగమ్మ, తండ్రి పేరు పుల్లయ్య.ఈ దంపతులకు ఐదుగురు మగపిల్లలు,ఒక ఆడపిల్ల జన్మించారు.పుల్లయ్య తన మగపిల్లలకు వరుసగా ధర్మరాజు, భీమన్న, అర్జునుడు, నకులుడు, సహదేవుడు అనే పేర్లు పెట్టారంటే అప్పటికే ఆ ఇంటిలోసాహిత్య వాతావరణంఉంది. భీమన్నగారు బి.ఎ.,బి.ఇడి. పూర్తి చేసి, బోర్డు హైస్కూలులో చరిత్రను బోధించే ఉపాధ్యాయునిగా పనిచేశారు. తర్వాత ఆంధ్రప్రదేశ్ అనువాద విభాగం డైరెక్టర్‌గా, రిజిస్ట్రార్ ఆఫ్ బుక్స్ గా 1964 వరకు పనిచేశారు. ఒకవైపు చదువుకుంటూనే మరొకవైపు పాత్రికేయునిగా

పనిచేశారు. ఆవిధంగా జనవాణి, జయభేరి, ప్రజామిత్ర, ఆంధ్రప్రభ తదితర పత్రికల్లో సబ్-ఎడిటర్, ఎడిటర్‌గా వివిధస్థాయిల్లో పనిచేశారు.సమైక్య ఆంధ్రప్రదేశ్ విధాన పరిషత్ శాసనసభ్యునిగా నామినేటెడ్ పదవిలో1978 నుండి 1984 వరకు ఉన్నారు. దీనితో పాటు ప్రభుత్వం అనేక కమిటీల్లో ఈయనను నామినేట్ చేసింది. ఫిలిమ్ సెన్సార్ బోర్డు మెంబరుగా కూడా పనిచేశారు. తన 11వ ఏట నుండే రచనలు చేసే అలవాటున్న భీమన్నగారు సుమారు 70 రచనలను చేశారు. వీటిలో అత్యధిక రచనల దళితుల జీవితాల్ని వర్ణించేవే. మిగతా రచనల్లో కూడా భారతీయ జాతీయతా స్ఫూర్తిని పెంచుతూనే కొన్ని సైద్ధాంతి భావనలను వ్యక్తం చేశారు. వీటిలో పాలేరు, కూలిరాజు, రాగవాశిష్ఠం నాటకాలు ఆయనకు ఎంతో పేరు ప్రఖ్యాతుల్ని తెచ్చాయి. వీటితో పాటు వాల్మీకి, వ్యాసుడు మొదలైన రచనలు కూడా వినూత్న సిద్ధాంతాలతో ఆలోచించేలా చేశాయి. దళితుల్ని తమ ఆత్మగౌరవానికి ఈ రచనలు ఎంతగానో తోడ్పడతాయి. దళిత సంస్కృతిలోని ఔన్నత్యాన్ని చాటిచెప్తాయి. ఆయనలోని గాంధీయిజం, అంబేద్కరిజాలతో పాటు, ఆనాడు విస్తృత వ్యాప్తిలో ఉన్న ఆర్య సమాజ ప్రభావం కూడా ఆయన రచనల్లో ఎంతో శక్తివంతంగా కనిపిస్తుంది. వేదాల్ని వ్యాఖ్యానించడంలోను, ఆర్యులు భారతీయులేనని చెప్పడంలోను ఈయన సిద్ధాంతాలు ఒక విశిష్టతను సాధించుకున్నాయి. వీటి గురించి సాహిత్యలోకంలో పెద్దగా చర్చ జరగకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. అలా భీమన్న గారు సుమారు 70 రచనలు చేసినా, ప్రస్తుతం 66 లభ్యమవుతున్నాయి.

బోయి భీమన్న రచనలు

1.జానపదుని జాబులు, 2.పాలేరు, 3.కూలి రాజు, 4.మధుబాల, 5. రాగోదయం, 6, అసూయ,7. దీప సభ, 8. మధుగీత, 9. భీమన్న కావ్య కుసుమాలు,10. మానవుని మరొక మజిలీ,11.పడిపోతున్న అడ్డుగోడలు, 12. పైరు పాట, 13. రాగ వాసిష్ఠం, 14. అనాది కొస నుంచి అనంతత్వంలోకి, 15. త్రిపదలు, 16. ప్రకృతిలో మానవ ప్రకృతి, 17. చిత్ర కళా ప్రదర్శనం,18. The Seventh Season 19. బాలయోగి, 20. రాగ వైశాఖి, 21. అకాండ తాండవం, 22. రాజకీయ వీరుడు డా.ఖాన్, 23.శ్రీపిల్లీ శతకం, 24. ధర్మం కోసం పోరాటం, 25.ఏక పద్యోపాఖ్యానం, 26.లశోకవనిలో రాముడు, 27.ఆదికవి వాల్మీకి, 28. రాధతో ఎగ్జిబిషనుకు, 29.భీమన్న రాఖీలు, 30. ఓయి కవి కవిత్వం వ్రాయి, 31. మణి మానసం, 32. గుడిసెలు కాలిపోతున్నై, 33. బొమ్మ, 34. కేదారేశ్వరి, 35. శివాలికలు, 36. ప్రగతి, 37. జన్మాంతర వైరం, 38. భీమన్న ఉగాదులు, 39. అంబేద్కర సుప్రభాతం, 40. అంబేద్కరిజం, 41. బాలయోగీయం, 42.మోక్షం నా జన్మహక్కు, 43. ఇదిగో ఇదీ భగవద్గీత, 44. భీమన్న పాటలతోట, 45. పాటలలో అంబేద్కరు, 46. అంబేద్కర మతం, 47. డ్రగ్ ఎడిక్టులు, 48. ధర్మవ్యాధుడు, 49. ఎంతచీకటి ఎన్ని దీపాలు, 50. పురాణాలలో హరిగిరిజన మనీషులు, 51. గిల్లి చెబుతున్నా, 52. నాకు తెలిసిన జాషువా, 53. నా ఊహాలలో వాల్మీకి, 54.God The Drug, 55.చివరి మెట్టుమీద శివుడు, 56. పంచమ స్వరం, 57. వేదవ్యాసుడు, 58. భీమన్న శంఖారావం, 59. ఒంటరి గొంతు, 60.Paramatma the Super Soul, 61.భీమన్న మాట వెలదులు, 62.చాటువులు స్వగతాలు, 63. జగత్ సత్యం - బ్రహ్మ మిధ్య, 64. శ్రీశ్రీ కమ్యూనిస్టు కావు,65.కుక్క మొరుగుతూ ఉంది, 66.అంబేద్కర్ గారు annihilation of caste అనే రచనకు అనువాదం - కుల నిర్మూలన.

వీటిలో గుడిసెలు కాలిపోతున్నాయ్ గ్రంథానికి కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు వచ్చింది. ఆంధ్ర విశ్వకళాపరిషత్ వారిచేత కళా ప్రపూర్ణ - 1971, పద్మశ్రీ పురస్కారం - 1973, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు- 1975, కాశీ విద్యాపీఠం గౌరవ డాక్టరేట్ - 1976, పద్మ భూషణ్ పురస్కారం -2001, నాగార్జున విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుండి సాహిత్యంలో 1991లో విశిష్ట పురస్కారం వంటి వాటితో పాటు వివిధ సంస్థలు ఇచ్చిన పురస్కారాలు ఎన్నెన్నో. ఇవన్నీ కేవలం పురస్కారాలు, తన కీర్తి ప్రతిష్టలను పెంచుకోవడం కోసం రాయలేదు తాను వచ్చిన దళిత జీవితంలో సామాజిక పరివర్తనను ఆశించి రాశారు. తాను వచ్చిన మూలాల్ని మరిచిపోలేదు. సుమారు 94 ఏండ్ల పాటు జీవించిన భీమన్న గారు 2005 డిసెంబరు 16న హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు.

భీమన్నగారి గురించి నా ప్రసంగంలో రెండు పార్శ్వాల్ని మీముందుపెట్టే ప్రయత్నం చేస్తాను. ఒకటి ఆయన జీవితం. రెండవది ఆయన రచనల్లోని దృక్పథం. ముందుగా భీమన్నగారు ఎదుర్కొన్న అవమానాలు, దళితులు తమ అనుభవాల్లో ఎదురైన అనుభవాలతో పోల్చి చూసుకొనే లాగానే ఉన్నాయి. డా.బి.ఆర్.అంబేద్కర్ కూడా అలాంటి అవమానాల్నే ఎదుర్కొన్నారు. ఆయన రచనల్ని చదివిన పాఠకులు అవన్నీ తమకీ ఎదురైన అవమానాలుగానే భావించారు. అలాగే బోయి భీమన్నగారికి ఎదురైన అవమానం కూడా అలాంటిదే ఒకటి మీకు వివరిస్తాను. ఒకప్పుడు ఆంధ్ర సారస్వత పరిషత్ అని పిలిచే సంస్థ నేడు తెలంగాణ సారస్వత పరిషత్ అని పిలుస్తున్నారు. దానిలో బోయి భీమన్నగారు 'పరిణతవాణి' పేరు తన జీవితాన్ని, సాహిత్యాన్ని పేర్కొంటూ ఎన్నో కొత్త విషయాల్ని చెప్పారు.ఈ విషయాలన్నీ https://swadhyaaya.com అనే వెబ్ సైట్‌లో ఉన్నాయి. చూడండి.

అంబేద్కర్‌ని జ్ఞప్తికి తెచ్చే భీమన్నట్రామ్ పయనం- దళిత ఆత్మగౌరవ ప్రకటన:

"ఒకసారి మద్రాసులో ఉన్నప్పుడు భార్యాపిల్లలతో బీచ్ నుండి వస్తూ ట్రాం ఎక్కాం. ట్రాం బయల్దేరుతున్నప్పుడు ఒక ముసలాయన శాస్త్రి గారు మనవడి సహాయంతో ట్రాం ఎక్కి అది కదుల్తూ ఉంటే పడకుండా పైన రింగు పట్టుకొని ఊగుతున్నాడు. నేను లేచి ఆయన్ను కూర్చోమన్నాను.కూర్చున్నాడు. ఎవరు నాయనా? అని అడిగాడు. మీరు నాకు తెలుసునండీ, నేను మీకు తెలియదు అన్నాను. ఇంకా ఊరుకోకుండా పద్యాలు రాస్తాను అని కూడా చెప్పాను. పద్యాలు రాసేవాళ్లు నాకు తెలియని వారెవరు? అన్నాడు. మీకు తెలియదులెండి. నా పేరు భీమన్న అన్నాను. ఒకపద్యం వినిపించమన్నాడు. "కృష్ణాన్వేషణ' అని అప్పుడొక ఖండిక రాసి ఉన్నాను. అందులోని పద్యం చదివాను. మరిచితివేమొ గోపసుకుమారుని మారుని కన్నతండ్రినీ విరులకు

మోహపునపదను వెట్టిన ప్రేయసునీ 'ప్రియాళికిన్ వరమురళీరవాను నటనమ్ములు నేర్చిన విశ్వసాధకున్ మరచితివేమొ గోపవిభు మావిభు గోవిభు గోపికావిభున్ ఇది విని ఆయన ఆశ్చర్యపోయారు. విని ఇంతగా పద్యం రాసేవాళ్ళు నాకు తెలియకుండా ఉండడమేమిటి? మీ ఇంటి పేరేమిటి అని అడిగారు బోయి భీమన్న అని చెప్పాను. ఇంకా మేం హరిజనులమని చెప్పాను. నన్ను, మా అవిడనూ పిల్లల్నీ చూసి మీరు హరిజనుల్లాగా లేరే అన్నారు. అప్పుడునాకు కొంచెం కోపం వచ్చింది. మీరెప్పుడు హరిజనుల్ని చూసి ఉండరు లెండి. హరిజనులంటే మాలాగే ఉంటారు. మేం మాలలం. పొలాల్లో ఎండలో పనిచేసి ఇలా ఉన్నాం కాని, గుడిసెల్లో కూర్చుని పనిచేసుకునే వాళ్ళు మావాళ్ళు మాదిగలున్నారు. రాజమండ్రి బ్రిడ్జి ప్రక్కన వారిని చూడాలి. అచ్చమయిన ఆర్యతేజస్సు వారిలోనే ఉంది అన్నాను. ఆయన మాట్లాడకుండా తరువాతి స్టేజీలో దిగి పోయారు. అంతటితో అయిపోయిందనుకున్నాను. మరుసటి రోజు ఆంధ్రప్రభ ఆఫీసుకు వచ్చారు. ఆయన పెద్దవాడు కాబట్టి నార్ల ఆయన్ను ఆఫీసులో అందరి దగ్గరకు తీసుకు వచ్చి పరిచయం చేశాడు. దగ్గరకు వచ్చినప్పుడు నార్ల ఏదో చెప్పబోయేలోగానే నాముఖం చూసి గిరుక్కున ముఖం తిప్పుకొని వెళ్లి పోయాడాయన. ఆయన మహా మహోపాధ్యాయ, కవిసార్వభౌమ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి గారు. అంతా నా చుట్టు చేరి ఏమిటి ఆయనట్లా నీ దగ్గరకు వచ్చేటప్పటికి అలా చేశారేమిటి అని అడిగారు. నేను జరిగిన కథ చెప్పాను"

ఈ అనుభవాల్ని చూస్తే కులం పేరుతో దళితులు ఎలాంటి అవమానాలకు గురవుతున్నారో స్పష్టంగా తెలుస్తుంది. అయినా గాని తన ఆత్మ విశ్వాసాన్ని సడలించకుండా, మనుషులమధ్య ద్వేషభావాల్ని పెంపొందించుకోకుండా అటువంటి సంఘటనల్ని ఎలా తీసుకోవాలో కూడా భీమన్నగారు చెప్పారు.

సమాజంలో భిన్న మనస్తత్వాలు:

ఈ సమాజంలో భిన్న మనస్తత్వాలు ఉన్నవాళ్ళుంటారనీ, నూటికి ఒకరు మనల్ని ద్వేషిస్తే, మిగతా తొంబైతొమ్మిది మందినీ ద్వేషించడం సరికాదనేది భీమన్నగారి మనస్తత్వం. దీనికొక ఉదాహరణను ఒక లాజిక్ నీ ఇలా చెప్పారు.

"ఒక బ్రాహ్మడు కులం పేరుతో నన్ను అవమానిస్తే మరొక బ్రాహ్మడు ఆదరించి అభిమానించి ఎంతో మేలు చేశాడు. ఇప్పుడు కులం పేరుతో ఒక బ్రాహ్మణకులాన్ని నేను ప్రేమించనా? ద్వేషించనా?ఒక రెడ్డి గారు అపకారం చేస్తే పదిమంది రెడ్డు నాకుపకారం చేసేవారు. మా ఊరిలో కాపు లెక్కువ. ఒక కాపు నన్ను గుర్రబ్బండి ఎక్కించుకోకపోతే మరోకాపు తన అరుగు మీద కుర్చీవేసి నన్ను కూర్చోపెట్టుకొని కబుర్లు చెప్పేవాడు. అందుకని ఏ ఊర్లోనయినా అందరూ కలిసి ఉండక తప్పదు.కాబట్టి అన్ని కులాలకూ పరస్పర సంబంధాలు తప్పవు. తిరుగుబాటు చెయ్యడం కుదరదు. సమైక్యమేమంచిదన్న భావం నాకు చిన్నప్పటినుంచీ ఉంది" అని తానెలా ఎదిగిందీ, తానెలా ద్వేషాన్నీ, ప్రేమనీ స్వీకరిస్తారో చెప్పారు.

సహకరించిన వారందర్నీ గుర్తు చేసుకోవడం:

"ఇంతవరకూ. ఇక నాకు ఎంత చికటి ఎన్ని దీపాలు అన్నప్పుడు నేను పుట్టిన చికటి సూర్యుడు చంద్రుడు నక్షత్రాలూ గ్రహాలూ ఇవన్నీ ఆగిపోతే ఎలా ఉంటుందో ఆ రకమయిన గాఢాంధకారంలో పుట్టాను నేను. అడుగు ముందుకు వేయాలి కదా ఎటు? ఎక్కడికి? ఒక దీపం కనిపిస్తుంది. అటుగా నడుస్తాను. ఆ దీపం ఆరిపోవచ్చు. దాటిపోవచ్చు. ఇంకో దీపం. ఇలా ఎన్ని దీపాలు నామార్గానికి దారి చూపాయో ఇప్పుడు నిలబడి ఆలోచించుకుంటే చాలా అద్భుతమనిస్తుంది. అంత చీకట్లో పుట్టిన నేను ఇంతదూరం రావడానికి ఎన్ని దీపాలు! మొదట మా ఊరి కాపులు. వారికి పట్టింపులు ఎక్కువ. కఠినంగా ఉంటారు. వారిలో నలుగురయి దుగురునన్ను ఆత్మీయంగా చేరదీశారు. అక్కడినుండి చిన్నచిన్న దీపాల దగ్గరి నుండి కాలేజీకి వెళ్ళటప్పటికి పెద్దదీపాలు కళా వెంకట్రావు, ముళ్ళపూడి పళ్లంరాజు, అయ్యదేవర కాళేశ్వర్రావు: మంగిపూడి వెంకటశర్మ. నిజంగా మంగిపూడి వెంకటశర్మ ఇచ్చినంత వెలుగు ఇప్పటివరకూ ఎవ్వరూ ఇవ్వలేదని నేననుకుంటున్నాను.

అక్కడి నుంచీ మద్రాసు వరకూ వెళితే నార్ల వెంకటేశ్వరరావు, తాపీ ధర్మారావు, నిడదవోలు వెంకటరావు వీళ్లంతా. అక్కడినుంచి హైదరాబాదుకు వస్తే కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, సి.నారాయణ రెడ్డి, జె. బాపురెడ్డి ఇంకా చాలమంది. ఈ విధంగా ఒక్కొక్క వెలుగూ ఒక్కొక్క వెలుగూ వస్తూ ఉంటే నేను ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ వచ్చానన్నమాట" అంటూ తన జీవితంలో తనకు సహకరించిన వారందర్నీ గుర్తుచేసుకోవడంలో భీమన్న గారికి గొప్ప కృతజ్ఞతాభావం ఉంది.

మామాలు:

బోయి భీమన్నగారు దళితుల్లోని మాల కులంలో పుట్టినా, తాను మాదిగల గురించే రాశారు. కులనిర్మూలలో భాగంగా కులాంతర వివాహాలు జరగాలనేదొక ఆలోచన. అది ఆచరణలో చూపిన వారు భీమన్న. తాను ఒక బ్రాహ్మణ అమ్మాయి హైమవతిగారిని వివాహమాడారు. మాల మాదిగలు కలిసి ఉండాలని వాదించిన సాహితీవేత్త. ఆయన మాల, మాదిగలను 'మామాలు' అంటారు. దానికి పురాణాల్లోనుండీ కొన్ని అంశాల్ని తీసుకొచ్చి చూపిస్తారు.

"మామాలకు, అంటే మాదిగల్ని, మాలల్ని ఇద్దర్నీ కలుపుదామని. మాతంగుడు ధర్మవ్యాధుడు ఇద్దరూ వియ్యంకులు. మాతంగుడు ఫస్ట్ అస్టచబుల్. దిఫస్ట్ హరిజన్ ఈజ్ ధర్మవ్యాధ. ఆ ధర్మవ్యాధుడి కూతుర్ని మాతంగుడి కొడుక్కు చేసుకున్నాడు. వీళ్లేమో మాంసాహారులు. అతనేమో శాకాహారి. ఈ మాంసాహారుల ఇంటి పిల్ల శాకాహారుల కోడలవడం వల్ల వచ్చిన గోలను వరాహపురాణంలో చాల విపులంగా చాలా అందంగా వర్ణించారు. వాల్మీకి వ్యాసుడు వీళ్లంతా హరిజనులని నేనెందుకంటున్నానంటే ఆ ధర్మవ్యాధుడు ఏదోఒక జంతువును వేటాడి బ్రహ్మార్పణ చేసి, కొంత ఇతరులకు పంచి, కొంత అమ్మి, కొంత తిని జీవించేవాడు. చివరకు హరిని గురించి తపస్సు చేసి హరి ప్రత్యక్షమయితే అతను కోరిన వరమేమిటంటే నాకు, నా సంతానానికీ, నా వంశానికి పరంపరగా విజ్ఞానం, కళాత్మకం, ఆధ్యాత్మికం ఈ మూడింటితో కలిసినటువంటి కవిత్వాన్ని ఇమ్మన్నాడు. 'ఇచ్చాను. ఓ మహాకవీంద్రా" అన్నాడు

విష్ణువు, మహాకవీంద్రా అని మొట్టమొదట అనిపించుకున్నవాడు ధర్మవ్యాధుడు. ఆకాలానికి లిపిలేదు, కవిత్వం లేదు. ఏమి లేని కాలానికి వాడా కోరిక కోరాడు. మాతంగుడు, ధర్మ వ్యాధుల సంబంధం వల్ల ఈ దేశంలోని వంశాలన్నీ పుట్టుకొచ్చాయని నేననుకుంటూ అదే వారసత్వంలో అది కృత యుగంలో జరిగింది. త్రేతాయుగంలో వాల్మీకి బోయ, ద్వాపర యుగంలో వ్యాసుడు బోయ, కలియుగంలో భీమన్న బోయ" -అని, రాయడానికి ఇది కారణం.

బోయి భీమన్న గారి గురించి, ఆయన సాహిత్యం గురించి ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లో 2008లో అనుకుంటాను- ఒక గొప్ప జాతీయ సదస్సు జరిగింది. ఆ సదస్సులో నేను బోయి భీమన్న గారి రాగవాసిష్ఠం నాటకం మీద ఒక పత్రాన్ని సమర్పించాను. ఆ పత్రాన్ని సమర్పించడానికి బోయి భీమన్న గారి రచనలేన్నో చదివాను. ఆ తర్వాత సూర్య దిన పత్రికలో 28 ఫిబ్రవరి 2011లో ఒక పెద్ద వ్యాసాన్ని రాశాను. ఆ వ్యాసంలో ఉన్నటువంటి అనేకమైన భావాలే బోయి భీమన్న గారి గురించి వికీపీడియాలో యధాతథంగా తీసుకున్నారు. గత ఏడాది స్నేహ టీవీ వాళ్లు కూడా బోయి భీమన్న గారి గురించి 19 సెప్టెంబరు 2020వ తేదీన ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అందులో బోయి భీమన్న గారి గురించి మాట్లాడే అవకాశం కలిగింది. ఇలా మరలా మద్రాసు విశ్వవిద్యాలయం వారు నిర్వహిస్తున్న అంతర్జాతీయ అంతర్జాల సమావేశంలో బోయి భీమన్నగారి గురించి కీలకోపన్యాసం చేయడం ఒక గొప్ప అవకాశంగా భావిస్తూ ఆయన రాసిన కొన్ని నాటకాల ద్వారా దళితులదే తెలుగు సాహిత్య సృష్టి అంతా అనే ఒక వాదన చేశారు. కనుక, వాటిని పరిచయం చేస్తాను.

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాయలం వారు ప్రచురించిన పౌరాణిక నాటకాలు - భాగం -1 లో రాగవిసిష్ఠం, చిత్రకళాప్రదర్శన, బాలయోగి, ఆదికవి వాల్మీకి, ధర్మవ్యాధుడు, వేదవ్యాసుడు, జగత్ సత్యం బ్రహ్మ మిథ్య అనే పదినాటకాలున్నాయి.

ఆదికవి వాల్మీకి: స్వర్గంలో అప్సరసల దర్శనం వల్ల బ్రహ్మమనస్సు వికలమై అందుండి వాల్మీకి పుట్టాడనీ, అన్యాయంగా బ్రహ్మచే చంపింపబడి చండాలుడై నాడనీ, తర్వాత అటవికులలో కలిసాడనీ, పురాణ గాథ. ఈ పురాణ గాథనే నాటక రచనకు పునాదిగా స్వీకరించారు భీమన్న గారు. హరిజనులు ఆర్యులే అనే తన సిద్ధాంతాన్ని బలపరచడానికే ఆదికవి వాల్మీకి నాటకాన్ని రాసినట్టుగా పీఠికలో చెప్పుకున్నారు. మన ఆర్యమహర్షుల పుట్టుపూర్వోత్తరాలను ఈ విధంగా తాను ఎత్తి చూపడానికి కారణం నేటి హిందూ సమాజం నుండి కులమతాన్ని నిర్మూలించాలన్న తన ఆకాంక్షే అని నాటక రచనోద్దేశాన్ని రచయిత వివరించారు.

ధర్మవ్యాధుడు: తను హైస్కూలు విద్యార్థిగా ఉండగా తెలుగు వాచకంలోని ధర్మవ్యాధుని వృత్తాంతం ఉన్న కౌంగ - కౌశికుడు పాఠాన్ని చదువుకున్న భీమన్న చిన్న నాటి నుండి ధర్మవ్యాధుని కథపట్ల ఆసక్తిని పెంచుకుంటూ వచ్చారు. ఆ తర్వాత కాలంలో వరాహ పురాణాన్ని విమర్శనాత్మక దృష్టితో చదివి భారత జాతి పుట్టుపూర్వోత్తరాల గురించి తెలుసుకున్నారు. 1960 ప్రాంతంలో ధర్మవ్యాధుడు నాటకాన్ని రాసారు. మాంసం విక్రయం వృత్తిగా గల ఒక కిరాతుడు శాస్త్రజ్ఞుడు, ధర్మజ్ఞుడు, దైవజ్ఞుడు, బ్రహ్మజ్ఞానుడుగా అయిన విధానాన్ని ఈ నాటకం అక్షరీకరించింది. "ధర్మవ్యాధుడి పట్ల నాకు ప్రీతి మెండు. అతడు నాటకంలో ఇమడదం లేదని నవలగా వ్రాద్దామనుకొన్నాను. అది కష్టతరం కాగా, చేతి శక్తి, కంటి చూపూ తగ్గుతూ రాగా, టేపు రికార్డరు కొనుక్కొని, పద్యాలలో కావ్యంగా పాడసాగాను. అదీ తుదముట్టదని గ్రహించి ఇప్పుడు ఆ తొలి రూపం లోనే నాటకంగా ప్రకటిస్తున్నాను." అన్నారు భీమన్నగారు

వేదవ్యాసుడు: వ్యాసమహర్షి భారతజాతికి పంచమవేదం అనదగిన మహాభారత ఇతిహాస వాక్యాన్ని అందించినవాడు. వేద విభజన చేసి ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలను వింగడించినవాడు. జాతికి పారాయణమైన భగవద్గీతను అందించిన వాడు.

"పంచభూతాలువర్ణాలు,ప్రామణములును

పంచతంత్రాలు,ఖండాలు,వార్ధులిట్లు

పంచమములెన్నొకలవుప్రాపంచికమున

పంచజనుడేను నాదిప్రపంచవిభుత" అని ఒకచోట కవిత్వం రాసి భీమన్నగారే సందర్భం వచ్చినపుడల్లా పురాణాలన్నీ దళితులవేననే స్వరాన్ని వినిపిస్తారు.

జగత్ సత్యం-బ్రహ్మమిథ్య : ఒకసభలో భీమన్నగారు జగత్సత్యం-బ్రహ్మమిథ్య అని అన్నారని అది విని బ్రహ్మ, సరస్వతి వచ్చి కవిగారితో వాదానికి దిగడం ఈ నాటకం ఇతివృత్తం. ఇది దృశ్యకావ్యం ఇందులో కొన్ని చిలిపి ఊహలు, విచిత్రమైన భావాలు ఉన్నాయి. బ్రహ్మచేస్తున్న నాలుగుముఖాల, నాలుగు రకాల సృష్టిని రచయిత నిరాకరించారు. ఈ నాటకాలన్నీ భీమన్నగారికి పురాణ విజ్ఞానం పట్ల గల అనురక్తినీ తెలియచేయడమే గాక, భారతపురాణ పురుషులందరూ అంటరాని కులాలనుండి వచ్చిన వారేనని, వారే ఈ దేశానికి సంస్కృతిని, సాహిత్యాన్ని అందించిన మూలపురుషులనీ ఈ నాటకాల ద్వారా నిరూపించదలిచారు భీమన్న గారు."తాను అస్పృశ్యుణ్ణిని కాను / ఆది బ్రాహ్మణుణ్ణి" అంటారు.

బోయి భీమన్న గారు నాటకాలతో పాటు పద్య, గేయ, వచన కూడ రాశారు. వివిధ పుస్తకాలకు వ్రాసుకున్న పీఠికల్లో పరిశోధనాత్మక దృష్టి కనిపిస్తుంది. వాటిలో కొన్నేమో కొత్త ప్రతిపాదనల్ని, కొత్త సిద్ధాంతాల్నీ చెప్తున్నట్లుంటుంది. ఆకాశవాణిలో ప్రసారం కోసం అనేక భావగీతాల్ని వ్రాశాడు. వీటన్నింటితో పాటు అంబేద్కర్ వ్రాసిన కొన్ని రచనల్ని తెలుగులోకి అనువదించడంతో పాటు, ఆయన జీవితాన్ని, వ్యక్తిత్వాన్ని కీర్తిస్తూ రాశాడు. ఈయన రాసిన 'జయ జయ జయ అంబేద్కర!' దళితులకు జాతీయగేయమై నేటికీ ఊరూరా ప్రార్థనా గీతంగా మార్మోగుతోంది. కోనసీమ ప్రాంతానికి చెందిన వాడు భీమన్న.ఆ ప్రాంతాల్లో ప్రతి ఇంటిలో అంబేద్కర్ చిత్రాన్ని ఇంచుమించు ప్రతి ఇంటిలోనూ ఒక దైవంగా పెట్టుకుంటారు. దళిత చైతన్యం, అంబేద్కర్ భావజాలం, దళిత ఆత్మగౌరవ స్ఫూర్తి ముప్పేటగా ఉన్న గేయమది. 'జాతీయ కవి బోయి భీమన్న' పేరుతో 2011 ఫిబ్రవరి 28వ తేదీన సూర్య దినపత్రిక సాహిత్య అనుబంధంలో నేను రాసిన వ్యాసాన్నే తెలుగు వికీపీడియా వారు పూర్తిగా బోయి భీమన్న గురించిన రాసిన

వ్యాసంలో ఉపయోగించుకున్నారు. ఆ వ్యాసంలోని భాగాల్ని గమనిస్తే, బోయి భీమన్నగారి వ్యక్తిత్వంతో పాటు, ఆయన సాహిత్య దృక్పథం కూడా స్పష్టమవుతుంది. ఒక సందర్భంలో భీమన్న గారు ఇలా అంటారు.

"ఏది హిందూ ఏది ముస్లిం/ ఏది క్రైస్తవము?/ ఎల్ల మతముల సారమొక్కటె/హృదయమీ మతము/కృష్ణుడూ, క్రీస్తూ, మహమ్మదో/ గీతయో, బైబిలో, ఖురానో/ ప్రేమనే బోధించలేదా?/ ద్వేషమును నిరసించెకదా" అయినప్పటికీ, భారతదేశంలోని 'భిన్నత్వంలోని ఏకత్వం' లాగే, భీమన్న రచనల్లోనూ ఆ లక్షణం కనిపిస్తుందనీ, ఆయన కుల, మతాల కంటే మానవత్వాన్నే ఆశించిన జాతీయవాది అనీ ఆ గ్రంథం ప్రతిపాదిస్తుంది. భారత జాతీయ దృక్పథంలో అంతర్భాగంగా ప్రవహించే హిందూమతంలో కులాన్ని ప్రత్యేకంగా విశ్లేషించుకోవాలి. అంబేద్కర్ విశ్లేషించిందీ, భీమన్న వ్రాసిందీ అదే! తన జీవితాంతం ఆయన జాతీయవాదిగానే ఉన్నాడు. జాతీయతలో తాను పుట్టి పెరిగిన దేశీయ వాస్తవికతకు అనుగుణంగా ఉంటూనే, ఆత్మగౌరవంతో జీవించాలనే ఆకాంక్ష ఉంటుంది.

ఒకప్పుడు 'బ్రాహ్మణ' శబ్దాన్ని చదువుకున్నవాళ్ళనీ, ఆలోచనాపరుల్నీ సూచించడానికి ప్రయోగించారు. సామాజిక నిర్మాణంలో చాతుర్వర్ణ వ్యవస్థలోకి చేరిన తర్వాత కులసూచికగా మారిపోయింది. తమ తెలివితేటలతో ఆధిపత్యంలో ఉన్న వాళ్ళు, క్రమేపీ ఒక వర్గంగా తయారయ్యారు. ఈ ఆలోచనాపరులు ఒక క్రమబద్ధమైన జీవన విధానాన్ని మతమని ప్రబోధిస్తూనే, ఆచార, వ్యవహారాల పేరుతో, కర్మ సిద్ధాంతం వైపు నడిపించుకొనిపోయిన హిందూమతం పైనే డా.అంబేద్కర్ ముందుగా తన దృష్టిని కేంద్రీకరించాడు. కొన్ని వందల సంవత్సరాలుగా పాతుకుపోయిన హిందూమతంతో అవినాభావ సంబంధాన్ని కలిగి ఉన్న వాళ్ళు, తమకు బోధించిన ధర్మశాస్త్రాల వల్ల మానసికంగా, అస్పృశ్యులుగా ఉండిపోవడానికైనా సిద్ధపడతారు.

పురాణేతిహాసాలు, సాంప్రదాయ సాహిత్యాల పేరుతో పాలకవర్గాలతో 'ఆలోచనాపరులు' కలిసి కొనసాగించిన కుట్ర ఫలితంగా, నేటికీ కులాధిపత్య సాహిత్యమే ఉత్తమ సాహిత్యంగా కొనసాగిపోతోంది. దురదృష్టమేమిటంటే, నాటి భావజాలాన్ని నేటికీ కొనసాగించడాన్ని ఆ భావజాలం వల్ల నష్టపోయిన, ఇంకా నష్టపోతున్న వాళ్ళు వ్యతిరేకిస్తుంటే, నాటి ఆధిపత్య భావజాలానికి ప్రతినిధుల్లా వాటిని సమర్థించేవాళ్ళు కొంతమంది తయారయ్యారు. అందుకనే తన ప్రజలంతా దేని వల్లనైతే మోసపోతున్నారో, దాన్నుండి రక్షించుకోవడానికి సామాజిక ఉద్యమాన్ని నడిపే బాటలో పయనించిన వాడు అంబేద్కర్. అలాంటి ఆశయాన్నే సాహిత్యంలో కొనసాగించిన రచయిత బోయి భీమన్న కూడా!

డా. బోయి భీమన్న సమగ్రసాహిత్యం పేరుతో మొదటి సంపుటిని తెలుగు విశ్వవిద్యాలయం వారు ఇటీవలే విడుదల చేశారు. దీనిలో 'పాటలలో అంబేద్కర్' (పుటలు : 306- 462) ఉంది. దీనిలో అంబేద్కర్ వ్యక్తిత్వాన్ని, భావజాలాన్ని వర్ణించిన 118 పాటలు ఉన్నాయి. దీనిలోనే భీమన్న అనేక పాటల్లో దళిత పదాన్ని ప్రయోగించాడు. కానీ, దళిత పదాన్ని వాడడం ఇష్టం లేదని ఆయన తన చివరి రోజుల్లో ప్రకటించాడు. దానికి అనేక కారణాలున్నాయి.

"వద్దు హరిజన, దళితయు వద్దుగాక
పంచమ పద్మమై మనకు శుభప్రదమ్మ
పంచముడ నేను, వైదిక పంచజనుడ
పాంచజన్యము నాది, ప్రాభము నాది" అని "పంచమస్వరం"లో పేర్కొన్నారు.

'దళితజనులకంబేద్కరు, ధర్మమే మతమన్నాడు, బౌద్ధ ధర్మమొకటేరా, భారతీయమన్నాడు' అని ఒక చోట, 'దళితుల నుద్ధరించని ధర్మం కుంటిదంటూ..' ఒక పాటకు దళిత పదాన్ని శీర్షికలోనే పెట్టిమరీ మరోచోట వ్రాశాడు. దళితుల్ని ఈయన అవర్ణులు, పంచములు, హరిజనులనే పేర్లతో వర్ణించడం కనిపిస్తుంది. కుల నిర్మూలనను బలంగా వ్యతిరేకించిన నాటకం పాలేరు. 1988 నాటికి పాలేరు నాటకానికి ఏభై యేళ్ళిందని రచయితే చెప్పుకున్నాడు. అంటే, ఆ నాటకం 1938లో వ్రాసినట్లు స్పష్టమవుతుంది.

భీమన్న రాసిన 'పాలేరు' నాటకంలో వెంకన్న, వనబాలల ప్రేమకథలోను, 1959లో వ్రాసిన 'రాగవాసిష్ఠం' నాటకంలో గల అరుంధతి, వశిష్ఠుల ప్రణయ గాథలోను, మరికొన్ని రచనల్లోను కులాంతర వివాహాల పేరుతో కులనిర్మూలన అవకాశాల్ని చర్చించాడు. సమాజంలో కులం వల్ల గౌరవం పొందుతున్న కుటుంబం నుండి వచ్చిన వనబాల, కులం వల్ల సమాజంలో అవమానాలకు గురౌతున్న వెంకన్న పరస్పరం ప్రేమించుకుంటారు.

పాలేరుగా పనిచేయాల్సిన వాడు, అగ్రకులంగా గౌరవమర్యాదల్ని పొందుతున్న అమ్మాయిని పెళ్ళి చేసుకోవాలంటే, ఎన్ని బాధలకు గురికావాల్సి వస్తుందో, అన్నింటినీ అగ్రకుల, భూస్వామి కుబేరయ్య వల్ల పాలేరు వెంకన్న ఎదుర్కొంటాడు. చివరికి 'ఉపకారి' మాస్టారు సహాయంతో చదువుకుని, వెంకటేశ్వరరావుగా గౌరవం పొంది, డిప్యూటీ కలెక్టరుగా ఉన్నతోద్యోగం సాధిస్తాడు. ఉద్యోగిగా తన గ్రామానికే వచ్చి, భూస్వాముల దురాగతాలను చట్టబద్ధంగా అడ్డుకుంటాడు. అస్పృశ్యతను పాటించే వాళ్ళనీ, ప్రోత్సహించేవాళ్ళనీ నిరోధిస్తాడు. ప్రజాస్వామ్యబద్ధంగా దళితులు తమ హక్కుల్ని సాధించుకోవాలనే అంబేద్కర్ ఆశయాన్ని దీని ద్వారా ప్రేరేపించాడు రచయిత.

సమాజంలోని వాళ్ళంతా చెడ్డవాళ్ళే కాదనీ, మంచివాళ్ళూ ఉంటారనేది భీమన్న సాహిత్యంలో కనిపించే ఒక విశిష్ట గుణం. ఈ పాలేరు నాటకంలో వనబాల కూడా అగ్రవర్ణానికి చెందిన కుంటుంబం నుండే వచ్చినా, సంకుచిత మూర్ఖ కులతత్వ వాదులు లేని వాళ్ళూ ఉంటారనే మరో పార్శ్వాన్ని కూడా చూపారు. వెంకన్న తండ్రి పుల్లయ్య తన తండ్రి బాటలోనే తానూ పయనించి, తన కొడుకునీ పాలేరుతనానికి పంపుతాడు. అలాంటి సేవ చేయడానికే తాము జన్మించామనే భ్రమను కల్పించి, కొన్ని తరాలుగా కర్మసిద్ధాంతం పేరుతో దళితుల్ని అగ్రవర్ణభూస్వాములు వంచించిన తీరుతెన్నుల్ని ఈ నాటకం ద్వారా వివరించారు.

నిజజీవితంలో అటు అంబేద్కర్, ఇటు భీమన్న ఇరువురి జీవితాల్నీ

పాలేరు నాటకం స్ఫురింపజేసేటట్లుంది. ఇరువురూ కులం వల్ల అనేక అవమానాల్ని ఎదుర్కొన్నవాళ్ళే. ఇరువురూ చదువుకోవడం వల్లనే అనేకమంది దళితులకి ఆదర్శం కాగలిగారు. యాదృచ్ఛికంగా ఇరువురూ కులాంతర వివాహాలనే చేసుకున్నారు. తాము చెప్పిన వాటిని నిజజీవితంలో ఆచరించి చూపి మరీ ఆదర్శవంతులయ్యారు. రాగవాసిష్ఠంలో అరుంధతీదేవి మాహాత్మ్యాన్ని వివరించడానికి, పురాణేతిహాసాల్లోని కులాంతర వివాహాల్ని సృజనీకరణ ప్రతిభతో భారత జాతీయదృక్పథాన్ని ప్రదర్శించారు. దీనికి ఆర్యద్రావిడ వాదాల్ని కూడా నాటకంలో అంతర్భాగం చేశారు.

సనాతన సాంప్రదాయవాది భావాల్ని 'ప్రాచీనుడు' అనే పాత్ర ద్వారా వర్ణించారు. నిష్కళంకమైన ప్రేమకు సాంప్రదాయం ఎలా అడ్డంకిగా మారుతుందో వివరిస్తూనే, ఆ ప్రేమలో నిజాయితీ ఉంటే, అన్నింటినీ జయిస్తుందని నిరూపించారు. కుల నిర్మూలనకు కులాంతర వివాహాలు తోడ్పడతాయని చెప్పినట్లే, తర్వాత వాళ్ళకు పుట్టే పిల్లల సామాజిక స్థితి గతుల్ని చర్చించవలసిన అవసరం ఉంది. నేడు కులాంతర వివాహాలు జరిగినా, మళ్ళీ తండ్రిది గానీ, తల్లిదిగాని కుల గుర్తింపే వస్తే, కులనిర్మూలన జరిగినట్లెలా అవుతుందో ఆలోచించాల్సిందే!

'గుడిసెలు కాలిపోతున్నై' (1973)కావ్యంలో ఏడాదికోసారి దళితుల గుడిసెలెందుకు కాలిపోతున్నాయో, మరలా కొత్తగుడిసెలు మాత్రమే ఎందుకు వస్తున్నాయో ఓట్లకోసం వచ్చేవారిని నిలదీసే చైతన్యం దళితుల్లో కలగాలనే ఆశయం కనిపిస్తుంది. చీమలను శ్రామిక దళితులకు, పాములను కులదోపిడీదారులకు ప్రతీకలుగా చేసి దానిలో వర్ణించారు. దళితుల మధ్య ఉండాల్సిన సమైక్యత ప్రబోధిస్తారు. అంబేద్కర్ అందరికీ ఓటు హక్కునిచ్చారనీ, దాన్ని దళితులు సమర్థవంతంగా ఉపయోగించుకుంటే దళితులదే రాజ్యమనే స్ఫూర్తినిస్తూ ఇలా అంటారు. **'మీరొక్కరు / మేం లక్షాపదివేల ఓటు కాగితాలం / మా ఒట్లన్నీ మీకేనండి / మా గుడిసెలన్నీ మీవేనండి / మా వాళ్ళకు తిక్కరేగాలిగాని / ఒకే గుద్దడం గుద్దిపారేస్తారు / ఇక వెళ్ళిరండి బాబు / మేం.., ఇంకా గంజికాచుకోలేదు" అని "గుడిసెలు కాలిపోతున్నై"** లో రాశారు భీమన్న.

'కూలిరాజు'(1946)నాటకంలో కులంతో పాటు ఆర్థికాంశాల్ని కూడా స్పర్శించారు.'ధర్మం కోసం పోరాటం'లో బహుజనులంతా రాజ్యాధికారదిశగా పయనించడానికి సూచనలు చేశారు. ఈ నాటకంలో ఒక సందర్భంలో ఇలా ఒక గేయాన్ని పెడతారు. **"కూలీలంతా ఏకం కండోయ్ / కూలీ రాజ్యం స్థాపించండోయ్ / దున్నేవాడే భూమికి భర్త / దున్నేవాడే భూమికి భర్త / వందలకొలదీ ఎకరాలొకటే / వ్యక్తికి చెందటం తగదండోయ్"** అందుకనే ప్రముఖ విమర్శకుడు ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డిగారు కూలీరాజు నాటకంలో "ఈ రెండు నాటకాల్లో గాంధీయిజం, సారంలో అంబేద్కరిజం దర్శనమిస్తాయి" అని వ్యాఖ్యానించారు.

వాల్మీకి, వేదవ్యాసుడు, ధర్మవ్యాధుడు మొదలైన వాళ్ళు దళితులేనని వాదిస్తూ, వాళ్ళు వ్రాసిన భారత, రామాయణ, భాగవతాలు తమవేనని చెప్పడంలో భీమన్న దృక్పథాన్ని లోతుగా విశ్లేషించుకోవాల్సిన అవసరం ఉంది. హింసావాదానికి భీమన్న వ్యతిరేకి. దళితులందరూ శ్రామికులనే వారిని భీమన్న వ్యతిరేకించారు. కమ్యూనిస్టుపార్టీలో పనిచేసి, కులం, వర్గం వేరని వాదించిన కోనాడ సూర్యప్రకాశరావుకి పాలేరు నాటకాన్ని అంకితమిచ్చాడు. భీమన్న రచనల గురించి మాట్లాడుతున్న వాళ్ళు మూడు ప్రధానాంశాల్ని గుర్తించాలి. ఆర్యఅనార్య సిద్ధాంతాన్ని అంబేద్కర్ ఆలోచనతోనే 'రాగవాసిష్ఠం' లాంటి నాటకాన్ని వ్రాశాడు. రెండవది, వర్ణం విషయంలో భారతదేశంలో కులమనే అవగాహన చేసుకోవాలి. ఇది ప్రపంచ దేశాలన్నింటికీ సమన్వయించినప్పుడు కుదరదు. దీన్ని కూడా అంబేద్కర్ ఆంత్రోపాలజీ, సామాజిక శాస్త్రాల్ని ఆధారంగా చేసుకుని చెప్పిన సిద్ధాంతమే. దీన్నే భీమన్న కూడా తన రచనల్లో సమన్వయించాడు.

పాలేరు నాటకానికి వ్రాసిన ముందుమాటలో భీమన్న స్పష్టంగానే వర్గం, కులం పట్ల తన అభిప్రాయాల్ని ప్రకటించాడు. 'భారత్‌లో వర్గపద్ధతి లేదు. వర్ణవ్యవస్థ అంటే కుల వ్యవస్థ ఉంది. ఇక్కడ కూలీలంతా అభ్యుదయం సాధించాలంటే ముందుగా అంటరానితనాన్ని తొలగించాలి' అన్నాడు. వర్గపోరాటాలు జరుగుతున్న తీరుని విమర్శిస్తూ 'నాయకులంతా దేశీయ స్థితిగతులను గుర్తించకుండా ప్రపంచ కార్మిక దృష్టిమాత్రమే కలిగిన ధనిక సవర్ణులు' అని ప్రకటించాడు. ఇంత స్పష్టంగా కులనిర్మూలనను ఆశించిన భీమన్న సాహిత్యాన్ని వివిధ జాతీయసదస్సుల్లో కులం లేదన్నారని వక్రీకరిస్తున్నారు. మూడవది వర్ణాంతవివాహాల వల్ల కులనిర్మూన జరగడాన్ని ఆకాంక్షించారు. ఈ విషయాలన్నీ బాధ్యతగల సాహితీవేత్తలు గుర్తించాల్సిన అవసరం ఉంది. అంబేద్కర్ భావజాలానికి సాహిత్య ప్రతిఫలమే భీమన్న సాహిత్యమని గుర్తించాల్సి ఉందని నేను రాసిన వ్యాసంలోని భాగాల్ని యథాతథంగా వికీపీడియా వారు తీసుకోవడం నాకు సంతోషంగా ఉంది.

మీతో ఈ అంతర్జాల అంతర్జాతీయ సదస్సు ద్వారా మళ్ళీ బోయి భీమన్న జీవితాన్ని, సాహిత్యాన్ని చర్చించుకునే అవకాశం కలిగింది. ఆయన రచనలన్నీ చర్చించుకోవడానికే ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. నేను కేవలం కొన్ని కీలకమైన అంశాల్ని మాత్రమే ఇక్కడ ప్రస్తావించాను. చివరిగా ఒక్కమాట, బోయి భీమన్నను గానీ, ఏ సాహితీవేత్తనైనా వాళ్ళు రాసిన సాహిత్యంలో వస్తువునీ, శిల్పాన్నీ కూడా చర్చించుకోవాలి. ఒక సామాజిక పరివర్తన కలిగించేదైతే, మరొకటి సాహిత్య విలువల్ని నిర్ధారించేది. ఈ రెండూ బోయి భీమన్న రచనల్లో మనం లోతుగా చర్చించినప్పుడే మనం ఆయనను సరిగ్గా అర్థం చేసుకోగలం. ఆచార్య విస్తాలి శంకరరావుగారు, వారి శిష్యబృందం, సాహితీవేత్తలు ఈ దిశగా తమ పత్రాలను రాస్తున్నారని ఆ పత్రాల శీర్షికలను బట్టి అనిపిస్తుంది. ఈ సదస్సు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ, నాకీ గొప్ప అవకాశం కలిగించిన మద్రాస్ విశ్వవిద్యాలయం, శ్రీమతి హైమవతీ భీమన్నగార్కి నా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

(తెలుగుశాఖ, యూనివర్సిటీ ఆఫ్ మద్రాసు, చెన్నై వారు 21, 22 ఫిబ్రవరి 2022 తేదీల్లో 'బోయి భీమన్న సాహిత్యం- సమాలోచన' పేరుతో రెండు రోజుల పాటు నిర్వహించిన అంతర్జాల అంతర్జాతీయ సదస్సు ప్రారంభ సమావేశంలో చేసిన కీలకోపన్యాసంలోని కొన్ని ముఖ్యాంశాలు)

అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా

అవని నీడ ఆమే..

సృష్టికే కానుకైన ఆమె ఓ మధుర భావన. తన సొంతమైన అపార శక్తితో అమూల్యమైన యుక్తితో జగతిన గొప్పగా నిలిచిన ప్రేరణనే ఆమే. లాలనలో, పాలనలో తల్లిగా, చెల్లిగా, తోడుగా, నీడగా ఆమె పాత్ర నిరంతరం అనితరసాధ్యం..

'యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవత' అని ఆర్యోక్తి. దీనికి అర్థం ఎక్కడ స్త్రీలు పూజలందుకుంటారో అక్కడ దేవతలు కొలువై ఉంటారు అని. అయితే అన్నీ మారుతున్నాయి కానీ మహిళల పట్ల ఆలోచనా ధోరణి మాత్రం మారడం లేదు. అవును దేవతగా కొలవాల్సిన స్త్రీ మూర్తిపై అసమానతలు ఒకవైపు పెరిగిపోతుంటే అత్యాచార సంఘటనలు నేటి పరిస్థితుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి.. రంగం ఏదైనా ఉన్నత శిఖరాలను చేరుకుని పురుష శక్తికీ తామేమీ తీసిపోమని చాటిచెపుతోన్న స్త్రీ శక్తి తాము ఇంటికే పరిమితం కాదంటూ పురుషులకు ధీటుగా విజయాలు సాధిస్తున్నారు. 'కార్యేషు దాసీ.. కరణేషు మంత్రీ.. భోజ్యేషు మాతా అంటూ ప్రతి విషయంలో, ప్రతీ క్షణం ప్రతీ విజయంలో స్త్రీ పాత్ర అవసరమే అవుతుంది. ఆమే లేనిదే మనుగడే లేదు. అయినా కూడా ఎక్కడ చూసినా స్త్రీ శక్తి వంచనకు గురి అవుతూనే ఉంది. సభ్య సమాజ చైతన్యాన్ని, సామాజిక బాధ్యతలను సవాలు చేస్తూ సాగిపోతున్న స్త్రీలపై దారుణ అఘాయిత్యాలకు అంతులేకుండా పోతోంది. వీటిని నియంత్రించేందుకు ఎంతటి కఠిన చట్టాలను తీసుకువచ్చినా నామమాత్రంగా మిగిలి నిర్వీర్యమైపోతున్నాయి. అందుకే సమాజ నిర్మాణంలో సగభాగమైన 'స్త్రీ సమానత్వమే మన ప్రగతికి మూలమని' చాటి చెపుతు ఇదే నినాదంతో ఐక్యరాజ్య సమితి మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకను ఏటా నిర్వహిస్తోంది.

శ్రీలతరమేశ్ గోస్కుల
M.A.,B.Ed,
హుజురాబాద్
సెల్ : 7013943368

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రజలందరూ కూడా మార్చి 8వ తేదీని మహిళలకు ప్రత్యేక రోజుగానే గుర్తిస్తున్నారు. సమానత్వంతో కూడిన ప్రపంచమే సమర్థవంతమైన ప్రపంచమని చాటిచెప్పిన ఒక గొప్ప చరిత్ర కలిగిన మార్చి 8 తేదిని మహిళలందరూ ప్రపంచవ్యాప్తంగా సగర్వంగా నిర్వహించుకునే పండగ రోజు. అంతేకాదు మహిళల విజయాలను గౌరవించడానికే అంకితం చేసిన రోజు కూడా ఇది. ఈ రోజున విభిన్న నేపథ్యాలు సంస్కృతుల మహిళలందరూ ఒక్కటిగా కలిసి సమానత్వం మహిళల హక్కు అని పోరాట ఫలితాన్ని దక్కించుకున్న ఒక ప్రత్యేకమైన రోజు. అయితే ఇది మొదట కార్మిక ఉద్యమం నుంచి పుట్టుకొచ్చింది. దీనిని ఐక్యరాజ్య సమితి కూడా గుర్తించి ప్రతి ఏటా నిర్వహిస్తోంది. అయితే దీని పుట్టుకకు కారణం తక్కువ పనిగంటలు, మెరుగైన జీతంకొరకు ఇంకా ఓటు వేసే హక్కు కోసం న్యూయార్క్ సిటీలోని 15 వేల మంది మహిళలు ప్రదర్శన చేశారు. ఈ మహిళల డిమాండ్లను దృష్టిలో పెట్టుకుని అమెరికాలోని సోషలిస్టు పార్టీ 1909వ సంవత్సరంలో మొదట జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రకటించింది. ఆ తరువాత ఈ దినోత్సవాన్ని అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించాలన్న ఆలోచన 'క్లారా జెట్కిన్' అనే ఒక మహిళది కాగా కోపెన్‌హెగెన్ నగరంలో 1910లో జరిగిన 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ వర్కింగ్ ఉమెన్' సదస్సులో ఈమె ఈ ప్రతిపాదన చేశారు. 17 దేశాల నుంచి ఈ సదస్సుకు హాజరైన 100 మంది మహిళలు క్లారా జెట్కిన్ ప్రతిపాదనను ఏకగ్రీవంగా అంగీకరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని తొలిసారిగా 1911లో ఆస్ట్రియా, డెన్మార్క్, జర్మనీ, స్విట్జర్లాండ్ దేశాల్లో నిర్వహించారు. అంతేకాదు 2011లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ శతాబ్ది వేడుకలు కూడా జరిగాయి.

జరిగిపోయిన కొంత కాలాన్ని ఒకసారి మననం చేసుకుంటే పూర్వకాలంలో అయితే స్త్రీలు వంటగదికే పరిమితమయ్యేవారు. బాల్య వివాహాలు, సతీ సహగమనం, ఇంకా నిరక్షరాస్యత మొదలైన ఆచారాలు సాంప్రదాయాల పద్దతులతో మహిళలు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. అంబేడ్కర్, రాజారామ్మోన్ రాయ్, కందుకూరి వీరేశలింగం పంతులు, మాడపాటి హనుమంతరావు మొదలగు మహానుభావులు స్త్రీ అభ్యున్నతికి ఎంతగానో పాటుపడ్డారు. ప్రస్తుతం స్త్రీలు ఎంతో అభివృద్ధి, ప్రగతి సాధించినప్పటికీ వారికి గౌరవం లభిస్తుందా, స్త్రీలకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుందా, వారి కలలు సాకారం అవుతున్నాయా అంటే ఇవన్నీ ప్రశ్నలుగానే మిగిలిపోతున్నాయి. ఎందుకంటే అక్కడక్కడా జరిగే అఘాయిత్యాలు అన్ని వేలెత్తి చూపిస్తునే వెక్కిరిస్తున్నాయి. స్త్రీలపై జరిగే అఘాయిత్యాల పరంపర రోజురోజుకీ పేట్రేగిపోతూ హత్యలు, అఘాయిత్యాలు ఇంకా ఎక్కవగానే పెరిగిపోతున్నాయే తప్ప తగ్గిన పరిస్థితులు ఏ కోశానా కనబడబడం లేదు. ఎందుకంటే నెలల వయసు ఉన్న చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు ప్రతిచోటా ఆడవారిపై ఎన్నో అఘాయిత్యాలు జరుగుతునే ఉన్నాయి. అందులో నమోదవుతున్నవి కొద్ది సంఘటనలు మాత్రమే. దీనినిబట్టి చూస్తే మహిళలు ఎంతగా బాధించబడుతున్నారో అర్థమవుతుంది. అలాగని స్త్రీలు వెనుకబడిపోయారనేది కాదు. వారు ఎంత అభివృద్ధి చెందుతున్నా స్త్రీని అలాగే చిన్నచూపుతోనే చూస్తున్నారు తప్ప వారిపై గౌరవం మాత్రం సమానంగా అందడం లేదు.

ఆడవారు అబలలు కాదు మహాశక్తి అని నిరూపించే యువతులూ భరతగడ్డపై ఎందరో పుట్టారు. ఎన్నో రంగాల్లో ఎంతో ఉన్నతిని సాధించారు. భారతదేశంలో తొలిగా అహ్మదాబాద్ లో అనసూయా సారాభాయ్ టెక్స్‌టైల్ లేబర్ అసోసియేషన్ అనే పేరుతో కార్మికసంఘం ప్రారంభించారు. భారత కార్మికోద్యమంలో కార్మిక స్త్రీలను సంఘటితం చేసిన మహిళా నేతలలో సుశీలా గోపాలన్,

విమలారణదివే, కెప్టెన్ లక్ష్మిసెహగల్, అహల్యారంగ్నేకర్, పార్వతీకృష్ణన్ ప్రముఖులు. ఈ పోరాటాల ఫలితంగానే స్వాతంత్ర్యం తరువాత కార్మికుల బ్రతుకులు మెరుగయ్యాయి. కార్మికుల పని పరిస్థితులు,వేతనాలు,మహిళా కార్మికుల గురించి చట్టాలు చేయబడినవి. 1991లో ప్రారంభమైన సరళీకరణ విధానాల ప్రభావం వలన ప్రైవేటు రంగం బలపడడంతో మహిళా కార్మికుల చట్టాల అమలు కుంటుబడుతున్నది. దీనికి వ్యతిరేకంగా పోరాటాలలో మహిళలు పాల్గొనడం, నేతృత్వం వహించడం కూడా జరుగుతుంది. అయితే మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పునస్కరించుకుని... ఈమధ్య కాలంలో కేంద్ర ప్రభుత్వం 'నారీ శక్తి' పురస్కారాలను ప్రకటించింది. దేశంలో వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరచిన మహిళలకు ఈ పురస్కారాలు ప్రదానం చేస్తున్నారు. 'మహిళా దినోత్సవం' రోజున న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా వీరు ఈ అవార్డులు అందుకుంటున్నారు. అయినా కూడా ఇంకా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మెరుగుపడవలసిన అవసరం ఎంతైనా ఉంది.



అంతర్జాతీయ మహిళా దినోత్సవం కనీసం 20 దేశాలలో అధికారిక సెలవు దినం. వీటిలో ఆఫ్ఘనిస్తాన్, క్యూబా, లావోస్, రష్యా, వియత్నాం. ఈ దేశాలలో చాలావరకూ సాంప్రదాయం ప్రకారం పురుషులు తమ తల్లులు, భార్యలు, స్నేహితురాళ్ళు, సహచరును పువ్వులు,చిన్న చిన్న గిఫ్ట్ లు ఇచ్చి గౌరవిస్తారు. ఇతర దేశాలలో ఈ రోజు మదర్స్ డే హాలిడే లాంటిది. ఇక్కడ పిల్లలు,తమ తల్లులు, నానమ్మలకు బహుమతులు ఇస్తారు.

ఒక ప్రత్యేక రోజుగా గౌరవిస్తారు. అంతర్జాతీయ మహిళల దినోత్సవం రష్యా సహా చాలా దేశాల్లో జాతీయ సెలవు దినం. మార్చి 8కి ముందు, తర్వాత మూడు నాలుగు రోజుల పాటు రష్యాలో పువ్వుల కొనుగోళ్లు రెండింతలు అవుతుంటాయంటారు. చైనాలో మార్చి 8వ తేదీన స్టేట్ కౌన్సిల్ సిఫార్సు మేరకు చాలా మంది మహిళలకు సగం రోజు పని నుంచి సెలవు లభిస్తుంది. కానీ ఇంకా కొన్ని సంస్థలు తమ మహిళా ఉద్యోగులకు ఈ సగం పనిదినం అవకాశాన్ని కూడా ఇవ్వట్లేదు.

ఇటలీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం లేదా 'ల ఫెస్టా డెల్ల డొన్న'ను మిమోసా అనే చెట్టుకు పూసే పువ్వులను బహూకరించి జరుపుకుంటారు. ఈ మిమోసా పువ్వులను పంచే సంప్రదాయం ఎప్పుడు ప్రారంభమైందో స్పష్టంగా తెలియదు కానీ రెండో ప్రపంచ యుద్ధ సమయంలో రోమ్‌లో ఇది ప్రారంభమైందని భావిస్తుంటారు. అమెరికాలో అయితే మార్చి నెల మహిళల చరిత్ర నెల. అమెరికా మహిళల విజయాలను గౌరవిస్తూ ప్రతి ఏటా అధ్యక్ష ప్రకటన వెలువడుతుంది. వాస్తవానికి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని తొలిసారిగా 1911లో ఆస్ట్రియా,డెన్మార్క్,జర్మనీ,స్విట్జర్లాండ్ దేశాల్లో నిర్వహించారు. 1913లో రష్యాలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడు అధికారిక సెలవుదినంగా ప్రకటించారు. అయినా మహిళలు ఇప్పటికీ ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటునే ఉన్నారు.

1917 రష్యాలో పురుషులు యుద్ధంలో ఉన్నప్పుడు అక్కడి మహిళలు ఆహార కొరతతో తల్లడిల్లి పోయారు. వారి మాటలను కానీ వారి పరిస్థితిని కానీ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. దీంతో యుద్ధ సమయంలో రష్యా మహిళలు "ఆహారం – శాంతి" డిమాండ్ చేస్తూ సమ్మెకు దిగడంతో.. అప్పుడు తాత్కాలికంగా ఏర్పాటైన ప్రభుత్వం మహిళలకు ఓటు వేసే హక్కును మంజూరు చేసింది. మహిళలు ఈ సమ్మెకు దిగిన రోజు జూలియన్ క్యాలెండర్ ప్రకారం ఫిబ్రవరి 23 ఆదివారం. తర్వాత అప్పటి రష్యా సామ్రాట్ నికోలస్ జా2 సింహాసనాన్ని కూడా వదులుకోవాల్సి వచ్చింది. గ్రెగోరియన్ క్యాలెండర్ ప్రకారం చూస్తే అది మార్చి 8వ తేదీ. అందుకే మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా వారు జరుపుకుంటున్నారు. 1975వ సంవత్సరంలోనే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఐక్యరాజ్య సమితి అధికారికంగా గుర్తించింది. పురుషులతో సమానంగా విద్యా, ఉద్యోగ, సామాజిక, రాజకీయ రంగాల్లో మహిళల ప్రాతినిధ్యం గణనీయంగా పెరుగుతోంది. ఆడవారి కష్టానికి గుర్తింపుగా మార్చి 8న ఇంటర్నేషనల్ ఉమెన్స్ డే చేసుకుంటున్నారు.

మార్చి 8 వస్తే మహిళలకు పండుగే. ఎందుకంటే మహిళా దినోత్సవ సంబరం ప్రతి మహిళని పలుకరిస్తుంది. ప్రస్తుతం కుటుంబ

ఆర్థిక భారాలను స్త్రీ శక్తి తనవంతు బాధ్యతగానే సంతోషంగా మోస్తోంది. ఎంతో ఉన్నత శిఖరాలను చేరుకున్న పురుష శక్తికీ తామేమీ తీసిపోమని చాటి చెపుతోంది.అయితే సామాజికంగాను, రాజకీయాల్లోనూ, ఆర్థిక రంగంలోనూ మహిళలు ఎంత మేరకు ఎదిగారో తెలుసుకుని,వేడుక చేసుకునే రోజుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం మారిపోయింది.అయితే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఐక్యరాజ్య సమితి అధికారికంగా నిర్వహించటం ప్రారంభించినప్పటి నుండి ప్రతి ఏటా ఏదో ఒక ఇతి వృత్తం(థీమ్)తో ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. 'గతాన్ని వేడుక చేసుకోవడం, భవిష్యత్తుకు ప్రణాళికలు రచించుకోవడం' అని మొదటి థీమ్‌ను నిర్ణయించింది. "సమానత్వంతో ఆలోచించండి, తెలివిగా నిర్మించండి,మార్పు కోసం సృజనాత్మకంగా పనిచేయండి" మొదలైనవి ఎన్నో నినాదాలు ఉన్నాయి.అయితే పనిచేసే వయసున్న మహిళల్లో సగం మంది మాత్రమే ప్రపంచ కార్మిక శక్తికి ప్రాతినిథ్యం వహిస్తున్నారని ఐక్యరాజ్య సమితి గణాంకాలు చెబుతున్నాయి.

తాజాగా మహిళా వివక్షతను ప్రశ్నించింది.అందుకు తనకు చెందవలసిన సమాన వేతనంతో పాటు నష్టపరిహారంగా 20 కోట్ల రూపాయలను కూడా అందుకుంది.ఈమధ్యే బ్రిటన్ కు చెందిన స్టేసీ మాకెన్ ఓ జాతీయ బ్యాంకులో ఉద్యోగం. కాని వివక్ష. ఆ వివక్షతను భరించలేక తన హోదాలోనే పనిచేస్తున్న సహోద్యోగి పురుషుడితో సమానంగా వేతనానికై వేసిన దావాతో ఎనిమిదేళ్ళ పాటు జరిగిన విచారణలో వివక్షత తగదని బ్రిటిష్ ట్రిబ్యునల్ పెద్దమొత్తంలో నష్టపరిహారం చెల్లించాలని తీర్పునివ్వడమనేది ఇదే తొలిసారి కావడం విశేషం.

ఏది ఏమైనప్పటికిని నేటి పరిస్థితి చూస్తే స్త్రీలు సాధించిన ప్రగతి శక్తివంతమయింది. అందుకే సమాజంలో తమకంటూ ఒక గుర్తింపు తెచ్చుకుంటున్న మహిళల ఆలోచనా విధానాలకు ప్రాముఖ్యత ఇస్తూ అన్ని విధాలుగా రక్షణ బాధ్యతలను చేపట్టాలి.కొనసాగుతున్న అసమానతలపై అఘాయిత్యాలపై అవగాహన పెంచాలి.వాటిని పునరావృతం కాకుండా గట్టి చర్యలు,చట్టాలు తీసుకురావాలి. అయితే ప్రభుత్వం ఇప్పుడిప్పుడే అన్ని రంగాలలో మహిళా సాధికారత సాధ్యమయ్యే దిశగా వేస్తున్న అడుగులను వేగవంతం చేస్తోంది.అది పూర్తి స్థాయిలో నెరవేరాలని ఆశిద్దాం.అప్పుడే నిజమైన అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి అసలైన అర్థం చేరుకుతుంది.

ఆంధ్రా యూనివర్సిటీలో సైన్స్ వారోత్సవ పండుగ (సైన్స్ వీక్ ఫెస్టివల్) 22 ఫిబ్రవరి నుండి 28 ఫిబ్రవరి వరకు జరిగాయి. దీనిలో భాగంగా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ పి.వి.జి.డి.ప్రసాద్ రెడ్డి గారు సైన్స్ వారోత్సవాల యొక్క ఆవశ్యకతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అనేక మంది ప్రముఖులు, నేవీ అధికారులు మరియు యూజీసీ హెచ్‌ఆర్‌డీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్.ఎ.డి.పాల్ గారు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా

మహిళల సాధికారత ఎక్కడ?

దామరాజు లలిత

స్వయం నిర్ణయాత్మక శక్తిని కలిగి ఉండడం, తగిన సమయంలో తగిన నిర్ణయాలు తీసుకోవటం అటు కుంటుంబంలోను ఇటు సమాజంలోను మహిళ ఆదర్శవంతమైన పాత్ర పోషిస్తుంది.

భారతదేశం పరిస్థితి చూస్తే మహిళసాధికారత సగభాగం ఉన్న మహిళల పరిస్థితి చూస్తే నేటికి అక్షరాస్యత లేదు. తిండి ఆరోగ్యం, చదువు లేదు. రాజకీయంగా కూడా చూడలేదు. మహిళ సాధికారత గురించి నాలుగు పధకాలు పెడితే మహిళ సాధికారత సాధించటం అంటున్నారు. రాజకీయ నాయకులు నేటి విధాన నిర్ణయాల్లో మహిళపాత్ర ఎంత ఉంది. చట్టాల్లో కాని, రాజకీయల్లో కాని, ఎక్కడ కనపడలేదు. రాజకీయాల్లో, పార్లమెంట్లో, లోక్‌సభల్లో కూడా మహిళ పాత్ర ఎక్కువ లేదు. ఆరోగ్య కార్డులు, పించన్, రేషన్ కార్డులు, మెడికల్ కిట్లు ఇవ్వడం కాదు. విధాన నియమాలు మహిళ రాజకీయ అధికారంలోని మహిళ పాత్ర ఉంటే మహిళ సాధికారత సాధించవచ్చు కాని మరో వందేళ్ళయినా మహిళలకు సమానత్వం కలే?


కెప్టెన్ లక్ష్మీ సెహగల్

మహిళ సాధికారత గురించి తెలుసుకొనే ముందు సాధికారత అనగా వ్యక్తి తన హక్కులను, బాధ్యత తెలుసుకొని తనకు ఉన్న శక్తియుక్తులను సమగ్రంగా ఆవిష్కరించుకొని అందిన అన్ని అవకాశాలను ఉపయోగించుకొని, తనకు కుటుంబ, దేశం ఉపయోగపడటం సాధికారత. సాధికారత విభిన్న అంశాలలో కలబోత. మహిళ సాధికారత అనగా మహిళలు వారి జీవితానికి సంబంధించిన అంశాలు స్వయం నిర్ణయాధికారాన్ని కలిగి ఉండటం, జనాభాలో సగ భాగం ఉన్న మహిళలు అన్ని రంగాల్లో ప్రాతినిధ్యాన్ని కలిగి ఉండటం, నిర్ణయాలు తీసుకొనే స్వేచ్ఛ, ఎంపిక చేసుకొనే సామర్థ్యాన్ని కలిగి ఉండటం. ఆర్ధిక స్వతంత్ర, రాజకీయ అధికారాన్ని కలిగి ఉండటం, స్త్రీ పురుషులు సమానత్వాన్ని ఆమోదించడం. పంచవర్ష ప్రణాళికలలో మహిళ సంక్షేమానికి మహిళాసాధికారతకు ప్రాధాన్యతను ఇచ్చింది.. 8వ పంచవర్ష ప్రణాళిక 1992-97 ఈ ప్రాధాన్యాన్ని చూడటం, 1982-83లో డ్వాక్రా, 1942 మహిళ కమిషన్ ఏర్పాటు 2001 జాతీయ మహిళ సాధికారత విధానము మొదలైనవి ఇందులో భాగం.

మాలతీ చందూర్

స్వాతంత్ర్యం అనంతరం భారత ప్రభుత్వం, మహిళా సాధికారత కోసం కృషి చేసింది అని చెప్పవచ్చు. రాజ్యాంగంలో స్త్రీ, పురుషులు ఇద్దరికి సమానంగా ప్రాధమిక హక్కులు కల్పించడం, వివిధ చట్టాలు ద్వారా మహిళ సాధికారత కోసం ప్రయత్నం జరిగింది. సాధికారతకూ, సమానత్వానికి బాటలు వేసిన గ్రామీణ ఉపాధి హామీ పథకానికి ముప్పు. ప్రపంచంలో ఏ మూలకు పోయినా శ్రమ చేయని మహిళలు దాదాపు కనిపించారు. పెట్టుబడి దారి సమాజంలో శ్రమ దోపిడి, - స్త్రీ పురుషులు ఇద్దరూ అతీతం కాకపోయినా పురుషాధిక్యత సమాజంలో మహిళా అదనపు దోపిడి గురి అవుతున్నారు. ఉదయం నుండి రాత్రి వరకు నడుం ఎత్తకుండా ఇంటి చాకిరి చేస్తున్న అందుకు వేతనాలు పొందుతున్న మహిళలు అరుదు. సంపన్న వర్గాల మహిళలకు మత్రమే అది పరిమితి. కుటుంబ సంరక్షణ, ఇంటి శ్రమ పంచడం లాంటి పనులకు ప్రత్యక్ష ఆదాయం లభించని పనులు మాత్రమే ఎక్కువమంది మహిళలు బలి అవుతున్నారు. సమాజంలో ఆర్ధికంగా తక్కువ విలువ, గుర్తింపు లేని పనులు మాత్రమే మహిళలు పరిమితంగా ఉన్నారు. దేశంలో ప్రపంచీకరణ వలన ఆర్ధిక విధానాలు వలన వృద్ధిరేటు ఇబ్బడి ముబ్బడిగా పెరిగినప్పటికి ఉపాధి నిష్పత్తిలో పెరగలేదు. సరికదా ఇంకా తగ్గిపోయింది. స్వంత ఆస్తిలు తమకు లేకపోవడం, అప్పులు పొందగలిగితే పరిమితి లేకపోతే మహిళలు సాపేక్షంగా పేదరికం ఎక్కువ అవుతుంది. చదువులో వెనుకుబాటుతనం ఉంది. మహిళా సాధికారత ఏ రకంగా సాధించగలం?

ఈ రోజుకు నూటికి 90శాతం వ్యవసాయం పైన ఆధారపడి జీవిస్తున్నారు. పథకాలు పెట్టడం అయితే జరిగింది. కాని దాని ఆచరణల్లో లోపాలు చాలా ఉన్నాయి. పథకాన్ని రూపొందిస్తే భూస్వాములు, ధనిక రైతులు వర్గాలు వారికి ఫలాలు అందుతున్నాయి. సి.డి.పి. (కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం) విఫలం అయ్యింది. (ఐఎడిపి) ఇంటెన్సివ్ అగ్రికల్చర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం తీసుకువచ్చారు. రైతులు, ఎరువులు సబ్సిడీపైన పురుగులు మందులు, విత్తనాలు, యాంత్రాలు ఇచ్చారు. ఉత్పత్తి పెరిగి ఆహార దాన్యాలు ధరలు తగ్గి పేదరికం అంతరించిపోతున్నదని అంచనాలు వేశారు. వ్యవసాయ రంగంలో యంత్రాలు ప్రవేశంలో ఉత్పత్తి పెరిగిన, శ్రామికులు ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయని పరిశోధకులు తేల్చాయి. పేద, ధనిక రైతు మధ్యంతరం మరింత పెరిగింది. మన రాష్ట్రాలు పోగేసిన సంపద సినిమాలు, పరిశ్రమల లోనికి ప్రవహించడం తెలిసిన విషయం. పనికి ఆహార పథకం లాంటి కార్యక్రమాలైతే పేదరిక నిర్మూలన కోసం కాక, రాజకీయ నాయకులు జేబులు నింపడానికి మాత్రమే ఉపయోగపడింది.

మీరా కుమార్

సుచేతా కృపాలనీ

వాసిరెడ్డి సీతాదేవి

ఈ సందర్భంలో గ్రామీణ ఉపాధి హామి చట్టం 2005లో వచ్చింది. ఎన్.డి.ఎ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలుపై వ్యతిరేకత, వారి నయా నూతన ఆర్థిక విధానాలపై వ్యతిరేక ఓటుతో యు.పి.ఎ ప్రభుత్వం 2004 ఎన్నికల్లో గెలిచింది. మేము ప్రజల పక్షాన ఉన్నామని అప్పటి సోనియా గాంధి జాతీయ సలహా మండలి ఏర్పడింది. అప్పుడు సమాచార హక్కు, ఉపాధి హామి చట్టాలు 2005 తయ్యారయింది. గ్రామీణ కుటుంబాల్లో 100 రోజులు పని కల్పించాలి. లేని యడల 15 రోజుల్లో పని కల్పించలేకపోతే 15 రోజులు లోపు నిరుద్యోగ భృతి చెల్లించాలి. కొంత మేరకు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఊతం ఇచ్చింది. దీని వలన దుర్భల దారిద్ర్యంలోనికి పోకుండా 45 శాతం మహిళలు పేదరికం నుండి బయట పడ్డారని, నేషనల్ కౌన్సిల్ ఫర్ ఎకనామిక్ రిసెర్చ్ సంస్థ తేల్చింది. ఉపాధి హామితో మహిళల భాగస్వామ్యం ఎక్కువగా ఉండటానికి గల కారణం కనీసం మూడు వంతులు మహిళలు హామీ పథకం ఉండాలని చట్టం నిర్దేశించి పురుషులు అయినా మహిళ అయినా సమాన వేతనం ఇవ్వాలి.

ఇదంతా నాణేనికి ఒక వైపు మాత్రమే. ఉపాధి హామితో 60 రోజులు పాటు పని దక్కటంలేదు. వేతనాలు తక్కువ ఉండటం, వేతనాలు సకాలంలో ఇవ్వకపోవడం, ప్రభుతవం పని కల్పించకపోవడం, నరేంద్ర మోదీ ప్రధాన మంత్రి అయిన తర్వాత అసలు ఉపాధి హామీ పథకం లేకుండా చేయడానికి జరగని ప్రయత్నం లేదు. చట్టాలు నుండి కార్మికులు హక్కులు కాలరాసింది. ఒక పథకము ప్రభుత్వ భిక్ష మాత్రమే నడుస్తుంది. ప్రధాన మంత్రి పార్లమెంటు సాక్షిగా హక్కులు రద్దు చేయటం. ప్రజావ్యతిరేకత వస్తే విరమించడం జరుగుతుంది. కార్మిక, రైతు, విద్యార్థి రద్దు చేయడానికి పూనుకొన్నాడు. సమిష్ట ఈ విధానాలవలన మహిళ సాధికరతా వచ్చే పథకాలును ఎదుర్కొవాలి.

అనారోగ్యంతో పేదరికంలోకి నెట్టివేయబడింది. ఈ ప్రభుత్వాల విధానలు ఎటా 36 లక్షల మంది భాదితులు ఇంటి ఖర్చు భాగంగా 25 శాతం ఆరోగ్యంపైన ఖర్చు చేస్తున్నారు. ఏరకంగా మహిళా సాధికారత సాధించగలరు. ప్రధానంగా అణారోగ్యంపై అంతో ఇంతో ఆస్తులు ఉన్న కుటుంబం అనారోగ్యం వస్తే వైద్య ఖర్చులకు ఆస్తులు కరిగిపోతున్నాయి. అప్పో సొప్పో చేసి ఆరోగ్యవంతులైన వారు ఆర్థికంగా కుదేలవు తునన్నారు. తీవ్ర అనారోగ్యం కారణంగా ఏటా దేశంలో 6 కోట్ల మంది తెలుగు రాష్ట్రాలు 45 లక్షల మంది పేదరికంలోకి వెళ్లినట్లు సర్వే చెప్పింది. దీని వలన కుటుంబ ఆర్థిక పరిస్థితి దిగజారి మహిళా సాధికారత కూడా కుంటుపడుతుంది. ప్రభుత్వ విధానాల వలన ఎన్నో కుటుంబాలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. మూకుమ్మడి ఆత్మహత్యలు పెరిగాయి. రైతులు, విద్యార్థులు, మహిళలు చిన్న వ్యాపారస్తులు కూడా ఆత్మహత్యలు పరిష్కారాలు అనే నమ్ముతున్నారు. ఈ విధానాలు త్రిప్పికొట్టాలి. మనం కట్టే పన్నులు పాలన సాగిస్తున్న వాటిపై ఆధారపడి ప్రభుత్వాలును నిలదీయాలి.

తెలుగు కవిత్వంలో స్త్రీవాద సాహిత్యం చర్చించిన అంశాలు

'స్వేచ్ఛా', 'సమానత్వం', 'సౌభ్రాతృత్వం' అనే మూడు సూత్రాలు ప్రపంచ దేశాలకు ఫ్రెంచి విప్లవం పరిచయం చేసింది. అది 1789 సంవత్సరంలో జరిగింది. ఆనాటి నుంచి ప్రపంచానికి ఈ మూడు మాటలు గొప్ప ఆలోచనల్ని, కొత్త ఆశల్ని కలిగించాయి. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సమాజంలోనూ ఒకరిపై ఒకరు ఏదో విధంగా ఆధిపత్యాన్ని కలిగి ఉంటారు. ఆ ఆధిపత్యం తారాస్థాయికి చేరినప్పుడు నియంతృత్వం, లేదా నిరంకుశ అధికారాలు చెలాయిస్తారు. ఆ ఆధిపత్య ధోరణులు మహా సామ్రాజ్యాలు మొదలు మన ఇండ్ల వరకు కనిపిస్తాయి. ప్రతి సమాజంలో ఒక కుటుంబం ఆ కుటుంబంలో భార్యాభర్తలు, పిల్లలు పెద్దలు ఉంటారు. నాగరిక సమాజం కుటుంబాన్ని కలిగి ఉంటుందనే ఒక లక్షణంగా భావిస్తున్నారు. కానీ ఒకరిపై ఒకరు ఆధిపత్యాన్ని చెలాయించుకుంటూ అనాగరిక చర్యలకు కూడా పాల్పడుతుంటారు. ఇవి అనేక పార్శ్వాల్లో కనిపిస్తున్నా స్త్రీ, పురుషులు కలిసి మెలిసి ఉండవలసిన కుటుంబంలో మరింత ఎక్కువగా కనిపించి కొంత మందికి మానసిక ఒత్తిడిని, క్షోభను కలిగిస్తాయి. అనాదిగా పురుషుడు స్త్రీని తనకు అనుకూలంగా మార్చుకున్నాడు. స్త్రీకి మాత్రమే పిల్లల్ని కనగలిగే శక్తి సామర్థ్యాలు ఉండడం వలన అదే వారి పాలిట వరముగానూ, శాపముగానూ పరిణమించాయి. కుటుంబాలలో స్త్రీ, పురుషుల మధ్య ఆధిపత్యం మొదలైన తరువాత దాన్ని భరించలేని స్థితిలోనే స్త్రీవాదం బయలుదేరింది. ఆ స్త్రీవాద దృక్పథం తెలుగు సాహిత్యంలోనూ ఎంతో విస్తృతంగానే వచ్చింది. తెలుగు సాహిత్యంలో స్త్రీవాద సాహిత్యం చర్చించిన అంశాలను అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ వ్యాసంలో విశ్లేషించే ప్రయత్నం చేస్తాను. స్త్రీ వాదాన్ని చాలా మంది రకరకాలుగా నిర్వహించారు. "స్త్రీవాద సాహితీ సమాఖ్య" వారు, "సమాజంలోని అన్ని రంగాలలోనూ స్త్రీకి సమానభాగస్వామ్యం ఉండాలని, ఆడవాళ్ళ వ్యక్తిత్వమూ, జీవితమూ కొందరి చెప్పుచేతలకి లోబడి తీర్చిదిద్దబడే పరిస్థితి మారాలని, ముఖ్యంగా స్త్రీ తల్లిగా, భార్యగా మాత్రమే ముద్రవేయబడే ఒక లేబిల్ నుంచి మనిషిగా గుర్తింపు పొందే స్థితి రావాలనీ, దానికోసం రావాలనీ, సాంస్కృతికంగానూ, సామాజికంగానూ, సాహిత్యపరంగానూ ఊడలై విస్తరించి ఉన్న పురుషస్వామ్యపు భావజాలం పోవాలనీ, ఈ భావాలతో సాగుతున్న ఉద్యమమే ఫెమినిజమంటే" (స్త్రీవాద సాహితీ సమాఖ్య,1989:1) అని స్త్రీవాదాన్ని నిర్వచించారు.

నలసాని రాం ప్రసాద్,
రీసెర్చ్ స్కాలర్, తెలుగుశాఖ,
యూనివర్సిటి ఆఫ్
హైదరాబాద్, హైదరాబాద్,
ఫోను: 9502847494

స్త్రీవాద సాహిత్యాన్ని పొదుం జయరాంగారు ఇలా చెప్తూ "ఇది పురుష పీడన సమాజం. ఆధిక్యతను కొంత కాలం పాటు భరించవచ్చు. కానీ పీడనను ఎన్నాళ్ళని భరిస్తారు? తమకు జరిగే అన్యాయాలకు, అక్రమాలకు, పీడనకు వ్యతిరేకంగా ఆధునిక స్త్రీ తిరుగుబాటు చేస్తోంది. ఆ తిరుగుబాటులో భాగంగానే నేటి స్త్రీ వాద కవిత్వాన్ని పరిగణించాలి" (స్త్రీవాద వివాదాలు. పుట:54) అని జయరాం గారు స్త్రీవాద సాహిత్యాన్ని తత్వాన్ని తెలియజేశారు. ఈ నిర్వచనాల దృష్ట్యా తెలుగులో వచ్చిన కవయిత్రుల కవితల్ని ఇక్కడ విశ్లేషించుకుందాం.

స్త్రీవాద కవిత్వాన్ని ప్రముఖ కవయిత్రి, ఉద్యమకారిణి విమల 'వంటిల్లు' అనే కవితను రాశారు. అందులో "వంటింటి తనాన్ని" ఇక్కడే నేర్పారు నాకు / మా అమ్మ, మా అమ్మమ్మ / ఇంట్లో అమ్మలంతా ఇక్కడే **"స్త్రీ"లయ్యారట / గిన్నెలు, డబ్బాలు, బస్తాలతో / రకరకాల శవాలు నిండిన శ్మశానంలా / మా వంటిల్లు -తడి కట్టెల పొగ మేఘాల మధ్య / మా వంటిల్లు వేలాడుతూ ఉంటుంది"** అని తరతరాల పాటు వంటిల్లులోనే తమ జీవితాల్ని గడిపారని తెలుస్తోంది. బాల్యం నుంచి ఆ వంటిల్లులో ఉండే గిన్నెలు, పొయ్యి, కట్టేల మధ్య ఉండిపోయారని విమలగారు వర్ణించారు. 1984 లో సావిత్రి "బంది పోట్లు" అనే కవిత రాసింది!

"పాఠం ఒప్పచెప్పక పోతే పెళ్ళిచేస్తానని / పంతులు గారన్నప్పుడే భయమేసింది! / ఆఫీసులో నా మొగుడున్నాడు / అవసరమొచ్చినా సెలవివ్వడని / అన్నయ్య అన్నప్పుడే అనుమానమేసింది!/వాడికేం ? మగమహారాజని / ఆడా, మగా వాగినప్పుడే అర్థమ్మై పోయింది / పెళ్ళంటే పెద్ద శిక్ష అని / మొగుడంటే స్వేచ్ఛా భక్షకుడని/మేం పాలిచ్చి పెంచిన జనంలో సగమే / మమ్మల్ని విభజించి పాలిస్తోందని!" / ఈ కవిత పెద్ద సంచలనం సృష్టించింది. స్త్రీ స్వేచ్ఛాస్వరూపాన్ని అనేకకోణాల్లో వ్యక్తీకరించిన కవిత.

జయప్రభ 'ఆడతనంతో అచంచల విశ్వాసం' అనే కవితను రాశారు. అందులో స్త్రీకి మాతృత్వం వలన ఆమె అనుభవించిన శారీరక, మానసిక ఆవేదనను కవితాత్మకంగా వర్ణించారు. **"నా పురిటి నొప్పులు కదా / కొత్త సృష్టికి కారణం / నా ఆడతనమే / నాకే రూపాన్నిచ్చింది, / రక్తస్రావాన్నిచ్చింది, / నన్ను తల్లిని చేసింది, / గర్వంతో తలెత్తుకునేలా చేసింది"** అని జయప్రభగారు చక్కగా తెలిపారు.

విమల 'సౌందర్యాత్మక హింస' అనే కవితను రాశారు. ఈ కవితలో స్త్రీ శరీరాన్ని ఒక భోగ వస్తువుగా చూసే పితృస్వామ్య సమాజం

భావించే తీరును, వర్ణించారు. **అందం పోటీయైన చోట, /అందం సరుకైన చోట /అందాల వ్యాపారాన్ని ద్వేషిద్దాం"** అని స్త్రీ శరీర హింసకు గురవుతున్న స్థితని విమలగారు పేర్కొన్నారు. కొండేపూడి నిర్మల లేబర్ రూం కవితలో **"లేబర్ రూంలో అడుగుపెడితే చాలు / మీరంతా చెబుతున్న/ తెల్ల చీర మల్లెపూలు పాల గ్లాసు వరుసల్లో/ పరాధీనతా బానిస కన్నీరు ద్వీపాంతర వాసం..../ కాళ్ళనలా ఎడం చేసి దీనంగా హీనంగా నీచాతి నీచంగా /ఒక హింసాతల పరాకాష్ఠ కోసం ఎదురు చూడ్డమంటే/ రైలు పట్టా మీద నాణెం విస్తరించిన బాధ"** అని స్త్రీ ప్రసవ సమయంలో అనుభవించే శారీరక, మానసిక బాధను తెలిపారు.

మందరపు హైమవతి 'నీలి కవితలే రాస్తాము' అనే కవితను రాశారు. ఆ కవిత ఇలా ఉంది. **"కవికీ చిత్రకారుడికీ /నా శరీరమే గదా /వర్ణనీయ వస్తువు/చలన చిత్రాలకు/వ్యాపార ప్రకటనలకు /పెట్టుబడి నా శరీరమే గదా!"** అందులో స్త్రీల శరీరాల్ని పెట్టుబడిదారీ సమాజం ఏ విధంగా వ్యాపారం చేస్తున్నారనే దాన్ని కవిత రూపంలో తెలిపారు. అదే విధంగా స్త్రీవాద సాహిత్యాన్ని దళిత, మైనారిటి సాహిత్య ఉద్యమాలలో పలువురు స్త్రీలు తమకు జరిగిన, జరుగుతున్న అన్యాయాల్ని, అవమానాల్ని, కుల వివక్షతను, జెండర్ వివక్ష, ఇలా మొదలైన అంశాల్ని స్మరింపజేస్తూ రచించారు. వాటిలో దళిత, మైనారిటి స్త్రీల కొన్ని కవితల్ని చూద్దాం.

దళిత స్త్రీ వాద సాహిత్యం:

స్త్రీ వాద సాహిత్యం, దళిత వాదం సాహిత్యం ఇంచుమించు ఒకే కాలంలో ఆవిర్భావించాయి. సమాజంలో దళిత స్త్రీలు కుల వివక్ష, జెండర్ వివక్ష హింస, అవమానం, దోపిడి ఇలా ఎన్నో రకాల సమస్యల్ని ఎదుర్కోవడం నిత్యం కనిపిస్తున్నాయి. వాటి గురించి దళిత స్త్రీలు ఆవేదనతో కవిత్వాన్ని రాశారు. వారిలో చల్లపల్లి స్వరూపరాణి గారు ఒకరు. ఆమె మంకెనపువ్వు కవిత సంపుటిలో దళిత యువతులు హాస్టల్లో పడే మానసికవ్యధను ఇలా వర్ణించారు. **"అక్కడ కూడా వార్డెన్‌గాడి / ఆకలి చూపులు". వాటి నుంచి తప్పించుకోలేక, మానసిక వ్యధకు గురవుతున్న వాళ్లెందరో! 'ఒంటిని గుప్పిట్లోకి తీసుకొని / దూరంగా విసిరేయాలని'నిపించడం గొప్ప వ్యక్తీకరణ.** ఎలాగో చదువుతుంది, అవమానాలకూ ఎదురీదుతుంది, ఉద్యోగం సాధిస్తుంది, ఆఫీసులో దళిత ఉద్యోగిని పట్ల ప్రవర్తన ఎలా వుంటుంది? **"ఆఫీసుకెళ్లినప్పుడు/రిజర్వేషన్ కేటగిరి" అనే/గుసగుసల్ని వినలేక/నాకే నా చెవుల్లో సీసం పోసుకోవాలనిపిస్తుంది"**

మైనారిటి స్త్రీల సాహిత్యం :

మైనారిటీల కవిత్వంలో స్త్రీవాద సాహిత్యం ధోరణులు కనిపిస్తున్నాయి. మైనారిటీల జీవన విధానంలో సంస్కృతి సంప్రదాయాలలో, కుటుంబ వ్యవస్థలో మైనారిటి స్త్రీల జీవితాలు ఏ విధంగా అణచివేతకు గురవుతున్నారో షాజహాన, ముస్వీరున్నీషా, మహజబీన్ వంటి కవయిత్రులు కవితాత్మకంగా వర్ణించారు.

షాజహాన "ముసుగు తీసి చూడు" అనే కవితను రాశారు. అందులో మైనారిటీ స్త్రీల జీవితాలు ఏవిధంగా ఉంటాయనే దాన్ని తెలిపారు. **"ఏ పరదాల మాటున ఎంత నైరాశ్యం/గూడు కట్టుకుని వుందో/ఎన్ని బురఖాల చాటున ఎన్ని కన్నీళ్ళ /సముద్రాలున్నాయో"** అని వారు ధరించే బురఖా దుస్తుల చాటున దాగి ఉన్న మైనారిటీ మతం పట్ల మైనారిటీ స్త్రీల ఆవేదనను షాజహాన్ ఎంతో చక్కగా వర్ణించారు.

అలాగే ముస్వీరున్నీషా 'గడియా' అనే కవితను రాశారు. మైనారిటీ స్త్రీల జీవితాలలో వివాహ వ్యవస్థలో బహు భార్యత్వం ఉంటుంది. అందులో బహుభార్యాత్వానికి బలైనా యువతి జీవితాన్ని తెలిపారు. **"నేనొక అరబ్బు కామవాంఛకు /బలైనా బొమ్మను.../ పరదేశానికి అమ్ముడైన/ అంగడి బొమ్మను నేను.../కన్న వాళ్ళు అసహాయితకు కటికి పేదరికానికి/బలిపీఠం ఎక్కుతున్న వాళ్ళం"** ఈ కవిత ఆధారంగా మైనారిటి స్త్రీల ఆవేదనల్ని వివరించారు.

ఈ విధంగా తెలుగు సాహిత్యంలో స్త్రీలు రకరకాల అంశాలపై కవిత్వమయ్యారు. సమాజంలో స్త్రీ పాత్ర, మాతృత్వం, కుటుంబంలో స్త్రీ పాత్ర, విద్య, ఉద్యోగం, ఆరోగ్యం, వివాహం, వరకట్న సమస్య, పిల్లల్ని పెంచడం, వంట చేయడం, రాజకీయాధికారం, అనేక శారీరక సౌందర్యం, స్త్రీకి ఆస్తి హక్కు లేకపోవడం, పురుషులతో సమానంగా చదవలేకపోవడం, సమానమైన వేతనం ఇవ్వకపోవడం, చిన్న పిల్లలకు రక్షణగా ఉండడం, గృహహింస, రక్షణ లేకపోవడం, మానవ సంబంధాలు, హక్కులు మొదలైన అంశాలన్నింటిని తెలుగు స్త్రీవాద కవయిత్రులు చాలా సమర్థవంతంగా ఎంతో విస్తృతంగా వర్ణించారు. ఇవన్నీ కూడా చదువుకున్న మధ్య తరగతి పురుషులను చాలా వరకు ఆలోచింపజేశాయి. ఆ విధంగా స్త్రీవాదం మహిళా హక్కుల్ని కాపాడటంలోను, హక్కులను సాధించుకోవడంలోను స్త్రీలు శక్తివంతమైన పాత్రను నిర్వహిస్తున్నారని స్పష్టంగా చెప్పవచ్చు.

మా పెళ్లి మళ్లీ

ప్రజామీడియా నెట్‌వర్క్

ఏజెన్సీలో అనేక గిరిజన గ్రామాలున్నాయి. ఈ గ్రామాల్లో ఉండే సహజ సిద్ధమైన ప్రకృతి అందాలను అస్వాదించేందుకు నిత్యం సందర్శకులు వస్తుంటారు. కానీ విశాఖ ఏజెన్సీలోని పెదలబుడు అనే గ్రామానికి వచ్చే టూరిస్టులు మాత్రం పెళ్లి చేసుకుంటారు. ఇక్కడికి వచ్చే టూరిస్టులే కాదు, పొలిటిషియన్లు, ఐఏఎస్, సెలబ్రిటీలు ఒక ప్రత్యేక అనుభూతితో తిరిగి వెళుతుంటారు. అదే మళ్లీ పెళ్లి.

జనవరి 11, 2022 తేదీన ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే తన భార్యతో సహా అరకు సమీపంలోని పెదలబుడు గ్రామానికి వచ్చారు. అక్కడికి చేరుకున్న కొద్దిసేపట్లోనే కాంతిలాల్ దండే దంపతులు పెళ్లి కొడుకు, పెళ్లి కూతురుగా తయారైపోయారు. అప్పటికే సిద్ధమైన కళ్యాణ వేదికను చేరుకున్నారు. గిరిజన సంప్రదాయ వాయిద్యాలు మోగుతుండగా... దంపతులిద్దరూ మళ్లీ వివాహం చేసుకున్నారు.

పెదలబుడు గ్రామంలో గిరి గ్రామ దర్శిని పేరుతో ఏర్పాటైన ఒక గిరిజన గ్రామంలో ఈ తంతు జరిగింది. గిరిజన సంస్కృతి ప్రతిబింబించేలా ఆయన వివాహం చేసుకున్నారు. ఈ పెళ్లికి పెద్దగా పాడేరు ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ వ్యవహరించారు. ఆయన చేతుల మీదుగానే ఈ తంతు మొత్తం పూర్తి చేశారు.ఆ తర్వాత అంతా కలిసి గిరిజన సంప్రదాయ నృత్యం ధింసా చేశారు. పెళ్లి ఫోటోలకూ ఫోజులిచ్చారు.

"సాధారణంగా వివాహం అందరికి గుర్తుండిపోయేలా చేసుకోవాలని అనుకుంటాం. జీవిత కాలం గుర్తుండిపోయేలా ప్లాన్ చేసుకుంటాం. అందుకే ప్రస్తుతం డిఫరెంట్ మ్యారేజ్ కాన్సెప్ట్‌లకు డిమాండ్ పెరిగింది. అయితే ఖర్చు తక్కువతో, జీవితకాలం గుర్తుండిపోయే విభిన్నమైన రీతిలో వివాహం చేసుకోవాలనుకునే వారికి గిరిజన సంప్రదాయంలో చేసుకోవడం మంచి అప్షన్. ఇక్కడి ఆచార, వ్యవహారాలతో, గిరిజన వేషధారణతో పెళ్లయిన జంటలు కూడా నూతన వధువరులుగా మారిపోతారు.

"సరదాగా మళ్లీ పెళ్లి చేసుకుని...లైఫ్ టైమ్ మెమరీగా ఆ స్మృతులను దాచుకుంటున్నారు. సెలబ్రిటీల నుంచి సామాన్యుల వరకు ఈ కాన్సెప్ట్ కు ఆకర్షితులవుతున్నారు. అధికారులు, పొలిటిషియన్లు సైతం గిరి గ్రామ దర్శినికి వచ్చి గిరిజనుల్లా మారిపోయేందుకు ఆసక్తి చూపుతున్నారు" అని గిరి గ్రామ దర్శిని ఇంఛార్జ్ దయానిధి చెప్పారు.

గిరిజనుల్లా ఒక రోజు...

గిరి గ్రామదర్శిని సందర్శించి గిరిజన సంస్కృతీ సంప్రదాయాలను తెలుసుకుంటున్నారు. అది నచ్చి, వారిలాగే కట్టు, బొట్టు ధరించి అడవి బిడ్డల్లా మారిపోతున్నారు. అలాగే ఒక రోజంతా ఆదివాసీ ఆచార వ్యవహారాలు, ఆహారపు అలవాట్లు పాటిస్తూ సరికొత్త అనుభూతిని పొందుతున్నారు.

అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, కాకినాడ ఎంపీ వంగా గీత, కేరళ అల్తూర్ ఎంపీ శ్రీ రమ్య హరిదాస్‌లు కూడా గిరిజన మహిళల్లా మేకోవర్ అయి గిరిగ్రామ దర్శినిలో సందడి చేశారు. తిరగలి తిప్పుతూ.. రోకలిలో దంచుతూ.. కాసేపు సమయం గడిపారు.

"ఈ గిరి గ్రామ దర్శిని ద్వారా వినూత్నమైన అనుభూతి పొందేలా సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ), ఎకో టూరిజం వెల్ఫేర్ సొసైటీ అధ్వర్యంలో ఈ గ్రామాన్ని ఏర్పాటు చేశారు. ఆసక్తి ఉన్నవారు గిరిజన సంప్రదాయాల్లో జరిగే పండుగలు, వేడుకలు ఇక్కడ జరుపుకోవచ్చు. అలాగే గిరిజన పద్ధతుల్లో వివాహం చేసుకోవచ్చు. కట్టుబొట్టు నుంచి పెళ్లి విందు, అప్పగింతల వరకు వివాహ వేడుకంతా కూడా గిరి గ్రామ దర్శినిలో ఉన్న ఆదివాసీలే చూసుకుంటారు. కనుమరుగవుతున్న గిరిజన సంప్రదాయాలను నేటి తరానికి కళ్లకు కట్టే విధంగా చూపించడమే ఈ గిరి గ్రామ దర్శిని ప్రధాన ఉద్దేశం" అని అరకు ఎంపీ మాధవి చెప్పారు.గిరి గ్రామాల్లో వధూవరులను ఎలా ముస్తాబు చేస్తారో అదే విధంగా గిరిజన

సంప్రదాయంలో పెళ్లి చేసుకోవాలనే వారిని కూడా అలంకరిస్తారు. గిరిజన ఆభరణాలు దుస్తులతో వధూవరులను పెళ్లికి సిద్ధం చేస్తారు.

గిరిజన గ్రామాల్లో పెళ్లి వేడుకకు కల్యాణ వేదిక తరహాలోనే మండపాన్ని ముస్తాబు చేస్తారు. వివాహానికి హాజరయ్యే వారిని కూడా గిరిజనుల మాదిరిగా తయారు చేస్తారు. గిరిజన ఆచారం ప్రకారం పెళ్లి తంతు పూర్తి చేస్తారు.

"మా స్నేహితులమంతా అరకు టూర్ వచ్చాం. ఇక్కడ గిరి గ్రామ దర్శిని చూశాం. ఈ గ్రామం మొత్తం చూస్తే గిరిజన అలవాట్లు, సంప్రదాయాలు, వారి పండగల పై అవగాహన కలుగుతుంది. వీటన్నిటికంటే గిరిజన సంప్రదాయలో జరుగుతున్న వివాహం చాలా ఆసక్తికరంగా అనిపించింది. ఇందులో జరిగే వివిధ ఆదివాసీ వివాహ తంతులు బాగున్నాయి. అందుకే మే నెలలో జరగబోయే మా మ్యారేజ్ డే నాడు ఇక్కడే మేం గిరిజన సంప్రదాయంలో పెళ్లి చేసుకుంటాం" అని విశాఖ నగరానికి చెందిన స్వాతి చెప్పారు.

గిరిజన ప్రపంచంలోకి ఆహ్వానం' గిరిజనుల జీవనం ప్రత్యేకం. గిరిజన సంప్రదాయలు విభిన్నం. కొండకొనల్లో మారుమూల గ్రామాల్లో ఉండే వీరు, తరతరాలుగా వారి సంస్కృతి, ఆచారాలను పాటిస్తూనే ఉంటారు. ఎంతో భిన్నంగా ఉండే ఆ పద్ధతులను తెలుసుకుంటే ఆశ్చర్యంగా అనిపిస్తుంది. అలాంటిది ఆచరిస్తే ఎలా ఉంటుంది అన్న ఆలోచనకు రూపమే ఈ కాన్సెప్ట్.

"టూరిస్టులు ఇక్కడి ఆచార వ్యవహారాలు, ఆదివాసీల జీవన విధానాలను చూసి మనం కూడా ఇలా జీవిస్తే బాగుంటుందని కదా అని అంటుంటారు. వారి ఆలోచనలకు అనుగుణంగా...టూరిస్టులను మరింత ఆకర్షించేందుకు ఐటీడీఏ కొత్త కాన్సెప్ట్ ని డిజైన్ చేసింది. ఏజెన్సీలో అడవి బిడ్డలు ఎలా గడుపుతారో...వారి రోజు వారి జీవన విధానం ఎలా ఉంటుందో తెలుసుకోవడమే కాకుండా...ఒక రోజుంతా గిరిజనుల్లా బతికేందుకు ఐటీడీఏ 'ఏ డే యాజ్ ట్రైబ్' అనే కాన్సెప్ట్ ను డిజైన్ చేసింది. అందుకోసం ఒక గ్రామాన్ని సృష్టించారు. అదే 'గిరి గ్రామ దర్శిని'. ఈ గ్రామానికి వస్తే గిరిజనుల జీవితం కళ్లకు కట్టినట్లు కనిపిస్తుంది" అని ఎకో టూరిజం వెల్ఫేర్ సొసైటీ సభ్యులు రామ్మూర్తి అన్నారు.

గిరి గ్రామ దర్శినిని పెదలబుడు ఎకో టూరిజం వెల్ఫేర్ సొసైటీ నిర్వహిస్తుంది. స్థానిక గిరిజన యువత, గిరిజన మహిళ బృందాలు కలిసి ఈ సొసైటీని ఏర్పాటు చేసుకున్నారు.మా ఆచారాలే మాకు ఉపాధి'

అరకు నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఈ గ్రామం ఉంది. అరకు వచ్చే టూరిస్టులంతా ఈ గ్రామాన్ని సందర్శిస్తున్నారు. ఇక్కడ మేకోవర్ కు పురుషులకైతే రూ.100, మహిళలకైతే రూ. 200, అలాగే గిరిజన సంప్రదాయ వివాహం చేసుకోవాలంటే రూ. 12 వేలు, ధింసా నృత్యం చేయాలంటే రూ. 6 వేలు రుసుం వసూలు చేస్తారు.

"ఇక్కడికి వచ్చే టూరిస్టులకు మేకోవర్ మేమే చేస్తాం. అలాగే ఎవరైనా గిరిజన సంప్రదాయ వంటలు చేయమని అడిగితే వారికి అవి చేస్తున్నాం. ఇక గిరిజన సంప్రదాయంలో వివాహం చేసుకునేవారికి పెళ్లి ఏర్పాట్లు అన్ని చేసేందుకు ఒక టీం ఉంది. వారు ఉండేందుకు గదులు ఏర్పాటు, ఆహారం అందించడం, క్యాంప్ ఫైర్స్ వంటివి ఎకో టూరిజం వెల్ఫేర్ సొసైటీ తరపున మేమే ఏర్పాటు చేస్తున్నాం. ఇలా స్థానిక మహిళలు, యువత ఉపాధి పొందుతున్నాం" అని ఎకో టూరిజం వెల్ఫేర్ సొసైటీ తరపున పని చేస్తున్న గిరిజన మహిళ సుశీల చెప్పారు.

ఇది డిఫరెంట్ ప్రాజెక్టు' ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆచార వ్యవహారాలు చాలా భిన్నంగా ఉంటాయని, అవన్నీ కూడా ప్రకృతి నుంచి పుట్టినట్లు ఉంటాయని, చెట్లు, చేమలను పూజించడం, అవి ఇచ్చే ఫలాలతోనే జీవితం గడపడం, మళ్లీ వాటికి కృతజ్ఞతలు తెలుపుకుంటూ పండుగలు చేయడం ఇలా అన్నీ ప్రకృతితోనే మమైకమై ఉంటుందని పాడేరు ఐటీడీవో పీవో ఆర్. గోపాలకృష్ణ అన్నారు.

"ప్రస్తుత ఆధునిక జీవన విధానంతో పోల్చితే గిరిజన జీవనంలో ఒత్తిడి ఉండదు. అందుకే దిగువ ప్రాంతాల (మైదాన) వారు వీటిని అనుసరించాలని అనుకుంటారు. అయితే నిత్యం కాకపోయినా, కనీసం అప్పుడప్పుడైనా వాటిని అనుసరించేందుకు, అందులోని అనుభూతిని పొందేందుకు వీలుగా ఇక్కడ గిరి గ్రామ దర్శిని ఏర్పాటు చేశాం. విశాఖ ఏజెన్సీలో ఇదొక డిఫరెంట్ ప్రాజెక్టు. ఈ గ్రామంలోకి అడుగుపెట్టిన వారంతా, గిరిజనులుగా మారిపోతారు" అని పీవో గోపాలకృష్ణ తెలిపారు.

(BBC సౌజన్యం)

గుమ్మడికాయల దొంగంటే..!

కె.సుందరరావు

యావత్ మోడీ సర్కార్ ఓ పిల్ల దేశపు ప్రధాని మాటలకు చిగురుటాకులా వణికిపోతోంది. ఎందుకంటే ఆయన 'ప్రజాస్వామ్యం' గురించి మాట్లాడాడు. ఎందుకంటే ఆయన నెహ్రూని ఆకాశానికెత్తాడు. అక్కడితో సింగపూర్ ప్రధాని 'ఆగడాలు' ఆగలేదు. (భారత)దేశ స్వాతంత్ర్యోద్యమానికి నాయకత్వం వహించి నిప్పుకణికలా బయటికొచ్చిన నెహ్రూ కొన్ని విలువలు స్థాపించాడన్నాడు. ఆ తర్వాత భారత్‌లో విలువలు దిగజారాయన్నాడు. ప్రస్తుత లోక్‌సభ సభ్యుల్లో సగం మందిపై క్రిమినల్ కేసులున్నాయన్నాడు.

ఇంకేముంది.. విదేశాంగశాఖ మంత్రి సింగపూర్ హైకమిషనర్‌ని పిలిపించి నిరసన తెలిపినట్లు సమాచారం. సదరు సింగపూర్ ప్రధానికి "తప్పుడు" సమాచారం ఎవరిచ్చారో ఆరాతీస్తారట! బహుశా ఈ మోడీ వ్యతిరేక క్యాంపెయిన్ వెనుకున్న విదేశీశక్తుల "కుట్ర కోణం" కూడా పరిశోధిస్తారేమో!కాలంలో నెహ్రూ అవలంబించిన అన్ని చర్యలనూ అందరూ ఏకీభవించకపోవచ్చు. కాని ఆయన ఖచ్చితంగా ప్రజాస్వామ్యవాదే అనడంలో భిన్నాభిప్రాయాలకు తావేమీలేదు. పార్లమెంట్‌లో చర్చ తర్వాతే పంచవర్ష ప్రణాళికలు ప్రారంభమైనాయి. పార్లమెంటరీ చర్చ తర్వాతే ప్రభుత్వరంగం ఆవిర్భవించింది. దాన్ని నాడు వ్యతిరేకించింది ఒక జనసంఘ్ మాత్రమే. ప్రభుత్వరంగ నిర్వహణలో లోపాలుండవచ్చు. కానీ అవి వెనుకబడ్డ ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ఉపయోగపడ్డాయి. లక్షల కోట్ల రూపాయలు పన్నుల రూపేణా ప్రభుత్వాలకు వనరులందించాయి. మన సమాజంలోని వెనుకబడ్డ కులాలకు ఉపాధి దొరికింది. విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు చౌకగా ప్రజలందరికీ లభ్యమైనాయి. నీరు, రోడ్లు మొదలైనవి అందుబాటులోకి వచ్చాయి. ఇవన్నీ కేవలం నెహ్రూ గొప్పతనాలు కాదు. స్వాతంత్ర్యోద్యమ ఆకాంక్షలు. దీన్నే సింగపూర్ ప్రధాని "స్వాతంత్ర్యోదమ అగ్ని పరీక్షల్లో రాటుదేలిన వ్యక్తి నెహ్రూ" అన్నాడు. ఆనాటిది స్వాతంత్ర్యోద్యమమే కాదని బరితెగించి చెపుతున్న బీజేపీ నేతల గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టే కదా!? నెహ్రూ ఎక్కడున్నా ప్రతిపక్ష నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య సభలో మాట్లాడేటప్పుడు సభలోనే ఉండి పాయింట్లు రాసుకునేవారట! వంది మాగధులు బల్లలు చరుస్తుంటే.. అధినాయకుడు పరవశించిపోయే నేటి దశలో అవన్నీ ఊహించగలమా?! ఆర్.కె. లక్ష్మణ్ వంటి ప్రపంచ ప్రఖ్యాత కార్టూనిస్టుతో తనపైనే కార్టూన్లు వేయించుకునేవారట! కార్టూన్లకే జైళ్లు నోళ్ళు తెరుచుకునే నేడు ఆ విషయాలను ఊహించనైనా లేము. లాల్ బహుదూర్‌శాస్త్రిని నేడు బీజేపీ ఆకాశానికెత్తుతోంది. ఆయన కొడుకు నేడు యూపిలో బీజేపీ మంత్రి. లాల్‌బహుదూర్‌శాస్త్రి రైల్వేమంత్రిగా ఉండగా జరిగిన రైలు ప్రమాదానికి బాధ్యత వహిస్తూ పదవిని త్యజించారు. ఖిలారులో కార్మికులపై పోలీసు కాల్పులకు నిరసనగా కేంద్ర కార్మిక మంత్రి పదవికి వివి గిరి రాజీనామా చేశారు. ఈ విలువలు నేడు చూడగలమా?! కనీసం తమ సిట్ ఫైల్ చేసిన రిపోర్టులో దోషి అని తేలిన తరువాత కూడా ఆ వ్యక్తి తండ్రిని మంత్రివర్గంలో కొనసాగిస్తున్న బీజేపీ నుండి ఏ విలువలు ఆశించగలం. అందుకే ఇప్పుడు బీజేపీ మండిపోతోంది. సింగపూర్ ప్రధాని వారి పార్లమెంటులో ప్రసంగించిన సందర్భం ఏదైనా, మనదేశంలోని దాని టైమింగ్ బీజేపీకి ప్రమాదకరమైంది. దేశంలో జరిగే ప్రతి ప్రతికూల అంశానికీ నెహ్రూనే కారకుడన్నట్టు మోడీ ప్రచారం ఉధృతంగా సాగుతున్న తరుణంలో... దానికి తోడు బీజేపీకి చావోరేవో తేలే యూపీ ఎన్నికలు జరుగుతున్న సమయంలో... మరీ ముఖ్యంగా అక్కడ రేవుకి చేరే చాన్సేలేదన్న

దశలో ఆయన ప్రసంగం బయటికి రావడంతో మరి మండదా?! కీలకాంశం నెహ్రూ కాలంలో శాస్త్రీయ దృక్పథం పరిఢవిల్లింది. మోడీ శకం అశాస్త్రీయతకు ఆలవాలమవుతోంది. యూనివర్సిటీ స్థాయిలో భూతవైద్యం, జ్యోతిష్యశాస్త్రం వంటివి సబ్జెక్టులుగా ప్రవేశపెట్టి పట్టాలిస్తున్నారు. దేశంలో జరిగిన అనేక అభివృద్ధి కార్యక్రమాలు... అంటే ప్రాజెక్టులు, ప్రభుత్వరంగ పరిశ్రమలు, హరితవిప్లవం, శ్వేత విప్లవం, విద్యుత్ చట్టం, ట్రాన్స్‌పోర్టు చట్టం మొదలైన ఉన్న నెహ్రూ కాలంలోనే జరిగాయి. అవన్నీ జాతీయోద్యమ వారసత్వ సంపదలు. జాతీయోద్యమంతో ఏ సంబంధమూ లేని బీజేపీ చరిత్ర చక్రాన్ని వెనక్కి తిప్పే ప్రయత్నం చేస్తోంది. దాన్నే సింగపూర్ ప్రధాని స్పష్టంగా బయటపెట్టాడు. దినపత్రికల వార్తలే నిజమైతే... నాటి ఆయన మాట్లాడిన సందర్భం ఏమంటే సింగపూర్‌లో ఒక పార్లమెంటు సభ్యురాలు అబద్ధాలు ప్రచారం చేసినందుకు జరిమానా విధించారు. అది మోడీ శకంలో సాధ్యమేనా? వెనక్కి తెస్తానన్న నల్లధనమేమైంది? రైతుల ఆదాయం రెట్టింపేమైంది? ఏటా రెండు కోట్ల ఉద్యోగాలేమైనాయి. ఈ అబద్ధాలన్నిటికీ ఫైన్‌లు వేస్తే బీజేపీ ఎంత రుసుము చెల్లించాలో..?!

బుల్డోజర్ల తిరుగుబాటు...

కె.వెంకట్, పిహెచ్‌డి

అది ఒక విశాలమైన గ్రౌండు. ఆ గ్రౌండులోకి బుల్డోజర్లు, జేసీబీలు ఒక్కొక్కటిగా చేరుకుంటున్నాయి. ఆ చుట్టుప్రక్కల ప్రాంతాల నుండి అనేక బుల్డోజర్లు, జేసీబీలు వచ్చి చేరుకున్నాయి. ఇంకా అక్కడికి రాని బుల్డోజర్లను వెంటనే రమ్మంటూ సమాచారాలు పంపుతున్నాయి. వస్తున్న జేసీబీ, బుల్డోజర్స్‌తో అంతా హడావుడిగా, గొడవ గొడవగా ఉంది. మొత్తానికి కాసేపటికి అంతా సద్దు మణిగింది.

ఒక సీనియర్ బుల్డోజర్ ముందుకు వచ్చింది. సోదర బుల్డోజర్లు, జేసీబీలకు స్వాగతం! ఈ సమావేశానికి ఆహ్వానించగానే వచ్చినందుకు సంతోషం! ఇటీవల జరిగిన పరిణామాలు, మన భవిష్యత్ కార్యాచరణ గురించి చర్చించేందుకు ఈ సమావేశం ఏర్పాటుచేశాము! అన్నది.



ఇంతకూ విషయమేమిటో చెప్పండి!" అన్నది ఓ కొత్త జేసీబీ. దానికి ఇంకా రిజిస్ట్రేషన్ కూడా కాలేదు. తొందరెందుకూ చెబుతారు కదా!" అన్నది ఓ పాత బుల్డోజర్. "అన్నీ చెబుతాము. మీటింగ్‌కు పిలిచింది చెప్పటానికే గదా! ఇటీవలే పువ్వుగుర్తు పార్టీ ఎమ్మెల్యే చెప్పిన మాటలు మీరంతా విని ఉండొచ్చు. వాళ్ళ పార్టీ ఎంతో గొప్పగా పనిచేస్తోందని, వాళ్ళ పార్టీకి ఓట్లు వెయ్యకపోతే, ఊళ్ళలో నుండి వెళ్ళగొడతామని, ఇళ్ళ మీదికి బుల్డోజర్లు, జేసీబీలను నడిపిస్తామని ప్రకటించారు. దీనిపై మీ అభిప్రాయాలు తెలుసుకునేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేశాము" అన్నది అధ్యక్ష బుల్డోజర్.చాలా మంచిది. ఎమ్మెల్యేకు థ్యాంక్స్ చెప్పి మనం పని మొదలు పెడదాం!" అన్నది కొత్త జేసీబీ ఉత్సాహంగా. వెంటనే దాని తలమీద రెండు మూడు మొట్టికాయలు పడ్డాయి!

"ఒరేరు బుడ్డోడా! నీకు రిజిస్ట్రేషన్ కూడా కాలేదు! ఎందుకురా హడావుడి పడతావు. పెద్దవాళ్ళము అంతా ఉన్నాము కదరా!" అన్నది ఓ ఓల్డ్ బుల్డోజర్. "సమావేశం అంటారు! అభిప్రాయాలు చెప్పమంటారు! నా అభిప్రాయం చెప్పాను. ఇది ప్రజాస్వామ్యం కదా! నా అభిప్రాయం చెప్పే స్వేచ్ఛ లేదా!" అని ఎగిరిపడింది కొత్త జేసీబీ.

"చూశావా! సమావేశం పెట్టి, అభిప్రాయాలు అడగ్గానే నీకు స్వేచ్ఛ ఉందని, మాట్లాడే హక్కు ఉందని, ప్రజాస్వామ్యమని మాట్లాడుతున్నావు! మరి భారతదేశం కూడా ప్రజాస్వామ్య దేశమనీ, ఈ దేశ ప్రజలకూ ఓటు హక్కు ఉందని, నచ్చిన వారికి ఓటేసే స్వేచ్ఛ ఉందనీ మర్చిపోతే ఎలా?" అన్నది ఓ పాత జేసీబీ.

"గత ఐదేండ్లుగా ఉత్తరప్రదేశ్‌ను యోగి ఎంతో అభివృద్ధి చేశాడు. ఆ అభివృద్ధిని చూసి ఓటు వెయ్యమని కాస్త గట్టిగా అడిగే ప్రయత్నంలో ఓ మాట అని ఉండొచ్చు! అది తప్పెలా అవుతుంది!" ప్రశ్నించింది ఓ నడివయస్సు జేసీబీ. "తమను, తమ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిందీ, లేనిదీ, ఆ రాష్ట్ర ప్రజలు నిర్ణయించుకుంటారు! తమకు నచ్చిన వారికి ఓటు వేసే స్వేచ్ఛ ప్రజలకు ఉంది! కానీ, ఓటు వేయకుంటే ఊళ్ళో నుండి వెళ్ళగొడతామని, ఇళ్ళ మీదికి బుల్డోజర్లు నడిపిస్తామనే స్వేచ్ఛ ఎవరికీ లేదు! అలాంటి మాటలు బెదిరింపులే! ప్రజలను బెదిరించటం నేరం!" అన్నది మరో వడి వయస్సు జేసీబీ.ఉత్తరప్రదేశ్ చాలా అభివృద్ధి చెందింది. ఎన్నో కొత్త విమానాశ్రయాలు, రైల్వేస్టేషన్స్, కొత్త కొత్త గుళ్ళు, గోపురాలను యోగి నిర్మించారు. అంత గొప్ప అభివృద్ధి కేరళలో కూడా జరగలేదు!" అందుకే మళ్ళీ యోగి ప్రభుత్వాన్ని గెలిపించాలని అడగటంలో తప్పేముంది?" మళ్ళీ ప్రశ్నించింది కొత్త జేసీబీ.

"ఒరేరు బుడ్డోడా! నీవు వాట్సప్ చూడటం తగ్గించురా అంటే వినకపోతివి! చూడు ఎట్లా తయారయ్యావో! ఆ ఎయిర్‌పోర్టులు, రైల్వేస్టేషన్స్ అన్నీ ఫేక్‌రా! ఎక్కడెక్కడి దేశాల్లోని ఫొటోలు తెచ్చి వాట్సప్‌లో గుమ్మరించి అవి ఉత్తరప్రదేశ్‌లోనే కట్టినట్టు క్రియేట్ చేస్తున్నారు! వాస్తవాలు తెలుసుకుని మాట్లాడు!" అన్నది మరో మధ్య వయస్సు జేసీబీ. "ఉత్తరప్రదేశ్‌లో అభివృద్ధి ఏమిటో గంగానదిలో కొట్టుకుని పోయిన శవాలు చెబుతాయి!" అన్నది మరో కొత్త జేసీబీ.

"అధికారంలోకి రాకముందు రాములవారి గుడి, హిందువుల అభివృద్ధి, చైనా దాడులు, పాకిస్థాన్ పేరు చెప్పి ఓట్లడిగారు! అప్పుడు కూడా మాకు ఓట్లేయ్యకపోతే మీ ఇళ్ళమీదికి బుల్డోజర్లు నడుపుతామని అంటే వాళ్ళు అధికారంలోకి వచ్చేవారా? అంటే అధికారంలోకి

రాకముందు ఒకలా, వచ్చాక మరొకలా ఉంటారా? ఇదేమి పద్ధతి?" ప్రశ్నించింది మరో బుల్డోజరు.

"ఓట్లేయమని అడుక్కోవాలి గాని, బెదిరిస్తారా? ఇది ప్రజాస్వామ్యమా? లేక నిరంకుశమా?" అన్నది మరో జేసీబీ.

"ఐనా! ప్రజలను బెదిరించటానికి ఇంతకు ముందు రౌడీలను, గూండాలను వాడుకునేవారు! ఇప్పుడేమో మనలను ప్రజలకు మీదికి నడిపిస్తానంటారా? మనలను వాడుకునే హక్కు వారికెవరు ఇచ్చారు?" గట్టిగా ప్రశ్నించింది మరో జేసీబీ.

"మన ఆలోచనలు, అభిప్రాయాలు తెలుసుకోకుండా మనలను ప్రజలపైకి నడిపిస్తామని ఆ ఎమ్మెల్యే ఎలా చెబుతాడు? అసలు ఈ పాలకులు మనలను ఎప్పుడూ ప్రజలకు వ్యతిరేకంగా వాడుకుందామని చూస్తారెందుకు? రోడ్ల విస్తరణ పేరిట రోడ్డు మీద చిన్న డబ్బాలు వేసుకుని బతికేవారి మీదకు మనల్ని పంపిస్తారు!" అన్నది ఓ బుల్డోజర్.

"అక్రమ కట్టడాలు అంటూ, పేద గుడిసెలు కూలుస్తారు గాని, పెద్ద పెద్ద బిల్డింగులు ఎప్పుడైనా కూల్చమన్నారా? పేదల గుడిసెలు మనతో కూల్పించేసి, పెద్దల బంగళాలు రెగ్యులైజు చేస్తారు? ఇదే ప్రజాస్వామ్యమా?" ప్రశ్నించింది మరో సీనియర్ జేసీబీ.

"సమాజంలో తయారయ్యే ఏ సరుకైనా ప్రజల మేలుకు ఉపయోగపడాలి గాని, ప్రజల నాశనానికి కాదు! మనం కూడా అంతే! ప్రజల మేలుకు పనికి వచ్చే మనలను ప్రజలపైకే నడిపిస్తామని అంటే మనం సహించే ప్రశ్నే లేదు! అందుకే అవసరమైతే మనలను ప్రజల ఇండ్లపైకి నడిపిస్తామని ప్రకటించిన ఎమ్మెల్యే ఇంటిమీదికే పోదాము. అతడినే ఊళ్ళో నుండి వెళ్ళగొట్టి శాంతిభద్రతలు కాపాడుదాం! ఇదే ఈ సమావేశంలో నేను పెడుతున్న తీర్మానం!" అని తీర్మానం పెట్టింది అధ్యక్ష బుల్డోజర్.

"ఈ తీర్మానానికి ఓటింగ్ అవసరం లేదు! అంతా ఏకగ్రీవమే! తక్షణమే ఈ తీర్మానం అమలు చేద్దాం!" అంటూ ముందుకు కదిలింది! రిజిస్ట్రేషన్ కాని కొత్త జేసీబీ. "పదండి ముందుకు! పదండి తోసుకు" అని నినాదాలుచేస్తూ బుల్డోజర్లు, జేసీబీలు ముందుకు కదిలాయి.

ఎవరు బాధ్యులు..?

అది 1981... అంటే నలభై ఏళ్ల క్రితం... బెంగాల్‌లోని డార్జిలింగ్ జిల్లా... ఓ హత్య జరిగింది... పోలీసులు ఓ నేపాలీ వ్యక్తిని అరెస్టు చేశారు... ఆయనే హంతకుడు అని స్టాంపేశారు... సాక్ష్యాలదేముంది..? అన్నీ వచ్చేశాయి... చార్జిషీటు కూడా వేసేశారు... ఆ నేపాలీ పేరు దీపక్ జైషి... అప్పట్లో ఎంత మొత్తుకున్నాడో తెలియదు... ఎవరూ వినిపించుకున్నవారు లేరు... అసలు తనను తీసుకుపోయి ఓ హత్య కేసులో జైలులో పడేశారు అనే సంగతే తనవాళ్లకు తెలియదు... ఏమైపోయాడో నేపాల్‌లోని వాళ్ల సంబంధీకులకు అర్థం కాలేదు... ఏళ్లు గడుస్తూనే ఉన్నయ్... మన పోలీస్ వ్యవస్థ, మన జైళ్లు, మన న్యాయవ్యవస్థల గురించి పదే పదే చెప్పుకునేది ఏముంది..? ఆ న్యాయదేవత ఎత్తిపట్టుకున్న ఆ ధర్మఖడ్గం నిండా తూట్లే కదా... ఈ జైషి గురించి అడిగేవాళ్లు లేరు... క్రమేపీ కేసు పెండింగ్ పడిపోయింది... జైలులో జైషి కాలం ఈడుస్తూనే ఉన్నాడు... ఏళ్లు గడిచిపోయినయ్... ఎన్నేళ్లు తెలుసా..? అక్షరాలా నలభై ఏళ్లు... షాక్ తినకండి... నలభై ఏళ్లుగా ఆ కేసు పెండింగే... ఆగండి... ఇంకా ఉంది... మనం మరింత ఏడ్వడానికి ఈ కథలో ఇంకొన్ని ఉద్వేగాలు, కన్నీళ్లు కూడా ఉన్నయ్.

నిజానికి ఆ హత్య కేసులో... తనంతట తనే మొదటి విచారణలోనే నేరం అంగీకరిస్తే... తనకు యావజ్జీవం గనుక పడి ఉంటే. రెమిషన్లు గట్రా కలుపుకుని ఏ పదీ పన్నెండేళ్లలోనే బయటికొచ్చేవాడు. బతుకుజీవుడా అని నేపాల్ వెళ్లిపోయేవాడు... కానీ అలా జరిగితే ఇక కథేముంది..? నేపాల్‌కే చెందిన మరొకాయన ఆమధ్య ఈ జైషి ఉన్న డమ్ డమ్ సెంట్రల్ జైలుకు వచ్చాడు... తను ఇచ్చిన సమాచారం ద్వారా హ్యామ్ రేడియో ఆపరేటర్లు కొందరు జైషి ఉనికిని సరిగ్గా కనుక్కున్నారు... నిజమే... సినిమాటిక్ కాదు... జైషి బంధువులకు తెలిశాక నేపాల్ ప్రభుత్వాన్ని కంటాక్ట్ చేశారు ఈమధ్యే... మావాడిని అక్రమంగా, దశాబ్దాలుగా విచారణ కూడా దిక్కులేకుండా నిర్బంధించారు అని మొత్తుకున్నారు. ఈ వార్త ఎక్కడో చదివిన కలకత్తా హైకోర్టు చీఫ్ జస్టిస్ కదిలిపోయి ఓ లాయర్‌ను పిటిషన్ వేయాలని సూచించాడు... అయ్యా, సదరు విచారణ ఖైదీని విడుదల చేసి, నేపాల్‌కు పంపించేయండి, ఇదీ కథ అంటూ ఓ పిటిషన్ దాఖలైంది కొద్దిరోజుల క్రితం.

ఈలోపు తెలిసింది ఏమిటయ్యా అంటే..? సదరు ఖైదీ మెంటల్ కండిషన్ అస్సలు బాగాలేదు అని... అప్పుడెప్పుడో జైలులోకి వచ్చిన కొత్తలో... 1982లో పరీక్షలు జరిపారట... అప్పుడే ఆయన మానసిక స్థితి బాగాలేదని గుర్తించారట... ఐనాసరే, ఇన్నేళ్లలో తన ఆరోగ్యం గురించి పట్టించుకున్న నాథుడే లేడు... ఇప్పుడు తన పరిస్థితి ఏమిటీ అంటే..? తన నేటివ్ ప్లేస్ ఎక్కడో తనకు తెలియదు... మెమొరీ మొత్తం కోల్పోయాడు... ఆయన్ని పరీక్షించిన కలకత్తా యూనివర్శిటీ నిపుణులు "తొమ్మిదేళ్ల మెంటల్ ఏజ్‌లో ఉన్నాడు" అని చెప్పారు... అంటే ఇన్నేళ్ల జీవితం పోయింది, ఆరోగ్యం పోయింది... సత్యనాశ్... ఇప్పుడు వయస్సు 70 ఏళ్లు... చివరకు ఏం తేల్చారు..? "ఈయనపై పెట్టిన కేసు విచారణ కూడా ఇక శుద్ధ దండుగ... విచారణ ఎదుర్కొనే స్థితిలో ఆయన లేడు..." దాంతో అరుదుగా వినియోగించే విశేష అధికారాల్ని వాడి హైకోర్టు ఆయన విడుదలకు ఆదేశించింది. (Section 482 of the Code of Criminal Procedure (inherent powers of high court) and Articles 226 and 227 of the Constitution) అంతేకాదు... జైషిని తిరిగి నేపాల్‌లో వాళ్ల బంధువులకు అప్పగించాలని, ఈమేరకు నేపాల్ కాన్సులేట్, హైకోర్టు రిజిస్ట్రార్ కోఆర్డినేట్ చేసుకోవాలని తీర్పు చెప్పింది... బాగుంది... కానీ ఓ ప్రశ్న సశేషం... జవాబు లేనిది కూడా... ఒక వ్యక్తి కోల్పోయిన నలభై ఏళ్ల జీవితానికి పరిహారం ఏమిటి..?

తెర

వేటూరి వైభవం,,

కొడుకుల వాసుశ్రీ

శృంగారగీతాల రచనలో వేటూరిది ప్రత్యేకమైన శైలి. రసరమ్య గీతాల నుంచీ, నాటు పాటల వరకూ ఏ రకమైన శృంగారగీతాలు రాసినా ప్రతి పాటలోనూ ఎంతో కొంత కవిత్వం, సౌందర్యదృష్టి చొప్పించే శైలి అది. ఈ శృంగార గీతాల్లో పదుగురితో పంచుకునేవి కొన్ని, సన్నిహితులతోనే పంచుకోవాల్సినవి కొన్ని, ఎవరికి వారే ఆస్వాదించాల్సినవి కొన్ని! ఇదంతా నిన్న స్వరాభిషేకంలో జేగంటలు సినిమాలో వందనాలు..వందనాలు "పాట విన్న తరువాత కలిగిన అనుభూతి. అభిరుచి కల్గిన నిర్మాత యువచిత్ర మురారి గారు. ఎన్నో మంచి గీతాలు వేటూరి చే రాయించి మనలను అలరించారు. హీరో రాంజి హీరోయిన్ ముచ్చర్ల అరుణ మొదటి సినిమా. దర్శకుడు సింగీతం, సంగీతం మామ మహదేవన్ ..వేటూరి కలంకి ఇంక అడ్డేముంది.. పాడినది బాలు సుశీలమ్మ..ఎంత మధురంగా జీవం పోసి పాడారో ఓ సారి విని అనుభవించాలిసిందే.. నలభై ఏళ్ళ కిందటి పాట నేటికీ పదారణల తెలుగు పిల్లే ఈ గీతం..



"వందనాలు..వందనాలు..

వలపుల హరిచందనాలు
వెన్నెలలో వేచి వేచి వెచ్చనైన..
నా స్వామికీ వందనాలు..
వందనాలు ..వందనాలు..
వలపుల హరిచందనాలు
కన్నులలో నీరు నిల్చి చల్లనైన...
నా దేవికీ వందనాలు...
ఈ కన్నే కోపాలు.. వెన్నెల్లో దీపాలు..
ఆ ముద్దు మురిపాలు.. ఏ పొద్దు సగపాలు..
ఈ కంటి నీలాలు... ఆ కంట పొంగితే
సురగంగ నీరాల.. సరిగంగ తానాలు
ఈ చుక్క రాకతో నవరాత్రి నవ్వనీ...
ఈ ఒక్కరాతిరి తొలి రాతిరవ్వనీ...
కలలన్నీ కలయికలే ...
కలుసుకొనే కౌగిలిలో...
సంపెంగ పూలలో ..నా బెంగ దాచాను
సన్నజాజి నీడలో ..ఈ నోము నోచాను
ఏకాంత సేవకే.. ఇన్నాళ్ళు వేచాను
ఏకాంత వేళలో.. నీ చెంత చేరాను
నీ ప్రేమ కౌగిలే రామయ్య కోవెలా
ఈ లేత వెన్నెలే జాబిల్లి దీవేనా
మనసులనే మనువాడే..
వలపులనే వయసులలో

.... తెలుగు పదాలే పులకించి పోయాయి.. జయదేవుని అష్టపదిలా లేదు వేటూరి శృంగార వెన్నెల... ప్రియురాలి కోసం వేచి చూస్తే విరహమే అది వెన్నెలలోనైనా వేడి పుట్టిస్తుంది మరి లోపల వేడికి వెన్నెల వేడి తోడైతే వెచ్చబడి పోవడమె ..పల్లవిలోనే వేడెక్కించేసారు గురూజి. కళ్ళలో నీరు నిలిచిపోయి ఆమే చల్లగా ఉందట.. అబ్బాయిగారి వేడిని ఆర్పటానికన్నమాట.. స్వామి దేవి అని సంభోదించి రాధాకృష్ణులను చేసేసారు..కన్నె కోపాలు వెన్నెల్లో దీపాలన్నారూ..ఈ వెన్నెల అంటే వేటూరికి గొప్పగురి.. మంచుపల్లకిలో ఓ పాటలో వేకువఝామున వెన్నెల మరక అని ఉండిలేనట్లు అన్నమాట ఈ దీపాలకోపాలన్నమాట.. ప్రేమ అలకలు అంతే కదా! ఆ ముద్దుల మురిపాలు పొద్దు గూకిన నుండి పొద్దెక్కె వరకూ ఉంటాయి మరి మరి ఏ పొద్దు వేళని చెప్పను అని... సురగంగ శివుడి తలపై ఉంటుంది..సరిగంగ స్నానాలు మనం చేస్తాం... వేటూరి చమత్కారమంతా ఇక్కడ తెలుస్తుంది" ఈ చుక్క రాకతో నవరాత్రి " నవరాత్రులు పర్వదినాలు.. శరన్నవరాత్రులైన వినాయక రాత్రులైన ఓ తిథి నుండే మొదలు పాడ్యమి నుండి దశమి వరకు చుక్క అంటే నక్షత్రం అనుకొంటే నవరాత్రులు,.ప్రేమికుల భాషలో చుక్క అంటే ప్రియురాలు రాకతో నవ అంటే కొత్త అనే అర్థం.. ఇక కొత్త రాత్రులు మొదలని.. పూలంటే వేటూరికీ మక్కువే అందుకే సంపెంగ పూలలో నా బెంగ దాచాను అని ఆమే బిడియపడుతోం ది.. సన్నజాజి నీడ అంటే పందిరి కింద. ఈ నోము నోచానూ అంటే సంగమమం. ఏకాంత సేవకే వేచి చూసి నీఈ కాంత చెంత చేరాను అని సరిగ్గా వింటే బాలు గొంతులో మనకి ఈ కాంత అనే వినిపిస్తుంది.. ప్రేమ కౌగిలిని రాములోరి కోవెలతో పోల్చి సీతారాములను చేసారు..లేత వెన్నెల అంటే జీవిత పయనం ఆరంభం జాబిల్లి దీవెన తో ముగించారు.. పలు ప్రక్రియల ద్వారా తెలుగు భాషని పరిపుష్ఠం చేసి, పద సంపద పెంచి, భిన్నమయిన సాహితీ ప్రక్రియలతో మనల్ని అలరించి, ఆలోచనామృతం చిలికించి, తెనుగు తల్లికి అక్షరార్చన చేసిన ,,అక్షర అర్చకులు వేటూరి .. మాతృబాషా దినోత్సవ వేళ వేటూరిని స్మరించుకోవడం మన అదృష్టమే..

సావిత్రిబాయి ఫూలే ఆకాశంలో వెలుగుతున్న నీలి నక్షత్రం

రంగు రంగుల ప్రపంచం. శృతి ఎక్కడో తప్పుతుంది. విశ్వమంతా ఒక లయలో ఉంది. ఆ సముద్రంలో విద్యుద్దీపాల నావ ఒకటి ప్రయాణం లో ఉంది. ప్రయాణమేదైనా అనంత జ్ఞానమే. నావ కదిలే కొలదీ చూపుల్లో దీపాల కాంతుల రూపాలు మారుతున్నాయి. ఒడలోని నావికునికి సుదీర్ఘమైన తీరం ఆబాసగా ఉంది. నావలోని జనమంతా ఒక కుటుంబమే. కుల, మత, లింగ బేధాలను అలలు తుడిచివేశాయి. నిజానికి! సముద్రమొక విశ్వవిద్యాలయం. సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు నావలో మనల్ని పలకరించి వెళతాయి. విశ్వం మనతో చెలిమి చేస్తుంది. మనం నీటిమీద వెలుతుంటాము. వాయువుతో శ్వాస ,వెలుగుతో చెలిమి, శూన్యంతో ముచ్చట్లు. ఒడ్డు కోసం ఆరాటం. నిజానికి సుదీర్ఘ నావ ప్రయాణికులంతా ఖండ ఖండాంతరాలను కనుగొన్నవారే. అమెరికా కూడా ఒక నావికుని దృశ్య కన్యే. ఔను!జీవితం సముద్రమంత విశాలమైనదే. ఎన్నో ఆటు పోట్లు సుడిగుండాలు దాటుకుని నడుస్తుంది. అనేకానేక మానసిక భావాలు సంఘర్షణలో ఉన్నాయి.

డా॥ ఆదే.బుజ్జి
అంబేద్కర్ రీసెర్చ్ సెంటర్.
బాపట్ల, గుంటూరు.(జిల్లా)
9441722414

ఏది ప్రత్యక్షం?
ఏది అప్రత్యక్షం?
ఏది అభివ్యక్తి?
ఏది అభివ్యక్తి శూన్యం?
ఏది ప్రశ్న?
ఏది తత్త్వం?

ఈ ఘర్షణ నుంచే హెగెల్ పుట్టాడు. మార్క్స్ పుట్టాడు. అంబేద్కర్ పుట్టాడు. సావిత్రిబాయి ఫూలే పుట్టింది. నిరక్ష్యరాస్యుల మేదడుల్లో దీపాలు వెలిగించింది. బాల్య వితంతువుల్ని ఆకాశ నక్షత్రాలను చేసింది. స్త్రీ మాటల్లోని తేనె ధారల్ని ప్రపంచానికి అందించింది.

సావిత్రిబాయి ఫూలే భారత తొలి మహిళా విద్యా దాత. ఆమె వసివాడని మోదుగపువ్వు. ఆకాశంలో వెలుగుతున్న నీలి నక్షత్రం. అనేక భావాలకు వారధులు లేవు. ఆ గొర్రెలు కొండమీద వరుసగా ఎక్కుతున్నాయి. సింహగర్జన వినపడినా వాటి కళ్ళల్లో బెదురు లేదు. సమూహానికి ఉన్న శక్తి అది మరి. జీవితం అంటే పూర్తిగా వినోదం కాదు. అది అనుభూతం చేసుకోవాల్సింది చాలా ఉంది. భావన అనేది చాలా లోతైంది. భావనలో జ్ఞానం ఉంది. భావనలో చింతన ఉంది. భావనలో చిత్రం ఉంది. భావనలో రసాయన చర్య ఉంది. భావించడమే లేని. మనుషులు శిలాకృతులు. చాలామంది ఆలోచించడం, భావించడం,సంచలించడం, మార్పు చెందడం, సంఘర్షించడం మానివేశారు. మనిషి వాడిన పూల లాంటి వాడు!? మనో వికాసం. నూత్న భావజాల సృష్టికి మూలం. సృజన మానవునికి ప్రాణం. కవిత్వం వొక ఆయువు. కవిత్వంలో తత్త్వం జీవనమార్గం. కవిత్వమంటే భావనా చాతుర్యమేకాదు జీవనసౌరభం. 'ఖలీల్ జిబ్రాన్ 'ప్రేమ అనే సౌగంధికా సౌధాన్ని నిర్మించాడు. 'వర్డ్స్ వర్త్ 'గడ్డి పువ్వు నుండి నక్షత్ర మండలాన్ని శిల్పించాడు. 'షెల్లీ ' జీవన ఘర్షణలో నుండి వెలుగు రవ్వల దివ్వెలు వెలిగించాడు. 'బైరన్ ' విరాగ రాగ మందిరం సృష్టించాడు. అనుకరించేవాడెప్పుడూ అబలుడే. శ్రామికుడు ఒక్కడే సృష్టించగలడు. కవితా సృష్టి కూడా ఒక బౌద్ధిక శ్రమే. అందుకే జాషువా ఇప్పటికీ మనల్ని పలకరిస్తున్నాడు.

ఔను!రాజ్యం వధ్య శిలగా మారింది! తెగిన మొండేల శిరస్సులు ధ్వనిస్తున్నాయి. ఆ మంటల్లో కాలిన స్త్రీ వేసిన కేక సింహాసనాన్ని బద్దలు చేస్తుంది. పాలకుడు హిమాలయాల మీద నిలబడి భగవద్గీత చెబుతున్నాడు! నాగాలాండ్ లో వదించబడిన శ్రామికుడు పాలకునికి చరమగీతం పాడుతున్నాడు. కాశ్మీరం నడి బొడ్డులో నియంతృత్వం నృత్యం చేస్తుంది! కాశీలో వెలుగుతున్న దీపాల వెనుక హత్యోదంతాలు ఉన్నాయి! నరకబడిన వారంతా వీరులే. కోరేగ్రామ్ స్థూపం వీరసైన్యానికి పిలుపునిస్తుంది. దళితులెప్పుడూ సైనికులే. పలనాడు కన్నమనీడు కత్తి మరో సారి పదునుతేలుతుంది. కాశీ చండాలుర రాజ్యమే. హరిశ్చంద్రుడు అందుకే వీరబాహుని కల్లు కుండ మోసాడు. కాలుతున్న శవం తత్త్వ శాస్త్రం చెప్పింది. కాల్చే వాడెప్పుడూ తాత్త్వికుడే. మరణం అంటే భయపడేదే బ్రాహ్మణ్యం. మరణాన్ని జయించినవాడే దళితుడు.

దళితోద్యమ నిర్మాత, మహాకవి కత్తిత పద్మారావు

ICSR సీనియర్ రిసెర్చ్ ఫెలో ,

న్యూ ఢిల్లీ.

3 - 01 - 2022

లుంబినీవనం, అంబేద్కర్ రిసెర్చ్ సెంటర్,

అంబేద్కర్ కాలనీ, పొన్నూరు పోస్ట్, గుంటూరు జిల్లా, ఆంధ్ర ప్రదేశ్. ఫోన్:9948748812, 9849741695.

వేటూరి ప్రభాకర శాస్త్రి గారి జయంతి సందర్భంగా

విజ్ఞాన వటవృక్షం వేటూరి

శ్రీ

ప్రజ్ఞాప్రభాకరుడిగా తెలుగునాట కోటి వెలుగులు వెదజల్లిన మహోన్నతమూర్తి వేటూరి ప్రభాకర శాస్త్రి. కవి, పండితుల కుటుంబం. సాహిత్యం, సంగీతం, వైద్యం వేటూరివారి ఇంట్లో, ఒంట్లో ప్రకాశమానమై కోటి ప్రభలుగా ప్రభవించాయి. పన్నెండవ ఏటనే పద్యములల్లిన పుట్టుకవి.పండితుడు,కవి, పరిశోధకుడు, పరిష్కర్త, చరిత్రకారుడు, విమర్శకుడు, నాటక రచయిత. వీటన్నింటిని మించి గొప్ప యోగ సాధకుడు. అటు సాహిత్యంలోనూ, ఇటు యోగాభ్యాసంలోనూ ఎందరికో గురువు, గురువులకే గురువు వేటూరి. జీవించింది ఆరుపదుల కాలమే అయినా, అనంతకాలంలో నిలిచేపోయే అద్భుతమైన కృషి చేసిన ఆంధ్ర తేజం. ఆయన ముట్టని కొమ్మలేదు,పట్టిన ప్రతి కొమ్మకు చేవను అందించిన ధీశాలి. సంస్కారణా శీలి. వేటూరి ప్రభాకర శాస్త్రి అనగానే అన్నమయ్య,జాను తెనుగు, చాటువులు గుర్తుకువచ్చి తీరుతాయి.ఎన్నో మహా గ్రంథాలను వెలికితీసి, పరిష్కరించి, ప్రపంచానికి అందించిన పుణ్యజీవి. ఈరోజు అన్నమయ్య గురించి మనం మాట్లాడుకుం టున్నామంటే, ఆ కీర్తనలు వింటున్నామంటే, పాడుకుంటున్నామంటే.. అదంతా ప్రభాకరశాస్త్రి చలువే. ఈ లోకం అన్నమయ్యను దాదాపు 400ఏళ్ళపాటు మరచిపోయింది.ఆ సాహిత్యం మన స్మృతిపథం నుంచి వెళ్ళిపోయింది.తిరుమలలో నేలమాళిగలలో దాగివున్న ఆ జ్ఞాన భాండాగారాన్ని, రాగిరేకుల్లో ఒదిగివున్న ఆ అనంత సంపదను బయటకు తీసి పుణ్యం మూట కట్టుకున్న ధన్యజీవి.



వందల ఏళ్లనాటి ఆ కీర్తనలను పరిష్కరించి, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ వంటి మహనీయులకు అందించారు.వాటిని రాళ్లపల్లివారు స్వరపరచి, ప్రపంచానికి పరిచయం చేశారు. అలా మొదలైన అన్నమయ్య పదాల స్వరరచనా యజ్ఞం అనేకమంది మహామహుల చేతిలో అఖండంగా సాగింది. సాగుతోంది.నేడు ఇంటింటా అన్నమయ్య పేరు వినిపిస్తోంది. ఆ సాహిత్యానికి వ్యాఖ్యాన పరంపరలు మొదలయ్యాయి. తరతరాలకు ఆ సారస్వతం చేరువయ్యింది. ఈనాడు పదకవితా పితామహుడిగా అన్నమయ్యను జాతి కొలుచుకుంటోంది.ఈ పుణ్యానికి పునాదులై నిలిచిన ప్రభాకరశాస్త్రిని గుండె గుడిలో నిలుపుకొని కొలుచుకోవాలి. తిరుమల తిరుపతి దేవస్థానానికి ఎందరు చైర్మన్లు, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు సేవలందించినా, అందరిలోనూ అగ్రేసరుడు చెలికాని అన్నారావు.తిరుమల నాయకుని సేవలో, అన్నమయ్య ప్రచారంలో వీరి పాత్ర విశిష్టమైంది.ఇంతటి చెలికానివారు వేటూరి ప్రభాకరశాస్త్రిని గురువుగా, మార్గదర్శిగా, హితునిగా, సన్నిహితునిగా భావించి, గౌరవించేవారు. ప్రభాకరశాస్త్రికి గురుపరంపర కూడా చాలా ఎక్కువ. తండ్రి సుందరశాస్త్రి తొలి గురువు.మద్దూరి రామావధాని మలి గురువు. శాస్త్రములలో తీర్చిదిద్దిన గురువు అద్దేపల్లి రామనాథశాస్త్రి. సాహిత్య, కవిత్వ లోకంలో విహరించడానికి ప్రభావితం చేసిన గురువు చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి. యోగవిద్యా గురువు మాస్టర్ సి వి వి. ఇందరు సద్గురువుల సన్నిధిలో అభ్యాసం చేసిన కృషి ఊరికే పోలేదు.అబ్బిన ఆ సంస్కారం ఊరికే ఉండనివ్వలేదు. తాను కూడా సద్గురువుగా అవతరించి ఎందరికో మార్గదర్శనం చేసే సౌభాగ్యాన్ని దక్కేలా చేశాయి. జంటకవులుగా జగత్ ప్రసిద్ధులైన తిరుపతి వేంకటకవులను, కొప్పరపు కవులను ఒకరినొకరికి పరిచయం చేసినవారిలో తొలివరుసలోనివారు ప్రభాకరశాస్త్రి. నాడు మద్రాస్ లో జరిగిన కొప్పరపు కవుల అనేక అవధాన,ఆశుకవిత్వ సభల్లో ప్రభాకరశాస్త్రి పాల్గొన్నారు. కొప్పరపువారి అసమాన శేముషికి అమితాశ్చర్యం చెందారు. బందరులో ఉన్న తన గురువు చెళ్ళపిళ్ళకు కొప్పరపుకవుల అనన్య ప్రతిభను పద్యాలలో వర్ణిస్తూ,ఉత్తరం రాసి పంపారు. అది చూసిన చెళ్ళపిళ్ళ కొప్పరపువారిపై నాటి పత్రికలకు వ్యాసాలు రాశారు. పద్య నవరత్నాలు రాసి, కొప్పరపువారికి పంపారు. చెళ్ళపిళ్ళవారి తీరుకు మురిసిపోయిన కొప్పరపువారు కూడా ప్రతిస్పందనగా,నవరత్నాలు రాసి,చెళ్ళపిళ్ళకు పంపారు. సాహిత్యలోకంలో తిరుపతి వేంకటకవులు –కొప్పరపు కవుల వివాదాలు ప్రసిద్ధం. కానీ, ఈ అద్భుతమైన పరిచయపర్వం పెద్దగా ఎవ్వరికీ తెలియదు. ఈ జంటల వివాదాల సందర్భాల్లో ఏ ఒక్కరి పక్కనా నిలువక, ఉభయుల వైపు సమానమైన గౌరవం చూపించినవారిలో ప్రభాకరశాస్త్రి ప్రధానులు. మనుషులను విడదీసేవాళ్లు చాలామంది ఉంటారు.కలిపేవారు అరుదుగా ఉంటారు.ఆ అరుదైన అనురాగమూర్తి ప్రభాకరశాస్త్రి. శ్రీనాథుడు మొదలు ఎందరో మహాకవుల చాటువులను సేకరించి, పరిష్కరించి "చాటుపద్య మణిమంజరి"గా గ్రంథస్థం చేసిన ఘనత వేటూరిదే. ఈ పుణ్య విశేషం వల్ల, ఆ పద్యాలన్నీ మనం చదువుగలుగుతున్నాం.అనర్ఘ పద్యరత్నాలను తరతరాలకు బహుకరించిన జ్ఞానదాత వేటూరి. ముఖ్యంగా, శ్రీనాథుడుపై వీరు చేసిన కృషి విశిష్టమైంది. తెలుగు భాష

ప్రాచీనతను మూల్యాంకనం చేయడానికి ప్రభాకరశాస్త్రి చూపిన తోవ గొప్పది. వారు సేకరించిన తాళ పత్రాలు, కనిపెట్టిన శాసనాలు మనకు ఎంతో ఉపకరించాయి. అమరావతిలోని ఒక శాసనంలో " నాగబు" అనే ఒక పదం ఉంది. అది రెండువేల ఏళ్లనాటిదని పరిశోధకుల అభిప్రాయం. దీన్ని తొట్టతొలిగా కనిపెట్టింది వేటూరివారే. ఈ పదంపై ఇంకా వివాదాలు ఉన్నాయి. అవి తేలాల్సి ఉంది. అది వేరే విషయం. మద్రాస్‌లో ఉపాధ్యాయుడిగా, ప్రాచ్య లిఖిత భాండాగారంలో పండితుడు, పరిష్కర్తగా వీరు చేసిన సేవలు అమూల్యం. అనేక తెలుగు గ్రంథాలను చారిత్రక ఆధారాలతో సవివరంగా పరిష్కరించి ప్రకటించారు. తెలుగు సాహిత్యానికే కాక, చరిత్ర, సంస్కృతి పరిరక్షణకు సైనికుడిలా పనిచేశారు. ఎన్నో అనువాద రచనలు కూడా చేశారు. సంస్కృతం, పాకృతంలోనూ వీరి పాండిత్యం అమోఘం. అన్నమయ్యతో పాటు తొలి తెలుగు రచయిత్రిగా చెప్పుకునే తిమ్మక్కను కూడా ఈయనే వెలుగులోకి తెచ్చారు. ప్రభాకరస్మారిక, చాటుపద్య మణిమంజరి, క్రీడాభిరామం, శృంగారశ్రీనాథం, రూపకమంజరి, భాసుని ప్రతిమా నాటక అనువాదం, మీగడ తరకలు, ఆంధ్రకామందకం, గౌరీ కళ్యాణం మొదలైనవి ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటు వారు రాసిన పీఠికలు కూడా పుస్తకాల రూపంలో భద్రంగా ఉన్నాయి కర్ణభారం, నాగానందం మొదలైనవి కూడా ఎన్నో ఉన్నాయి. వీరు రచించిన వాటిలో "దివ్య దర్శనం" అనే లఘుకావ్యం నిజంగానే దివ్య దర్శనం. దుర్గాదేవి దర్శన స్పర్శనలతో ఈ లఘుకావ్యం రాసినట్లుగా పండిత, ఆధ్యాత్మిక లోకంలో ప్రసిద్ధం. యోగ, ఆధ్యాత్మిక మార్గాలలో నడచినా, మొదటి నుంచీ మూఢ విశ్వాసాలను ఖండిస్తూనే వచ్చారు. సమతావాదంతోనే నడిచారు. సంఘ సంస్కరణలకు పెద్దపీట వేశారు. లెనిన్, మార్క్స్‌ను మించిన విప్లవకారుడు మహాత్మాగాంధీ అని, ప్రభాకరశాస్త్రి అనేవారు. వేటూరివారు చదివిన, వినిన, పరిష్కరించిన గ్రంథాలలోని విషయాలన్నీ ఆయనకు కరతలామలకమే. అంతటి జ్ఞాపకశక్తి ఆయన సొత్తు. సుప్రసిద్ధుడైన విస్సా అప్పారావు వీరికి వియ్యంకుడే. ప్రభాకరశాస్త్రి బందరులో చదువుకున్నప్పుడు కొండా వెంకటప్పయ్య, వల్లూరి సూర్యనారాయణరావు ఇంట్లో ఉండేవారు. ముక్త్యాల సంస్థానంతో ఎంతో అనుబంధం ఉండేది. ప్రఖ్యాత సినిమా గేయ రచయిత వేటూరి సుందరరామ్మూర్తికి ప్రభాకరశాస్త్రి సొంత పెదనాన్న. సుందరరామ్మూర్తి తన చిన్ననాట, పెదనాన్న నుంచి ఎన్నో అంశాల్లో ప్రేరణ పొందారు. ముఖ్యంగా అచ్చతెనుగుదనం, వాగ్గేయకార ప్రభావం ప్రభాకరశాస్త్రి నుంచి ప్రేరణ పొందినట్లుగా సుందరరామ్మూర్తి చెప్పుకునేవారు. నాటి సమకాలిక మహాకవి, పండితుల విశేషాలు కూడా ప్రభాకరశాస్త్రి నుంచి సుందరరామ్మూర్తి గ్రహించారు. సుందరరామ్మూర్తిపై విశ్వనాథ సత్యనారాయణ ప్రభావం ఎంత ఉందో, అంతకు మించిన ప్రభావం పెదనాన్న నుంచి ఉంది. యోగిపుంగవుడు, నిత్య పరోపకార చింతనాపరుడు, విజ్ఞాన వటవృక్షం వేటూరి ప్రభాకరశాస్త్రి.

జిందాల్ చేతిలోకి ఉక్కు పగ్గాలు...?

ఏపీకి గర్వకారణం, ఆంధ్రుల హక్కు అయిన విశాఖ ఉక్కు కర్మాగారం జిందాల్ స్టీల్స్ చేతిలోకి వెళ్ళిపోబోతుందా. జిందాల్‌కి అప్పగించేందుకు తెర వెనక చురుకుగా కసరత్తు సాగుతోందా. ప్రైవేట్ నుంచి విశాఖ ఉక్కుని దక్కించుకునే మార్గం లేదా అంటే జరుగుతున్నా పరిణామాలు అన్నీ చూస్తే ఇదే నిజం అనిపిస్తోంది అంటున్నారు.

నిజానికి విశాఖ ఉక్కు గత ఏడాదిగా రికార్డు స్థాయిలో ఉత్పత్తి చేస్తోంది. కార్మికులు తమ నిరసనను వినూత్నరూపంలో చూపిస్తున్నారు. ఉక్కు ఉత్పత్తులను పెంచడం ద్వారా పాలకుల మనసు మార్చాలనుకుంటున్నారు. అయితే రెండు కేంద్ర బడ్జెట్లు మారినా కూడా విశాఖ ఉక్కుకు ఉపశమనం కలిగించే చల్లని కబురు అయితే రాలేదు.

ఈ నేపథ్యంలో విశాఖ ఉక్కుని కొనుగోలు చేసేందుకు బడా కార్పోరేట్ సంస్థలు ఒక్కొటిగా ఆసక్తిని కనబరుస్తున్నాయి. మొదట టాటా స్టీల్స్ విశాఖ ఉక్కుని కొంటుందని ప్రచారం జరిగింది. మరి అది ఎంతవరకూ వచ్చిందో తెలియదు, ఈ లోగా అదాని గ్రూప్ విశాఖ ఉక్కుని కైవశం చేసుకుంటుందని కూడా వార్తలు వచ్చాయి.

అయితే వేరే చోట్ల అదాని దృష్టి సారించడంతో ఆది ఆగిపోయింది, ఇక ఊపిరి పీల్చుకోవచ్చు అనుకుంటున్న తరుణంలో సడెన్ గా రంగంలోకి జిందాల్ స్టీల్స్ వచ్చేసింది. విశాఖ ఉక్కుని కొనుగోలు చేయడానికి జిందాల్ స్టీల్స్ పూర్తి ఆసక్తితో ఉందన్నది లేటెస్ట్ టాక్. నవీన్ జిందాల్ నేతృత్వంలోని జిందాల్ స్టీల్స్ విశాఖ స్టీల్ మీద కన్ను వేసిందని అంటున్నారు.

విశాఖ ఉక్కు కర్మాగారానికి 7.3 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యం ఉంది. అంతే కాదు, సులువుగా లాభాల బాటలోకి మళ్ళించుకోవచ్చు. పైగా విశాఖ సాగర తీరంలో ఉంది. భారత దేశాన సీ షోర్‌లో ఉన్న ఏకైక స్టీల్ ప్లాంట్ కావడంతో రవాణా సదుపాయాలు కూడా పెద్ద ఎత్తున చవకగా ఉంటాయన్న ఆలోచిస్తున్నారు.

మరి జిందాల్ కోరిక ఇలా ఉంది. దీనికి సంబంధించి అడుగులు దూకుడుగానే ముందుకు పడుతున్నాయని అంటున్నారు. ఈ నేపథ్యంలో విశాఖ ఉక్కు భవిష్యత్తు ఏంటి అన్నది అయితే ప్రస్తుతం చర్చనీయాంశంగా ఉంది. చూడాలి విశాఖ ఉక్కు జాతకం ఏమవుతుందో.

కాఫీ విత్... 'శిఖా ఆకాష్'.. పొయెట్రీ..

శిఖా - ఆకాష్, 9381522247

తడిసిన గుండె లోంచి... మొలకెత్తిన పద్యం...

నేటి కవితాలోకంలో ఓ బలమైన 'స్వరం'...శిఖా ఆకాష్.
ఏది రాసినా మనసుపెట్టి రాస్తాడు. గొప్ప భావుకుడు.
కవిత్వ కొత్త భాషకోసం తాపత్రయ పడుతున్న కవి.
తను అనుకుంటే... రెక్కలు తెగిన సూర్యుని పాదముద్రల ఆనవాలు ఏదీ దొరకని చోటుకి పాఠకుల్ని తీసుకువెళ్ళగలడు.. అనుబంధాలు తెగి కాకి కన్నా హీనమై 'ఏకాకైన మనిషి దేహం వ్యాపార శాలగా మారి, జీవితం దిగులు నదై పోయినప్పుడు చేయూతగా... ఓ "మొలకెత్తే" పద్యం ఇచ్చే సత్తా ఉన్న కవి. కులమే మిగిలి మనుషులు మరణించి, నరబాముల పుట్టలు లేస్తున్న ఈకాలంలో....తానో ప్రశ్నించే ఉప్పెన గొంతుకవుతాడు. జీవితాన్ని తవ్వి... కన్నీళ్ళూరే కవిత్వమవుతాడు... అలాంటి ఓ కవితా సందర్భమే..ఈ .."
తడిసిన మట్టిలోంచి" కవితా పద్యం..!
మీరూ ఓసారి మనసు పెట్టిన చదవండి..ఈ పద్యం
మీ హృదయపు లోతుల్లోకి ఇంకకుంటే నాదీ పూచీ.!

పద్యానికి నాంది...

"తలుపుల్లేని చీకటేదో నా స్వప్నంలో ఈదులాడి దుఃఖ దీపాన్ని పట్టుకొచ్చే సుఖ మందిర ప్రాంగణమే లేని మనఃసీమల సీతాకోకల సంభాషణేదో.. మ్రోగనీ.. అరమూసిన కనుదోయిలో మధుర మంజుల రసార్ద్ర కావ్యమై కొలువుండే పదును పాటొకటి నినుదలచిన ఎన్ని జన్మల చింతయో నా హృదయవాకిటరంగవల్లికయై అలరారు నాలోన సాగరతీరాన ప్రతిక్షణాన స్నిగ్ధచైతన్యమేదో కులుకులాడే ఈ రాత్రి పాఠశాలలో పర్యాయపదమ ..నీ భావ సంకీర్తనమో ? అశ్రు జప మాల.

పద్యం ప్రారంభం...!!

నేనో చిత్తుప్రతినై పోతాను
నక్షత్రాల యాత్రయేదో నాలో ఊయలలూగుతోంది
ఈ దేశం ఏ ఆకాశం కిందున్దో!
ఈ కాలం ఏలోకానికి బానిసయ్యిందో!
ఈ వేషం ఏ నేలకు అత్తరు పూసిందో!
పెనుశోకమా! లోకమా! మోగిలిపూల నీడకింద దగ్ధమైన శాంతి గీతమా!ఏ జ్ఞాపకాల వడగండ్ల వానలో ఏ సత్యాలు పాతిపెట్టను?
మోయలేను చిగురాకుల గాలిని. నా రాత్రినే చందమామా ప్రేమించదు.
నా పగటికి ఏ ఊర్వశీ ప్రేమలేఖ రాయదు ఎప్పటికీ నేనో బాధాగ్ని కుసుమాన్నే.మండే సూర్యుడై లేవడం మినా ఏముందీ లోకాన.
వసంతాలు విరబోయాల్సిన చోట ఏడారులెందుకు విస్తరిస్తున్నట్టు?
గెలుపంటే ఏమిటో.. నాగరికత అంటే ఏమిటో ఎంత నిర్వచించినా ఓడిపోతూనే ఉన్నాను.నేను నడుస్తున్నానో..పరుగులేదుతున్నానో.
అసలు నిలబడే సమయాల్ని కోల్పోతున్నానో.. నన్ను నేనే తరుముకుంటూ.. శ్మశానాల్ని సజీవం చేస్తున్నానో శవప్రాయమైన జీవితాన్నే కలగంటున్నానో.. అత్యాశల ఇల్లేదో అత్యాధునికంగా నిర్మిస్తున్నానో.. జీవితం సాక్షాత్కరించని ఏకాకి వేగం వెంటబడి కొట్టుకుపోతున్నానో- అసలు యుద్ధాలెందుకు? మనుషులు మనుషుల్లా ఉండనందుకే కదూ..! మనుషుల్లేనిచోట స్వేచ్ఛకి ఊపిరుంటే మాత్రం ఏం లాభం? ఎవరు గీసుకున్న సరిహద్దులివి? ఎవరి ఆధిపత్యాలకో బలౌతున్న జీవితాలివి? నేను యుద్ధం లేని కాలాన్ని కలగంటున్నా కానీ ఎప్పటికీ జీవితమే యుద్ధమైన జీవన వాస్తవికతని చూస్తున్నా.
మనిషో చేరశాలై పోతున్నాడేమిటీ?
యుద్ధమే కలై మిగులుతుందేమిటీ?
శవాల గుట్టని దేశమందామా?
అరచేయంతైనా లేని రూపాయేదో యుద్ధమై మొరుగుతుందేమిటీ?
స్వేచ్ఛ పేరు యుద్ధమా?యుద్ధం పేరు స్వేచ్ఛనా?శోకమా!నా పర్యాయ పదమా!మౌన తపస్విలా "రాయి".
శబ్ద భేదిలా కీచురాయి.నిజం అబద్ధమాడదు అది గీటురాయి

గాలి బొటనవ్రేలు తెగి స్రవిస్తోంది అవిశ్రాంతంగా..
పిల్లగాలి చల్లగా మెల్లమెల్లగా గడ్డకట్టదు.
తాను నిద్రపోదు.నా నిద్రనాపదు. జోకొడుతోంది.. లాలిస్తోంది.
గాలికెవరు ఈ బాధ్యతను అప్పగించారో..?
నా కోసమదా? దానికోసం నేనా? అమ్మతోడు
అది నా తోడూనీడ.గానుగ చెట్టు నీడ ఉదయాన్ని తవ్వుతూ ఒక స్వప్నాన్ని పరిచయం చేసింది.
ఒక గోరింటాకు కల ఈ దేహాన్ని నాలోని సందేహాల్ని వెలిగించింది.ఈ దేశాన్ని నడిపించింది.ఋతువు సంగీతమేదో..
మోసుకెళ్తోన్న పక్షుల కళ్ళలో
ఒకానొక సముద్రం మలుపుదగ్గర నమస్కరించింది.పసిపాపలా నిశ్శబ్దం నిద్రలో నవ్వింది.ఎన్ని మెరుపులు విచ్చుకుంటే ఈ మరలిపోని రాత్రుల్ని పూలదండగా గుచ్చి ఒక సూర్యోదయాన్ని ఆహ్వానిస్తూ
ఒక వేపగాలి పుస్తకం మొద్దుబారకుండా ఉండేందుకు ఒక లేచిరుగాలై రెపరెపలాడుతూ..సజీవమవ్వడానికే ..నాలుగు వాక్యాలై నదిలా ప్రవహించాలి.నీలో నాలో ఒక కొత్త ప్రపంచం మనుషులు మనుషులుగా మిగిలే ప్రాణపదమైన జీవితం ఉదయిస్తుంది.
పిట్టల పాటల్ని నిశ్శబ్ద రహస్యాల్ని ప్రేమించు. శూన్యం చెప్పే విచిత్ర సంభాషణాల్ని విను. నీ వెలుగుతోన్న కళ్ళతో శూన్యాన్ని వెలిగించు.కనిపించని సౌందర్యాలెన్నో కను. కొన్ని ఊహల్ని విత్తు. నీ ఆకాంక్షల్లో ధైర్య సంగీతం విరబూసేలా.. పరిమళభరిత క్షణాల్ని దుఃఖభరిత సంఘర్షణల్ని అన్ని ఋతువుల్లో ఒంపు. నీ లోపలసంచరించే మృగాల్ని వేటాడు. శవమై పోతోన్న వస్తువై మిగిలిపోతున్న, కాంక్రీటు వనాలైపోతున్న, కాలాన్ని రోగగ్రస్తం చేస్తున్న,ఎడారులై విస్తరిస్తున్న చోటే పొడిబారిన స్థితి నుండి తడి తడిగా భూమిపొరలలోంచి రెపరెపలాడే మొక్కలా మొదలవ్వడమే ఈ లోకానికి నా పద్యం ఇచ్చే కానుక....".!! ...తడిసిన మట్టిలోంచి

కవి మానసిక సంక్షోభం..

ఎ.రజాహుస్సేన్

వర్తమాన కాలానికి, అద్దం పడుతుంది. వర్తమానం చీకటి..కవి మానసం చీకటికి ప్రతీక..వర్తమానం సంక్షుభితం.తలుపుల్లేని చీకటి కవి స్వప్నంలో ఈదులాడుతోంది.పైగాదుఃఖ దీపాన్ని పట్టుకొస్తోంది. దాంతో దిగులు చీకటి మరింత చిక్క బడుతోంది. మనఃసీమలకు సుఖ మందిర ప్రాంగణమే లేదు. ఇప్పుడది సీతాకోకల విహారసీమ. అరమూసిన కనుదోయిలో మధుర మంజులరసార్ద్ర కావ్యమై కొలువుండే పదును పాటొకటి మోగుతోంది
జన్మ జన్మల చింత కవి హృదయవాకిట రంగవల్లికై
అలరారుతోంది. సాగరతీరాన ప్రతిక్షణాన కనబడే
స్నిగ్ధచైతన్యం ఇప్పుడు కవి మనసులో కదలాడు
తోంది. కులుకులాడే ఈ రాత్రి పాఠశాలలో పర్యాయపదమో .... భావ సంకీర్తనమో ? అశ్రు జపమాలో..
తెలీదు కానీ..కవి మానసం మాత్రం సంద్రంలో
సునామీ అలల్ని తలపిస్తోంది..
చీకటి....చీకటి....చిక్కని చీకటి..
దుఃఖం....దుఃఖం....తీరని దుఃఖం..
దిగులు..దిగులు.. ?? గుండెకు పగులు.

బాధాతప్త హృదయంతో ఇప్పుడు కవి పద్యంగా మారడానికి రంగం సిద్ధమైంది.ఈ కవితకు కాన్వాస్ దుఃఖం.
అది చీకటై చిక్కబడింది.కవి గొంతులోంచి
పద్యం పెగులుతోంది..
కవి చిత్తు ప్రతిగా మారిపోయాడు.చిత్తుప్రతి కవి మానసిక పరిస్థితిని తెలిపే ప్రతీక. ఒక్కుదుటన ఎగిసిపడుతున్న భావ వీచికలకు వేదిక.

చీకటి నుంచి మొదలైన కవి యాత్ర ఇప్పుడు మినుకు
మినుకుమనే నక్షత్రాల వైపుకు దారి తీసింది.
ఈ దేశం ఏ ఆకాశం కింద ఉందో..ఈ కాలం ఏ లోకానికి బానిసయ్యిందో.. ఈ వేషం ఏ నేలకు అత్తరు పూసిందోకానీ.. పెనుశోకం ఆవరించింది. లోకం మోగిలిపూల నీడకింద దగ్ధమైన శాంతి గీతమైంది.ఏ జ్ఞాపకాల వడగండ్ల వానలో ఏయే సత్యాలను పాతిపెట్టాలో కవికి అర్థం కావడంలేదు.
సంక్షుభిత కవి మానసం సంధిగ్ధమై రెపరెపలాడుతోంది.
ఏదీ భరించలేని దుస్థితి. దేన్నీ మోయలేని స్థితి. ప్రతిదీ మోయలేని భారమైపోతోంది.చివరకు చిగురాకుల గాలిని కూడా తట్టుకోలేక పోతోంది.

తన రాత్రిని ఏ చందమామా ప్రేమించదు,
తన పగటికి ఏ ఊర్వశీ ప్రేమలేఖ రాయదు...
ఎప్పటికీ తనో బాధాగ్ని కుసుమమే.
మండే సూర్యుడై లేవడం మినా చెప్పుకోడానికే ముందీ లోకాన?
కవి మానసం లో అనేక ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.
వసంతాలు విరబోయాల్సిన చోట ఎడారులెందుకు విస్తరిస్తున్నట్టు?

గెలుపంటే ఏమిటో..నాగరికత అంటే ఏమిటో
ఎంత నిర్వచించినా అర్థం కాని ప్రశ్నగా మిగిలిపోతోంది.

తాను ఎప్పుడూ ఓడిపోతూనే ఉన్నాడు,
తాను నడుస్తున్నాడో..పరుగులిడుతున్నాడో..
అసలు నిలబడే సమయాల్ని కోల్పోతున్నాడో,
ఎంతకూ అర్థం కావడం లేదు..
తనను తానే తరుముకుంటూ..శ్మశానాల్ని సజీవం చేస్తున్నాడో,
శవప్రాయమైన జీవితాన్నే కలగంటున్నాడో..,
అత్యాశల ఇల్లేదో అత్యాధునికంగా నిర్మిస్తున్నాడో,
జీవితం సాక్షాత్కరించని ఏకాకి వేగం వెంటబడి కొట్టుకు పోతున్నాడో.,
ఎంతగా బుర్ర బద్దలుకొట్టుకున్నా అర్థంకావడంలేదు.
పుట్టుకే శాపమైన చోట జీవనం నిలువెత్తు యుద్ధమౌతుంది
అయినా...లోకంలో అసలు ఈ యుద్ధాలెందుకు?
మనుషులు మనుషుల్లా ఉండనందుకే కదూ..!.
మనుషుల్లేనిచోట స్వేచ్ఛకి ఊపిరుంటే మాత్రం ఏం లాభం?
ఎవరు గీసుకున్న సరిహద్దులివి?
ఎవరి ఆధిపత్యాలకో బలౌతున్న జీవితాలివి?

తాను మాత్రం యుద్ధం లేని కాలాన్ని కలగంటున్నాడు. కానీ... ఎప్పటికీ జీవితమే యుద్ధమైన జీవన వాస్తవికతని చూడాల్సి వస్తోంది.అదే బాధ.దానికి ఆద్యంతాలు లేవా? మనిషి ఓ చెరసాలై పోతున్నాడేమిటీ? యుద్ధమే కలై మిగులుతుందేమిటీ? శవాల గుట్టని దేశమందామా? అరచేయంతైనా లేని రూపాయేదో యుద్ధమై మొరుగుతుందేమిటీ? అసలు స్వేచ్ఛ పేరే యుద్ధమా? లేక..యుద్ధం పేరు స్వేచ్ఛనా? శోకమే..పర్యాయ పదమా! మౌన తపస్విలా "రాయి".శబ్ద భేదిలా. అంటున్నాడు కవి.

ఏమో..? కాలం...కీచురాయి. నిజం అబద్ధమాడదు.. అది గీటురాయి అంటున్నాడు కవి. గాలి బొటనవ్రేలు తెగి ప్రవిస్తోంది అవిశ్రాంతంగా.. పిల్లగాలి చల్లగా మెల్లమెల్లగా గడ్డకట్టదు. గాలి.. తానునిద్రపోదు. కవి నిద్రనాపదు. జోకొడు తోంది.. లాలిస్తోంది. గాలికెవరు ఈ బాధ్యతను అప్పగించారో..? తనకోసమదా? దానికోసం తనా? అమ్మతోడు... అది తనతోడూనీడ అంటున్నాడు. ఈలోగా... గానుగ చెట్టు నీడ ఉదయాన్ని తవ్వుతూ ఒక స్వప్నాన్ని పరిచయం చేసింది. ఒక

గోరింటాకు కల ఈ దేహాన్ని తనలోని సందేహాల్ని వెలిగించింది.ఈ దేశాన్ని నడిపించింది. ఋతువు సంగీతాన్ని మోసుకెళ్తోన్న పక్షుల కళ్ళలో ఒకానొక సముద్రం మలుపుదగ్గర నమస్కరించింది. పసిపాపలా నిశ్శబ్దం నిద్రలో నవ్వింది.ఎన్నిమెరుపులు విచ్చుకుంటే ఈ మరలిపోని రాత్రుల్ని పూలదండగా గుచ్చి ఒక సూర్యోదయాన్ని ఆహ్వానిస్తుంది.. ఒక వేపగాలి పుస్తకం మొద్దుబారకుండా ఉండేందుకు ..ఒక లేచిరుగాలైరెపరెపలాడుతూ సజీవమవ్వడానికే నేమో..?

మనిషి నాలుగు వాక్యాలై నదిలా ప్రవహించాలి. నదికి హద్దులూ.సరిహద్దులుండవు.మనిషి కూడా నదిలా మారితే..లోకంలో కులమతాల గోలా..... గొడవలూ.. పొరపొచ్చాలూ. వివక్షలు.. నీ..నా.... తరతమ భేదాలుండవుగదా! అప్పుడు.. ఒక కొత్త ప్రపంచం యేర్పడుతుంది. మనుషులు మనుషులుగా మిగిలే ప్రాణపదమైన జీవితం ఉదయిస్తుందన్నది కవి భావన. అదే జరిగితే... పిట్టల పాటల్నినిశ్శబ్ద రహస్యాల్ని ప్రేమించాలి... శూన్యం చెప్పే విచిత్ర సంభాషణాల్ని వినాలి... వెలుగుతోన్న మన కళ్ళతో శూన్యాన్ని వెలిగించాలి. కనిపించని సౌందర్యాలెన్నో కనాలి. కొన్ని ఊహాల్ని విత్తాలి.. మనం ఆకాంక్షల్లో ధైర్య సంగీతం విరబూసేలా.. పరిమళభరిత క్షణాల్ని దుఃఖభరిత సంఘర్షణల్ని అన్నిఋతువుల్లో ఒంపుకోవాలి.. మన లోపల సంచరించే మృగాల్ని వేటాడాలి...

శవమై పోతోన్న... వస్తువై మిగిలిపోతున్న, కాంక్రీటు వనాలై పోతున్న, కాలాన్ని రోగగ్రస్తంచేస్తున్న, ఎడారులై విస్తరిస్తున్న చోటే పొడిబారిన స్థితి నుండి.. తడి తడిగా భూమిపొరలలోంచి రెపరెపలాడే మొక్కలా మొదలవ్వడమే ఈ లోకానికి తన పద్యం ఇచ్చే కానుక... అంటున్నాడు కవి.. శిఖా ఆకాష్!! ఎంతమంచి కల..? తీరం వదలని అల..

ఈ పద్యం.!

మట్టైనా..మనిషైనా తడి తగిలితేనే మొలకెత్తేది..? మట్టికి తడితగిలితే ...మొక్క మొలకెత్తుతుంది.. గుండెకు తడి తగిలితే..మనిషితనం మొల కెత్తుతుంది... ఈ కవి గుండెకు తడి తగిలి మంచి పద్యం మొలకెత్తింది..!! ఈ కవితలో శిఖా ఆకాష్ చాలా కొత్తగాకనిపించాడు. సరికొత్త పద ప్రయోగాలతో భావలోకంలో విహరించి న తీరు గొప్పగా ఉంది..ఇటీవలి కాలంలో నాకు బాగా నచ్చిన... హృదయానికి హత్తుకున్న కవితల్లో ఇదొకటి. తడి గుండె లో నుంచి మొలకెత్తిన .. ఈ పద్యం చదివాక ఈ ఉదయం కాఫీ మంచి కిక్కెక్కించింది.!! శిఖా ఆకాష్ కు అభినందనలు.!!

నీ కాలితో చేను
దమ్ముచేసి,
నీ చేతితో నారులాగి
నాటువేసి,
నీ కత్తితో కోతకోసి
కుప్పలేసి,
కుప్పనూర్చి
పోతపోసి,
పండించిన ధాన్యం
పెత్తందారుల
వ్యాపారుల పాల్జేసి,
దిక్కు మొక్కు లేకున్నా
మళ్ళీ మళ్ళీ గింజ
గింజ
మాకందించేందుకు
వ్యవసాయం లో
ఎవ్వరి సాయం
లేకున్నా
కులంలేని కూలితల్లి,
కులమే కూలిగా ఉన్న
దళితతల్లి,
మతంలేని
మహామాత

అలసి సొలసిన చర్మపుతిత్తి
తో...
అలసటలేని ముడతల
నగుమోమున
చిరునవ్వుతో....
జాతికింత బువ్వపెట్టే అవ్వా,

రంగురంగు కోకలు,
టిప్పుటాప్ మే..కప్పులు,
వలువలు నిండుగా లేకున్నా
విలువల బతుకే నీదమ్మా
మా "భరతమాత"

నా దృష్టిలో
నువ్వే నువ్వే "భారతమ్మవు",
నువ్వే నువ్వే
"విశ్వసుందరమ్మ" వు
అందరికీ "అన్నం పెట్టే
"అమ్మవు"
నీకు శతకోటి వందనాలు..

దాసి సీతారామరాజు

అంతర్జాతీయ మహిళా దినోత్సవ థీమ్స్ చిగురించని జీవితాలు

అంతర్జాతీయ మహిళా దినోత్సవం యొక్క ఉద్దేశం మహిళల ఎదుర్కొంటున్న సాంఘిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక అంశాలపై దృష్టి కేంద్రీకరించడం మరియు అన్ని ప్రాంతాలలో మహిళల పురోగతికి మద్దతునివ్వడం ఈతరం మహిళాలోకం ఉన్నత శిఖరాలను చేరుకుని పురుషులకు తామేమి తీసిపోమని చాటిచెపుతోంది. ఇంటికే పరిమితం కాదంటూ అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. ఇంతా సాధిస్తున్న మహిళలు ఇంకా భారతీయ సమాజంలో నిత్యం అణచివేతకు పెరుగుతూనే ఉన్నారు మరీ ముఖ్యంగా దళిత బహుజన మహిళల పైనే ఈ అణచివేతలు పెరుగుతున్నాయి. అయితే మహిళలు అన్ని రంగాల్లో ముందున్నా సమానత్వం పూర్తిగా లభించలేదు. మరోవైపు చట్టసభల్లో సమానత్వం అంటూ అన్ని పేరుకే అనే చందంగా వ్యవస్థలు సాగుతున్నాయి. నిత్యం ఎక్కడో ఒకచోట మహిళలపై అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయి. స్త్రీలు దేశంలో అణచివేతకు ఉన్నారు. అసలు ప్రభుత్వాలు, న్యాయవ్యవస్థలు మహిళలకు రక్షణ చట్టాలు మరింత కఠినతరం చేయాలి. అలాగే సమాజంలో మహిళల పట్ల ఆలోచించే విధానాల్లో మార్పులు రావాలి. అలా జరిగినప్పుడే స్త్రీలు సంఘంలో గౌవరం పొందుతారు. స్త్రీల పట్ల మగవారు ఆలోచించే ధోరణి మారాలి, అంగడి బొమ్మగా కాదు వారిలో అమ్మను చూడగలగాలి. సంఘంలో ఎక్కడికి వెళ్లినా గౌరవింపబడాలి పునాదిలో మార్పు తేకుండా ఉపరితలంలో చేపట్టే సంస్కరణలు ఫలితాలివ్వవు. భారత ప్రభుత్వం మరియు భారత సమాజంలో దళిత బహుజన స్త్రీలపై చూపుతున్న వివక్ష ఇందుకు ఉదాహరణలు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్మిక ఉద్యమం నుంచి పుట్టుకొచ్చింది. దీనిని ఐక్యరాజ్య సమితి గుర్తించి, ప్రతి ఏటా నిర్వహిస్తోంది. దీని పుట్టుకకు బీజాలు 1908లో పడ్డాయి. తక్కువ పనిగంటలు, మెరుగైన జీతం, ఓటు వేసే హక్కు కోసం న్యూయార్క్ సిటీలో 15 వేల మంది మహిళలు ప్రదర్శన చేశారు. ఈ మహిళల డిమాండ్లను దృష్టిలో పెట్టుకుని అమెరికాలోని సోషలిస్టు పార్టీ 1909వ సంవత్సరంలో జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రకటించింది. ఈ దినోత్సవాన్ని అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించాలన్న ఆలోచన క్లారా జెట్కిన్ అనే ఒక మహిళ.

రవివర్మ పాలడుగు,
కమెండ్స్ ఆఫ్ అంబేద్కర్ రైట్స్,
9704722470

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని తొలిసారిగా 1911లో ఆస్ట్రియా, డెన్మార్క్, జర్మనీ, స్విట్జర్లాండ్‌లో నిర్వహించారు. అయితే, 1975వ సంవత్సరంలోనే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఐక్య రాజ్య సమితి అధికారికంగా నిర్వహించడం ప్రారంభించింది. 1917 యుద్ధ సమయంలో రష్యా మహిళలు "ఆహారం - శాంతి" డిమాండ్ చేస్తూ సమ్మెకు దిగారు. నాలుగు రోజుల తర్వాత అప్పటి రష్యా సామ్రాట్ నికోలస్‌జా2 సింహాసనాన్ని వదులుకోవాల్సి వచ్చింది. అప్పుడు తాత్కాలికంగా ఏర్పాటైన ప్రభుత్వం మహిళలకు ఓటు వేసే హక్కును ఇచ్చింది. మహిళలు ఈ సమ్మెకు దిగిన రోజు జూలియన్ క్యాలెండర్ ప్రకారం ఫిబ్రవరి 23 ఆదివారం. గ్రెగోరియన్ క్యాలెండర్ ప్రకారం చూస్తే అది మార్చి 8వ తేదీ. అందుకే మార్చి 8వ తేదీన గ్రెగోరియన్ క్యాలెండర్ ప్రకారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటున్నారు

ఐక్యరాజ్య సమితి 1996 సంవంత్సరం నుంచి ప్రతి సంవత్సరం వార్షిక ఇతివృత్తాన్ని అనుసరించడం ప్రారంభించింది. మొదటి ఇతివృత్తం 'గతాన్ని వేడుక చేసుకోవడం, భవిష్యత్తుకు ప్రణాళికలు రచించుకోవడం' అని మొదటి థీమ్‌ను నిర్ణయించింది. అప్పటినుండి ప్రతి సంవత్సరం ఒక థీమ్‌తో మహిళా అభివృద్ధి లక్ష్యంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటున్నారు

ప్రపంచంలోనే మహోజ్వలమైన ద్రావిడ చరిత్ర ఉన్న పవిత్ర గ్రామీణ భారత దేశంలో సంస్కృతి పరంగా స్త్రీని దేవతామూర్తిగా పిలుస్తారు. దేశ జనాభాలో దాదాపు సగం మంది మహిళలే ఉన్నారు. ప్రస్తుతం పితృస్వామిక కుటుంబాలుగా చలామణి అవుతున్న భారత గ్రామీణ వ్యవస్థలో గతంలో మాతృస్వామిక కుటుంబాలు ఉండేవి. అనగా కుటుంబ యజమానురాలిగా పూర్తి భాధ్యతలు స్త్రీలే వహించేవారు. స్త్రీకి ఈ దేశంలో ఎంత ప్రాధాన్యత ఉందంటే భారతదేశాన్ని భరతమాత అని పిలిచేంత గొప్పతనం, గౌరవం స్త్రీలకు ఉంది. కాని ఈ దేశంలో దళిత బహుజన కుటుంబాలకు సంబంధించిన స్త్రీలు పలురకాల అణచివేతలకు, అవమానాలకు గురౌతున్నారు. దళిత బహుజన స్త్రీ ఒక సాంఘీక శక్తి. ఒక సంస్కృతికి ప్రతీక. ఒక చారిత్రక నేపథ్యం. కానీ భారతదేశంలో ఈనాడు ఒక అస్పృశ్యురాలిగా సంక్షుభితమైన జీవన యాత్రలో ప్రయాణం సాగిస్తుంది. వ్యవసాయ రంగంలో ప్రముఖ పాత్ర వహిస్తూ ఆనకట్టలు, భవనాలు, రోడ్ల నిర్మాణాల్లో

కూడా తమ శ్రమను దారపోస్తుంది. బట్టల మిల్లులు, బీడీ పరిశ్రమ, సిమెంట్ ఫ్యాక్టరీలు, ఆస్పత్రులు, క్వారీ పనులు ఇలా ఎన్నో రంగాల్లో పనిచేస్తుంది. ఒకవైపు ఇలా శ్రమిస్తూ మరోవైపు గృహజీవనానికి సంబంధించిన పనులన్నీ చేయడం వల్లే మొత్తం భారతీయ "శ్రామిక శక్తి"లో ప్రధాన పాత్ర పోషిస్తున్నారనేది చారిత్రక సత్యం. పోషకాహార లోపం వల్ల బలహీనులై కనీసం వృద్ధాప్యంలో తమను పోషించడానికి ఒక్క బిడ్డయిన మిగలాలనే ఆశతో అనేక మంది బిడ్డలకు జన్మనిచ్చి రక్తహీనతతో మరింత బలహీనులౌతున్నారు. పగలంతా చెమటోడ్చి పొలాల్లో పనిచేస్తే పరిమితమైన కూలి లభిస్తుంది. నిత్యావసర వస్తువులు కొనడం కోసం ఆ డబ్బు చాలదు. అంతేగాక మాతృహృదయం కలిగిన వీరు భర్తకు, పిల్లలకు వడ్డించిన తరువాతనే మిగిలితే తినవలసిన పరిస్థితి తరచూ ఎదురౌతూనే ఉంది.

మండుటెండకు నెర్రెలు విచ్చిన భూమి పగుళ్ళలా ఆమె కాళ్ళు పగిలి ఉంటాయి. అన్నం చాలక కరుణార్ద్రతతో ఆమె కళ్ళు గుంటలు పడి ఉంటాయి. నూనె లేక అట్టలు కట్టిన ఆమె జుట్టు శ్రమించి కాయలు కాసిన ఆమె చేతులు మానవతా రహితమైన ఈ దేశ గ్రామీణ అగ్రకులాల కర్కశత్వాన్ని గుర్తుచేస్తాయి. దళిత బహుజన స్త్రీ ఒక సృజనాత్మక శక్తి. గ్రామాల్లో నులను మంచానికి అల్లుటలోను, బట్టలు నేయడంలోనూ, తాటాకులతోనూ, ఈతాకులతోనూ చాపలు అల్లడంలోనూ, కళాస్రవంతిగా, సంస్కృతీ భాండాగారంగా ఆమె నిరూపించుకుంది. వేటకత్తెగా, జాలరిగా, యుద్ధ సైనికురాలిగా మానవ జీవన చరిత్రలో అనేక పాత్రలు పోషించింది కనుకనే ప్రాచీన భారతీయ పారిశ్రామికవేత్త ఈ మహిళ. తోళ్ళపని, కుట్టు, నేత, కుండల తయారీల వంటి పనులు చేపట్టింది. గృహ, సమాజ నిర్వహణ కర్తగా ఒక ముఖ్య పాత్ర వహించింది. ఆమె రోజువారీ శ్రమను పరిశీలిస్తే శ్రామిక సంస్కృతిపై ఒక పెద్ద విజ్ఞాన గ్రంథాన్ని తయారు చేయవచ్చు. రోజుకు 18 గంటలు రక్తాన్ని, చెమటను ధారపోసి పనిచేసే దళిత బహుజన స్త్రీ శ్రమ, సోమరి భారతీయుల నిర్దయపూరిత శరీరాలను పెంచి పోషిస్తుంది. వారి శ్రమ భారతీయ ఆర్థిక సాంఘిక రంగాలకు పునాది. కాని మన మేధావులు ఈ స్త్రీల జీవితాన్ని పరిశీలించడం లేదు. జీవన విధానాన్ని పరిశోధించనంతకాలం వీరికి భారతదేశ వాస్తవికత అర్థం కాదు. తమ మానవీయ ఔన్నత్యాన్ని కించపరిచే సాంఘిక అణచివేతలోనూ, ఆర్థిక సంక్షోభంలోనూ ఈనాటి దళిత బహుజన స్త్రీలు ఎంతో సంఘర్షణతో జీవిస్తున్నారు.

ప్రాచీనకాలంలో భారతదేశంలో వ్యవసాయ సంస్కృతికి సంబంధించిన అంశాలన్నీ ఈ స్త్రీల జీవన విధానంలోనే మనకు ద్యోతక మవుతున్నాయి. విత్తనాలు నాటేటప్పుడు, కోతలు కోసేటప్పుడు వీరు పాడే పాటల్లో మాట్లాడే భాషలో ఎంతో సంస్కృతి దాగి ఉంది. భారతదేశానికి మూలమైన భౌతిక తత్వశాస్త్రానికి మూలం వీళ్ళే. సాంఖ్యతత్వ శాస్త్రాన్ని, తాత్విక వాదాన్ని ఆచరణలో పెట్టింది దళిత బహుజన స్త్రీలే. కులం పునాధుల్ని పెకిలించి కులాతీతంగా మాతృత్వాన్ని అందించిన గాథలు పురాణాలనిండా ఎన్నో ఉన్నాయి. వీరిని అణచివేసిన తరువాతే భారతదేశంలో తత్వ శాస్త్రానికి దారిద్ర్యం వచ్చింది.

భారతీయ గ్రామాలకు మూలమైన భాషా సంస్కృతి, కళలు అన్నీ దళిత బహుజన స్త్రీలోనే నిక్షిప్తమై ఉన్నాయి. మానవత్వం, దాతృత్వం, సౌజన్యం, సౌహార్ధం ఈమెకు సహజ లక్షణాలు. అందుకే ఆమె ఈ దేశానికి పునాది. సంస్కృతిని తన ఔధార్యంతో రక్షిస్తూ వచ్చింది. ఉమ్మడి జీవనాన్ని శిథిలం కాకుండా చూసింది. మాతృత్వంలో దాగి ఉన్న అన్ని దశలను యుద్ధం చేసి రక్షించింది. పురిటి నొప్పుల్లో కూడా భూమికి తన చెమటను ధారపోసి తన ఔన్నత్యాన్ని చాటుకుంది. నదీ నాగరికతను నిర్మించింది. భారత భౌగోళిక వాస్తవికత నుంచి సంస్కృతిని రూపొందించింది. ప్రకృతిని అనునిత్యం జీవితానికి అన్వయించిన కళాతపస్వి. హృదయ సంబంధమైన కళా ప్రపంచానికి స్త్రీదే ఆదినాయకత్వం. అందునా దళిత బహుజన స్త్రీ తను అభివ్యక్తం చేయదలచుకున్న విషయాన్ని వాచక సాత్వికాభినయంతో సహా వ్యక్తీకరిస్తుంది. భారతీయ శిల్పుల, చిత్రకారుల చేతుల్లో అభివృద్ధి చెందిన కళలన్నీ ప్రాథమికంగా దళిత బహుజన స్త్రీ రూపొందించినవే. సముద్రపు ఒడ్డులో ఇసుక తిన్నెలో చిత్రాలు గీసింది. రాతిని శిల్పంగా మలచింది. ప్రకృతి రమణీయకత్వానికి అనుగుణంగా శృతిని, గతిని కలిపి పాడింది. సాహిత్యానికి మూలమైన లిపిని కూడా దళిత బహుజన స్త్రీయే కనుగొన్నది. లిపికి మూలమైన అంశాల్లో ఒకటైన "పచ్చబొట్టు"ని ఈమె మొదట ప్రారంభించినట్లు చరిత్ర తెలుపుతుంది. ఇంతటి మహోదాత్తమైన ఆ దళిత బహుజన తల్లి ఈనాడు గర్భవతి అయితే ఆమె కడుపులో ఉన్న బిడ్డకు జీవాన్నిచ్చే ఆహారం పెట్టుకోలేక తన బిడ్డ తన కడుపులోనే మరణించే పరిస్థితులకు అనేక సందర్భాల్లో నెట్టబడుతుందంటే తరతరాలుగా ఈ సమాజం ఏ పరిస్థితికి మన స్త్రీని నెట్టివేసిందో తెలుస్తుంది. ఆంధ్రప్రదేశ్ లోని అనేక ప్రాంతాల్లో జోగిని వ్యవస్థ దళిత బహుజన స్త్రీలను బాధించింది ఇప్పుడు ఎక్కడో ఒకచోట దీని మూలాలు కనబడుతున్నాయి. ఆదిమ జాతులను దళితులను ఈ సమాజం అస్పృశ్యులుగా చేసిన తర్వాత వీరిపై అనేక దురాచారాలను, మూఢ విశ్వాసాలను రుద్దింది. అందులో ఈ అమానుషమైన జోగిని ఆచారం ఒకటి. చిన్న వయస్సులోనే దేవాలయాలకు అంకితమవ్వడమనే పేరుతో వారిని "ఊరు ఉమ్మడి" బ్రతుకులుగా చేసి హింసించి అత్యాచారాలు చేసే ఈ దుర్మార్గపు ఆచారం ఇప్పటికీ కొన్ని మారుమూల ప్రాంతాలలో ఆచరించబడుతుంది.

ఈ దేశంలో జీవితానికి సంబంధించిన ఆర్థిక, రాజకీయ, సాంఘీక కోణాలన్నింటి లోనూ దళిత బహుజన స్త్రీలు దోపిడీకి, బానిసత్వానికి గురౌతున్నారు. వీరి కనీస వేతనం ప్రభుత్వం నిర్ణయించినప్పటికీ వాళ్ళ రక్తాన్ని, స్వేదాన్ని జుర్రుకుంటున్న భూస్వాములు వారి శ్రమకు తగిన కూలి ఇవ్వడం లేదు. ఈ విధంగా

దళిత స్త్రీల జీవన ప్రమాణాన్ని దిగజారుస్తున్నారు. కనుక ఈ వ్యక్తిగత ఆస్తి మూల్యాన్ని, వ్యక్తిగత ఆస్థిని బలపరుస్తున్న సాంఘిక విచక్షణను రూపుమాపే ఉద్యమంగా మారినపుడే దళిత బహుజన స్త్రీల ఉద్యమం దళిత బహుజనులను విముక్తి చేయగలదు. భారతదేశంలోని సంస్కరణ ఉద్యమం మధ్యతరగతి స్త్రీలను దాటి శ్రామిక స్త్రీలను చేరలేక పోయింది. దళితులపై జరుగుతున్న అత్యాచారాలను, దోపిడీని ఎదిరించటానికి దళిత మహిళలు ముందు నిలిచి సింహ గర్జన చేసిన ఆ స్త్రీల నుండే ఈనాడు దళిత బహుజన విముక్తికై మహోన్నతమైన ఉద్యమం జనించింది.

జెండర్ స్వేచ్ఛా సమానత్వాల గురించి స్త్రీల మౌలిక హక్కుల గురించి స్త్రీలపై అమలయ్యే పితృస్వామ్య ఆధిపత్యానికి వ్యతిరేకంగా గొంతు విప్పే మధ్య తరగతి ఉన్నత వర్గాల స్త్రీలు ఒకవైపు, దుర్భరమైన పేదరికంలో కొట్టుమిట్టాడుతూ ఇంటిల్లపాదికీ ఆహార భద్రత కల్పించే భారాన్ని నెత్తి మీద మోస్తూ కుటుంబ పోషణకోసం గనిలో వనిలో కార్ఖానాలో అహర్నిశలూ శ్రమిస్తూ శ్రమదోపిడికి తోడు అదనంగా లైంగిక దోపిడికి గురవుతూ తమకూ హక్కులుంటాయని మర్చిపోయి కూటికోసం గుడ్డ కోసం గూడు కోసం అనునిత్యం సంఘర్షించే దళిత బహుజన శ్రామిక మహిళలు మరోవైపు – భిన్న ధ్రువాల్లో నిలబడ్డారని చెప్పలేం గానీ భిన్న తలాల్లో భిన్న పోరాట మార్గాల్లో ఉన్నారు.

మహిళలందు పేదమహిళలు వేరయా అనో దళిత మహిళలు వేరయా అనో చెప్పడానికి లక్షింపేట, పెద గొట్టిపాడు వంటి సమీప ఉదాహరణలు కొల్లలుగా కనిపిస్తాయి. ఆదివాసీ వాకపల్లి ఘటనలు ప్రధాన స్రవంతికి పెద్దగా పట్టవు. పైపెచ్చు అవి దేశ సుస్థిరతకి భంగం కల్గించే వామపక్ష తీవ్రవాదంపై ప్రభుత్వాల రాజకీయ విధానంలో భాగంగా తీసుకొనే చర్యలు అని నచ్చచెప్పుకుంటాం. ఇటువంటి నేపథ్యంలోనే బయట దేశాల్లో 'బ్లాక్ ఫెమినిజం' సిద్ధాంతం కూడా ముందుకు వచ్చింది. మన నేల మీద దళిత బహుజన స్త్రీ వాదం రూపుదిద్దుకుంది. శ్రామిక మహిళావాదం పురుడుపోసుకుంది. వర్గ సమాజంలో మెజారిటీగా ఉన్న శ్రామిక మహిళ విముక్తి వర్గ విముక్తితోనే ముడిపడి ఉంటుంది, వర్గరహిత సమాజంలో మాత్రమే ఆమెకు నిజమైన స్వేచ్ఛా, సమానత్వం, సాధికారిత వస్తాయనే స్పృహతో కొత్త పోరాట రూపాల్ని ఎన్నుకుంది. ఫలితంగా రాజ్యహింసను ఎదుర్కొంటుంది. భూస్వామ్య పెత్తందార్ల దౌర్జన్యానికి బలవుతుంది. అయినా నూతన మానవి ఆవిష్కరణ కోసం అడుగడుగునా పెనుగులాడుతోంది.

బ్రాహ్మణి కరణ అగ్రకుల శూద్ర మనువాదులు దొంగచాటుగా దళిత వాడల పై దాడులు నిర్వహించినప్పుడు ఆ దాడులలో భర్తను పిల్లలను కోల్పోయి అగ్రకుల దాష్టీకానికి వ్యతిరేకంగా పోరాడి నిలిచిన దళిత స్త్రీల నుండే దళిత బహుజన ఉద్యమం ప్రారంభమైంది. భర్తల శవాలను ఒడిలో పెట్టుకొని ప్రభుత్వం చేయబోయిన ఆర్థిక సహాయాన్ని తిరస్కరించిన ఆ దళిత తల్లుల త్యాగపూరిత ఆత్మగౌరవమే దళిత ఉద్యమానికి పునాది అయ్యింది. ఇటువంటి సంఘటనలు ఎన్నో దళిత స్త్రీల చైతన్యాన్ని, సంఘటిత శక్తిని రుజువు చేశాయి. దేశంలోని దళిత బహుజన స్త్రీలందరు ఉద్యమిస్తే వారి బిడ్డలు, దళిత బహుజన పురుషులు వారికి సంఘీభావంతో నిలిస్తే దళిత బహుజన విముక్తి పోరాటం తన లక్ష్యాన్ని తప్పక సాధిస్తుంది. భారత సమాజంలో అత్యధిక పీడనకు, అణచివేతకు గురైన దళిత బహుజన మహిళలే ఈ విముక్తి పోరాటాన్ని ముందుకు తీసుకెళ్ళగలరు అప్పుడే ఈ దేశంలో నిజమైన మహిళా దినోత్సవం జనిస్తుంది.

అక్షరమే విశ్వ ప్రగతి

మాతృభాష లోని
అక్షరాలెన్నటికీ
మానవస్వరూపాలె !
అక్షరాలెప్పటికీ
అమృతభాంఢాగారాలె !
అక్షరవలయాలే ఆ
ఆకాశనక్షత్రగణాలు !
అక్షరమేగదాఎప్పటికి
జీవాత్మ, పరమాత్మ !
అక్షర ముఖుడు నేడు
ఓ విద్యాధాతేకదా !

అక్షరంవిశ్వప్రగతికి
తొలిమెట్టుకాదా !
అక్షర జీవకుడో
బ్రహ్మసుపుత్రుడేకాదా!
అక్షరాన్నిదిద్దిననాడే
అజ్ఞానం పారిపోదా !
అక్షరవిత్తువిత్తీనేలపై
జ్ఞానపంటవిరివిగండుకో!
భువనవిజయ మహాసభలో
అక్షరయోధుడైన దేవరాయుని
యుగంలో అష్టకవులుకోకొల్లలు

సాహితీపంట పండంచ లేదా !
తెనుంగక్షరాలు పూలతోటలో
బహుగా విరబూసి అక్షర పూ
మాలగా సరస్వతిమెడనండా
నిలుస్తాయి స్వర్ణకాంతులతో !
అక్షరాలే ముమ్మాటికీ నీకు
కూడు, గూడు, ధనమునిచ్చు
అక్షరమే నీకు విశ్వఖ్యాతితెచ్చు
తేనియలొలుకు మన తెలుగు!!

మాతృభాషాదినోత్సవ
శుభాకాంక్షలతో...

వేము వందనం
రచయిత, నటుడు
83743 33907

మైండ్ సెట్... తెల్లవారింది..

ఎన్.హేమంత్

నాకు ఐదు గంటలకే మెలకువ వచ్చింది లేచి చేసేది ఏముందని అలాగే పడుకొని ఉన్నాను.మార్నింగ్ వాక్ కి వెళ్ళాలి...

కానీ బద్ధకంగా అనిపించింది.

మావారు బ్యాంక్ మేనేజర్ గా పనిచేసేవారు...ఆయన చనిపోయి రెండేళ్లు అయింది... కొడుకు కూతురు అమెరికాలో స్థిర పడి పోయారు.నన్నూ అక్కడకు వచ్చేయమంటారు. కానీ నాకే ఇష్టం లేదు. ఆయన పోయాక నాకు ఆసక్తి పోయింది. నిరాశ నిస్పృహలతో కాలం గడుపుతున్నాను..

కాఫీ తాగాలి అనిపించింది కానీ ఈ మధ్యన చక్కెర వ్యాధి రావడాన డాక్టర్స్ సలహా మేరకు కాఫీ మానేశాను..కాఫీ త్రాగడం ఎప్పటి అలవాటో! చిన్నగా నిట్టూర్చి పైకి లేచాను బ్రష్ చేసుకొని వాకింగ్ కి బయలు దేరాను...

కొంత సేపటికి జాగింగ్ చేస్తూ ఒక యువతి ఎదురు పడింది వయసు పాతిక ఉంటుంది. అందంగా... ఆరోగ్యంగా... అంతకు మించి చలాకీగా ఉంది. నన్ను చూడగానే "గుడ్ మార్నింగ్ ఆంటీ!" అని విష్ చేసింది,.ఆ అమ్మాయి ఎవరో గుర్తు రాలేదు. ఇంటికి వెళ్ళాక కూడా ఆ అమ్మాయిని గుర్తుకు తెచ్చుకునే ప్రయత్నం చేశాను. కానీ గుర్తు రాలేదు., మరుసటి రోజు వాకింగ్కి వెళ్ళినప్పుడు కూడా అదే చిరు నవ్వుతో విష్ చేసింది.

అలా వారం గడిచింది ఒక రోజు తను నన్ను విష్ చేసినప్పుడు " సారీ అమ్మా!

నిన్ను గుర్తు పట్టలేకపోయాను!"అన్నాను. ఆ యువతి చిన్నగా నవ్వి " మన మధ్య పరిచయం ఉంటే కదా ఆంటీ!మీరు నన్ను గుర్తు పట్టడానికి" అన్నది. నేను ముఖం ప్రశ్నార్థకంగా పెట్టాను. అప్పుడా అమ్మాయి" విష్ చేయడానికి పరిచయం ఎందుకు?" అన్నది.,తన మాటకు నేను నవ్వేసాను..నేను నవ్వి చాలా కాలం అయింది.,ఆ విషయం మనసు గుర్తు చేసింది.

"నీ పేరు?" అని అడిగాను"స్వప్న.మరి మీ పేరు?" అని అడిగింది."వకుళ" అని చెప్పాను.స్వప్న నన్ను దాటిపోతూ వెనక్కి తిరిగి "ఆంటీ! మీ నవ్వు చాలా బాగుంటుంది" అన్నది.,నాకు మావారు గుర్తుకు వచ్చారు.ఆయన కూడా అదే మాట అనేవారు గుండెలో సంతోషం పొంగింది.

మధ్య మధ్యలో నాకు స్వప్న ఉత్సాహం...సంతోషం గుర్తుకు వస్తూ ఉండేవి ఉత్తేజంగా అనిపించేది. ఒక రోజు "ఒక ఐదు నిముషాలు అలా కూర్చుని మాట్లాడుకుందాం" అన్నాను. స్వప్న సరేనంది ఇద్దరం అక్కడ ఉన్న సిమెంట్ బల్ల మీద కూర్చున్నాము. "నీకు పెళ్లి అయిందా?" అని అడిగాను.

"అయింది ఒక బాబు...పాప" అంది స్వప్న మాటల్లో మావారు పోయిన విషయం...మా పిల్లలు అమెరికాలో ఉన్న విషయం చెప్పాను మావారు పోయినందుకు సంతాపం తెలియ పరిచింది.

కొద్ది క్షణాల తరువాత "ఇప్పుడు ఇంటికి వెళ్లి బ్రేక్ ఫాస్ట్ ఏం చేస్తారు?" అని అడిగింది స్వప్న." బ్రెడ్" అని చెప్పాను.

"ప్రతి రోజూ అదేనా?" అని అడిగింది స్వప్న.

"ఒక్కదాన్నే గా!అందుకే!" అన్నాను.

"ఒక్కరు కాబట్టే మంచి ఆహారం తీసుకోవాలి మీ ఆరోగ్యం మీరు కాపాడు కోవాలి" అంది స్వప్న.కొంచెం సేపు ఆగి..,తనే" మీ వారు.. పిల్లలు ఉన్నప్పుడు వాళ్లకు ఇష్టం అయినవి చేసి పెట్టి ఉంటారు.. ఇప్పుడుమీకు ఇష్టమైనవి చేసుకు తినండి" అన్నది.

ఆ తరువాత మేం వెళ్ళిపోయాము.

ఇంటికి వెళ్ళిన తరువాత కూడా స్వప్న మాటలు తలపుకు వచ్చాయి.అందులోని వాస్తవం గుర్తించాను.,చాలా కాలం తరువాత నాకు ఇష్టమైన జీడిపప్పు ఉప్మా చేసుకు తిన్నాను.

ఎందుకో మనసుకు తృప్తిగా అనిపించింది. మరుసటి రోజు కలిసినప్పుడు స్వప్నకి జీడిపప్పు ఉప్మా గురించి చెప్పాను ఎంతో సంతోషించింది."మంచి పని చేశారు" అని అభినందించింది.., మాటల్లో జీవితం నిరాసక్తతగా ఉన్నట్లు చెప్పాను.స్వప్న మౌనం వహించింది. నెల తరువాత ఒక రోజు " వీలు చూసుకొని ఒకసారి

మా ఇంటికి రా!" అని ఆహ్వానించాను.స్వప్న వచ్చే ముందు ఫోన్ చేసి వస్తాను" అని నా సెల్ నంబర్ తీసుకుంది.మా వారు పోయాక నేను మా ఇంటికి ఆహ్వానించిన తొలి వ్యక్తి స్వప్న.

సాయంత్రం నాలుగు గంటలకు వస్తున్నట్లు స్వప్న ఫోన్ చేసింది. నాకు సంతోషం అనిపించింది. తనకోసం కాఫీ చేసి ఫ్లాస్క్‌లో పోసి ఉంచాను..,చెప్పినట్లు సరిగ్గా నాలుగు గంటలకు స్కూటీ మీద వచ్చింది. వస్తూ వస్తూ నాకోసం గులాబీ కుండీ తెచ్చింది. "ఎందుకిది " అని అడిగాను."రోజూ దీనికి నీళ్లు పోస్తూ పూవు పూసే రోజు కోసం ఎదురు చూడండి!" అంది. స్వప్న సోఫాలో కూర్చుంది కాఫీ అందించాను."మీరు తీసుకోరా?" అని అడిగింది." డయాబెటీస్. అందుకే ఇష్టమైనా తీసుకోవడం లేదు" అన్నాను.

తను కిచెన్ లోకి వెళ్లి ఒక కాఫీ కప్పు తెచ్చి అందులో కొద్దిగా కాఫీ పోసి నాకు అందిస్తూ"జబ్బు కంటే భయమే శరీరం మీద ఎక్కువ ప్రభావం చూపిస్తుంది..,ఏం కాదు.హ్యాపీగా త్రాగండి" అంది నేను మంత్ర ముగ్ధురాలిలా కాఫీ సిప్ చేశాను.. చాలా కాలం తరువాత త్రాగుతున్న కాఫీ నాకు అద్భుతంగా అనిపించింది.. అప్పుడు స్వప్న చిక్కటి పాలల్లో.. బ్రూ పౌడర్ కలుపుకు త్రాగినా రుచి అద్భుతంగా ఉంటుంది..,అందుకు కొంచెం మైండ్ సెట్ మార్చుకోవాలి" అన్నది. కాఫీ త్రాగడం పూర్తి అయ్యాక "ఇల్లు చూద్దువు గాని రా!" అని స్వప్నను లోనికి తీసుకు వెళ్ళాను.

తను పూజా మందిరం చూసి "రోజూ పూజ చేయడం లేదా?" అని అడిగింది." లేదు" అన్నాను.., తను రెండు అగరొత్తులు తీసి వెలిగించింది.,క్షణంలో గది పరిమళ భరితం అయింది అప్పుడు స్వప్న "పూజ చేసినప్పుడు మన మనసూ ఇలా పరిమళ భరితం అవుతుంది" అన్నది. "ఈ అమ్మాయి ఏ విషయం చెప్పినా ఎంతో బాగుంటుంది" అని మనసులో అనుకున్నాను. స్వప్న బయలు దేరినప్పుడు " గులాబీ మొక్కకు నీరు పోసేటప్పుడు చిన్నప్పుడు మీ పాపకు పాలు పట్టడం గుర్తు చేసుకోండి!" అన్నది."అలానే" అన్నాను. గదిలో అలుముకున్న అగరొత్తుల పరిమళం స్వప్న వెళ్ళిపోయినా ఆమెను గుర్తు చేస్తూనే ఉంది.

మరునాటి ఉదయం రోజులా నిస్పృహతో లేవలేదు.కాఫీ త్రాగాలన్న ఉత్సాహంతో లేచాను.కాఫీ చక్కెర లేకుండా త్రాగాను.స్వప్న చెప్పినట్లు మైండ్ సెట్ మార్చుకొని త్రాగితే బాగుంది అనిపించింది.., చాలా కాలం తరువాత ప్రభాత సమయంలో ఉత్సాహంగా అనిపించింది... వాకింగ్ సమయంలో అదే విషయం స్వప్నకి చెప్పాను.సంతోషం వ్యక్తం చేసింది. స్వప్న ఇచ్చిన గులాబీ మొక్కకు రోజూ శ్రద్ధగా నీరు పోయసాగాను క్రమేపీ దానితో అనుబంధం పెరిగింది..,ప్రతి రోజూ దాన్ని శ్రద్ధగా పరిశీలించ సాగాను మొగ్గ తొడగడం... పువ్వు విచ్చడం పరిమళం అద్భుతం అనిపించ సాగింది. మావారు ఉన్నప్పుడు పూల కుండీలు ఉండేవి గాని...వాటి పోషణ ఆయన చూసుకునేవారు ఇప్పుడు ఇది నాకు సరి కొత్త అనుభవం. మధ్య మధ్యలో స్వప్న తను ఇచ్చిన గులాబీ మొక్క గురించి వాకబు చేస్తూ నా ఆనందం పంచుకుంది.

ఈమధ్య స్వప్న నాతో పాటే వాకింగ్ చేయసాగింది., ఒకరోజు వాకింగ్ మధ్యలో " మీకో చిన్న పని చెప్తాను., అలా చేసి ఎలా ఉందో నాకు చెప్పండి" అంది. "ఏమిటది?" అని ఆసక్తిగా అడిగాను. రెండు చిన్న బౌల్స్ తీసుకొని ఒకదానిలో బియ్యం గింజలు..ఒకదానిలో నీరు పోసి మీ పిట్ట గోడ మీద పెట్టండి" అన్నది. తన భావం గ్రహించి" సరే" అన్నాను. అలా పెట్టిన గింజలు పిట్టలు తింటూ... దప్పిగొన్న పక్షులు నీరు తాగుతుంటే ఆ దృశ్యం మనోహరంగా అనిపించ సాగింది.

ఉదయం తాగుతున్న కాఫీ...పూజ... అగరొత్తుల పరిమళం... పూస్తున్న గులాబీలు...గింజలు తింటున్న పిట్టలు... నీరు తాగుతున్న పక్షులు....ఇవి చిన్న చిన్న మార్పులే గానీ నా జీవితంలో పెను మార్పులు తెచ్చాయి.ఒకప్పుడు నిరాశ..నిస్పృహలతో నిరుత్సాహంగా ఉండే నేను ఇప్పుడు ఉత్సాహంగా...సంతోషంగా ఉంటున్నాను. నాలోని మార్పుకు స్వప్నే కారణం.డఒకరోజు సాయంత్రం స్వప్న స్కూటీ మీద వచ్చింది.తనతో పాటు ఇద్దరు పిల్లలను తెచ్చింది."వీళ్ళు మా పని మనిషి పిల్లలు.

బాగా చదువుతారు.,కానీ వీళ్ళమ్మ వీళ్ళను చదివించలేక పోతున్నది.. అందుకే ఈ బాబుకు నేను స్కూల్ ఫీ కడుతున్నాను. మీకు అభ్యంతరం లేకపోతే ఈ పాప స్కూల్ ఫీ కి మీరు సహాయం చేయండి" అన్నది.. నేను క్షణం ఆలస్యం చేయకుండా ఒప్పేసుకున్నాను... వాళ్లకు సహాయం చేయడం నాకు ఎంతో తృప్తిని ఇచ్చింది. పిల్లలు నన్ను అడిగి జామ చెట్టు దగ్గరకు వెళ్ళి జామ కాయలు కోసుకున్నారు,స్వప్న నాతో "మీ హాబీస్ ఏమిటి?" అని అడిగింది." ఒకప్పుడు బొమ్మలు గీసేదాన్ని" అని చెప్పాను. "వావ్" అని స్వప్న నన్ను కౌగిలించుకుంది. "ఆంటీ! నాకు పెయింటింగ్స్ అంటే పిచ్చి. నాకోసం ఒకటి డ్రా చేయండి" అని చిన్న పిల్లలా మారాం చేసింది." వాటి జోలికి వెళ్లి చాలా కాలం అయింది..,వేయగలనో! లేదో!" అన్నాను."తప్పక వేయగలరు!" అంది స్వప్న. ఆన డమే కాదు...ఆ సాయంత్రం నేను పెయింటింగ్ వేయడానికి అవసరమైన డ్రాయింగ్ చార్ట్...పెన్సిల్స్...వాటర్ కలర్స్ తెచ్చి ఇచ్చింది. దాన్ని బట్టి తనకు పెయింటింగ్స్ ఎంత ఇష్టమో అర్థం చేసుకున్నాను.

ఆలోచించి రాధా కృష్ణుల పెయింటింగ్ మొదలు పెట్టాను.మొదట కొంచెం తడబడినా త్వరగానే దారిలోకి వచ్చాను. పెయింటింగ్ పూర్తి చేయడానికి నాలుగు రోజులు పట్టింది.,ఆ విషయం స్వప్నకి చెప్పాను. ఆ సాయంత్రమే పరుగున నా దగ్గరకు వచ్చేసింది.పెయింటింగ్ చుడగానే " "ఎక్సలెంట్ ఆంటీ!" అని నన్ను కౌగిలించుకొని బుగ్గ మీద ముద్దు పెట్టింది. నాకు సంతోషం...సిగ్గు రెండూ కలిగాయి. "పెయింటింగ్ మీద మీ సైన్ చేసి నాకు గిఫ్ట్ గా ఇవ్వండి" అని కోరింది.అలానే చేశాను.

ఆ రాత్రి అమెరికాలో ఉన్న మా అమ్మాయికి ఫోన్ చేశాను. “ఎప్పుడూ మేం చేయడమే గాని,నీవు చేసింది లేదు.ఫస్ట్ టైం నువ్వే చేశావు” అని ఆశ్చర్యపోయింది.క్లుప్తంగా స్వప్న గురించి చెప్పాను.” నీ లైఫ్ స్టైల్ మార్చింది .నా అభినందనలు తెలియజేయి” అన్నది.

కొద్ది రోజులకు స్వప్న తన ఇంటికి ఆహ్వానించింది.తనే వచ్చి స్కూటీ మీద తీసుకువెళ్ళింది.,ఇంటికి వెళ్లగానే నేను పెయింట్ చేసిన రాధాకృష్ణ అందమైన ఫ్రేమ్‌లో కనిపించి కనువిందు చేసింది.,నాకు మనసులో గర్వంగా అనిపించింది. స్వప్న నాకు వాళ్ళ అత్త మామ గార్లను పరిచయం చేసింది.,నేను సోఫాలో కూర్చున్నాను.,స్వప్న కాఫీ తేవడానికి లోనికి వెళ్ళింది.

స్వప్న అత్తగారు నాతో మాట్లాడుతూ..

“మా కోడలు దేవతమ్మా!మమ్మల్ని కంటికి రెప్పలా చూసుకుంటుంది.” అన్నది., అంతలో స్వప్న కొడుకు...కూతురు మా దగ్గరకు వచ్చారు.నేను వాళ్లకు నేను తెచ్చిన బిస్కెట్స్...చాక్లెట్స్ ఇచ్చాను. వాళ్ళు అక్కడినుంచి వెళ్లిపోయారు.

అప్పుడు స్వప్న అత్తగారు” ఈ బాబే స్వప్న కొడుకు ఆ పాప అనాథ.,స్వప్న దత్తత తీసుకొని పెంచుకుంటున్నది అంతే కాదు... మరిక పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకుంది., అదేమంటే... మన పిల్లలను మనం పెంచడం ...ప్రేమించడం గొప్ప కాదు. అనాధకు చేయూత నీయడం గొప్ప అంటుంది. మా అబ్బాయి అందుకు సమర్థిస్తాడు” అని చెప్పింది.

అది విన్న నాకు సంభ్రమాశ్చర్యాలు కలిగాయి.స్వప్న కు అంత చిన్న వయసులోనే ఎంత పరిపక్వత అనుకున్నాను.,కాఫీ తెస్తున్న స్వప్న లో నాకు దేవతా మూర్తి గోచరించింది. స్వప్న,అత్తగారితో “ మొత్తం చెప్పేసారా? చెప్పనిదే ఊరుకోరు కదా!” అంది నవ్వుతూ. నేను సింపుల్ గా “ అభినందనలు స్వప్నా!” అన్నాను.

ఇల్లు చేరానే గాని ఆ రాత్రి నిద్ర పట్టలేదు.స్వప్నను చూసాక జీవన మాధుర్యం బోధ పడింది.ఈరోజు తను చేసిన పని తెలిశాక నా జీవిత గమ్యం బోధ పడింది. నా దగ్గర బాగానే డబ్బు ఉంది.,నా డబ్బు మా పిల్లలు ఆశించరు.ఆ విషయం నాకు బాగా తెలుసు. చాలా సేపు ఆలోచించి ఏం చేయాలో నిర్ణయం తీసుకున్నాను.,అప్పుడు హాయిగా నిద్ర పట్టింది. కొద్ది కాలానికి మా వారి పేరు మీద ఒక చారిటబుల్ ట్రస్ట్ ఏర్పరిచాను., దానికి సెక్రటరీ గా స్వప్నను ఏర్పాటు చేశాను. ఇప్పుడు నాకు జీవితం నిరాశగా... నిస్పృహగా అనిపించడం లేదు...సంతోషంగా... ఉత్సాహంగా అనిపిస్తున్నది... ఒకప్పుడు సమయం గడవని నాకు.., ఇప్పుడు సమయం చాలడం లేదు. వయసులో చిన్నదే అయినా ..నా మనసులో గురువు స్థానం స్వప్నకే ఇచ్చాను!!

Note : **ఒంటరిగా ఉంటే అన్నీ కోల్పోయినట్టు కాదు... మనస్సుకు నచ్చినట్టు ఉండటం తప్పు కాదు....**

పేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

కృష్ణాజిల్లా చల్లపల్లిలోని బాలికల గురుకుల పాఠశాలలో రిపబ్లిక్ డే వేడుకలలో కర్రా విజయభాస్కరరావు, సమత (టీచర్స్) బహుకరించిన బాబాసాహెబ్ అంబేద్కర్ గారి చిత్రపటాన్ని ఆవిష్కరించి, 10 వ తరగతి విద్యార్థినిలు 80 మందికి రైటింగ్ పాడ్స్ పంపిణీ చేసిన AP సెక్రటేరియట్ న్యాయశాఖ డిప్యూటి సెక్రటరీ శ్రీ వెలగపల్లి వెంకటేశ్వరావు, మరియు అంబేద్కరిస్ట్, బుద్దిస్ట్ శిరివేళ్ల రాఘవరావు.

గురుకుల జూనియర్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ జాన్ కెనడి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కాలేజ్ ప్రిన్సిపాల్ శ్రీమతి శైలజ, ఉపాధ్యాయులు తో పాటు దళితనాయకులు చిర్ల కిషోర్, లంకా బోస్, మాతంగి నరసింహారావు, మెరుగు రమేష్, కిషోర్, సుబ్రమణ్యం, అంజయ్య, వరిగంజి అర్జునరావు, బడుగు సంజీవరావు మరియు AP సమత చైతన్య వేదిక కన్వీనర్ దాసి సీతారామరాజు పాల్గొన్నారు. బాలికలకు స్వీట్స్ పంచిపెట్టారు.

హిజాబ్.. శాంతిభద్రతల సమస్యా?

పొలిటికల్

ఆర్.కె.కుమార్

ముస్లిం బాలికలు తలకు చుట్టుకొనే స్కార్ఫ్ (దీనినే హిజాబ్ అని తప్పుగా పేర్కొంటున్నారు) ధరించాలనుకోవడంలో ఎటువంటి వివాదం లేదు. కానీ బీజేపీ పాలిత కర్ణాటక రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను హిజాబ్ వివాదాలుగా వక్రీకరించి తప్పుదోవ పట్టించడం సరైనది కాదు.

ఇది భారత రాజ్యాంగం, చట్టాలు హామీ ఇచ్చిన విద్యాహక్కును ముస్లిం యువతులకు దూరం చేస్తూ వారిపై చేస్తున్న తీవ్రమైన దాడి తప్ప వేరు కాదు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి సానుకూలంగా ఉండే జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు కొత్తగా వచ్చిన చీఫ్ కూడా ఉడిపిలోని జిల్లా అధికారులకు జనవరి 27న ఒక నోటీసు జారీ చేసారు. అందులో తనకు ఒక ఫిర్యాదు వచ్చిందనీ, ఆ ఫిర్యాదులో అక్కడి పరిస్థితి చాలా ఆందోళనకరంగా ఉందని, విద్యాహక్కు చట్టానికి భంగం వాటిల్లుతోందని పేర్కొన్నారు. దీనిని బట్టి ఈ కేసులో బాధిత విద్యార్థుల మానవ హక్కుల ఉల్లంఘన ఎంత తీవ్రంగా జరిగిందో తెలుస్తోంది.రెండు నెలల్లో 12వ తరగతి పరీక్షలు రాయబోతున్న వందలాది ముస్లిం మహిళల భవిష్యత్తుకు భంగం కలిగేలా కర్ణాటక ప్రభుత్వం పూర్తి దురుద్దేశ్య పూర్వకంగా ఫిబ్రవరి 5న ఉత్తర్వు ఇచ్చింది. ఈ ఉత్తర్వుపై కర్ణాటక హైకోర్టు సింగిల్ బెంచ్ మధ్యంతర స్టే విధించక పోవడం చాలా అసంతృప్తికరమైన చర్య.

విద్యార్థులు ప్రీ యూనివర్సిటీ విద్యా విభాగానికి సంబంధించిన కాలేజీ అభివృద్ధి కమిటీ లేక ప్రీ యూనివర్సిటీ కాలేజీల యాజమాన్య బోర్డుల అప్పిలేట్ కమిటీలు సూచించిన దుస్తులు ధరించాలని 1983లో వచ్చిన కర్ణాటక విద్యా చట్టం 133(2) సెక్షన్ చెప్తోంది. దీనిని కూడా ఈ ప్రభుత్వ ఉత్తర్వు తప్పు దారి పట్టిస్తోంది.

యాజమాన్య కమిటీ ఒక యూనిఫామ్‌ను సూచించని పక్షంలో సమానత్వం, సమగ్రత, ప్రజా శాంతి భద్రతలకు భంగం కలిగించే ఎటువంటి దుస్తులూ ధరించరాదని చెపుతున్న 133(2) సెక్షన్ కూడా ప్రస్నార్థకంగానే ఉంది. ఇది విద్యాభివృద్ధికి సంబంధించిన విషయాలలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యక్ష జోక్యానికి అవకాశం కల్పిస్తోంది. నిజానికి యూనిఫారాలు ఈ విభాగం క్రిందికిరావు.

ఈ చర్యలు దురుద్దేశ్యంతో కూడి ఉన్నాయనేది మనకు స్పష్టంగా తెలుస్తోంది. కర్ణాటకలోని కాలేజీ అభివృద్ధి కమిటీలకు ఆయా కాలేజీలు ఉన్న ప్రాంతాలలో ఎన్నికైన ఎమ్మెల్యేలు నేతృత్వం వహిస్తారు. మొట్టమొదట ఈ సమస్య తలెత్తిన ఉడిపి జిల్లాలోని పీ.యూ కాలేజీకి బీజేపీ ఎమ్మెల్యే నేతృత్వం వహిస్తున్నారు. ఆయన సూచన మేరకే తలకు స్కార్ఫ్ చుట్టుకున్న అమ్మాయిలు క్యాంపస్‌లోకి రాకుండా ఆపాలని నిషేధం విధించారు. అంతకుముందు ఆ కాలేజీలో తలకు స్కార్ఫ్ చుట్టుకోరాదనే నిబంధనలు ఏవీ లేకపోయినా కొత్త నిబంధనలు విధించారు.విద్యార్థినులు క్యాంపస్‌లో హిజాబ్ ధరించడానికి కాలేజీ అనుమతిస్తే కనుక మేము హిందూ విద్యార్థులందరూ క్యాంపస్ లోపల కాషాయ శాలువాలు ధరించేటట్లు చేస్తామని భజరంగ్ దళ్ ఉడిపి జిల్లా కార్యదర్శి సురేంద్ర కొటేశ్వర్ బెదిరించారు.

ప్రభుత్వ అండతో అతను తన ప్రణాళికను అమలు చేసాడు. మొదటగా ప్రభుత్వం తన యంత్రాంగం ద్వారా ఇలాంటి వారితో భజరంగ్ దళ్ సహకారంతో కాషాయ కండువాలు కప్పుకొని ఆవేశంతో ఉన్న యువకులను ముస్లిం యువతులకు వ్యతిరేకంగా సమీకరించింది. తరువాత వారిని గేట్ల వద్ద ఆపివేయబడిన ముస్లిం

మహిళలు ఉన్న కాలేజీల వద్దకు రావడానికి అనుమతించింది. వారు అమ్మాయిలను అవహేళన చేస్తూ వారిని వేధిస్తున్నా కూడా అక్కడే ఉన్న పోలీసులు దానిని నివారించకుండా ప్రేక్షకపాత్ర వహించి తాము పక్షపాతం లేకుండా వ్యవహరించామని చెప్పుకున్నారు.

తలకు చుట్టుకొనే స్కార్ఫ్ వలన శాంతి భద్రతల సమస్య తలెత్తవచ్చు కనుక కాలేజీకి అటువంటి నిబంధనలు ఉన్నా లేకున్నా దానిని నిషేధిస్తున్నామని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వారి కమ్యూనిటీలో ప్రతిచర్యకు దారితీయడమే కాక అంతకు ముందు స్కార్ఫ్ ధరించని మహిళలు కూడా స్కార్ఫ్ ధరించి తమ నిరసన తెలియచేయడానికి దారి తీస్తుంది. కర్ణాటకలో ప్రస్తుతం మనం ఇదే చూస్తున్నాం. ఈ పరిస్థితిలో మహిళల స్వేచ్ఛకు అడ్డుపడే ముస్లిం చాందసవాద సంఘాలు కూడా బలపడి తమ ఛాందసవాద భావజాలాన్ని బలపరుచుకోవడం జరుగుతుంది. విద్యాసంస్థలలో యూనిఫామ్ విధానాన్నే బాలికలు వ్యతిరేకిస్తున్నాట్లుగా దీనిని చిత్రీకరిస్తున్నారు.

కర్ణాటక విద్యాశాఖా మంత్రి బీ.సీ నాగేష్ మాట్లాడుతూ... విద్యార్థులందరూ ప్రభుత్వం సూచించిన యూనిఫామ్‌ను గౌరవించాలని తాను విద్యార్థులకు విజ్ఞప్తి చేస్తున్నాననీ, ప్రభుత్వ స్కూల్

యూనిఫామ్ నిబంధనలు పాటించని వారికి స్కూలులో ప్రవేశించి క్లాసులకు హాజరయ్యే అవకాశం ఉండదని స్పష్టంగా చెప్పారు. ముస్లిం బాలికలు నిర్దేశించిన యూనిఫామ్‌లు దరిస్తూనే ఉన్నారు. దానికి తోడు వారు తమ తలలను హెడ్ స్కార్ఫ్‌తో కప్పుకుంటున్నారు. అంతే కానీ వారు యూనిఫామ్ బదులుగా బుర్ఖాలు వేసుకోవడం లేదు. వారు తమ ముఖాలు కప్పుకోవడానికి ముసుగులు ధరించడం లేదు. సిక్కు మతానికి చెందిన బాలురు టర్బన్‌లు దరిస్తున్నారంటే వారు ప్రభుత్వ యూనిఫామ్ ఉత్తర్వులను వ్యతిరేకిస్తున్నట్లు అవుతుందా? భారత దేశంలో ఎక్కడైనా ఏ నిబంధన ప్రకారమైనా ఒక సిక్కు బాలుడు కానీ బాలిక కానీ తమ తలను కప్పుకోరాదనే నిబంధన ఉన్నదా? ఇప్పుడీ ద్వంద్వ విధానాలెందుకు? విద్యా సంస్థలలో యూనిఫామ్‌లకు ఎవరూ వ్యతిరేకం కాదు. ఒక ముస్లిం బాలిక హెడ్ స్కార్ఫ్ ధరించితే అది యూనిఫామ్ నిబంధనలను ఉల్లంగించడం కిందికిరాదు. ఇది శాంతి భద్రతలకు సంభందించిన విషయమని వాదించడం పూర్తి అసంబద్ధమైనది. గత ఎన్నో సంవత్సరాలనుండీ ఎప్పుడూకూడా కర్ణాటకలో కానీ మొత్తం భారత దేశంలోకానీ ఇటువంటి శాంతిభద్రతల సమస్య ఎన్నడూ ఉత్పన్నం కాలేదు.

పొరుగున ఉన్న కేరళ రాష్ట్రంలో ముస్లిం విద్యార్థినులు తాము కోరుకుంటే హెడ్ స్కార్ఫ్‌లు ధరించవచ్చు. చాలామంది అది కోరుకోవడంలేదు. అక్కడ ఖచ్చితంగా వేసుకోకూడదని కానీ వేసుకోవాలని కానీ నిబంధనలేమీ లేవు. కేరళలో హెడ్ స్కార్ఫ్‌లు ధరిస్తున్న బాలికలతో శాంతి భద్రతల సమస్యలేవీ తలెత్తడంలేదు. ఆ రాష్ట్రంలో ముస్లిం మహిళలలో అక్షరాస్యత రేటు అత్యధికంగా ఉండడంతో పాటుగా ఉన్నత విద్యా సంస్థలలో ముస్లిం బాలికల నమోదు అత్యధికంగా ఉంది.

కర్ణాటక ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వు ఉద్దేశ్యపూర్వకమైనది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 ప్రకారం ప్రతి వ్యక్తికీ భావ ప్రకటన స్వేచ్ఛతో పాటు తన కిష్టమైన మతాన్ని నమ్మడానికీ, ఆచరించడానికి, ప్రచారం చేసుకోడానికి హక్కు ఉంటుంది. ప్రభుత్వం శాంతి భద్రతల సాకుతో ఈ అంశాన్ని ముందుకు తీసుకువచ్చి రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛకు సంబంధించిన అంశాలైన ఏ మతాన్నయినా నమ్మే,ఆచారించే, ప్రచారం చేసుకొనే హక్కుల వలన శాంతి భద్రతల సమస్యలు వస్తున్నట్లు చిత్రీకరిస్తోంది.

కేరళ హైకోర్టుకు సంబందించిన ఒక కేసులో(ఆమ్నా బింట్ బషీర్ వర్సెస్ సీబీఎస్. ఈ 2016) ఇచ్చిన తీర్పులో ఒక ముస్లిం మహిళ పొడవు చేతుల దుస్తులు ధరించడం, హెడ్ స్కార్ఫ్ ధరించడం అనే అంశాలు ఆమె మతపరమైన ఆచారాలనీ వాటికి ఆర్టికల్ 25 కింద రక్షణ ఉన్నదనీ పేర్కొంది. ఈ కేసులో ఒక ముస్లిం విద్యార్థినికి సీబీఎస్ ఈ డ్రెస్ కోడ్ ప్రకారం పొట్టిచేతుల దుస్తులు ధరించాలనీ, హెడ్ స్కార్ఫ్ ధరించరాదనీ చెప్పడం అంటే సెక్షన్ 25 ప్రకారం ఆమె ప్రాథమిక హక్కులను హరించడమేనని చెప్పడం జరిగింది. అదే సందర్భంలో సీబీఎస్ ఈ వాదన ప్రకారం పరీక్ష హాలులోకి మోసపూరితంగా పేపర్లు తేవడాన్ని నిరోధించేందుకు ఆ మహిళలు సీబీఎస్ఈ నియమించిన అధికారులచే భౌతిక తనిఖీకి సహకరించాలని చెప్పింది. అంతేకానీ ఇది శాంతిభద్రతల సమస్యనో లేక నిజాయితీకి సంబంధించిన సమస్యనో కాదని కోర్టు స్పష్టం చేసింది. ఆ విధంగా పరీక్షా విధానంలో సమగ్రతను కాపాడడంతో పాటుగా ఆమె ప్రాథమిక హక్కులకు కూడా రక్షణ కల్పించబడింది. ఇంతకుముందు కూడా 2015లో ఇంకొక కేసులో(నదియా రహీం వర్సెస్ సీబీఎస్ఈ) కోర్టు ఇద్దరు ముస్లిం విద్యార్థినులు వారి మతాచారం ప్రకారం పొడవు చేతుల దుస్తులు ధరించేందుకూ, హెడ్ స్కార్ఫ్ ధరించేందుకూ వేసిన పిటిషన్‌ను సమర్థించింది. భిన్న సాంప్రదాయాలూ, మతాలూ ఉన్న దేశంలో ఒకే డ్రెస్ కోడ్‌ను అనుసరించాలనీ లేకుంటే వారిని పరీక్షలకు అనుమతించమనీ ఒత్తిడి చేయరాదని కోర్టు పేర్కొంది. ఈ కేసులో కూడా కోర్టు సీబీఎస్ఈ సూచనల మేరకు విద్యార్థిని భౌతిక తనిఖీలకు సహకరించాలని చెప్పింది. కర్ణాటక ప్రభుత్వం ఈ కోర్టు తీర్పులనన్నిటినీ తప్పుదోవ పట్టించే దురుద్దేశ్యంతోనే కోర్టులో వాదనలు జరిగే ముందుగానే అక్కడ శాంతి భద్రతల సమస్యలు తలెత్తినట్లుగా చూపింది.

వాస్తవానికి మన దృష్టి మరింత ఎక్కువమంది పిల్లలకు విద్యాహక్కును విస్తరించే ఆలోచనతో ఉండాలి. ఈ రెండు సంవత్సరాల ఆన్‌లైన్ క్లాసులతో బాలికలు ఎక్కువగా నష్టపోయారు. విద్యాహక్కు చట్టం ఫోరమ్ లెక్కల ప్రకారం కోవిడ్19 మహమ్మారి కారణంగా మన దేశంలో 10మిలియన్ల బాలికలు మాధ్యమిక విద్య నుండి తప్పుకున్నారు.

కర్ణాటకలో గ్రామీణ అభివృద్ధి శాఖ, పంచాయతీరాజ్ కలిసి ఒక సర్వే నిర్వహించి జూలై 2021లో ఆ రాష్ట్ర హైకోర్టుకు ఒక నివేదిక సమర్పించారు. దాని ప్రకారం గ్రామీణ కర్ణాటకలో 1.59 లక్షల మంది పిల్లలు బడి ముఖం చూడనివారు ఉన్నారు. అయినప్పటికీ ఈ ప్రభుత్వం ఒక సంకుచితమైన ఎజెండాతో బాలికలు బడులకు హాజరుకాకుండా బలవంతంగా వారిని ఆపుతున్నారు. ఇదంతా చూస్తుంటే ప్రభుత్వం ఇచ్చిన "బేటీ బచావో బేటీ పడావో "నినాదం లో ముస్లిం బేటీలకు(కూతుర్లకు) స్థానం లేదేమో అనిపిస్తుంది.

యువతీయువకుల భావోద్వేగాలను ఈ బలగాలు ఇంత క్రూరంగా తప్పుదోవ పట్టించడం చాలా బాధాకరం. ఆన్‌లైన్ తరగతులను అందుకోలేని లక్షలాదిమంది విద్యార్థులు తమ చదువులను నష్టపోయిన ఈ తరుణంలో యువజనులలో ఇటువంటి ఘర్షణలు సృష్టించి వారిని విభజించడం నేరపూరితమైన చర్యలు కాక మరేమిటి. విద్యాసంస్థలలో హిందుత్వ ఎజెండాను ముందుకు తీసుకెళ్లడానికే ఇంతటి ఘోరాలకు పాల్పడుతున్నారనేది స్పష్టంగా తెలుస్తోంది. కరోనా మహమ్మారి స్థానంలో మతోన్మాద మహమ్మారి ప్రవేశించింది. ఈ వైరస్ హిందుత్వశక్తుల ప్రయోగశాలలో తయారైంది. ఫలితంగా యువతీయువకుల జీవితాలకు నష్టం కలిగే విధంగా విద్యాసంస్థల లాక్‌డౌన్‌కు దారి తీసింది.

యూపీలో మండల్ శక్తుల తిరుగుబాటు

పొలిటికల్ విశ్లేషణ

ఎస్.ఎన్. సాహు, (మాజీ రాష్ట్రపతి కె.ఆర్. నారాయణన్ ప్రెస్ సెక్రటరీ)

ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సంభవిస్తున్న పరిణామాలు భారతీయ జనతా పార్టీని కలవరపరుస్తున్నాయి. హిందూత్వకు ఒక గట్టి ప్రతిఘటనగా లౌకిక విలువలు, మత బహుళత్వం పునరుత్థానమయ్యేందుకు చరిత్రాత్మక రైతు ఉద్యమం దోహదం చేయగా, సామాజిక న్యాయం ఎజెండాను పునరుద్ధరించాలని ఇతర వెనుకబడిన తరగతుల (ఓబీసీ) వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ పరిణామాలు యూపీ అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీకి తీరని నష్టం కలిగించనున్నాయని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

రైతు ఉద్యమం పశ్చిమయూపీలో జాట్‌లు, ముస్లింలను ఏకం చేసింది. ప్రజలను కుల మతాల వారీగా విడదీసే బీజేపీ రాజకీయాలకు అడ్డుకట్ట వేసింది. ముజాఫర్‌నగర్‌లో మతోన్మాద అల్లర్ల నేపథ్యంలో యూపీ ప్రజల్లో మతపరమైన చీలికలను సృష్టించడం ద్వారా 2014 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ విశేషంగా లబ్ధి పొందింది. హిందూ-ముస్లిం వైషమ్యాలకు తోడు తీవ్రస్థాయిలో ప్రజ్వరిల్లిన జాతీయవాద మనోభావాలు 2017 అసెంబ్లీ, 2019 సార్వత్రిక ఎన్నికలలో బీజేపీ విజయాలకు తిరుగులేని విధంగా తోడ్పడ్డాయి. ముస్లింలతో తమ సంప్రదాయ రాజకీయ మైత్రిని విడనాడిన జాట్ రైతులు ఆ రెండు ఎన్నికలలో బీజేపీకి మూకుమ్మడిగా ఓటు వేశారు. ఎన్నికల విజయాలతో ఆ పార్టీ తన హిందూత్వ ఎజెండాను మరింతగా ముందుకు తీసుకువెళ్ళింది. ముస్లింల మత విశ్వాసాలపై దాడి చేసింది. వారి ఆహార, చివరకు వస్త్ర ధారణ అలవాట్లను కూడా తెగనాడింది.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త సాగుచట్టాలు మతాలకు అతీతంగా రైతులందరినీ సమైక్యపరిచాయి. పశ్చిమ యూపీలో రైతుల మధ్య మతాలకు అతీతంగా పునరుజ్జీవమైన సమైక్యత ముజఫర్‌నగర్‌లో జరిగిన కిసాన్ మహాపంచాయత్‌లో సంపూర్ణంగా ప్రతిబింబించింది. రాకేష్ టికాయిత్ ‘అల్లా హొ అక్బర్’ అని ఎలుగెత్తినప్పుడు మహాపంచాయత్‌లో పాల్గొన్న రైతులు అందరూ ముక్తకంఠంతో హర హర మహదేవ్ అంటూ ప్రతిస్పందించారు. లౌకికవాదానికి ప్రధానమైన ఈ మత బహుళత్వం ప్రజలను మతాల వారీగా విడదీసే హిందూత్వ ఎజెండాకు పూర్తిగా విరుద్ధమైనది. ‘విద్వేషమే బీజేపీ రాజకీయాల ప్రమాణ చిహ్నం’ అని రాకేశ్ టికాయత్ వ్యాఖ్యానించాడు. ప్రజల్లో వెల్లివిరిసిన ఈ మత సమైక్యత యూపీ అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ విజయావకాశాలను ప్రతికూలంగా ప్రభావితం చేయనున్నది. ఈ వాస్తవాన్ని గుర్తించినందునే తాము తీసుకొచ్చిన కొత్త సాగు చట్టాలను మోదీ ప్రభుత్వం ఉపసంహరించుకుంది. అయితే అప్పటికే చాలా జాప్యం జరిగింది.

రైతు ఉద్యమంతో పాటు సామాజిక న్యాయ ఎజెండా పునరుద్ధరణ కూడా ప్రకంపనలు సృష్టిస్తోంది. యోగి ఆదిత్యనాథ్ మంత్రి మండలి నుంచి వైదొలిగి, బీజేపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసిన ముగ్గురు మంత్రులు- స్వామి ప్రసాద్ మౌర్య, దారాసింగ్ చౌహాన్, ధరం సింగ్ సైనీతో సహా పలువురు బీజేపీ శాసనసభ్యులే సామాజిక న్యాయ ఎజెండాను సమగ్రంగా అమలు పరచాలని పట్టుబడుతున్నారు. యోగి ప్రభుత్వం నుంచి వైదొలిగిన ముగ్గురు మంత్రులు తమ తమ సామాజిక వర్గాలలో గణనీయమైన పలుకుబడి ఉన్నవారు. గతంలో బీజేపీ ఎన్నికల విజయాలకు వారు విశేషంగా సహాయపడినవారే. సామాజిక న్యాయం పట్ల బీజేపీకి చిత్తశుద్ధి లేదన్నది వారి ఆరోపణ. ‘సామాజిక పునర్నిర్మాణం కంటే సామాజిక న్యాయానికి తక్కువ ప్రాధాన్యమిస్తున్నారు. హిందూత్వ లక్ష్యాల సాధనకు అవసరమైన సంఖ్యాధిక్యతలను వెనుకబడిన కులాలు, దళితుల మద్దతుతో సమకూర్చుకోవడమే బీజేపీ పునర్నిర్మాణ కార్యక్రమం. అగ్రకులాల ప్రయోజనాలకే ప్రథమ ప్రాధాన్యమని వారు విమర్శించారు.

యోగి ప్రభుత్వం మైనారిటీల శ్రేయస్సును విస్మరించి ఉన్నత కులాల వారినే అన్ని విధాల ప్రోత్సహిస్తుందని స్వామి ప్రసాద్ మౌర్య తదితరులు ధ్వజమెత్తారు. మైనారిటీల పట్ల అన్ని విషయాలలోనూ వివక్ష చూపడం సాధారణమైపోయిందని వారు పేర్కొన్నారు. ఓబీసీలు, ఎస్సీలు, ఎస్టీల విషయంలో కూడా యూపీ ప్రభుత్వం రాజ్యాంగ బద్ధంగా వ్యవహరించడం లేదు. విద్యా ఉద్యోగాలలో ఆ బడుగు వర్గాలకు రిజర్వేషన్లను అర్హులైన అభ్యర్థులు లేరనే సాకుతో అమలుపరచడం లేదు. తమకు న్యాయబద్ధంగా దక్కవలసిన రిజర్వేషన్లు దక్కకపోవడం పట్ల ఆ సామాజిక వర్గాలలో తీవ్ర అసంతృప్తి నెలకొని ఉంది. ఉద్యోగ నియామకాలలో తమ పట్ల పూర్తి ఉదాసీనత

చూపడం వారిని ఆందోళనకు గురిచేస్తోంది. ఉన్న ఉద్యోగాల విషయంలో కూడా తమకు న్యాయం చేయకపోతే ఎలా అని వారు ప్రశ్నిస్తున్నారు.

ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తన సొంత ఠాకూర్ కులస్తులకే అన్నిటా అగ్ర ప్రాధాన్యం ఇవ్వడం పట్ల మిగతా సామాజిక వర్గాలలో తీవ్ర అసంతృప్తి నెలకొని ఉంది. రాజకీయ, పాలనా రంగాలలో కీలక పదవులు అన్నిటిలోనూ ఠాకూర్లే కనిపిస్తున్నారు. యూపీ సమాజంలో వారి ప్రాబల్యం పెరిగిపోతుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతుంది. గమనార్హమైన విషయమేమిటంటే తమ ఓట్ల ఆధారంగా అధికారానికి వచ్చిన హిందుత్వవాదులు అగ్రకులాలకే అధిక ప్రాధాన్యమిస్తూ తమ శ్రేయస్సును ఉపేక్షిస్తున్నారని ఓబీసీలు, ఎస్సీలు, ఎస్టీలు గట్టిగా విశ్వసిస్తున్నారు. కేవలం మైనారిటీలనే కాకుండా వెనుకబడిన కులాలు, దళితులను సైతం హిందుత్వ అణచివేస్తుందనే సత్యాన్ని అర్థం చేసుకుంటున్న వారి సంఖ్య అంతకంతకూ పెరిగిపోతోంది.

నిరుద్యోగిత అంతకంతకూ పెచ్చరిల్లిపోతోంది. ధరలు భరించలేని విధంగా పెరిగిపోతున్నాయి. ఆహార భద్రత కొరవడుతోంది. ఆరోగ్య సంక్షోభం సరేసరి. ఈ సమస్యలన్నీ ఉత్తరప్రదేశ్ ప్రజలు అందరినీ వేధిస్తున్నాయి. అయితే మరెవ్వరికంటే వెనుకబడినకులాలు, అణగారిన వర్గాల వారే వాటి భారాన్ని ఎక్కువగా చవిచూస్తున్నారు. కొవిడ్–19 రెండో దశ తీవ్రత యూపీ ప్రజలను ఇప్పటికీ భయకంపితులను చేస్తోంది. వైద్య సదుపాయాలు, మందుల కొరతతో కుటుంబసభ్యులు, ఇతర ఆప్తులను కోల్పోవలసిరావడం చాలామందిని అంతులేకుండా బాధిస్తూనే ఉంది. సార్స్ కోవ్–2 రూపాంతరమైన ఒమైక్రాన్ ప్రస్తుతం విజృంభిస్తున్నప్పటికీ ఆ పరిస్థితులలో ఇప్పటికీ మెరుగుదల లేకపోవడం వారిని అమితంగా కలవరపరుస్తోంది. మహమ్మారిని అదుపు చేయడంలో యోగి ప్రభుత్వం సమర్థంగా వ్యవహరించలేకపోయిందనే భావం ప్రజల్లో బలంగా ఉంది.

కులాల వారీగా జనాభా గణన నిర్వహించాలన్న ఓబీసీ నాయకుల డిమాండ్‌ను అటు కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వమూ, ఇటు లక్నోలోని యోగి సర్కార్ రెండూ నిర్ద్వంద్వంగా తిరస్కరించడాన్ని సంబంధిత వర్గాల ప్రజలు తీవ్రంగా నిరసిస్తున్నారు. ఈ తిరస్కరణ తమను అవమానించడమేనని వారు ఆగ్రహిస్తున్నారు. వారి ఆగ్రహం అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపే అవకాశం ఎంతైనా ఉంది. దీనికి తోడు తమ పార్టీ అధికారానికి వస్తే మూడు నెలలలోగా బీసీ జనాభా గణన నిర్వహిస్తామని సమాజ్‌వాది పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ ప్రకటించారు. ఓబీసీలు ఇప్పటికే ఆయన వైపు మొగ్గు చూపుతున్నారు. ఇది బీజేపీకి ప్రతికూల పరిస్థితిని సృష్టిస్తుందనడంలో సందేహం లేదు.

యోగి పాలనలో తమ సామాజిక, ఆర్థిక పరిస్థితులు దిగజారిపోవడం వల్ల వెనుకబడినకులాల వారిలో తీవ్ర అసంతృప్తి నెలకొని ఉంది. బీజేపీ నుంచి వైదొలగి హిందుత్వను వ్యతిరేకించాలని వారు తమ ప్రజాప్రతినిధులపై ఒత్తిడి చేస్తున్నారు. హిందుత్వ భావజాలమే తమకు అస్తిత్వ సంక్షోభాన్ని సృష్టించిందని ఆ నాయకులూ గ్రహిస్తున్నారు. అందుకు వారు బీజేపీ నుంచి వైదొలుగుతున్నారు. ఓబీసీలు, దళితులు, ఆదివాసీలు, మైనారిటీల శ్రేయస్సుకు కీలకమైన సామాజిక న్యాయం ఎజెండాను బీజేపీ పూర్తిగా ఉపేక్షిస్తోందని వారు ఆరోపిస్తున్నారు.

రైతు ఉద్యమ లౌకిక విలువలు, మత సామరస్యం, ఓబీసీ నాయకుల సామాజిక న్యాయ ఎజెండా బీజేపీకి ఒక ప్రతికూల పరిస్థితిని సృష్టించాయి. ఈ కారణంగా ఎన్నికల రాజకీయాల సంక్లిష్టతలను గతంలో వలే అధిగమించగలగడం హిందుత్వ పార్టీకి అసాధ్యంగా ఉంది. ఇది వారిని తీవ్రంగా కలవరపరుస్తోంది. హిందుత్వ లక్ష్యాల సాధనకు కీలకమైన ఓబీసీల మద్దతు బీజేపీకి ఏ విధంగాను లభించని పరిస్థితి ఏర్పడింది. యూపీ అసెంబ్లీ ఎన్నికలు 80 శాతం మందికి, 20 శాతం మందికి మధ్య జరగనున్న పోరాటమని యోగి ఆదిత్యనాథ్ అభిర్ణించారు. ఆ గణాంకాలు రాష్ట్ర జనాభాలోని హిందువులు, ముస్లింల నిష్పత్తిని ప్రతిబింబిస్తున్నాయనేది అందరికీ తెలిసిన విషయమే. ఆ వ్యాఖ్య ద్వారా ముస్లింల పట్ల హిందుత్వ దృక్పథమేమిటో మరోసారి విశదమయింది. సామాజిక న్యాయాన్ని కూడా అది వ్యతిరేకిస్తుందనే విషయం కూడా అందరికీ అర్థమయింది.

సామాజిక న్యాయ ఎజెండా పునరుద్ధరణ మండల్ వెర్సెస్ కమండల్ రాజకీయాలను గుర్తు చేస్తుంది. మతతత్వాన్ని సామాజికన్యాయం పదిహేను సంవత్సరాల పాటు అదుపులో ఉంచిన రాజకీయాలవి. కమండల్ ప్రాధాన్యం సంతరించుకున్న తరువాతనే సామాజిక న్యాయశక్తులు బలహీనపడ్డాయి. తద్వారా హిందుత్వ రాజకీయాలు ప్రభవించడానికి దారి సుగమమయింది. క్రింది స్థాయి వర్గాల వారి సమానత్వం, సామాజిక న్యాయ డిమాండ్లను బలహీనపరిచేందుకే బీజేపీ అయోధ్యలో రామాలయ నిర్మాణానికి పూనుకున్నది. అందుకే కారిడార్ ప్రాజెక్టునూ ప్రారంభించింది.

యూపీ అసెంబ్లీ ఎన్నికలలో 40 శాతం స్థానాలు మహిళా అభ్యర్థులకు కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ఈ నిర్ణయం హిందుత్వ మహిళా వ్యతిరేక ఎజెండాపై ప్రతికూల ప్రభావం తప్పక చూపుతుంది. లౌకికవాద విలువల పరిరక్షణకు పోరాటం మహిళా హక్కుల కోసం పోరాటమే అన్న అభిప్రాయం పూర్తిగా సహేతుకమైనది. రాజకీయాలలో జెండర్ న్యాయం లౌకికవాదాన్ని కాపాడడంతో పాటు హిందుత్వను తిరస్కరిస్తుంది.

ఉత్తరప్రదేశ్‌లో చాలా సంవత్సరాల తరువాత సామాజికన్యాయం గురించి ప్రజలు మాట్లాడుకుంటున్నారు. ఇది ఎవరూ విస్మరించలేని వాస్తవం. సామాజిక న్యాయ ఆకాంక్షలూ, ఆరాటాలూ బీజేపీని ప్రజాక్షేత్రంలోనూ, ఎన్నికల పోరాటంలోనూ బలహీనపరుస్తాయి. యూపీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు దేశ ప్రజలను ఆశ్చర్యపరిచే విధంగా ఉంటాయి. అంతేకాకుండా అవి జాతీయ రాజకీయాలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేసి లౌకికవాదశక్తులను ఉత్సాహపరిచి వాటిని 'భారత్ భావన' వెనుక సమైక్యపరుస్తాయి. హిందుత్వ శక్తుల పురోగతిని అడ్డుకున్న ప్రతిష్ఠ రైతులు, వెనుకబడిన కులాలు, జెండర్ న్యాయానికి ప్రాతినిధ్యం వహిస్తున్న శక్తులకే దక్కుతుంది.

మహిళా తరం మారుతోంది...

కె. పద్మజ

ఒకప్పటికి, ఇప్పటికీ చాలా తేడా ఉంది. నిన్నటి తరం వరకూ మహిళల్లో ఓర్పుండేది. కుటుంబంలో ఎన్ని చికాకులున్నా ఒక ఏడుపు ఏడ్చి సర్దుకుపోయే పరిస్థితుండేది. అత్తమామలతో మనస్పర్థలు కావచ్చు, భర్త వ్యవహారశైలి విషయం నచ్చక కావచ్చు..దేన్నైనా స్నేహితురాళ్లతో చెప్పుకుని బరువు దించేసుకుని ఊరుకునే వాళ్లు. ఎందుకంటే అప్పట్లో దాదాపు అందరు మహిళల పరిస్థితి అలాగే ఉండేది. ఎక్కడో ఒకరిద్దరు విడాకులు తీసుకుంటే ఈ మహిళలే "అవ్వ..ఎంత పని చేసిందో..ఎంత అప్రతిష్ట.." అని చిరాకు పడేవారు తప్ప "పోనీలే..విముక్తి పొంది హాయిగా ఉంది" అని అనుకునే వారు కాదు. ఇప్పుడదంతా మారింది. సమస్యలున్నా విడాకులు తీసుకోకుండా మగ్గుతున్న ఆడవాళ్లని చూసి సాటి ఆడవాళ్లే తక్కువగా చూస్తున్నారు. ఆడదాని ఓర్పుని ఇప్పుడు సమాజంలో కొత్తతరం మహిళలు ఆదర్శంగా చూడట్లేదు. "నచ్చకపోతే గుడ్ బై చెప్పేయాలి గానీ ఏవిటి సెంటిమెంటల్ నాన్సెన్స్" అనేవాళ్లు పెరుగుతూనే ఉన్నారు. దీనికి ముఖ్యకారణం ఆడవాళ్లు స్వయం సమృద్ధి చెంది బాగా సంపాదించుకోగలగడం. ఆ పైన చట్టాలు కూడా ఆడవాళ్ల పక్షాన బలంగా ఉండడం. ఇప్పటికీ నిన్నటి తరం మహిళల్లా ఏ స్థాయి సమస్యలున్నా సర్దుకుపోతున్న వాళ్లెవరైనా ఉంటున్నారంటే వాళ్లు కేవలం స్వయం ఉపాధి లేకనో, తమ తల్లిదండ్రులు బాధపడతారనో, పిల్లలకోసమో నెట్టుకొస్తున్నవాళ్లే. అన్నిటికంటే ముఖ్యంగా ఆర్థికంగా బలంగా ఉన్న కుటుంబాలనుంచి వచ్చిన మహిళలు మాత్రం ఏ రకమైన స్వేచ్ఛా హరణానికి, అవమానానికి సహించడంలేదు.

సమంత విడాకుల విషయంలో తొలుత విడిపోవాలని కోరుకున్నది సమంతేనని నాగార్జున చెప్పినట్టు ప్రచారం జరిగింది. కానీ కొన్ని గంటల్లోనే నాగార్జున అది అసత్యమని ఖండించారు. ధనుష్-ఐశ్వర్య విడాకుల విషయంలో విడిపోవాలని కోరున్నది ఐశ్వర్యేనని తమిళనాడులో బాహాటంగానే చెప్పుకుంటున్నారు. ఈ విషయాన్ని రజినీకాంత్ గాని, ధనుష్ కానీ ఖండించలేదు. మరొక పెద్ద తెలుగు హీరో రెండవ కుమార్తె విడాకుల విషయం కూడా ప్రస్తుతానికి పుకారుగా చలామణీలో ఉంది. అక్కడ కూడా నిర్ణయం ఆమెదేనని చెబుతున్నారు. కారణమేదైనా కావొచ్చు, పూర్వం మాదిరిగా మహిళలు అస్సలు స్పేర్ చేయట్లేదు. తమకు నచ్చినట్టు భర్తలు నడుచుకోకపోతే ఏదో ఒక రోజు అవతలికి పొమ్మనే స్థాయిలో ఉన్నారు. ఐశ్వర్య-ధనుష్ ల వివాహం ఎప్పుడో 18 ఏళ్ల క్రితం జరిగింది. పిల్లలు కూడా పెద్దవాళ్లౌతున్నారు. వీళ్లది సమంత-నాగచైతన్య జంటలాగ కాదు. అయినా సరే భరించే ఓపిక లేక సెపెరేటైపోయారు. ఇక్కడ గమనించాల్సిన విషయం ఈ ముగ్గురు స్త్రీలు ఆర్థికంగా బలవంతులే. తమకంటూ ఒక నేపథ్యం, స్థాయి ఉన్నవారే. అలాగే ఒక సుప్రసిద్ధ దర్శకుడి భార్య భర్త వ్యవహారాలు నచ్చకపోయినా సర్దుకుపోయి జీవిస్తోంది. ఆమె నిన్నటితరం మహిళ. ఆర్థికంగా పూర్తిగా భర్తమీదే ఆధారం. అందుకే ఆమె విడాకుల నిర్ణయం తీసుకోలేదు. మరొక సుప్రసిద్ధ సినీప్రముఖురాలు పేరు, డబ్బు గడించే వరకు భర్తతోనే ఉంది. ఆ రెండూ వచ్చాక ఇద్దరి మధ్యలో మనస్పర్థలు వచ్చాయి. ఆమె స్వేచ్ఛని ఇతను భరించలేకపోయాడు. ఇతని లేని తనాన్ని, తన మీదే ఆధారుపడుతున్న వైనాన్ని ఆమె సహించలేకపోయింది. అంతే మొదట ఆమెనే గుడ్ బై చెప్పింది. తర్వాత వదలద్దని అతను ప్రాధేయపడ్డాడు. ఆమె ఎలా ఉన్నా తాను నడుచుకుంటానన్నాడు. అయినా సరే ఒకసారి మనసు విరిగాక మళ్లీ వెనకడుగు వేయలేదామె. చేసేది లేక కొన్నేళ్లకు ఆమెకు విముక్తి ప్రసాదించవలసివచ్చింది అతనికి.

స్వయంప్రతిభ ఉన్నా, ఆర్థిక బలం ఉన్నా స్త్రీలు అణిగిమణిగి బ్రతకడానికి అస్సలు తావు ఇవ్వట్లేదు. భర్తలు మేల్ ఇగోని పక్కనబెట్టి వీళ్లతో సర్దుకుపోగలగాలి. అది కష్టమైతే ఏదో ఒకనాడు విడాకులు తప్పకపోవచ్చు. ఇప్పుడలా ఉంది పరిస్థితి. సెలెబ్రిటీలని పక్కన బెడితే.. ఎన్నో ఆశలతో పెళ్లిళ్లు చేసుకునే అమ్మాయిలుంటారు. ఉదాహరణకి ఒకమ్మాయి ఏదో పీజీ చదివి ఉద్యోగం చేసే ఆలోచన మాత్రం లేకుండా నెలకి రెండు లక్షలు సంపాదిస్తున్న సాఫ్ట్వేర్ ఇంజనీర్ ని పెళ్లి చేసుకుందనుకుందాం. ఆమె ఆలోచనలన్నీ ఎప్పుడెప్పుడు భర్తకి ఆన్సైట్ వస్తే అమెరికా చెక్కేద్దామా అని ఉంటుంది. ఆ భర్తకి ఆన్సైట్ ఆఫర్లు రాకపోవచ్చు. వచ్చినా అతనికి ఇష్టం ఉండకపోవచ్చు. తన తల్లిదండ్రుల్ని చూసుకోవాలనో మరొకటో చెప్పి అతను ఇక్కడే ఉండొచ్చు. అతనికి సెటిల్ కాని తమ్ముడు, పెన్షన్ రాని తల్లిదండ్రులు ఉంటే నెలకి వచ్చే మొత్తంలో చాలావరకు అటు పోతుంది. ఈ అమ్మాయి కలలు గన్నట్టుగా కార్లు, గేటెడ్ కమ్యూనిటీ ఇల్లు, అమెరికా పయనం పెళ్లయ్యి పదేళ్లయినా నెరవేరకపోవచ్చు. తన తోటి స్నేహితురాళ్లు మాత్రం అమెరికాలో కొందరు, లోకల్ గానే గేటెడ్ కమ్యూనిటీల్లో కొందరు సెటిలౌతుంటారు. అక్కడే కంపారిజన్ సిండ్రాం మొదలయ్యి భర్త మీద అసంతృప్తి పెంచుకుంటుంది. అతనినొక చేతకానివాడిగా చూస్తుంది. చిన్నదానికే అపరకాళిగా మారి నానా గొడవలు చేస్తుంది. కానీ విడాకులిస్తానని మాత్రం అనదు. ఎందుకంటే తనకు ఆర్థిక పరిపుష్టితో విడిగా బతికే శక్తిలేదని తెలుసు. అలాగని మొగుడ్ని ప్రశాంతంగా మాత్రం బతకనీయదు.

పైన ఉదాహరణకి ఏకవచనంలో ఒకానొక మహిళ గురించి చెప్పినట్టు చెప్పినా, ఇలాంటి కేసులు నూటికి 80 ఉంటున్నాయని మేరేజ్ కౌన్సిలింగ్ వాళ్లు చెబుతున్నారు. హైదరాబాదులో ఉద్యోగం చేయని ఒకమ్మాయి మేరేజ్ కౌన్సెలింగులో, "నా భర్త నెలకి రూ 40000 చేతిలో పెట్టి ఊరుకుంటాడు. దాంతోనే ఇల్లు నడిపాలంటాడు. అందులో మిగిలినదాంతో ఏదైనా కొనుక్కోమంటాడు. రూ 10000 మిగులుతాయి. ఏం చేసుకోను బోడి పదివేలు. అందుకేనా నేను నల్లగా ఉన్నా కూడా ఈ సాఫ్ట్వేర్ ఇంజనీర్ ని చేసుకున్నది? నాకు విడాకులు కావాలి" అని చెప్పిందట. ఆ తెల్లగా ఉన్న అమ్మాయిని వెండి చెంచాతో పుట్టిందేమో అనుకుని అనుకుని "ఏవమ్మా మీ నాన్నగారేం చేస్తారు?" అనడిగితే, "ఏలూరులో ఇన్సూరెన్స్ ఏజెంటు" అని చెప్పిందట. ఇక ఆ అమ్మాయికి సుదీర్ఘమైన క్లాసు తీసుకుని రూ 10000 విలువ ఏమిటో వివరించి ఇంటికి పంపామని చెప్పారు కౌన్సెలింగిచ్చిన వారు. ఇక్కడ విషయమేంటంటే విపరీతమైన ఎక్స్పోజర్ ఉన్న సెలెబ్రిటీలు గానీ, అమాయత్వంతో ఉండి తమ అందమే పెద్ద ఆస్తి అనుకునే సాధారణ మిడిల్ క్లాస్ అమ్మాయిలు గానీ మానసికంగా ఓపికని ప్రదర్శించలేకపోతున్నారు. వీళ్లు భర్త తమకు నచ్చినట్టుగా ఉండాలని బలంగా కోరుకుంటున్నారు. ఉండకపోతే గెటౌట్ మంత్రం జపిస్తున్నారు.

మారుతున్న కాలంలో పెళ్లీడుకొస్తున్న అబ్బాయిలకి, వారి తల్లిదండ్రులకి ఇదొక సమాచారం. బహుశా కొన్నేళ్లల్లో వివాహవ్యవస్థకు సంబంధించి పురుషుల హక్కులతో కూడిన కొత్త చట్టాలు కూడా వెలుగులోకొస్తాయేమో.

మహిళల వివాహ పెంపుతో సమానత్వం సాధ్యమా?

మనదేశంలో "మేజర్" అని డిక్లేర్ చేయడానికి స్త్రీ, పురుషులకు ఒకే వయస్సు 18ఏళ్ళుగా నిర్ధారించినప్పుడు, వివాహం వయస్సులో ఆడపిల్లలకు 18, మగ పిల్లలకు 21 ఏమిటి అనే ప్రశ్నకు ఫుల్ స్టాప్ పెడుతూ, ఆడ పిల్లల వివాహ వయస్సు 21గా మార్చుడం సమంజసమే. టాస్క్‌ఫోర్స్ ఇచ్చిన నివేదిక ఆధారంగా కేంద్ర మంత్రివర్గం భారతదేశంలో మహిళల వివాహ వయస్సు 18 నుండి 21 వరకూ పెంచే నిర్ణయం స్వాగతించే అంశమే. దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాలు, యూనివర్సిటీలు, కుటుంబాలను అడిగి, వారి అభిప్రాయాలను, వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని టాస్‌ఫోర్స్ బృందం మహిళల సామాజిక, ఆర్థిక, ఆరోగ్య అభివృద్ధికి వివాహ వయస్సు 21సంవత్సరాలుగా సూచించింది. ఈ సూచనల ఆధారంగానే కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. మంచిదే... 1978లో ఆనాటి పరిస్థితిలను దృష్టిలో ఉంచుకుని ముఖ్యంగా 'కుటుంబ నియంత్రణ' కోసం ఆడపిల్లల కనీస వివాహ వయస్సు 18గా నిర్ణయుంచారు. ఇది నేటికీ మన దేశంలో అమలు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ పద్ధతి వల్ల చాలా మంది ఆడపిల్లల చదువు మధ్యలోనే అటకెక్కుతోంది. శారీరక పెరుగుదల కోణంలోనే చూస్తున్నారు తప్ప, మానసిక పరిమితికి ప్రాధాన్యత ఇవ్వడం లేదు. దీని మూలంగా, 20లోపే గర్భం ధరించి, పుట్టిన పిల్లలను సంరక్షణ చేసుకోలేక అనేక అనారోగ్యాలకు గురవుతున్నారు అని పలు నివేదికలు చెబుతున్నాయి. కొన్ని సందర్భాల్లో మాతా శిశు మరణాలూ సంభవిస్తున్నాయి. ఇది అత్యంత బాధాకరమైన విషయం.

సత్యాల వెంకటేష్
ఎం.ఏ., (ఎంఫిల్)

నేటికీ మన దేశంలో ప్రతీ సంవత్సరం 1.5 మిలియన్ల బాల్యవివాహాలు జరుగుతున్నట్లు యునిసెఫ్ తెలియపరిచింది. ప్రపంచంలో జరిగే బాల్యవివాహాల్లో మూడవవంతు మనదేశంలోనే ఉండటం ఆందోళన కలిగిస్తుంది. ఆడపిల్లలు అంటే "ఆళ్ళ" పిల్లలే అని దురభిప్రాయం మన కుటుంబాల్లో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా ఉన్నది. అందుచేతనే పదవ తరగతి చదువుతున్న రోజుల్లోనే ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రాజస్థాన్ ఈ విషయంలో దేశంలోనే మొదటి స్థానంలో ఉంది. దేశ వ్యాప్తంగా నేటికీ 47శాతం బాల్యవివాహాలు జరుగుతున్నాయి అని ఐక్యరాజ్యసమితి బాలలనిధి తెలియజేస్తున్నది. చదువుకున్న వారు కూడా బాల్యవివాహాలు జరిపించడం బాధాకరమైన విషయం. మగ పిల్లలు ఎక్కువ, ఆడ పిల్లలు తక్కువ అనే భావం నేటికీ అనేక కుటుంబాల్లో కనపడుతోంది. ఈ రకమైన ఆలోచనలు మార్చుకోవాలి. "లింగ సమానత్వం" దిశగా ప్రయాణం చేయాలి. మత విశ్వాసాలను, మూఢ విశ్వాసాలను, ఆచారాలను పక్కన పెట్టాలి. అందరూ సమానమే అనే భావన రావాలి. స్త్రీని దైవంగా కొలిచే ఈ దేశం నిరంతరం మహిళల వేధింపులకు నిలయంగా ఎందుకు ఉంటుందో ఆలోచన చేయాలి. మన సంస్కృతి సాంప్రదాయాలను పాశ్చాత్య దేశాల్లో గొప్పలుగా చెప్పుకొంటున్న మనం, ఈరోజున మన దేశంలో ఉన్న వాస్తవ పరిస్థితులకు ఏమి సంజాయిషీ ఇస్తాం...? ఆకలి బాధలు, ఆక్రందనలు, వివక్షత, పేదరికం, అవిద్య, అక్రమ రవాణా, అఘాయిత్యాలు, ఆత్మహత్యలు, యాసిడ్ దాడులు, పరువు హత్యలు, వరకట్న వేధింపులు, వ్యభిచార కూపాలు, అవహేళనలు, గృహహింసలు, లైంగిక దోపిడీ, ర్యాగింగ్, రేప్‌లకు నిలయంగా ఉన్న ఈదేశంలో సగౌరవంగా స్త్రీ బతికేది ఎప్పుడు...? ఆలోచన చేయాలి. అందుకే "ఒక దేశ అభివృద్ధి, ఆ దేశ మహిళా అభివృద్ధిపై ఆధారపడి ఉంటుంది" అంటారు అంబేద్కర్. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని, దేశంలో ఉన్న అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు చిత్తశుద్ధితో అమలు చేయాలి. కానీ అంతమాత్రానికే దేశంలో మహిళలకు రక్షణ, భద్రత, సమానత్వం కలుగుతుందా?. పురుషులుతో సమానంగా స్త్రీలు అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుస్తారా?. దేశాభివృద్ధికి తిరుగులేని శక్తిగా నిలబడుతారా? దిశ యాప్, షీ టీం, మహిళా పోలీస్ స్టేషన్లు, నిర్భయ చట్టం ఉన్నా, అనునిత్యం దేశంలో ఏదో ఒక చోట మహిళల ఆక్రందనలు ఎందుకు వినిపిస్తున్నాయో గుర్తెరగాలి.

ఇటీవలి కాలంలో దేశంలో లింగ నిష్పత్తిలో 1000 మంది పురుషులకు, మహిళలు 1020 పైబడి నమోదు కావడం శుభ పరిణామంగా భావించాలి. భ్రూణ హత్యలు తగ్గాయి. అయితే అదే సమయంలో అఘాయిత్యాలు, గృహహింస రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఈ కరోనా కాలంలో మరింత ఎక్కువయినాయి. చట్టాలు ఎన్ని ఉన్నా సమాజంలో మహిళలపై చిన్న చూపు, వివక్షత కొనసాగుతూనే ఉంది. ఈ విషయాలపై ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. బాలికా విద్యను బలోపేతం చేయాలి. పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించాలి. ఆరోగ్య సేవలు పథకాలు అమలు చేయాలి. ముఖ్యంగా మహిళలు పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారు. బి.యమ్.ఐ సూచీలో వెనుకబడిన వారిగా ఉంటున్నారు. నేటి ఆధునిక కాలంలో కూడా చిన్నప్పుడు తల్లిదండ్రుల ఆధీనంలో, వివాహం అనంతరం భర్త ఆధీనంలో ఒక స్వతంత్ర ప్రతిపత్తిలేని వ్యక్తిగా మహిళ కొనసాగడం శోచనీయం. ఇటువంటి పరిస్థితుల్లో మహిళల వివాహ వయస్సు 21గా చేయటం మాత్రమే కాదు, తద్వారా కనీసం గ్రాడ్యుయేట్ డిగ్రీ పూర్తి చేసి, తమ కాళ్ళపై తాము నిలబడే స్థాయికి చేరి ఆర్థికంగా, సామాజికంగా, సమానత్వాన్ని సాధించేలా ప్రభుత్వం అవకాశాలు కల్పించాలి. అప్పుడే మహిళా సాధికారత సాధ్యం అవుతుంది. తల్లిదండ్రులు కూడా ఆడపిల్లల చదువు, ఎదుగుదలకు తోడ్పాటును అందించాలి. అంతేగానీ, కేవలం వివాహ వయస్సు పెంపు ఒక్కటే, మహిళాభివృద్ధికి భరోసా ఇవ్వలేదు అని గ్రహించాలి. "భేటీ బచావో... భేటీ పడావో, విద్యా కానుక, కళ్యాణిలక్ష్మి, షాదీ ముబారక్, సుకన్య సమృద్ధి యోజన పథకం, బాలికా సమృద్ధి యోజన, వంటి పథకాలు కొంతమేరకు ఉపశమనం తప్ప, శాశ్వతంగా మహిళలకు రక్షణ కల్పించలేవు అనే వాస్తవాన్ని ప్రభుత్వాలు గ్రహించాలి. మహిళలకు చదువు, ఆరోగ్య సేవలు, మహిళా చట్టాలు పటిష్టంగా అమలు చేయాలి. చిత్తశుద్ధితో ఇప్పటికీ పార్లమెంట్‌లో "పెండింగ్‌లో ఉన్న మహిళల రిజర్వేషన్ బిల్లు"ను ఆమోదించాలి. పాలకులు చిత్తశుద్ధి రుజువు చేసుకోవాలి. "పదవిలో ఆమే, పెత్తనం పెనుమిటిది (భర్త)గా ఉండరాదు". కాబట్టి ప్రస్తుత మహిళల వివాహ వయస్సు పెంపుదల మంచిదే కానీ, ఆమె అభివృద్ధికి ప్రభుత్వాలు, కుటుంబ సభ్యులు, సమాజం సహకరిస్తేనే, ఏ ఉద్దేశంతో ఈ చట్ట సవరణకు సిద్ధ పడుతున్నారో... ఆ ఆశయం సఫలీకృతం అవుతుంది. మహిళా సాధికారతకు సామాజిక మాధ్యమాలు కూడా వెన్నుదన్నుగా నిలవాలి..

టాటా తమ్ముడూ..ఓ అజ్ఞాతవాసి..!!!

ఈయన ఎవరో తెలుసా..? ఆ రతన్ టాటా తమ్ముడు... ఫుల్ కంట్రాస్ట్, అజ్ఞాతి.

రతన్ టాటా... జగమెరిగిన పేరు... వేల కోట్ల ఛారిటీ, విలువలతో కూడిన వ్యాపారం, క్రమశిక్షణ, నిలువెల్లా భారతీయత, విశ్వసనీయత, పరిపూర్ణ జాతీయతత్వం ఎట్సెట్రా... టీవీలు, పత్రికలు, సైట్లు, ఛానెళ్లు, బిజినెస్ సర్కిళ్లు, పొలిటికల్–బ్యూరోక్రటిక్ సర్కిళ్లు, ఇతర ఇండియన్ అత్యధిక ప్రభావశీల సమూహాల్లో ఎప్పుడూ నానే పేరు ఆయనది... ఈ కేరక్టర్‌కు పూర్తి భిన్నమైన నీడ ఒకటి ఉంది... ఫుల్ కంట్రాస్ట్ కేరక్టర్... ఆయన పేరు జిమ్మీ టాటా... ఆ రతన్ టాటాకు స్వయానా తమ్ముడు... అసలు ఈయన ఉన్నాడనే విషయమే లోకానికి సరిగ్గా తెలియదు... అంతెందుకు.. టాటా గ్రూప్ హైప్రొఫైల్ డిగ్నిటరీల్లోనే చాలామంది తెలియదు, ఆయన మొహం చూడలేదు.

అంత నిరాడంబర జీవితం తనది... సముద్రముఖంతో ఉండే ఓ అపార్ట్‌మెంట్... ముంబైలోని కొలబా... అక్కడే రతన్ టాటా కూడా ఉంటాడు... ఈ జిమ్మీ టాటా ఆ భవనపు ఆరో ఫ్లోర్‌లోని టూబెడ్రూం ఫ్లాటులో ఉంటాడు... అన్నలాగే బ్రహ్మచారి... కానీ తమ్ముడి ఫ్లాట్ మెయింటెనెన్స్ పూర్... ఫైళ్లు, దుమ్ము... ఎప్పుడూ తలుపులు మూసే ఉంటయ్... ఎప్పుడోసారి గానీ బయటికి రాడు... అంతెందుకు..? తనకు ఓ మొబైల్ ఫోన్ లేదు ఇప్పటికీ... అలాగని ఏమీ తెలియని వాడేమీ కాదు... తమ గ్రూపులో ఎప్పుడేం జరుగుతుందో మొత్తం తెలుసు... వివిధ పత్రికల్లో వచ్చిన విశ్లేషణలు, కథనాలు సేకరించి, తనకంటూ ఓ అంచనాకు వస్తాడు.

హఠాత్తుగా కొన్ని బిజినెస్ పత్రికలు నిన్న ఈయన గురించి ప్రత్యేకంగా రాసుకొచ్చాయి... కానీ నిజానికి 2016లోనే టైమ్స్ ఆఫ్ ఇండియా ఆయన జీవితం గురించి రాసుకొచ్చింది... టాటా వర్సెస్ మిస్త్రీ జోరుగా సాగుతున్నవేళ ఈయన అభిప్రాయాన్ని సేకరించింది... అప్పుడే చాలామందికి రతన్ టాటాకు ఓ సోదరుడున్నాడనే విషయం తెలిసొచ్చింది... టీసీఎస్, టాటా మోటార్స్, టాటా స్టీల్, టాటా కెమికల్స్, ఇండియన్ హోటల్స్, టాటా పవర్ వంటి ప్రిస్టేజియస్, వెరీ వాల్యూబుల్ కంపెనీల్లో జిమ్మీకి షేర్లున్నయ్... అంటే తను వ్యక్తిగతంగా ఎంత ఆస్తిపరుడో అర్థమైంది కదా... తను టాటా ఫౌండేషన్‌లో కూడా ఓ ట్రస్టీ... కానీ నమ్మశక్యం కానంతగా బాగా లోప్రొఫైల్ జీవితం.

ఆయనకున్న వ్యాపకం ఒకటే... మంచి స్క్వాష్ ప్లేయర్... సర్కిల్ తక్కువ, ఫ్రెండ్స్ తక్కువ... అసలు ఆయన ఫ్లాటుకు వచ్చేవాళ్లే కనిపించరు... మిస్త్రీ యవ్వారం అప్పట్లో వేడివేడిగా గ్రూపులో కలకలం రేపుతున్నవేళ తన అభిప్రాయాల్ని క్రోడీకరిస్తూ ఎప్పటికప్పుడు టాటా సన్స్‌కు పంపించేవాడు... కానీ తనెప్పుడూ తెర మీదకు రాడు... రాలేదు... ఈరోజుకూ... నిజంగా ఎంతటి పరస్పర విరుద్ధ జీవనాలు ఈ ఇద్దరు సోదరులవి... ఒకరు హైప్రొఫైల్... మరొకరు అదే స్థాయిలో లోప్రొఫైల్... ఈ అజ్ఞాతవాసాన్ని కూడా జిమ్మీ తనంతట తను కోరుకున్నదే కాబట్టి నో రిగ్రెట్స్... అసలు అలా ఉండటమే తనకు ఆనందమట... లోకోభిన్నరుచి... నిజమేకదా!!!

కోపం కాదు..,కడుపులో దుఃఖం....

విన్

కూతురు తనకు ఇష్టం లేని పెళ్లి చేసుకుందనే కోపంతో ఒక తండ్రి తన కూతురికి దినకర్మ పెట్టాడు... అంటే కర్మకాండ జరిపించేశాడు... అంటే తన దృష్టిలో మరణించినట్టు లెక్క... అంటే జస్ట్, తన కోపాన్ని, అయిష్టతను ఆ రూపంలో వ్యక్తీకరించాడు... అంతేతప్ప ఏ కత్తో ఏ కొడవలో పట్టుకుని బజారుకెక్కలేదు... తన బాధ అది.

ఇప్పుడు మళ్లీ ఓ చర్చ... కనిపెంచిన సంతానం భవిష్యత్తు కూడా బాగుండాలనే కదా ఏ పేరెంట్స్ అయినా కోరుకునేది... అన్నీ ఆలోచించే కదా నిర్ణయాలు తీసుకుంటారు... కానీ గుండెలపై తన్నేసి, తమకు ఇష్టం వచ్చినవాళ్లను పెళ్లాడేసి వెళ్లిపోతే... అందరూ తిట్టేది మళ్లీ పేరెంట్స్‌నే... పెంపకం సరిగ్గా లేదంటారు కొందరు, ఇష్టమున్నవారితో పెళ్లిచేసేయాలి కదోయ్ అంటారు మరికొందరు... పిల్లలు పెరిగాక ఇక నీ ఇష్టం ఏమిటోయ్ అనేస్తారు ఇంకొందరు... రేప్పొద్దున ఆ పెళ్లికేమైనా అయితే, బిడ్డ కదా, ప్రేమగా చేరదీయాలి కదా, ఇంకెవరు పట్టించుకుంటారు అనేది కూడా ఈ లోకమే.

నిజమే, ప్రేమ గుడ్డిది... కొన్నేళ్లుగా మరీ ఆ గుడ్డితనం స్కూల్ ఏజ్‌లోనే వచ్చేస్తోంది... థాంక్స్ టు అవర్ మూవీస్, అవర్ నవల్స్, అవర్ టీవీ సీరియల్స్ ఎట్సెట్రా... మరీ పది తప్పిన అబ్బాయి, ఇంటర్ చదివే అమ్మాయి.,. ఆలోపు కూడా... అసలు వాళ్ల మెంటల్ మెచ్యూరిటీ లెవల్స్ ఎంత..? ఆ తండ్రి వద్దు బిడ్డా అని వారిస్తే తప్పేమిటి..? సరే, అవన్నీ వదిలేద్దాం... ఈ వార్త చదువుతుంటే చాలా డౌట్స్.

మహబూబ్‌నగర్ జిల్లా, చిన్న చింతకుంట మండలం, మద్దూరు గ్రామం... కోటేశ్వర్, పద్మ ఇద్దరు దంపతులకు ఇద్దరు బిడ్డలు... మొదటి బిడ్డకు ఆల్‌రెడీ పెళ్లయింది... రెండో బిడ్డ భార్గవి ఇంటర్ చదువుతోంది... అదే గ్రామంలో ఉండే కోటేశ్వర్ సోదరి కొడుకు వెంకటేశ్‌ను ఆ రెండో బిడ్డ ప్రేమించింది... తండ్రి వద్దన్నాడు... కానీ భార్గవి వినలేదు, పెళ్లి చేసుకుంది... దాంతో తండ్రి కోపంతో బిడ్డకు కర్మకాండ చేశాడు... గుండు గీయించుకున్నాడు.

ఇక్కడ నిజానికి కులం అనే ఇష్యూ లేదు... ఎవరో తెలియని అబ్బాయి కూడా కాదు... పరువు పోయిందనే ఫీల్ ఎందుకో అర్థం కాదు... అఫ్‌కోర్స్, చదువూ సంధ్యా సరిగ్గా లేని వాడిని పెళ్లి చేసుకోవడం ఏమిటనేది తండ్రి కోపం కావచ్చు... చెల్లె కొడుకే, అంటే అమ్మాయికి బావ అవుతాడు... సో, వరసకు పెళ్లి చేసుకోదగిన సంబంధమే... కానీ ఆ పెళ్లి చేయడం తండ్రికి ఇష్టం లేదు... అంతేతప్ప ఇక్కడ పరువు కోల్పోయింది ఏముంది.. తండ్రి ఓవర్ రియాక్టయినట్టుగా అనిపిస్తోంది కదా... ఎట్‌లీస్ట్, ఆ వార్త చదివితే అలా స్థూలంగా అనిపిస్తోంది కదా...

కానీ ఇక్కడ మళ్లీ ప్రశ్న... తల్లిదండ్రులు తన గురించే కదా ఆలోచించేది, మరి కనిపెంచిన వాళ్ల అభిప్రాయాలకు విలువ ఇవ్వొద్దా ఆ అమ్మాయి.. కనిపెంచిన వాళ్ల ప్రేమకు ఆమె ఇచ్చిన గౌరవం ఏమన్నట్టు..? అయితే దీనికి పూర్తి భిన్నంగా మరో ప్రశ్న ఏమిటంటే... ఆమె ఇష్టపడింది, వరుసైనవాడే... పెళ్లి చేసుకుంటానంది... చేస్తే తప్పేముంది..? పెరిగాక కూడా పిల్లల్ని, వాళ్ల ఇష్టాల్ని గౌరవించకపోతే ఎలా...? ఇదీ ఇంకో ప్రశ్న... సో, ఒక్కొక్కరు దీన్ని అర్థం చేసుకునే తీరు వేర్వేరుగా ఉండవచ్చు... ఎటొచ్చీ, చివరకు సొసైటీ ఏమంటుంది తెలుసా.. పిల్లల్ని కంటాం గానీ, వాళ్ల అదృష్టాల్ని కంటామా.. ఏమో వాళ్ల ఖర్మ, వాళ్లిష్టం... మరేం చేస్తాం.. ఇలాగే అంటుంది సొసైటీ... కానీ తల్లిదండ్రి మనస్సులు ఊరుకోవు కదా... అదుగో, ఆ కోపమే ఆ తండ్రి 'కర్మకాండ'లో కనిపించింది... నిజానికి అది కోపం కాదు, తన కడుపులో నుంచి తన్నుకొచ్చే దుఃఖమే అది... ఆందోళనే అది... నిసహాయంగా అలా తన బాధను వ్యక్తీకరించాడు... అంతే.

ఉక్రెయిన్ ఉదంతం ప్రపంచానికో గుణపాఠం

ఉక్రెయిన్ పై రష్యా స్పెషల్ మిలిటరీ ఆపరేషన్ జరుపుతోంది. ఒళ్ళు గగుర్పొడిచే భయానక దృశ్యాలు మనకు కనబడుతున్నాయ్. కేవలం 48 గంటల్లోనే ప్రశాంతంగా ఉండే ఉక్రెయిన్ దేశం చిన్నాభిన్నమైపోయింది. ఆ దేశాధ్యక్షుడు జెలెన్ స్కీ ఎక్కడో బంకర్లో తలదాచుకుని ఉన్నాడనే వార్తలు వస్తున్నాయి. దేశాధ్యక్షుల పరిస్థితి దేవుడెరుగు. సాధారణ జనజీవనం మాత్రం అల్లకల్లోలమైపోయింది. జనం ప్రాణభయంతో పరాయి దేశాలకు చేరుకుంటున్నారు

ఇంతటి విధ్వంసానికి, వినాశనానికి, జనహననానికి ముమ్మాటికీ ఉక్రెయిన్ దేశాధ్యక్షుడు జెలెన్ స్కీయే కారణం. ఇంతటి నష్టం జరుగుతుందని ఒక దేశాధ్యక్షుడిగా జెలెన్ స్కీకి తెలీదా? తన శక్తి సామర్థ్యాలేవిటో, తాను కయ్యానికి కాలు దువ్వుతున్న రష్యా శక్తిసామర్థ్యాలేవిటో ఆయనకు తెలీదా? తనపై తనకు అతి విశ్వాసమా? నాటో దేశాల మద్దతు లభిస్తుందన్న అత్యాశా? ఏది ఆయనను యుద్ధం దిశగా నడిపించి ఉంటుంది?

నిజానికి ఉక్రెయిన్ దేశాధ్యక్షుడు జెలెన్ స్కీ ఫక్తు రాజకీయవేత్త కాదు. ఆయన ఒక సినిమా నటుడు. అత్యంత ప్రజాదరణ కలిగిన ఒక కమెడియన్. ఒక దేశాన్ని పాలించడం అంటే సినిమాల్లో కామెడీ చేసినట్టు కాదు కదా? రాజకీయాలలో, దేశ పాలనలో, ప్రపంచ పరిస్థితుల్లో ఎన్నో విషయాలను అనుక్షణం గమనిస్తూ, బేరీజు వేసుకుంటూ, గతాన్ని పరిశీలించుకుంటూ, వర్తమానాన్ని విశ్లేషించుకుంటూ, భవిష్యత్తును అంచనా వేసుకుంటూ ముందుకు సాగాల్సి ఉంటుంది. ఎందరితోనో, ఎన్నో విధాలుగా డీల్ చేయాల్సి ఉంటుంది. అవగాహన రాహిత్యమో, అతి విశ్వాసమో, వారిపై వల్లమాలిన అభిమానమో తెలీదుగానీ ఏమాత్రం పాలనానుభావం లేని సినీ పరిశ్రమకు చెందిన వారినే

ఆయన తన సలహాదారులుగా, మంత్రివర్గ సభ్యులుగా పెట్టుకున్నారు.

అందునా ఉక్రెయిన్, శక్తిమంతమైన ఈయూ, రష్యాల మధ్యన ఉన్నది. ఇరు పక్షాలతోనూ సయోధ్యతో మెలగడమే సరియైన విదేశాంగ విధానం. ఏ ఒక్క పక్షాన చేరినా రెండవ పక్షానికి విరోధులవుతాం కదా? ఇద్దరు బలవంతుల మధ్య ఒక బలహీనుడు ఇద్దరితో అణకువగా మసలుకుంటేనే కదా? లేకపోతే ఏదో ఒకనాడు ఎవరో ఒకరి చేతిలో తన్నులు తినక తప్పదు కదా? ఇది సహజమైన జీవన నియమమే కదా? మరి అంతటి దేశాధ్యక్షుడు ఇంత చిన్న లాజిక్ మిస్సయితే ఎలా?

సరే పోనీ... ఎవరి బలాన్నో నమ్ముకుని ఈయన హద్దులు మరచి రంకెలు వేశాడనుకుందాం.... మరి వారెవరైనా ప్రత్యక్షంగా రంగంలోకి దిగారా? అండగా నిలిచి ఆదుకున్నారా? ఒక బలమైన వాడితో ప్రత్యక్ష వైరం పెట్టుకోవాలంటే అవతలి వాడు కూడా ఎంతటి శక్తిమంతుడైనా ఎంతో కొంత ఆలోచిస్తాడు కదా?

నిజానికి రష్యా వంటి శక్తివంతమైన దేశాన్ని ఢీకొట్టే స్థితిలో ప్రస్తుతం అమెరికా కూడా లేనట్టే. అమెరికా కూడా పైపైన పటాటోపం ప్రదర్శించడం మినహా ఎప్పుడూ ఎక్కడా తన శక్తి సామర్థ్యాలను ప్రదర్శించిన పాపాన పోలేదు. సద్దాం హుస్సేన్, బిన్ లాడెన్ వంటి వారి ఆచూకీ తెలుసుకుని వారిని మట్టుబెట్టడానికే అమెరికా ఎంతో సమయాన్ని, శక్తిసామర్థ్యాలను, ధనాన్ని వెచ్చించవలసి వచ్చింది. వియత్నాం, సిరియా, లిబియా, ఇరాక్‌లలో పరిస్థితులు చక్కబెడతానంటూ వెళ్లి మరింత సంక్లిష్టం చేసొచ్చింది. ఇక ఆఫ్ఘనిస్థాన్లో అమెరికా చేసిన నిర్వాకం మనందరికీ తెలిసిందే. ఏడు సముద్రాలు ఈది ఏటి కాలువలో మునిగిన చందాన దశాబ్దాలపాటు ఆఫ్ఘనిస్థాన్లో తిష్ట వేసుకు కూర్చుని చివరికి ఆ తాలిబన్ల చేతికే ఆఫ్ఘన్‌ను అప్పగించి వచ్చిన ఘన చరిత్ర అమెరికాది. అమెరికా ఇప్పుడు ఆర్థికంగా కూడా రష్యాను ఢీకొట్టే స్థితిలో లేదు. మరి అలాంటి అమెరికా తనకు యుద్ధంలో తోడుగా నిలుస్తుందని జెలెన్ స్కీ ఆశలు పెట్టుకుని ఉంటే... అంతకంటే అమాయకత్వం మరొకటి లేదనే చెప్పాలి. ఇప్పుడు అమెరికా అయుధాలందిస్తానన్నా ఉక్రెయిన్ అందుకునే స్థితిలో లేదే? అందుకోడానికి ఉక్రెయిన్ చేతిలో సైనికులే లేరే?

ఉక్రెయిన్‌ను నాటో దేశాల సరసన కూర్చుండబెడితే రష్యా దూకుడుగా స్పందిస్తుందని ఫ్రాన్స్, జర్మనీలతో సహా ఐక్య రాజ్య సమితిలోని దేశాలన్నీ ఆది నుంచి అమెరికాను హెచ్చరిస్తూనే ఉన్నాయ్. అయినా ఆ హెచ్చరికలన్నిటినీ తోసిరాజని అమెరికా ఉక్రెయిన్‌ను నాటో అక్కున చేర్చే ప్రయత్నం చేసింది. అదే ఇప్పుడు ఇంతటి విధ్వంసానికి కారణం అయ్యింది.

ఉదాహరణకు చైనా తన మిలిటరీ బేస్‌ను అమెరికా పొరుగునున్న కెనడాలోనో, మెక్సికోలోనో పెడతానంటే అమెరికా సైతం ఆ దేశాలపైకి యుద్ధానికి వెళ్లకుండా ఉంటుందా? ఏ దేశానికైనా తమ దేశ భవిష్యత్తు, భద్రత, సంక్షేమమే కదా ప్రధానం? ఇప్పుడు రష్యా కూడా సరిగ్గా అదే చేసింది. తనకు గిట్టని దేశాలతో స్నేహం కొనసాగిస్తూ తనకు పక్కలో బల్లెంలా మారిన ఉక్రెయిన్ పై ఉక్కుపాదం మోపే ప్రయత్నం చేస్తోంది.

అన్నిటికంటే ముఖ్యంగా ఇక్కడ ఉక్రెయిన్ దేశాధ్యక్షుడు జెలెన్ స్కీ వ్యవహరించిన తీరే అత్యంత అవగాహనారహితమైనది, బాధ్యతారహితమైనది, విచారకరమైనది. జెలెన్ స్కీ తలచుకుంటే.... యుద్ధం జరుగకుండా ఆపే అవకాశం ఆయనకు చివరి క్షణం వరకూ ఉండింది. చర్చలు జరిపే అవకాశం ఉండింది. కానీ ఆయన ఆ దిశగా ప్రయత్నమే చెయ్యలేదు. సినిమాల్లోలా హీరోయిజం ప్రదర్శించాలని, ప్రజలలో తనకున్న జనాకర్షణను మరింతగా ఇనుమడింపజేసుకోవాలని భావించాడో ఏమిటో తెలీదు. ఇంత చేస్తాం, అంత చేస్తాం, అంతు చూస్తాం అంటూ ప్రగల్భాలు పలికాడు. ఇప్పుడు రష్యాను ఏదో విధంగా చర్చలకు ఒప్పించాల్సిందిగా అందరినీ ప్రాధేయపడుతున్నాడు. ఈ జ్ఞానమేదో మొదటే ఉండుంటే ఇంత అనర్థం జరుగకపోను కదా? అది కూడా ఓసారి చర్చలకు సిద్ధమనీ, మరోసారి కాదనీ ఇలా పూటకోమాట మాట్లాడుతున్నారు.

తెలివైన రాజకీయవేత్త ఎవరూ ఇలా ప్రవర్తించరు. ఈయూలోనో, రష్యాలోనో చేరే విషయమై మేం మరో పదేళ్ల తర్వాతే నిర్ణయం తీసుకుంటామని చెప్పి సమస్యను ఓ దశాబ్దం పాటు వాయిదా వేసుండేవారు. అసలు విషయం ఏంటంటే..... ఇంతకముందు ఉన్న అధ్యక్షుడితో ఈ విషయంలోనే విభేదించి, ఈయూలో కలుద్దామనుకుంటున్న ప్రజల అభీష్టానికి విరుద్ధంగా అధ్యక్షుడు వ్యవహరిస్తున్నాడంటూ ప్రజలను రెచ్చగొట్టి, తాను వారి కలలను నిజం చేస్తానంటూ ఓ పిచ్చి హామీ ఇచ్చి ఈయన అధికారంలోకి వచ్చాడు. ఇప్పుడు ఆ హామీలను నిలబెట్టుకునే వెఱ్ఱి ప్రయత్నంలో ఇలా దేశాన్ని కష్టాల కొలిమిలోకి నెట్టేశాడు. ఇది ఆయన అపరిపక్వతకు నిదర్శనం.

అయితే ఈ మొత్తం ఎపిసోడ్లో ఉక్రెయిన్ దేశ ప్రజలతో పాటుగా, ప్రపంచ దేశాల ప్రజలందరూ తెలుసుకోవాల్సిన విషయం ఏమిటంటే.... దేశాన్ని నడిపించే నాయకులకు కావాల్సింది గ్లామరో, గ్రామరో, హ్యూమరో కాదు. తన దేశం పట్ల అపారమైన ప్రేమ, తన దేశ ప్రయోజనాల పట్ల రాజీ లేని తత్వం, ప్రపంచ పరిస్థితుల పట్ల అవగాహన. ఎవరితో ఎలా మెలిగితే తన దేశానికి ప్రయోజనమో తెలిసిన నేర్పు, ఓర్పు, పట్టువిడుపు ఉన్నవాడు, పరిస్థితులకు తగ్గట్టుగా జనాన్ని కన్విన్స్ చెయ్యగలిగినవాడే నిజమైన నాయకుడు అవగలుగుతాడు. వ్యక్తిగతమైన భేషజానికో, ప్రతిష్ఠకో ప్రాకులాడి దేశ రక్షణను, ప్రయోజనాలను ఫణంగా పెట్టేవాడు కాదు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా సంయమనం కోల్పోకుండా తన దేశ హితమే పరమార్థంగా పనిచేసేవాడు, ఎక్కడ నెగ్గాలో.... ఎక్కడ తగ్గాలో తెలిసిన నాయకుడు మాత్రమే ఏ దేశాన్నైనా ప్రగతి పథంలో నడుపగలుగుతాడు.

ప్రజలు కూడా సినీ, క్రీడా గ్లామర్‌కో, కులానికో, వర్గానికో, ప్రాంతానికో, భాషకో, మతానికో ప్రాధాన్యం ఇవ్వక దేశ హితమే పరమ లక్ష్యంగా భావించి, ఆలోచించి తమ నేతను ఎన్నుకున్నప్పుడే ప్రజాస్వామ్యం సఫలమవుతుంది. అలా కాని పక్షంలో ప్రజాస్వామ్యమే ఏ దేశానికైనా వినాశ హేతువవుతుంది.

పూరీ ఆలయ భండారం... నిజం పెరుమాళ్ళకే ఎరుక...

సి.ఆదయ్య

గుడి

దాదాపు 900 ఏళ్ల చరిత్ర ఉన్న పూరీ జగన్నాథాలయానికి ఎన్నో ఆస్తులున్నాయి. ఎంతో సంపద ఉంది. ఒడిశాను ఏలిన రాజులందరూ జగన్నాథ భక్తులే. వాళ్లే కాదు, ప్రజలూ ఎన్నో విలువైన కానుకలు, కోట్లాది విలువ చేసే నగలూ ఇచ్చారు. వాటిని ఆలయంలోనే రత్నభండారంలో దాచారు. వాటి జాబితా తయారు చేసి, కనీసం నాలుగైదేళ్లకోసారైనా జాబితా ప్రకారం ఉన్నాయా లేదాని చెక్ చేయాలి. కానీ దానిని 1978 తర్వాత ఆ చెకింగ్ జరగలేదు. అప్పటి లెక్క ప్రకారం 120 కిలోల బంగారం, 221 కిలోల వెండి ఉంది. భండారాన్ని ఆఖరిసారిగా 1984లో తెరిచారు. 2018లో మళ్లీ తెరవబోతే మధ్యలో తాళంచెవులు మారిపోయాయని తెలిసింది. అప్పటినుంచి ఇప్పటిదాకా అవేమయ్యాయో తేలలేదు. తేల్చడం గురించి ఒడిశా ప్రభుత్వం కాళ్లీడుస్తోంది తప్ప గట్టి చర్యలు తీసుకోవడం లేదు.

రత్నభండారంలో 7 గదులున్నాయి. బయటి మూడిటిలో స్వామివారి నిత్యసేవలకు సంబంధించిన వస్తువులన్నీ పెడతారు. వాటిలో వజ్రవైఢూర్యాలు, వెండి బంగారాలు కూడా ఉంటాయి. తక్కిన లోపలి నాలుగు గదుల్లోనూ అత్యంత విలువైన వజ్రాలూ అవీ పెడతారు. వాటిలో 150 రకాల స్వర్ణాభరణాలు ఉన్నాయట. ఆర్కియాలజీ డిపార్టుమెంట్ 2016 నుంచి పూరీ గుడిని పరిశీలిస్తూ అవసరమైతే మరమ్మత్తులు చేస్తూ వచ్చింది కానీ రత్నభండారం జోలికి పోలేదు. ఆ డిపార్టుమెంట్ పనులను పర్యవేక్షిస్తున్న హైకోర్టు 'రత్నభండారం స్ట్రక్చర్ బలంగా ఉందో, లేదో చూసి, అవసరమైతే దాన్ని పటిష్టం చేయడానికి చర్యలు సూచించండి' అని ఆదేశించడంతో 2018 ఏప్రిల్‌లో ఆర్కియాలజీ డిపార్టుమెంట్‌కు సంబంధించిన 17 మంది అధికారుల బృందం భండారంలోకి అడుగుపెట్టింది.

వాళ్లకు గుడివాళ్లు ఇచ్చిన తాళం చెవులతో భండారం లోపలి నాలుగు గదుల తాళాలు తెరవబోతే తెరుచుకోలేదు. వీటిని క్రితం సారి ఎప్పుడు వాడేరు అని చూడబోతే 34 ఏళ్లయిందని తెలిసింది. ఇన్నేళ్లలో ఎవరు తాళాలు మార్చాశారో తెలియదు. ఇంకేం చేయలేక వెనక్కి వచ్చేశారు. బయట వేచి ఉన్న మీడియా వాళ్లతో గుడి చీఫ్ ఎడ్మినిస్ట్రేటర్ ప్రదీప్ జేనా ఐఏఎస్ 'రత్నభండారం లోపలకి వెళ్లవలసిన అవసరం కనబడలేదు, సెర్చ్‌లైట్ల సహాయంతో స్ట్రక్చర్ పటిష్టంగా ఉందని కనిపెట్టేశాం.' అని చెప్పేశాడు. కానీ వెనువెంటనే జరిగిన మేనేజింగ్ కమిటీ మీటింగులో పెద్ద గొడవ జరిగింది. ఆలయ ప్రధాన

సేవకుడిగా చెప్పుకునే గజపతి రాజు దివ్యసింగ్ దేవ్ తాళంచెవుల సంగతి తేలాల్సిందే అని గట్టిగా పట్టుబట్టారు.

గుడి ప్రతిష్ఠ పోతుందని ఆ విషయం దాచిపెట్టారు కానీ రెండు నెలల తర్వాత ఒడిశా టీవీ బయట పెట్టేసింది. తెరవాల్సిన అవసరం లేకపోతే మరి తమ వెంట తాళం చెవులు ఎందుకు పట్టుకెళ్లారు? అవి పనిచేయలేదని తేలిన తర్వాత ఇలాంటి కబుర్లు చెప్తున్నారు అని దులిపేసింది. 'ఏ కారణంగానైనా తాళాలు బిగిసిపోయి, చెవి పనిచేయకపోతే వెంట తీసుకెళ్లిన గ్యాస్ కట్టర్లను ఉపయోగించవచ్చు కదా! లోపలకి వెళ్లి హైకోర్టు ఆదేశాలను మన్నించి ఉండవచ్చుగా' అని జగన్నాథ సేన అనే సామాజిక సంస్థ ప్రతినిధి ప్రశ్నించారు. అంతమంది సభ్యుల సమక్షాన కట్ చేసి, తెరిచి మళ్లీ తాళాలు బిగించడానికి అయ్యే ఖర్చు కొన్ని వందల్లో ఉంటుంది. ఆ పని చేయకుండా తాళం చెవులెలా పోయాయో కనిపెట్టండి అంటూ ప్రభుత్వం ఓ కమిటీ వేసింది. దాని ఖర్చు 2019 నాటికే రూ. 22 లక్షలు!

తాళంచెవులు మిస్సింగ్ అనగానే భండారంలోంచి భారీగా చోరీ జరిగివుంటుందన్న పుకార్లు షికారు చేశాయి. నిరసన ప్రదర్శనలు వెల్లువెత్తాయి. దాంతో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రదీప్ జేనాను బదిలీ చేసేసి, రిటైర్డ్ హైకోర్టు జడ్జీ రఘువర్ దాస్ నేతృత్వంలో విచారణకు ఆదేశించాడు. 2018 జూన్ 14న జిల్లా అధికారులు మా దగ్గర డూప్లికేట్ కీస్ ఉన్నాయి అనడంతో మరో వివాదం తలెత్తింది. గుడి ఎడ్మినిస్ట్రేషన్ యొక్క మాజీ సభ్యులు 'ఒరిజినల్ కీస్ పూరి జిల్లా కలక్టరేట్ లోని ట్రెజరీలో దాచి ఉంచుతారు. డూప్లికేట్ కీస్ ప్రసక్తే లేదు' అన్నారు. 'వజ్రాల గదికి డూప్లికేట్ కీస్ ఉండడానికి గుడి నియమాలు ఒప్పుకోవు. ఇవి ఎక్కణ్నుంచి వచ్చాయి?' అని చరిత్రకారులు అడిగారు. వీటి మధ్య రఘువర్ దాస్ తన 324 పేజీల రిపోర్టును 2018 నవంబరు 30న హోం శాఖకు అందచేశారు. దాన్ని ప్రభుత్వం బయటపెట్టలేదు. అసెంబ్లీలోనే సమర్పిస్తాం అన్నారు. 8 నెలల తర్వాత కాంగ్రెస్ లీడరు దాని గురించి అసెంబ్లీలో ప్రశ్నిస్తే 'ప్రభుత్వం ఆ రిపోర్టును పరిశీలిస్తోంది. పరిశీలన పూర్తి కాగానే సమర్పిస్తాం' అన్నాడు మంత్రి.

రత్నభండారం తెరిచి, దానిలో ఉన్న వస్తువుల జాబితా తయారు చేయించమని 2019 అక్టోబరులో ప్రతిపక్ష నాయకుడు ముఖ్యమంత్రికి లేఖ రాశాడు. ఇప్పటిదాకా ప్రభుత్వ కదలకుండా, మెదలకుండా కూర్చుంది. తాళంచెవుల మాట ఎలా ఉన్నా అసలు రత్నభండారం భద్రంగా ఉందా లేదా అన్న సందేహం రావడంతో ఒక సమాచార హక్కు కార్యకర్త ప్రశ్న అడిగాడు. 2021 ఆగస్టులో వచ్చిన సమాధానంలో 'తేమ కారణంగా భండారం శిథిలావస్థలో ఉంది. గోడల్లో పగుళ్లు వచ్చి అనేక చోట్ల సున్నం రాలిపోయింది. సీలింగుకు సపోర్టుగా ఉన్న ఇనుప చువ్వలు చాలా చోట్ల మాయమై పోయాయి. దన్నుగా నిలబడిన రాతిస్తంభాలు అక్కడక్కడ విరిగిపోయాయి.' అని ఉంది. 2021 నవంబరులో మరో వార్త వచ్చింది.

మరో ఆర్‌టిఐ (సమాచార హక్కు) కార్యకర్త దిలీప్ కుమార్ బరాల్ వేసిన ప్రశ్నకు సమాధానంగా పూరీ జిల్లా ట్రెజరీ ఆఫీసరు 'మా స్ట్రాంగ్ రూము రిజిస్టర్‌ను 1970 నుంచి క్షుణ్ణంగా పరిశీలించాం. మా దగ్గర ఒరిజినల్ కానీ డూప్లికేట్ కీస్ కానీ డిపాజిట్ చేసినట్లు రికార్డులో లేదు.' అని జవాబిచ్చారు. అంటే తాళంచెవుల సంగతి ఎవరికీ ఏమీ తెలియదా? వాటిని ఎక్కడ భద్రపరుస్తున్నారు? ఎవరి అజమాయిషీలో ఉంటోంది? ఎవరికైనా దుర్బుద్ధి పుట్టి కొన్ని పట్టుకుపోతే కనిపెట్టడం ఎలా? ఎవరిని బాధ్యుల్ని చేయాలి? ప్రభుత్వం ఏమీ చేయకుండా ఎందుకుంది? తవ్వడం మొదలుపెడితే అనేక అస్తిపంజరాలు బయటపడతాయని భయపడుతోందా? బయటపడితే 21 ఏళ్లగా సిఎంగా ఉన్న నవీన్‌దే ప్రధాన బాధ్యత అవుతుందని బెదురా? రిపోర్టు బయట పెట్టకపోవడం వింతగా లేదా?

ఇదే సంఘటన ఆంధ్రలో జరిగి ఉంటే జగన్‌పై ఎంత దుమారం రేగేదో ఊహించవచ్చు. క్రైస్తవుడు కాబట్టే ఉదాసీనంగా ఉంటూ గుడి వ్యవహారాలు చక్కబెట్టలేదని అనేవారు. చంద్రబాబు హయాంలో తిరుపతి గుడిలో లంకెబిందెల కోసం తవ్వకాలు జరిగాయని జగన్ మీడియా నానా హడావుడి చేసింది. గులాబీ రంగు వజ్రం చోరీ అయిపోయిందని పెద్ద గలభా చేసింది. పూజారులు కూడా అసత్యారోపణలు చేస్తున్నారని కొందరన్నారు. ఆరోపణల్లో నిజం ఉందని వైసిపి నమ్మి ఉంటే అధికారంలోకి రాగానే విచారణకు ఆదేశించి స్వామిపై భక్తిని నిరూపించుకోవాల్సింది. గుడికి సంబంధించి ఏదైనా అనుమానం రగలగానే దాన్ని రాజకీయంగా ఉపయోగించుకోవాలని చూడడం తప్ప, పరిస్థితిని చక్కదిద్దాలని తోచదు ఈ నాయకులకు. అన్నట్లు తిరుపతి గుడి ఖజానా ఇన్వెన్టరీ ఎప్పుడు తీసుకున్నారు? 2020 జనవరిలో రీవెరిఫికేషన్ జరిగినట్లు, కొన్ని మిస్ అయితే సంబంధిత అధికారి నుంచి రాబడుతున్నట్లు నెట్‌లో ఉంది.

మళ్లీ పూరి దగ్గరకు వస్తే, వెరిఫికేషన్ జరిగితే కానీ ఎన్ని ఉన్నాయో, ఎన్ని పోయాయో తెలియదు. కానీ జరగనివ్వటం లేదు. ఈ గొడవ ఇలా నడుస్తూండగానే మరో వివాదం ఇటీవలే బయటకు వచ్చింది. ఫైనాన్స్ డిపార్టుమెంటు వాళ్లు గుడికి 2003-21 మధ్యలో రూ.142 కోట్ల నిధులు ఇచ్చారట. అవి ఎలా వినియోగమయ్యాయో చూపే యుసి (యుటిలైజేషన్ సర్టిఫికెట్లు) గుడి ఎడ్మినిస్ట్రేషన్ సబ్మిట్ చేయలేదట. డిసెంబరు 2న ప్రభుత్వ న్యాయశాఖ వాటి గురించి అడుగుతూ 2003-21 కాలంలో జరిగిన ఖర్చుల వివరాలు డిసెంబరు 10లోగా తెలపండి అని కూడా అడిగింది. 'ఇన్నేళ్లగా వీళ్లు ఇవ్వకపోవడం తప్పే. కానీ ఇప్పటిదాకా అడగకపోవడం వాళ్లదీ తప్పే కదా' అంటున్నాడు ఆర్‌టిఐ కార్యకర్త దిలీప్ బరాల్. 'అబ్బే, మేం ప్రతీ ఏడాదీ ఇస్తూనే ఉన్నాం. కావాలంటే వాటి కాపీలు మా దగ్గరున్నాయి." అంటున్నాడు గుడి ఎడ్మినిస్ట్రేటర్ అజయ్ జేనా.

ఇదే కాకుండా ఇంకో ప్రశ్న కూడా వచ్చింది. స్వామివారికి రోజూ అర్పించే 'కోఠా భోగ' (రాజభోగ) నైవేద్యానికై ఏటా రూ. 55 లక్షలు ప్రభుత్వం ఇస్తోంది. దానిలో ప్రధాన ఐటమ్స్‌లో ఒకదాన్ని గత ఐదు నెలలుగా ఆపేశారట. ఆ మేరకు గ్రాంటును కూడా తగ్గించాలిగా అని అడుగుతున్నారు కొందరు. ఈ ప్రశ్నలకు సమాధానాలు ఎవరు చెప్తారు? లోగుట్టు పెరుమాళ్ల కెరుక అంటారు. జగన్నాథుడు కూడా పెరుమాళ్లే. ఆయనకే తెలియాలి.

నేల విడిచి సాము

కె.శ్రీనివాసరావు

'ఉట్టి కొట్టలేని అమ్మ స్వర్గానికి నిచ్చెనలు వేసింది' అన్న చందంగా,భూమిపై బతకడం చేతకాని మనిషి అంతరిక్షంలో కాలనీలు కట్టి కాపురం చేస్తానంటున్నాడు. ఆ దిశగా ఆధునిక మానవుడు పరిశోధనలు ముమ్మరం చేస్తున్నాడు. కానీ, అది అంత తేలిక కాదు,పైగా మనిషిని మనిషే చంపుకొని తినే దారుణమైన పరిస్థితులు వస్తాయని కొందరు శాస్త్రవేత్తలు భయపడుతున్నారు. కరోనా వంటి ఊహాతీతమైన వ్యాధులు వచ్చి,మనిషిని పట్టి పీడిస్తున్నాయి. భవిష్యత్తులో ఇంకా ఎటువంటి వ్యాధులను ఎదుర్కోవాల్సి వస్తుందోనని మనిషి భయపడుతూనే ఉన్నాడు.ఇది ఇలా ఉంటుండగానే,భూమి నుంచి దూరంగా వెళ్ళి,వేరే స్పేస్‌లో జీవించవచ్చు అనే విశ్వాసాన్నీ పెంచుకుంటున్నాడు. ఇది కొత్తగా పుట్టిన కోరిక కాదు.ఎప్పటి నుంచో మనిషి ఆలోచిస్తున్నాడు.కరోనా కాలానికి ముందే కొందరు శాస్త్రవేత్తలు అంతరిక్ష జీవనాన్ని ప్రచారంలోకి తెచ్చారు. సాధ్యాసాధ్యాలపై ఇంకా విస్తృతంగా అధ్యయనాలు జరుగుతూనే ఉన్నాయి.కొత్త ప్రపంచంలోకి అడుగు పెడదాం,కొత్త లోకాల్లో విహరిద్దాం అని మనిషి ఎప్పటి నుంచో కలలు కంటున్నాడు.భూమిపై ఏదైనా విపత్తు వచ్చినా, పెరుగుతున్న జనాభాకు తగ్గట్టుగా వసతులు,వనరులు సరిపోకపోయినా! పైకెళ్ళి జీవించాలనే ఆలోచనలకు శాస్త్రవేత్తలు మరింత పదునుపెడుతున్నారు. అంగారక గ్రహం లేదా చంద్రమండలంపై కాలనీలు నిర్మించి జీవించవచ్చు అని శాస్త్రవేత్తలు ఇప్పటికే గుర్తించారు కూడా.భూమి నుంచి ఆహారాన్ని పంపించే పరిస్థితులపైనా దృష్టి సారిస్తున్నారు.ఇవ్వన్నీ సాధించడానికి సుదీర్ఘకాలం వేచి చూడాల్సిందేనని అర్థం చేసుకోవాలి.

ఎడిన్ బర్గ్ యూనివర్సిటీకి చెందిన చార్లెస్ కొకెల్ కొత్త సిద్ధాంతాన్ని తెరపైకి తెస్తున్నారు,పాత విషయాలను కొన్నింటిని గుర్తు చేస్తున్నారు.నిజంగా భూమి నివాసయోగ్యం కానప్పుడు అంతరిక్షం వైపు చూడవచ్చు. కానీ,దానిని సాధించాలంటే ఇంకా ఎన్నో పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుందని ఆయన చెబుతున్నారు.19వ శతాబ్దంలో నార్త్ వెస్ట్ పాసేజ్ ను వెతకడానికి కెప్టెన్ సర్ జాన్ ఫ్రాంక్లిన్ బయలుదేరారు. సాంకేతిక సమస్య తలెత్తడంతో దారి తప్పారు. అత్యుత్తమ సాంకేతికత అందుబాటులో ఉన్నా,వారంతా ఒకరినొకరు చంపుకుతినే దారుణమైన దుస్థితి వచ్చిందని ప్రొఫెసర్ చార్లెస్ కొకెల్ గుర్తుచేస్తున్నాడు. అంతరిక్షంలో కూడా అటువంటి పరిస్థితులు వస్తాయని హెచ్చరిస్తున్నాడు.వనరులు, వసతులతో పాటు ఆహార కొరత ప్రధాన సమస్యగా నిలుస్తుందని ఆయన భావిస్తున్నాడు.డాక్టర్ కామెరన్ స్మిత్ కూడా అదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నాడు. అంతరిక్షంలో మానవ మనుగడ వెళ్లానుకోవాలంటే వ్యవసాయ వ్యవస్థను అభివృద్ధి చేయాలని ఎడిన్ బర్గ్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు గట్టిగా చెబుతున్నారు. గ్రహాంతర వాసుల కోసం వెతుకులాట కూడా ఇప్పటికే మొదలైంది.అంతరిక్షంలోకి వెళ్లబోయే ముందు,ఈ భూమిని పవిత్రంగా,పచ్చగా కాపాడుకోవడం ముఖ్యం.స్వార్థం శృతి మించి, కోరికలు,విలాసాలు ఆకాశాన్ని అంటిన ఆధునిక మానవుడు సహజ వనరులను ధ్వంసం చేసుకుంటూ వెళ్తున్నాడు. తత్ఫలితంగా అడువులు అంతరించి పోతున్నాయి, జీవనదులు ఇంకిపోతున్నాయి.భూమి క్రుంగి పోతోంది,సముద్ర మట్టాలు పెరిగి పోతున్నాయి. అగ్ని గోళాలు బద్ధలై పోతున్నాయి. ఒక్కటేమిటి విశ్వరూపమే మారిపోతోంది.ప్రకృతిని అందినకాడికి అంతం చేసుకుంటూ వెళ్తున్న క్రమంలో ఋతువుల గమనం మారిపోయింది.భూమి వేడెక్కిపోతోంది. అతివృష్టి అనావృష్టి, ప్రకృతి వైపరీత్యాలు ప్రబలి పోయాయి. అణువణువూ కాలుష్య కాసారంగా మారింది. పీల్చే గాలి,త్రాగే నీరు, తినే ఆహారం అంతా కలుషితమై పోయింది.ఇంటాబయటా అంతా కాలుష్యమే.దీనికి ముందుగా మనిషి మనసే అత్యంత కలుషితమై పోయింది. అందుకే, కొత్త కొత్త వింత వ్యాధులు పుట్టుకొస్తున్నాయి.మంచినీరే కాదు, మంచిగాలి కూడా కొనడానికి కూడా దొరకని దుస్థితి వచ్చేసింది. పల్లెల ముఖచిత్రం మారిపోయింది. చేతివృత్తులు ఎగిరిపోయాయి. వ్యవసాయ విధానమే మారిపోయింది.ఆహారరక్షణపై శాస్త్రవేత్తలు హెచ్చరిస్తూనే ఉన్నారు.

అంతరిక్షానికి ఆహార సరఫరా సంగతి తర్వాత చూద్దాం. ముందుగా, భూమిపై పెరుగుతున్న జనాభాకు తగ్గట్టుగా ఆహార ఉత్పత్తి జరగడమే ప్రమాదంలో పడింది.ఆధునిక మానవుడు ఎక్కడ కాలు పెడితే అక్కడ భస్మమైపోతోంది. భూమిని పాడుచెయ్యడమే కాక, గ్రహాలను సైతం పాడు చెయ్యడానికి మనిషి తయారవుతున్నాడని కొందరు శాస్త్రవేత్తలు,మేధావులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఈ తరుణంలో,కరోనా వంటి ప్రాణాంతకమైన వ్యాధులు ప్రబలకుండా చూడడం శాస్త్రవేత్తల ప్రథమ కర్తవ్యం. ప్రకృతిని,భూభాగాన్ని రక్షించుకోవడం మానవాళి ప్రాథమిక అవసరం.సహజ వనరులను నిలబెట్టుకోవడం అత్యంత ముఖ్యమైన అంశం. వీటన్నిటిపై దృష్టి సారించడమే అందరి తక్షణ కర్తవ్యం.సమాంతరంగా అంతరిక్ష పరిశోధనలు కొనసాగించుకోవచ్చు. అన్నింటి కంటే ముందుగా,మంచి వైపు మనిషి మారితే అంతా మంచే జరుగుతుందని విశ్వసిద్దాం.

రాజకీయనేతల గుడి...

టి.స్వప్న

2021... ప్రియాంక గాంధీ ఈ గుడిని సందర్శించింది... పూజలు చేసింది... కానీ చీరలోగాకుండా సల్వార్ కమీజ్‌లో వచ్చినందుకు పూజారులు ఆమెను గర్భగుడి లోపలిదాకా అనుమతించలేదు.

2018.. కమల్‌నాథ్‌తోపాటు రాహుల్ గాంధీ ఆ గుడికి వచ్చాడు, దర్శించుకున్నాడు.

2015.. వసుంధర రాజే సింధియా మూడు రోజులపాటు ఆ గుడి దగ్గరే ఉండిపోయింది, పూజారులు చెప్పిన ప్రత్యేక పూజల్ని నిష్ఠగా జరిపింది.

2016.. రాజనాథ్‌సింగ్, అమిత్ షా గుడికి వచ్చారు... సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్, హోం మంత్రి నరోత్తం మిశ్రా దగ్గరుండి పూజల్ని చేయించారు.

1962.. ఇండో-చైనా యుద్ధసమయంలో అప్పటి ప్రధాని నెహ్రూ ఈ గుడికి వచ్చి ప్రత్యేక యాగాలు చేయించాడు.

2021.. యూపీ సీఎం యోగీ ఆదిత్యనాథ్ హఠాత్తుగా గుడి దర్శనం చేసుకున్నాడు.

ఇలా ఇందిరాగాంధీ, అటల్ బిహారీ వాజపేయి, అఖిలేష్ యాదవ్, ప్రణబ్ ముఖర్జీ, రామనాథ్ కోవింద్... ఎందుకో మన దక్షిణాది నేతలు వరుసకట్టడం లేదు గానీ, ఉత్తరాది ప్రముఖ నేతల్లో ఈ గుడిని సందర్శించనివాళ్లు లేరు... నమ్మని వాళ్లు లేరు... ప్రత్యేకించి క్లిష్టసమయాల్లో నేతలకు అన్నింటికన్నా ముందు గుర్తొచ్చేది ఈ గుడే, ఈ దేవతలే... ఇంతకీ ఆ గుడి ఎక్కడ..? ఏమిటి స్పెషాలిటీ..?

దీన్ని పీతాంబర పీఠం అని వ్యవహరిస్తారు... పలు గుళ్ల కాంప్లెక్స్ ఇది... ఆశ్రమం కూడా..! ఒక శక్తిపీఠం... అంటే వామాచార పద్ధతుల్లో పూజలు అందుకునే దశమహావిద్యలు కొలువైన చోటు ఇది... ఇక్కడ ప్రతిష్ఠించబడిన వాంఖడేశ్వర లింగం మహాభారతకాలం నాటిదని పురావస్తు శాఖ కూడా నిర్ధారించిందని అంటుంటారు... ప్రధానంగా ఇక్కడ పూజలు జరిగేవి ఈ శివుడికే కాదు... దశమహావిద్యల్లో ఒకరైన భగాలాముఖి, ధూమావతి దేవతలకు... భారతీయ అర్చన పద్ధతుల్లో నిగూఢంగా ఉంచబడిన అనేక తాంత్రిక పూజలు, సాధనల ఆనవాళ్లు ఇక్కడ దొరుకుతాయి... క్లిష్ట సమయాల్లో శత్రుసంహారానికి, ఇష్టకోరికల సిద్ధికి భగాలాముఖి పూజను దాదాపు పూజారులు అందరూ అంగీకరిస్తారు... ఈ విగ్రహాలు అన్నిచోట్లా ఉండవు, ఈ పూజలు అందరికీ చేతకావు... అందుకే ఇండో-చైనా యుద్ధ సమయంలో నెహ్రూకు, సోహ్రాబుద్దీన్ కేసు వేళ అమిత్ షాకు, ఎన్నికల వేళ రాహుల్ గాంధీకి, ఐపీఎల్ స్కాం సమయంలో వసుంధర రాజేకు, కార్గిల్ యుద్ధ సందర్భంలో వాజపేయికి... ఇలా ఈ మాత గుర్తొస్తుంది... గుర్తొచ్చింది.

ఝాన్సీకి 25 కిలోమీటర్లు, గ్వాలియర్ ఎయిర్ పోర్టుకు 75 కిలోమీటర్లు ఉండే ఈ గుడికి మూడునాలుగు కిలోమీటర్ల దూరంలోనే రైల్వే స్టేషన్ కూడా ఉంటుంది... ఓ ట్రస్టు ఆధీనంలో నడపబడే ఈ గుడిని నిజానికి 1920లో పూజ్యపాదుడు అనే యోగి నిర్మించాడంటారు... ఆయన అసలు పేరేమిటో, ఎక్కడి నుంచో వచ్చాడో ఎవరికీ తెలియదు... అరబిక్, ఇంగ్లిష్, పాళి, ఉర్దూ, పర్షియన్, సంస్కృతం సహా అనేక భాషలు తెలిసిన ఆయన స్వతహాగా శాస్త్రీయ సంగీతకారుడు... తను ఉన్నప్పుడు పేరుపొందిన అనేకమంది శాస్త్రీయ సంగీతకారులు గుడిని సందర్శించేవారు... ఈరోజుకూ ఇక్కడ దర్శనాలకు, పూజలకు ప్రత్యేక రుసుములు ఏమీ ఉండవ్... అవునూ, ఉత్తరాది ప్రముఖ నేతలందరి విశ్వాసానికి కేంద్రబిందువైన ఈ గుడి మన దక్షిణాది అరివీర హిందూ నేతలకు ఎందుకు కనిపించదో మరి..? దేశంలోని దాదాపు ప్రముఖ దేవాలయాలన్నీ సందర్శించిన ప్రధాని మోదీ కూడా ఇక్కడికి మాత్రం వచ్చినట్టు లేదు... విశేషమే..!!

కరెంట్ అఫైర్స్

☞ ఆదర్శ గ్రామాలలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచింది. కేంద్రం విడుదల చేసిన ఆదర్శ గ్రామ యోజన జాబితాలో మొదటి 10 గ్రామాల్లో 7 గ్రామాలు తెలంగాణ నుంచే ఉన్నాయి. కరీంనగర్ జిల్లా - వెన్నంపల్లి గ్రామం దేశంలోనే మొదటి స్థానాన్ని దక్కించుకుంది. రెండో స్థానంలో కౌలాస్, నాలుగో స్థానంలో గన్నేరువరం, అయిదవ స్థానంలో కందకుర్తి, ఆరవ స్థానంలో వీర్నపల్లి, తొమ్మిదవ స్థానంలో రామకృష్ణాపూర్, పదవ స్థానంలో తాణాకుర్ద్ గ్రామాలు ఉన్నాయి.

☞ ప్రపంచంలోనే అతి పెద్ద ఇగ్లూ (మంచు) కేఫ్ జమ్మూ కాశ్మీర్‌లోని గుల్మార్గ్‌లో ఏర్పాటయింది. 37.5 అడుగుల ఎత్తు, 44.5 అడుగుల వెడల్పున్న ఈ కేఫ్‌లో 40 మంది కూర్చోవచ్చు. దీన్ని 25 మంది 64 రోజుల పాటు కష్టపడి 5 అడుగుల మందంతో కట్టారు. మార్చి 15 దాకా కరగకుండా ఉంటుందని ఆ తర్వాత మూసేస్తామని ఓనర్ సయ్యద్ వసీం షా చెప్పారు. ఇటువంటిది ప్రపంచంలో మరెక్కడా లేదని తెలిపారు.

☞ ఇప్పటికే ఇండియాలో అత్యంత సంపన్నుడిగా నిలిచిన గౌతమ్ అదానీ మరో మైలురాయి అందుకున్నారు. 90.1 బిలియన్ డాలర్లతో ఆదానీ ముకేష్ అంబానీని అధిగమించి ఆసియాలోనే కుబేరుడిగా నిలిచారని, ఫోర్బ్స్ మరియు బ్లూమ్‌బర్గ్ ఇండెక్స్ తెలిపాయి. ప్రపంచ వ్యాప్తంగా పదో స్థానంలో ఉన్నారు. 2008లో ఈయన సంపద 9.3 బిలియన్ డాలర్లుగా ఉండేది. పోర్టులు, పవర్ జనరేషన్, సోలార్‌పవర్, వంటనూనెలు, రియల్ ఎస్టేట్, బొగ్గు ఇలా ఎన్నో రకాల వ్యాపారాలు ఆదానీ గ్రూప్ చేస్తోంది.

జిన్నా టవర్ చరిత్ర

☞ గుంటూరు జిల్లా కొమ్మదిపుడిలో 1942లో మతపరమైన ఘర్షణల కేసులో స్థానిక కోర్టు 14 మంది ముస్లింలకు ఉరిశిక్ష విధించింది. అప్పటి గుంటూరు ప్రజా ప్రతినిధి లాల్ జాన్ భాషా, ముంబై కోర్టులో లాయర్‌గా ఉన్న మహ్మద్ అలీ జిన్నాను కలిశారు. ఆయన గుంటూరు వచ్చి కేసు వాదించగా ఉరిశిక్షలు రద్దయ్యాయి. ఆ ఘటనకు గుర్తుగా జిన్నా టవర్ నిర్మించారు. 1945 జిన్నా ముఖ్య అనుచరుడు లియాఖాత్ అలీఖాన్ ఈ టవర్‌ను ప్రారంభించారు.



నుమాయిష్ @ 84 ఏళ్ల చరిత్ర

☞ 1938లో హైదరాబాద్ సంస్థాన ప్రజల ఆర్థిక స్థితిగతులు తెలుసుకోవడానికి నిధుల సేకరణ కోసం పబ్లిక్ గార్డెన్స్‌లో స్థానిక ఉత్పత్తులతో నుమాయిష్ ప్రారంభమైంది. రూ.2.5 లక్షల ఖర్చుతో 80 స్టాల్స్ ఏర్పాటు చేశారు. అప్పట్లో పది రోజులు జరిగేది. 1946లో నాంపల్లిలోని మైదానంలోకి మార్చారు. ఇక్కడ కొన్ని లక్షల వెరైటీ వస్తువులు దొరుకుతాయి. ఏటా 50 లక్షల మంది సందర్శకులు వస్తుంటారు. వందల కోట్ల వ్యాపారం జరుగుతుంది.

☞ రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ)కు చెందిన హైదరాబాద్‌లోని ప్రముఖ పరిశోధనశాల డీఆర్‌డీఎల్ (డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ల్యాబొరేటరీ) నూతన డైరెక్టర్‌గా జె.ఎ.శ్రీనివాసమూర్తి నియమితులయ్యారు. ఈయన అడ్వాన్స్‌డ్ నావల్ సిస్టమ్స్‌కు ప్రోగ్రామ్ డైరెక్టర్‌గా ఉన్నారు. శ్రీనివాసమూర్తి స్వస్థలం విశాఖపట్నం. 1986లో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బీఈ ఎలక్ట్రానిక్స్ చదివారు. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో డిజిటల్ సిస్టమ్స్‌లో ఎంఈ చేశారు. 1987లో డీఆర్‌డీఎల్‌లో చేరారు. అధునాతన క్షిపణి వ్యవస్థల రూపకల్పన అభివృద్ధి, ఉత్పత్తిలో సాంకేతికంగా మూర్తి తోడ్పాటు ఎంతో ఉంది.

☞ దేశంలో ఉన్నత విద్యకు సంబంధించి అత్యున్నత పదవి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఛైర్మన్ తెలుగు వ్యక్తి అయిన జెఎన్‌యూ ఉపకులపతి ఆచార్య మామిడాల జగదీష్ కుమార్‌కు దక్కింది. ఆయన ఈ పదవిలో అయిదు సంవత్సరాలు కొనసాగుతారు. ప్రస్తుతం ఆయన నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. 1961లో ఏపీలో తెనాలికి చెందిన వాసిరెడ్డి శ్రీ కృష్ణ (వీఎస్ కృష్ణ), 1991-95 వరకు కరీంనగర్ జిల్లాకు

చెందిన జి.రామిరెడ్డి యూజీసీ ఛైర్మన్‌లుగా పనిచేశారు. ఈ పదవి పొందిన మూడో తెలుగు వ్యక్తి జగదీష్ కుమార్.

తెలంగాణలోని నల్గొండ జిల్లా తిప్పర్తి మండలం మామిడాల గ్రామానికి చెందిన ఆయన ఒకటి నుంచి ఆరో తరగతి వరకు స్వగ్రామంలో ఆ తర్వాత మిర్యాలగూడలో చదువుకున్నారు. హైదరాబాద్‌లోని వివేకవర్ధిని కళాశాలలో బీఎస్సీ, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీజీ పూర్తిచేశారు. ఉన్నత విద్యను కెనడాలోని యూనివర్సిటీ ఆఫ్ వాటర్లూలో పూర్తి చేసిన అనంతరం ఖరగ్‌పూర్ ఐఐటీలో ఎలక్ట్రికల్ ఆచార్యుడిగా చేరారు. అక్కడి నుంచి ఢిల్లీ ఐఐటీకి బదిలీ అయ్యారు. అనంతరం జెఎన్‌యూలో ఆచార్యుడిగా పనిచేస్తునే 2016లో ఉపకులపతిగా నియమితులయ్యారు. యూజీసీ ఇన్‌చార్జి ఛైర్మన్‌గా కూడా వ్యవహరించారు.

☞ దేశ రాజధాని ఢిల్లీలోని ప్రతిష్టాత్మక జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) నూతన ఉపకులపతి (వీసీ) గా తెలుగు బిడ్డ డాక్టర్ శాంతిశ్రీ ధూళిపూడి పండిట్ (59) నియమితులయ్యారు.

జేఎన్‌యూ తొలి మహిళా వీసీగా రికార్డుకెక్కారు. ఇమె ప్రస్తుతం మహారాష్ట్రలోని సావిత్రిభాయి పూలే పూణే యూనివర్సిటిలో పొలిటికల్ సైన్స్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. జేఎన్‌యూ వీసీ పదవిలో ఐదేళ్ళపాటు కొనసాగుతారు. ఆమె గతంలో జేఎన్‌యూ నుంచి ఎంఫిల్, పీహెచ్‌డీ అందుకున్నారు.

శాంతిశ్రీ తండ్రి ధూళిపూడి ఆంజనేయులు స్వస్థలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా తెనాలి సమీపంలోని అమృతలూరు మండలంలోని యలవర్రు. ఆయన 1924 జనవరి 10న జన్మించారు. ఉన్నత విద్య అభ్యసించి, పాత్రికేయ రంగంలో స్థిరపడ్డారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్, హిందూ పత్రికల్లో సబ్ ఎడిటర్‌గా పనిచేశారు. ఆకాశవాణి సొంత పత్రిక సంపాదకులుగా పనిచేశారు. హైదరాబాద్‌లో కేంద్ర ప్రభుత్వ సమాచార శాఖలో సమాచర అధికారిగా సేవలందించారు. ఇంగ్లిష్ త్రైమాసిక పత్రిక త్రివేణికి సహసంపాదకులుగా ఉన్నారు.

శాంతిశ్రీ ధూళిపూడి పండిట్ 1962 జూలై 15న రష్యాలోని (అప్పటి యూఎస్ఎస్ఆర్) సెయింట్ పీటర్స్ బర్గ్‌లో జన్మించారు. ఆమె తండ్రి డాక్టర్ ధూళిపూడి ఆంజనేయులు. ఆమె తల్లి మూలమూడి ఆదిలక్ష్మి రష్యాలోని లెనిన్‌గ్రాడ్ ఓరియంటల్ ఫ్యాకల్టీ డిపార్టుమెంట్‌లో తమిళం, తెలుగు భాషల ప్రొఫెసర్‌గా పనిచేశారు. శాంతిశ్రీ మద్రాసులోని ప్రెసిడెన్సీ కాలేజీ నుంచి 1983లో హిస్టరీ, సోషల్ సైకాలజీలో బీఏ డిగ్రీ అందుకున్నారు. 1985లో అదే కాలేజీ నుంచి పొలిటికల్ సైన్స్‌లో పీజీ (ఎంఏ) డిగ్రీ పొందారు. 1990లో జేఎన్‌యూకు చెందిన స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ నుంచి "పార్లమెంట్, ఫారిన్ పాలసీ ఇన్ ఇండియా - ద నెహ్రూ ఇయర్స్" పై పీహెచ్‌డీ డాక్టరేట్ అందుకున్నారు.

☞ పీఎం కేర్స్ ఫండ్‌కు విరాళాల రూపంలో 2021 మార్చి వరకు రూ. 10,990 కోట్లు వస్తే రూ. 3,976 కోట్లు ఖర్చు చేశారని ఆడిట్ రిపోర్టు వెల్లడించింది. వలస కార్మికుల సంక్షేమం కోసం రూ. 1,392 కోట్లు, మిగతావి ఆక్సిజన్ ప్లాంట్లు, ఆస్పత్రులు, వ్యాక్సిన్ల కోసం వెచ్చించారు. పీఎం కేర్స్ ఫండ్‌లో వ్యక్తులు, సంస్థల స్వచ్ఛంద విరాళాలే ఉంటాయని రిపోర్టు పేర్కొంది.

☞ బ్రిటన్‌లో క్వీన్ ఎలిజబెత్ - 2 (92) పాలనకు ఫిబ్రవరి 6తో 70 ఏళ్లు పూర్తయ్యాయి. అత్యధిక కాలం పాలన చేసిన తొలి వ్యక్తి ఈమెనే. దీంతో బ్రిటన్ అంతటా ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు జరుగుతున్నాయి.

ఈ సంబరాలు జూన్ 2-5 మధ్య 4 రోజుల సెలవు దినాలతో ముగుస్తాయి. ఈ నాలుగు రోజుల్లో విందు, వినోదాలు, ప్లాటినం పుడ్డింగ్ తయారీ పోటీలు జరుగుతాయి. సైనిక కవాతు, వాయుసేన విమానాల ప్రదర్శన జరగనుంది.

☞ గత డిసెంబర్‌లో దేశ నిరుద్యోగిత రేటు 7.91 శాతంగా నమోదు కాగా జనవరిలో భారీగా తగ్గి 6.57 శాతానికి పరిమితమైందని సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమి (సిఎంఐఇ) తెలిపింది. కొవిడ్ వ్యాప్తి తగ్గడంతో ఉద్యోగ నియామకాలు పెరుగుతున్నాయని పేర్కొంది. ఇక దేశంలో తెలంగాణలోనే తక్కువ నిరుద్యోగిత రేటు నమోదైందని, జనవరిలో ఇక్కడ 0.7 శాతం మాత్రమే ఉందని సిఎంఐఇ వెల్లడించింది.

☞ కోనసీమకు చెందిన సీనియర్ పాత్రికేయుడు నిమ్మకాయల శ్రీరంగనాథ్ (78) హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. తూర్పు గోదావరి జిల్లా ఉప్పలగుప్తం మండలం మునిపల్లికి చెందిన శ్రీరంగనాథ్ పాత్రికేయ ప్రస్థానం నాలుగు

దశాబ్దాల పాటు సాగింది. శ్రీరంగనాథ్ 'ఉదయం' దిన పత్రిక స్టాఫ్ రిపోర్టర్‌గా కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం, విజయవాడ ప్రాంతాల్లో సుదీర్ఘ కాలం పనిచేశారు. వార్త దిన పత్రిక ఢిల్లీ బ్యూరో చీఫ్‌గా, ఏపీ టైమ్స్ ఆంగ్ల పత్రిక బ్యూరో చీఫ్‌గా, ఆంధ్రప్రభ దినపత్రిక న్యూస్ నెట్‌వర్క్ ఇన్‌ఛార్జిగా, సాక్షి దినపత్రిక కాలమిస్ట్‌గా పనిచేశారు. కమ్యూనిస్ట్ నేత తరిమెల నాగిరెడ్డి ఆంగ్లంలో రాసిన ఇండియా మార్ట్ గేజ్ పుస్తకాన్ని తెలుగులో శ్రీరంగనాథ్ తాకట్టులో భారతదేశం పేరుతో అనువదించారు.

- ఏపీ హైకోర్టు న్యాయమూర్తులుగా ఏడుగురి నియామకానికి రాష్ట్రపతి ఆమోదముద్ర వేశారు. న్యాయమూర్తులుగా కొత్తగా నియమితులైన వారిలో కొనకంటి శ్రీనివాసరెడ్డి, గన్నమనేని రామకృష్ణ ప్రసాద్, నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, తర్లాడ

రాజశేఖరరావు, సత్తి సుబ్బారెడ్డి, చీమలపాటి రవి మరియు వడ్డిబోయిన సుజాత హైకోర్టు ప్రధాన న్యామూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్ర వారితో ప్రమాణస్వీకారం చేయించారు. 37 మంది న్యాయమూర్తులు ఉండాల్సిన ఏపీ హైకోర్టులో కొత్తగా వచ్చిన వారితో న్యామూర్తుల సంఖ్య 26కు చేరింది.

- విద్యారంగంలో ఉత్తమ పరిపాలన, నూతన ఆవిష్కరణల దిశగా చేసిన కృషికి గుర్తింపుగా గుంటూరు జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.ఎస్ గంగాభవాణీ జాతీయ స్థాయిలో అవార్డు అందుకున్నారు. దిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్ (న్యూపా) సంస్థ అద్వర్యంలో దిల్లీ నుంచి వర్చువల్‌గా అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి డాక్టర్ సుభాష్ సర్కార్ అవార్డును బహుకరిస్తున్నాట్లు ప్రకటించారు.

- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, కర్నూలులోని జగన్నాథగట్టులో నేషనల్ లా యూనివర్సిటీ ఏర్పాటు చేయనున్నట్టు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ వెల్లడించారు. జగన్నాథగట్టుపై 50 ఎకరాల్లో రూ. 88.50 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన సిల్వర్, జూబ్లీ డిగ్రీ కళాశాల, క్లస్టర్ విశ్వవిద్యాలయం పరిపాలన భవన సముదాయ నిర్మాణానికి బుగ్గన రాజేంద్రనాథ్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌లు భూమి పూజ చేశారు.

- భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని సతీష్ ధావన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం మొదటి ప్రయోగవేదిక నుంచి ఫిబ్రవరి 14 ఉదయం 5.59 గంటలకు పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్-సి52 (పీఎస్ఎల్వీ-సి52) నింగిలోకి దూసుకెళ్లింది. ఈ వాహన నౌక ఆర్ఐశాట్-1, ఐఎన్ఎస్-2టీడీ, ఇన్‌స్పైర్ శాట్-1 ఉపగ్రహాలను నిర్ణీత కక్ష్యలోకి మోసుకెళ్ళింది. ఇస్రో అధిపతి డాక్టర్ సోమనాథ్ ఆధ్వర్యంలో చేపడుతున్న మొదటి ప్రయోగం ఇది.

- ప్రపంచ పులుల్లో 75 శాతానికి పైగా ఒక్క భారతదేశంలోనే ఉన్నాయని కేంద్ర పర్యావరణ, అటవీశాఖ మంత్రి భుపేందర్ యాదవ్ రాజ్యసభకు తెలిపారు. వయోభారం, పులుల మధ్య అంతర్గత కొట్లాట, విద్యుదాఘాతాలు, వేటు... ఇలా పలుకారణాల రీత్య గత రెండెళ్లుగా మరణాల సంఖ్య కూడా పెరిగిందని గణాంకాలను సభలో వెల్లడించారు.

2021 - 127 మరణాలు

2020 - 106 మరణాలు

2019 - 96 మరణాలు

రాష్ట్రాల నుంచి అందిన సమాచారం మేరకు 2021లో మొత్తం 127 పులులు మృతి చెందగా, ఇందులో గరిష్ఠంగా మధ్య ప్రదేశ్‌లో 112 మరణాలు నమోదైనట్లు తెలిపారు. మహారాష్ట్రలో 27, కర్ణాటకలో 15, ఉత్తర ప్రదేశ్‌లో 9 పులులు మృత్యువాత పడ్డాయి. సాదారణంగా అడవుల్లోని సహజవాతావరణంలో

నివసించే పులుల సగటు జీవిత కాలం 10-12 ఏళ్ళు ఉంటుంది. పులుల్లో కూనల (పిల్లల) మరణాలు కూడా ఎక్కువే "2018 నాటి అంచనాల మేరకు దేశంలో పులుల సంఖ్య 2,967గా ఉంది. 2014లో ఈ సంఖ్య దాదాపు 2,226 మాత్రమే అని భూపేందర్ యాదవ్ వివరించారు.

- న్యూఢిల్లీ తన జన్మదిన వేడుకలను జరుపుకుంది. న్యూఢిల్లీ నిర్మాణానికి బ్రిటన్ రాజు కింగ్ జార్జి 5, క్వీన్ మేరీ 1911 డిసెంబర్ 12న శంకుస్థాప చేశారు. నిర్మాణం 20 ఏళ్లపాటు సాగింది. 1931లో ఫిబ్రవరి 13వ తేదీన కొత్త ఢిల్లీ నగరాన్ని అప్పటి వైస్రాయ్ లార్డ్ ఇర్విన్ ప్రారంభోత్సవం చేశారు.

- ఉమ్మడిశెట్టి సత్యాదేవి సాహితీ పురస్కారానికి యార్లగడ్డ రాఘవేంద్రరవు ఎంపికయ్యారు. అనంతరపురానికి చెందిన ప్రముఖ కవి ఉమ్మడిశెట్టి రాధేయ సాహితీవేత్తలను ప్రోత్సహించేందుకు తన భార్య పేరిట ఉమ్మడిశెట్టి సత్యాదేవి సాహితీ పురస్కారాలను 34 ఏళ్లుగా ఏటా అందజేస్తున్నారు. 2021 సంవత్సరానికి గానూ సీనియర్ సాహితీవేత్త యార్లగడ్డ రాఘవేంద్రరావు రచించిన "పచ్చి కడుపు వాసన" కవితా సంకలనానికి పురస్కారం దక్కింది. తెలంగాణాలోని నిజామాబాద్ జిల్లాకు చెందిన యార్లగడ్డ రాఘవేంద్రరావు సాహితీలోకంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందారు.

- టర్కిష్ ఎయిర్‌లైన్స్ మాజీ చైర్మన్ ఇల్కర్ ఐచీ (51)ని ఎయిర్ ఇండియా ముఖ్య కార్యానిర్వహణాధికారి (సీఈఓ), మేనేజింగ్ డైరెక్టరు (ఎండీ)గా నియమించినట్లు టాటా సన్స్ ప్రకటించింది.

- శీతాకాల ఒలింపిక్స్‌లో అమెరికా అథ్లెట్ ఎరిన్ జాక్సన్ సరికొత్త చరిత్ర సృష్టించింది. మహిళల 500మీ॥ స్పీడ్ స్కేటింగ్‌లో స్వర్ణం సాధించిన ఆమె, ఈ క్రీడలో ఒలంపిక్ పతకం అందుకున్న తొలి నల్లజాతియురాలిగా నిలిచింది. 1994 తర్వాత ఈ విభాగంలో ఆ దేశానికి దక్కిన మొదటి పతకమిదే. ఎరిన్ 37.40 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకుంది. తకాగి (జపాన్ - 37.12 సె) గొలికోవా (ఆర్ఓసీ-37.21 సె) వరుసగా రజత, కాంస్య పతకాలు గెలుచుకున్నారు.

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్‌ను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. ఢిల్లీలోని ఏపీ భవన్ చీఫ్ రెసిడెంట్ కమిషనర్‌గా ఆయనను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్ శర్మ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న ఐపీఎస్ అధికారి భావనా సక్సేనాను ఆ బాధ్యతల నుండి రిలీవ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆమె విదేశాంగ శాఖలోని జీ-20 సెక్రటేరియేట్‌లో సంయుక్త కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆమె రెండేళ్లపాటు డిప్యుటేషన్‌పై కేంద్ర సర్వీసులో పనిచేయున్నారు.



- పారిశ్రామిక దిగ్గజం టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీ టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా ఎన్.చంద్రశేఖరన్ రెండో విడత కొనసాగనున్నారు. గత ఐదేళ్ల పనితీరు సమీక్షించి ఆయనను తిరిగి ఛైర్మన్‌గా కొనసాగించాలని టాటా సన్స్ బోర్డు నిర్ణయం తీసుకుంది చంద్రశేఖరన్ మరో ఐదేళ్లపాటు ఆ పదవిలో ఉంటారు ఈ సమావేశానికి రతన్ టాటా ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు.

- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్‌లో ప్రభుత్వం నలుగురు సభ్యులను నియమంచింది. కొర్రరాము (అరకు), జంపరంగి లిల్లీ (హుకుంపేట), ఎం. విశ్వేశ్వర రాజు (పాడేరు), సీహెచ్ మురళి (రంపచోడవరం) ఎస్టీ కమిషన్ సభ్యులుగా మూడేళ్లపాటు కొనసాగుతారు.

హిజాబ్ అంటే..!

హిజాబ్ అంటే తెర, మహిళలు జుట్టు, మెడను ఏదైనా క్లాత్‌తో కప్పి ఉంచడాన్ని హిజాబ్ అంటారు. ముఖం మాత్రం కనిపిస్తుంది. బురఖా అంటే స్త్రీల శరీరం పూర్తిగా కప్పబడి ఉంటుంది. బురఖా ధరిస్తే మహిళ శరీరంలో ఏ భాగం కనిపించదు. చాలా దేశాల్లో దీనిని అబాయా అని కూడా అంటారు. నికాబ్ అనేది ఒక రకమైన క్లాత్ మాస్క్, ఇది ముఖంపై ఉంటుంది. ఇందులో మహిళ ముఖం కనిపించదు. కానీ కళ్లు మాత్రం కనిపిస్తాయి. వీటిని ముస్లీం స్త్రీలు ధరిస్తారు.

కరెంట్ అఫైర్స్

- యాపిల్‌లో ఉండే యాసిడ్ - మాలిక్ ఆమ్లం
- చింతపడులో ఉండే యాసిడ్ - టార్టారిక్ ఆమ్లం
- పాలు మరియు పెరుగులో ఉండే యాసిడ్ - లాక్టిక్ ఆమ్లం
- వెనిగర్‌లో ఉండే యాసిడ్ - ఎసిటిక్ ఆమ్లం

- విద్యుత్ వాహనాలు వాడాలని ప్రోత్సహిస్తున్న ప్రభుత్వాలు తమ కార్యాలయాల్లో మాత్రం తక్కువ సంఖ్యలో వాటిని వాడుతున్నట్లు వెల్లడైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో మొత్తం 8,47,544 వాహనాలను వినియోగిస్తుండగా, వీటిలో 5,384 విద్యుత్ వాహనాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పార్లమెంట్‌లో తెలిపారు. భారతమాల కింద 19,363 కి.మీ నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు.

- నా దేశం నశించే పరిస్థితుల్లో నేను జన్మించాను అని అన్నది - **నెపోలియన్ బోనాపార్టే**

  ఐరోపా జబ్బు మనిషి అని ఏ దేశానికి పేరు - **టర్కీ**

  అడాల్ఫ్ హిట్లర్ రాసిన గ్రంథం - **మీన్‌కాంప్**

  కార్బోనరీ అంటే - **బొగ్గును కాల్చేవారు.**

- న్యూఢిల్లీ నగరంలో మెహ్రౌలీ ఇనుప స్థంభం 1600 ఏళ్ల క్రితం నాటిది. ఇప్పటివరకు తుప్పు పట్టకుండా చెక్కుచెదరకుండా ఉంది. ఈ ఇనుప స్తంబాన్ని క్రీ.శ.4వ శతాబ్దంలో గుప్తరాజు రెండో చంద్రగుప్తుడు తన విజయాలకు చిహ్నంగా స్థాపించాడ. మెహ్రౌలీ ఇనుప స్తంభంపై పరిశోధనలు చేసిన శాస్త్రవేత్తలు భారతదేశంలో గుప్తుల కాలం నాటికే లోహశాస్త్రం అత్యున్నత దశకు చేరిందని సూత్రబద్ధంగా నిర్ధారించారు.

- భారత దశంలో పీజీ చదివేవారి సంఖ్య గణనీయంగా తగ్గుతోందని కాగ్ నివేదిక వెల్లడించింది. బీటెక్, డిగ్రీతో ఉద్యోగ అవకాశాలు వస్తుండటంతో విద్యార్థులు పీజీ కోర్సుల వైపు ఆసక్తి చూపడం లేదని పేర్కొంది. గత రెండేళ్ళలో దేశవ్యాప్తంగా ఐఐటి, ఎన్.ఐ.టిల్లో కలిపి 19,480 సీట్లు మిగిలాయని వివరించింది. పీహెచ్‌డీ కోర్సుల్లో 1779 సీట్లు భర్తీ కాలేదంది. కొత్త ఐఐటిలైన భువనేశ్వర్, గాంధీనగర్, హైదరాబాద్‌లో సీట్లు ఎక్కువ మిగులుతున్నట్లు తెలిపింది.

- నాలుగో క్వాడ్ విదేశాంగ మంత్రుల సదస్సు ఎక్కడ జరిగింది. - **మెల్‌బోర్న్**
- మిలాన్ నౌకా విన్యాసాలను ఎక్కడ నిర్వహించారు. - **విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్**

కొన్ని క్రీడా విశేషాలు

- ప్రపంచవ్యాప్తంగా మొత్తం 8000 క్రీడలు ఉన్నాయి.
- ప్రపంచంలో తొలి క్రీడ రెజ్లింగ్. గ్రీస్ నగరంలో తొలిసారి క్రీ.పూ.776లో రెజ్లింగ్ పోటీలు నిర్వహించారు.
- ప్రపంచంలో ఓల్డెస్ట్ ఫుట్‌బాల్ క్లబ్ షెఫీల్డ్ ఎఫ్‌సీ.
- బ్యాడ్మింటన్ షటిల్ కాక్ బరువు సుమారు 5 గ్రాములు ఉంటుంది.
- ఒలింపిక్స్ బంగారు పతకాలు తయారీలో ఎక్కువగా వెండిని వాడతారు. అంతేగానీ ప్యూర్ గోల్డ్ తయారు చేయరు.

నిజాలు..!

- ఈజిప్షియన్ ప్లొవర్ అనే పక్షులు మొసళ్ల మధ్య ఇరుకున్న ఆహారాన్ని తింటాయి. అందుకే వాటిని క్రొకడైల్ బర్డ్స్ అంటారు.
- ఏ దేశస్థులైనా నార్వేలోని ప్రభుత్వ వర్సిటీల్లో ఉచితంగా చదువుకోవచ్చు.
- దోమలు, పాములు, ఇతర సరీసృపాలు లేని ఏకైక దేశం ఐస్‌ల్యాండ్. సాలీళ్లు మాత్రమే అక్కడక్కడా కనిపిస్తాయి.
- లొటామొలా అనే చేప ఒక్కసారే 30 కోట్ల గుడ్లు పెడుతుంది. ప్రపంచంలో మరే ప్రాణికీ ఈ రికార్డు లేదు.
- **భారతదేశంలో శాస్త్రీయ నృత్యాలు**

  కూచిపూడి - ఆంధ్రప్రదేశ్

  భరతనాట్యాం - తమిళనాడు

  కథకళి, మోహినియాట్టాం - కేరళ

  ఒడిస్సీ - ఒడిశా

  కథక్ - ఉత్తరప్రదేశ్

  సత్రియ - అస్సాం

  మణిపూరి - మణిపూర్

మేడారం జాతర

- సమ్మక్క సారక్క జాతర్లో బంగారంగా భావించి బెల్లాన్ని అమ్మవార్లకు నైవేద్యంగా సమర్పిస్తుంటారు. భక్తులు, ఇతర భక్తులు సమర్పించిన బంగారాన్ని ప్రసాదంగా ఇంటికి

తెచ్చుకుంటారు. అయితే అమ్మవార్లకు బెల్లం ఒక్కటే కాకుండా వడి బియ్యం, చీర, పసుపు బట్టలు, తట్టలు, బుట్టలు, బోనాలు, పట్నాలు, చిలుకలు, ఎదురుకోళ్లు, మేకపోతులను కూడా భక్తులు మొక్కులుగా చెల్లించుకుంటారు.

బెల్లం, ఉప్పును ఆదివాసీలు విలువైన వస్తువులుగా చూస్తారు. వీటిని వారు తయారు చేయరు. ఇతర ప్రాంతాల నుంచి వస్తు మార్పిడి లేదా కొనుగోలు చేసి తెచ్చుకుంటుంటారు. అందుకే గిరిజనులు తమకు అత్యంత విలువైన బెల్లాన్ని బంగారంగా భావించి రెండేళ్లకు ఒక్కసారి జరిగే మేడారం జాతరలో తమ ఇష్టదైవాలైన సమ్మక్క సారక్కలకు సమర్పిస్తుంటారు. అదే సాంప్రదాయాన్ని మిగతా భక్తులు కూడా పాటిస్తున్నారు.

జాతర ప్రత్యేకతలు

- సమ్మక్క సారక్క జాతరను 1998లో రాష్ట్ర పండుగగా గుర్తించారు.
- ఆసియాలో అతిపెద్ద గిరిజన జాతరగా యునెస్కో గుర్తింపు పొందింది.
- పూజా కార్యక్రమాలు ఆదివాసీలే నిర్వహిస్తారు.
- రెండు దశాబ్దాల తరువాత ఈ సారి మాఘశుద్ధ పౌర్ణమి బుధవారం (ఫిబ్రవరి 16, 2022) నాడు మేడారం జాతర ప్రారంభమయింది. ఈ వారం అమ్మవార్లకు ప్రీతిపాత్రమైన రోజు.
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)గా కసిరెడ్డి వెంకట రాజేంద్రనాథ్ రెడ్డికి ప్రభుత్వం పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ

మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్ శర్మ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు డీజీపీగా ఉన్న గౌతమ్ సవాంగ్‌ను సాధారణ పరిపాలన శాఖలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. 1992 బ్యాచ్‌కు చెందిన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రస్తుతం రాష్ట్ర ఇంటెలిజెన్స్ డీజీగా ఉన్నారు. ఆయన 1994లో ఉమ్మడి ఏపీలో నిజామాబాద్ జిల్లా బోధన్ అదనపు ఎస్పీగా పోస్టింగ్‌లో చేరారు. నిజామాబాద్ జిల్లాలో పలు బాధ్యతలు నిర్వహించిన అనంతరం ఆయన విశాఖ, నెల్లూరు జిల్లాలతో పాటు సీఐడీ, రైల్వే ఎస్పీగా పనిచేశారు. విజయవాడ, విశాఖ పోలీస్ కమిషనర్‌గా విధులు నిర్వర్తించారు. హైదరాబాద్ వెస్ట్ జోన్, మెరైన్ పోలీస్ విభాగంలో ఉత్తర కోస్తా ఐజీగా పనిచేశారు. పలు కీలక కేసులను ఛేదించి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు.

- అస్సాం తేయాకుకు మళ్లీ ఆకర్షణీయమైన ధర లభించింది గువాహటి కేంద్రంలో కిలో తేయాకు ధర 99,999 పలికింది. ఇది గత రికార్డును సమం చేసింది. గతంలో "మనోహరి గోల్డ్ టీ"కి ఈ స్థాయిలో రికార్డు ధర పలికింది వేలం కేంద్రంలో వరుస రికార్డు ధరలతో మనోమరి టీ ముందుంటోంది. అయితే ఆ తేయాకు తయారీకి కంపెనీకి సొంత తోటలు ఉన్నాయి. నహోర్‌చుక్‌బరి "బాట్ లీఫ్ ఫ్యాక్టరీ" ఉత్పత్తి చేసిన "గోల్డెన్ పెరల్ టీ" కిలో రూ. 99.999కు అమ్ముడుపోయినట్లు వేలం కేంద్రం కొనుగోలుదారుల సంఘం కార్యదర్శి దినేష్ బిహాని తెలిపారు విశేషం ఏమిటంటే ఈ ఫ్యాక్టరీ చిన్న తేయాకు పెంపకందారుల నుంచి ఆకులను సేకరించి ఉత్పత్తి ప్రక్రియ చేపడుతోంది. ఈ టీని గువాహటిలోని "అస్సాం టీ ట్రేడర్స్" కొనుగోలు చేసింది.

- **ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్నత విద్యా సంస్థల పరిధి**

రాష్ట్రంలోని ఉన్నత విద్యా సంస్థలన్నీ ఆంధ్రా యూనివర్సిటీ, శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీల పరిధిలో ఉన్నాయి. ఆంధ్రాయూనివర్సిటీ రీజియన్‌లో విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాలు ఉన్నాయి. శ్రీ వెంకటేవ్వర యూనివర్సిటీ రీజియన్‌లో అనంతపురం, చిత్తూరు, కర్నూలు, నెల్లూరు, వైఎస్సార్ కడప జిల్లాలున్నాయి. జిల్లాల విభజన తర్వాత ఆంధ్రా యునివర్సిటీ రీజియన్‌లో శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం, మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, బాపట్ల, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి,

కరెంట్ అఫైర్స్

ఏలూరు, గుంటూరు, కాకినాడ, కోనసీమ, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు, ప్రకాశం జిల్లాలను ప్రతిపాదించారు. శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ రీజియన్‌లో అనంతపురం, అన్నమయ్య, చిత్తూరు, కర్నూలు, నంద్యాల, శ్రీబాలాజీ, శ్రీ సత్యసాయి, వైఎస్సార్ కడప జిల్లాలు ఉండాలని ప్రతిపాదించారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోకి ప్రకాశం జిల్లా (ఆంధ్రా వర్సిటీ రీజియన్) పరిధిలోని 30 మండలాలు ఉండడంతో దాన్ని ఏ రీజియన్ పరిధిలో చేర్చాలనే అంశంపై కసరత్తు జరుగుతోంది.

☞ లండన్‌కు చెందిన టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రపంచ స్థాయిలో 2022వ సంవత్సరానికి యంగ్ యూనివర్సిటీ ర్యాంకులను ప్రకటించింది. ఈ ర్యాంకుల్లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ (ఏఎన్‌యూ) ప్రపంచస్థాయిలో 301–350వ కేటగిరీలో ర్యాంకు సాధించింది. జాతీయ స్థాయిలో 20వ ర్యాంకు, రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకును సాధించింది. యూనివర్సిటీలోని బోధన, పరిశోధన, అంతర్జాతీయ దృక్పథం, పరిశ్రమలతో అనుసంధానం. తదితర అంశాల ఆధారంగా టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ సంస్థ ఈ ర్యాంకులను జారీ చేసింది. ఏఎన్‌యూకి టైమ్స్ హయ్యార్ ఎడ్యుకేషన్ ర్యాంకు రావడం పట్ల వీసీ ఆచార్య పి.రాజశేఖర్, రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ డాక్టర్. బి.కరుణ హర్షం వ్యక్తం చేశారు.

☞ కరోనా నిబంధనలకు నిరసనగా జరుగుతున్న ఆందోళనలకు అడ్డుకట్ట వేసేందుకు కెనడలో ఎమర్జెన్సీ విధించారు. అత్యవసర అధికారాల చట్టాన్ని అమల్లోకి తెస్తున్నట్టు ప్రధాని జస్టిన్ ట్రూడో ప్రకటించారు. దీని ప్రకారం నిరసనకారులపై కఠిన చర్యలు తీసుకునే అధికారం ప్రభుత్వానికి లభిస్తుంది. అయితే దీన్ని పరిమిత కాలం పాటు, కొద్ది ప్రాంతాల్లో అవసరం మేరకే ఉపయోగిస్తామని ట్రూడో చెప్పారు. సైన్యాన్ని ప్రయోగించబోవడంలేదని స్పష్టం చేశారు. కరోనా వ్యాక్సిన్ నిబంధనలను ఎత్తేయాలని డిమాండ్ చేస్తూ ట్రక్ డ్రైవర్లు రెండు వారాలకు పైగా సరిహద్దులను. ఒట్టావా వీధులను వాహనాలతో దిగ్బంధించారు.

☞ స్టీల్‌ప్లాంట్‌లోని రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లు కలిపి రికార్డు ఉత్పత్తిని సాధించాయి. ఒక్క రోజు బ్లాస్ట్‌ఫర్నేస్–1 (గోదావరి), బ్లాస్ట్ ఫర్నేస్–2 (కృష్ణ) సంయుక్తంగా 15,230 టన్నుల ఉత్పత్తిని సాధించాయి. ఇది స్టీల్‌ప్లాంట్ చరిత్రలో అత్యధిక ఉత్పత్తిగా నమోదైంది. ఇంతకు ముందు రెండు ఫర్నేస్‌లు కలిపి 2006 ఫిబ్రవరి 10న అత్యధికంగా 13,325 టన్నుల హాట్ మెటల్ ఉత్పత్తి రికార్డుగా ఉండేది. ఇప్పుడు ఆ రికార్డును అధిగమించాయి.



ఇదిలా ఉండగా స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేస్–1 (గోదావరి) మరో రికార్డును అధిగమించింది. ఒక్కరోజు 7,730 టన్నుల హాట్ మెటల్ ఉత్పత్తి చేసి ఫిబ్రవరి 14నాటి ఉత్పత్తి 7,670 టన్నులను అధిగమించంది. ఈ ఫిబ్రవరి నెలలో బ్లాస్ట్ ఫర్నేస్–1 మూడు సార్లు ఉత్పత్తి రికార్డులు నమోదు చేయడం విశషం.

ఎన్నికల వేళ గురు రవిదాస్..!

☞ గురు రవిదాస్ వారణాశిలోని గోవర్ధన్‌పూర్ గ్రామంలో చర్మకారుల కుటుంబంలో జన్మించారు. రవిదాసియా అనే ప్రత్యేక మతాన్ని వ్యాప్తి చేశారు.

పంజాబ్‌లో ప్రముఖ దేరా సచ్ఛఖానంద్ బల్లాన్ రవిదాసియా మతాన్నే ఆచరిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ఈ దేరాకు 20 లక్షల మంది అనుచరులు ఉన్నారు.

చిన్నప్పట్నుంచి అంటరానితనాన్ని ఎదుర్కొన్న ఆయన సమాజంలో నెలకొన్న వర్ణ వివక్షను ప్రశ్నిస్తూ కవిత్వం రాశారు. ఆయన రాసిన కవిత్వానికి, రవిదాసులో సాహితీవేత్తకి కులాల కతీతంగా అభిమానులున్నారు.

సిక్కు రాడికల్ సంస్థకు చెందిన కొందరు నాయకులు 2009లో వియన్నాలో గురు రవిదాస్ దేరాలపై జరిపిన దాడిలో ఒక నాయకుడు మరణించాడు. దీంతో సిక్కు మతంతో తమకు సంబంధం లేదని ఆ దేరా ప్రకటించింది. గురు గ్రంథ సాహిబ్ స్థానంలో రవిదాస్ రచించిన 200 కీర్తనలతో కూడిన అమృత్‌వాణిని తీసుకువచ్చారు. అదే తమకు మత గ్రంథమని ప్రకటించుకున్నారు.

పంజాబ్ జనాభాలో 32 శాతం దళితులున్నారు. వారిలో ఎక్కువ మంది రవిదాస్ అనుచరులు కావడంతో రాజకీయ పార్టీల తలరాతలు మార్చే ఓటు బ్యాంకుగా మారారు.

పంజాబ్ ఎన్నికలు ఫిబ్రవరి 14నే జరపాలని తొలుత ఎన్నికల సంఘం నిర్ణయించినప్పటికీ రవిదాస్ జయంతి కోసం ఎన్నికల్ని కూడా 20 తేదీకి వాయిదా వేసింది.

పంజాబ్‌లో దళితులు ఓట్లను ఆకర్షించడానికి గతంలో బీఎస్పీ ప్రయత్నించి కొంత సఫలమైంది. అయితే ఆ పార్టీకి రామ్‌దాసియా సిక్కుల మద్దతు మాత్రమే లభించింది. ఈ సారి వీరి ఓట్ల కోసం ప్రతీ పార్టీ గట్టి ప్రయత్నాలు చేస్తోంది.

☞ ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలులోగల డాక్టర్ అబ్దుల్‌హక్ ఉర్దూ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ (వీసీ)గా హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం (మనూ) ప్రొఫెసర్ ఫజుల్ రహమాన్ నియమితులయ్యారు. ఆయన మానూలో యూజీసీ – మానవ వనరుల అభివృద్ధి కేంద్రం డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. 1993లో అలీఘడ్ ముస్లిం విశ్వవిద్యాలయం నుంచి నెమటాలజీలో పీహెచ్‌డీని పొందిన ఫజుల్ 2013లో ప్రొఫెసర్‌గా, స్కూల్ ఆఫ్ సైన్సెస్ డైరెక్టర్‌గా, 2019లో యూజీసీ హెచ్‌ఆర్‌డీసీలో డైరెక్టర్ తదితర విధులను నిర్వర్తించారు.

ఐఎస్ఎన్ విక్రాంత్

☞ భారత నౌకాదళంలో యుద్ధ విమానాల కోసం రూపొందిన మొట్టమొదటి నౌక విక్రాంత్ క్లాస్. 1997లో విక్రాంత్ సేవల నుంచి నిష్క్రమించింది. ఇప్పుడు అదే పేరుతో స్వదేశీ పరిజ్ఞానంతో ఆత్మనిర్భర్ భారత్ పేరుతో విక్రాంత్ యుద్ధ విమాన వాహన నౌక సన్నద్ధమైంది. విక్రాంత్ నిర్మాణం పదేళ్ల కిందటే ప్రారంభమైంది. పూర్తిస్థాయి భారతీయ పరిజ్ఞానంతో నిర్మిస్తున్న ఈ యుద్ధ నౌకలో అత్యంత ఆధునిక సదుపాయాలు ఉన్నాయి. 1999లో ఇండియన్ నేవీకి చెందిన డైరెక్టర్ ఆఫ్ నెవల్ డిజైన్ సంస్థ నౌక డిజైన్ చేపట్టగా కొచ్చి షిప్‌యార్డులో 2009లోనే కీలక భాగాలను పూర్తి చేశారు. 2011లో డ్రైడాక్ నుంచి విక్రాంత్‌ని బయటికి తీసుకొచ్చారు. 2015 జూన్ 10న కొచ్చిలో జల ప్రవేశం చేసింది. ఎయిర్ క్రాఫ్ట్ క్యారియర్ షిప్ ఐఎన్ఎస్ విక్రాంత్ గతేడాది మొదట్లో బేస్ ట్రయిల్స్ విజయవంతం అయ్యాయి. అదే విధంగా గత ఆగస్ట్‌లో 5 రోజులు, అక్టోబర్‌లో 10 రోజులు మొత్తం మూడు సార్లు సీట్రయల్స్‌ను విజయవంతంగా పూర్తి చేసుకుంది. రఫేల్ యుద్ధ విమానాలు కూడా విక్రాంత్ రన్‌వేపై ల్యాండింగ్, టేకాఫ్ టెస్టులు విజయవంతంగా పూర్తి చేసుకుంది.

విక్రాంత్ విశేషాలు..

పొడవు – 262 మీటర్లు

వెడల్పు – 62 మీటర్లు

ఎత్తు – 59 మీటర్లు

బరువు – 37,500 టన్నులు

నిర్మాణ శైలి – 5 సూపర్ స్ట్రక్చర్లు, 14 డెక్‌లు

ఓడలో కంపార్ట్‌మెంట్‌లు – 2,300

మహిళా క్యాబిన్ – 2

సిబ్బంది – 1,700 మందికి పైగా

రన్‌వేలు – 2, ఒక ల్యాండింగ్ స్ట్రిప్

వేగం – 28 నాటికల్ మైళ్లు

సామర్థ్యం – 18 నాటికల్ మైళ్ల వేగంతో 7,500 నాటికల్ మైళ్లు

సత్తా ఎంత – 30 విమానాలను మోసుకెళ్లగలదు

నిర్మాణంలో పాలుపంచుకున్నవారు – 14,000 మంది సిబ్బంది, ఉద్యోగులు.

ఏఏ విమానాలుంటాయి – 26 వరకు మిగ్–29 విమానాలు, కమోవ్ విమానాలు లేదా హెలికాప్టర్లను ఏకకాలంలో తీసుకెళ్లగలదు.

టర్బైన్లు – 4 ఎల్ఎం 2,500 ప్లస్ గ్యాస్ టర్బైన్లు

టర్బైన్ల సామర్థ్యం – 80 మెగావాట్లు

వ్యయం – రూ. 20,000 కోట్లు

ప్రత్యేకత – మిగ్ – 29 విమానాలు ఎగరగలిగే డెక్ ఉండటం. ఒక చిన్న నగరానికి సరిపడ విద్యుత్‌ని ఉత్పత్తి చేయగల టర్బైన్లు

☞ బాలీవుడ్‌లో డిస్కో సంగీతానికి, మాస్ పాటలకు ట్రెండ్ సెట్టర్‌గా నిలిచిన బప్పీ లహిరి ముంబైలో కన్నుమూశారు. ఆయన వయసు 69. వయసు సంబంధిత సమస్యలతో హాస్పిటల్‌లో

